ఈనాడు

విజయవాడ 8-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 360
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని వీవర్స్ శాలలో మగ్గంపై చీర నేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నేతన్నకు ఏటా ₹25,000

- ఈ నెల నుంచే మగ్గాలకు ఉచిత విద్యుత్తు
- రూ.74 కోట్లతో చేనేత క్లస్టర్లు
- అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం
- జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరాలు

ఈనాడు, అమరావతి: 'నేతన్న భరోసా' పథకం కింద చేనేతలకు ఏటా రూ.25 వేలు ఆర్థికసాయం అందించబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ఈ నెల నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. దీనికి ఏడాదికి రూ.193 కోట్లు వ్యయమవుతుందని వివరించారు. చేనేత వస్త్రాలపై చెల్లించాల్సిన 5 శాతం జీఎస్టీని ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందని.. ఇందుకోసం రూ.15 కోట్లు విడుదల చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిలిపేసిన త్రిఫ్ట్ ఫండ్‌ను అమల్లోకి తెస్తూ 5,386 మందికి రూ.5 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. చేనేతల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. 'చరిత్రలో ఎన్నడూ చూడని సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. అభివృద్ధిని పట్టాలెక్కించి, సంక్షేమానికి రాజమార్గం వేశాం. రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం (మిగతా 5లో)

> చేనేత సూరీడు ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తాం. మంగళగిరిలో నిర్మించే పార్కుకు ఆయన పేరు పెట్టి, అక్కడ విగ్రహం ఏర్పాటు చేస్తాం. - చంద్రబాబు



ఢీ అంటే ఢీ



అమెరికా సుంకాలపై దీటుగా స్పందించిన భారత్

రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్న మోదీ • భారాన్ని భరిస్తామని స్పష్టీకరణ

భారత్ ఎప్పటికీ రాజీపడదు
ప్రధాని స్పష్టీకరణ

దిల్లీ: ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం దిల్లీలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోం. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని భరించడానికి సిద్ధం. దీనివల్ల భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని తెలుసు' అని ప్రధాని స్పష్టంచేశారు.

మరిన్ని ఆంక్షలకు సిద్ధమన్న ట్రంప్ • అమెరికాలో పెరగనున్న ధరలు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ విషయంలో రెండు దేశాలూ ఢీ అంటే ఢీ అంటున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని సొంతంగా భరిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి.

> అమల్లోకి వచ్చిన 25%

భారత్‌పై గతంలో విధించిన 25 శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50 శాతం దాకా ఉన్నాయి.

అమెరికా అదనపు సుంకాలవల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడ్డాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా (మిగతా 5లో)

మరిన్ని ఆంక్షలను చూస్తారు
ట్రంప్ హెచ్చరిక

న్యూయార్క్, వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొంటోందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారు' అని పేర్కొన్నారు.

లోపలి పేజీల్లో

భాజపా, ఈసీ భారీ మోసం
- కుమ్మక్కై ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడ్డాయి
- దీనికి 'మహాదేవపుర' ఓటర్ల జాబితాయే నిదర్శనం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సంచలన ఆరోపణలు
- న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని సూచన
- నేడు బెంగళూరులో నిరసన ప్రదర్శనకు నిర్ణయం



తిరుపతిలో భూమన అనుచరుల అరాచకం
దళిత యువకుడిని నిర్బంధించి పోలీసు లాఠీతో దాడి

త్వరలో భారత్‌కు పుతిన్!
రష్యా అధ్యక్షుడి పర్యటన తేదీలపై కసరత్తు చేస్తున్నాం
జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్ ప్రకటన

నాన్నను ఆ ముగ్గురే చంపినట్లు సంతకం చేయాలన్నారు

- లేఖ చదివాక నేను ఒప్పుకోలేదు
- పులివెందులలో ప్రస్తుత పరిస్థితులు భయపెడుతున్నాయి
- వివేకానందరెడ్డి కుమార్తె సునీత



కడప ఎస్పీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సునీత దంపతులు

ఈనాడు, కడప - న్యూస్‌టుడే, కడప నేరవార్తలు: 'పులివెందులలో తాజా పరిస్థితులు చూస్తుంటే ఆరేళ్ల క్రితం మా నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. నాన్న జయంతి శుక్రవారం ఉండగా, మా అమ్మ ఫోన్ చేసి పులివెందులకు రావొద్దని, ఇక్కడ పరిస్థితులు బాగా లేవంటూ హెచ్చరించారు' అని వివేకా కుమార్తె సునీత ఆందోళన వ్యక్తంచేశారు. వివేకా హత్య కేసు నిందితుల బెయిల్ రద్దు పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న దృష్ట్యా కడప ఎస్పీ అశోక్‌కుమార్‌ను సునీత, రాజశేఖరరెడ్డి దంపతులు కడపలో గురువారం కలిశారు. కేసు తాజా పరిణామాలను ఆయనకు వివరించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడారు. 'మా తండ్రిని గొడ్డలితో నరికి చంపి, గుండెపోటుగా చిత్రీకరించి.. ఆ మేరకు మీడియాలో ప్రసారం చేశారు. హత్య తర్వాత అక్కడికి వెళ్లిన నాకు ఓ లేఖ ఇచ్చారు. ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, అప్పట్లో తెదేపాలో ఉన్న సతీష్‌కుమార్‌రెడ్డి మా నాన్నను చంపినట్లు ఉన్న ఆ లేఖపై సంతకం చేయాలన్నారు. నేను చేయలేదు' అని గుర్తు చేసుకున్నారు. 'తెదేపా వారు హత్య చేశారంటే తొలుత నేను నమ్మాను. చివరకు 'నారాసుర రక్తచరిత్ర' అని రాశారు. ఆ తర్వాత సునీత, రాజశేఖరరెడ్డే చంపారంటూ మాపై ఆరోపణలు చేశారు. సాక్షులను బెదిరిస్తున్నామంటూ మా పైనా కేసులు పెట్టారు' అని ఆమె వాపోయారు. తన తండ్రి హత్య కేసులో నిందితులెవరన్నదీ సీబీఐ తేల్చిందని, ఆరేళ్లుగా శిక్ష మాత్రం ఎవరికీ పడలేదని వివరించారు. ఇప్పుడు ఎంపీ అవినాష్ రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి పోలీసులను బెదిరించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 'మా నాన్న మళ్లీ రారు. హంతకులకు శిక్ష పడేలా ఇంకెన్ని రోజులు న్యాయపోరాటం చేయాలి? అయినా, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా. ఆ మేరకు పూర్తి నమ్మకముంది' అని వ్యాఖ్యానించారు. కడప, పులివెందుల ప్రజలు మార్పు కోసం ఆలోచించాలని సునీత కోరారు.

ఈ నెలలో వరుస అల్పపీడనాలు!

రాబోయే రెండు వారాల్లో వర్షాలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: వర్షాకాలంలో వేసవి తరహా వాతావరణంతో అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో శనివారం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు జోరందుకుంటాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో ఎక్కువ రోజులు వర్షాలు కురిసేందుకు అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది.



ఈనెల 13 నాటికి..

రాష్ట్రంలో ఆగస్టు నెల ప్రారంభం నుంచి వేడి, ఉక్కపోత వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రుతుపవనాల కారణంగా మేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి ఎండ తీవ్రత తగ్గే అవకాశముందని, ఈ సీజన్ చివరి వరకు రుతుపవనాలు చురుగ్గా ఉంటాయని (మిగతా 5లో)

అడ్డదిడ్డంగా పెడితే కుదరదంతే!

- హోర్డింగ్‌ల పాలసీకి సవరణలు
- ఏజెన్సీలకు లైసెన్సు తప్పనిసరి
- హైకోర్టు ఆదేశాలతో చర్యలు

ఈనాడు - అమరావతి



నగరాలు, పట్టణాల్లో అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారం ఏర్పాటవుతున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలకు ప్రభుత్వం కళ్లెం వేయనుంది. లైసెన్సులు తీసుకున్న సంస్థల ఆధ్వర్యంలోనే వాటిని ఏర్పాటు చేసేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తోంది. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లోనూ.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా హోర్డింగ్‌లు పెట్టకుండా పాలసీలో పలు సవరణలు చేయనుంది. ఇందుకోసం భాగస్వామ్య పక్షాల(ఏజెన్సీ)తో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై హైకోర్టు ఇటీవల అభ్యంతరం తెలిపింది. ఇలా అక్రమంగా ఏర్పాటు చేస్తున్నవాటిపై తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలని ఆదేశించింది. దీంతో పురపాలకశాఖ అధికారుల్లో చలనం వచ్చింది.

ఇన్నాళ్లూ చూసీచూడనట్లుగా..

జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చాక హోర్డింగ్‌లపై ప్రకటనల పన్ను వసూళ్లు నిలిచిపోయాయి. జీఎస్టీ చెల్లించాక మళ్లీ స్థానిక సంస్థలు పన్ను వసూలు చేయడంపై హోర్డింగ్‌లు పెట్టే పలు ఏజెన్సీలు కోర్టుకు వెళ్లాయి. అప్పటి నుంచి పురపాలక, నగరపాలక సంస్థలు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం తదితర నగరాల్లో మాత్రం ఏటా రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా అనేక ఏజెన్సీలు పుట్టుకొచ్చాయి. లైసెన్సులు తీసుకోకుండానే హోర్డింగ్‌లు విచ్చలవిడిగా పెడుతున్నాయి. కొందరికి రాజకీయ అండ ఉండటంతో వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారులు వారి జోలికి వెళ్లలేదు.

కొత్తగా తీసుకుంటున్న చర్యలు ఏమిటంటే?

- ప్రకటనల పాలసీలో పలు సవరణలు చేయనున్నారు.
- ఏజెన్సీల నుంచి ఫీజులు వసూలు చేస్తారు.
- హోర్డింగ్‌లు పెట్టే ప్రతి ఏజెన్సీ పుర, నగరపాలక సంస్థల నుంచి విధిగా లైసెన్సులు తీసుకోవాలి.
- అక్రమంగా, అభ్యంతరకరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే హోర్డింగ్‌ల తొలగింపునకు ప్రత్యేక బృందాల ఏర్పాటు. కమిషనర్లు ఎప్పటికప్పుడు హోర్డింగ్‌లను తనిఖీ చేయాలి.

ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ విజయవంతం


రాష్ట్రవ్యాప్తంగా 25,807 కేసుల నమోదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యాసంస్థల పరిసరాలను మాదకద్రవ్య రహితంగా మార్చే లక్ష్యంతో నిర్వహించిన 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' కార్యక్రమం విజయవంతమైందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాలయాల నుంచి 100 గజాల లోపు పొగాకు ఉత్పత్తులైన గుట్కా, సిగరెట్లతో పాటు ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్, దగ్గు మందు, గంజాయి, ఇతర హానికరమైన మత్తుపదార్థాలను అరికట్టడానికి ఈ ఆపరేషన్ నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 4 వరకు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో 25,807 కేసులు నమోదుచేసి, రూ.40.62 లక్షల అపరాధరుసుము విధించామని వెల్లడించారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 4,015, విశాఖ జిల్లాలో 3,468, కాకినాడ జిల్లాలో 3,115 కేసులు నమోదుచేసినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతుందని, మత్తుపదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరించారు.



నేరం బయటపడుతుందని.. ఏటీఎంకు నిప్పు 14లో

ఇదీ సంగతి!



హరిత భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

- అమరావతిలో వాటికే ప్రాధాన్యం
- మంత్రి నారాయణ వెల్లడి
- విజయవాడలో 'గ్రీన్ ఆంధ్ర సమిట్-2025'

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలో హరిత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. వాటి నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు ఇంపాక్ట్ ఫీజు, రెరా రిజిస్ట్రేషన్ ఫీజుల్లో ప్రత్యేక రాయితీలు ఇస్తామని ప్రకటించారు. విజయవాడలో సీఐఐ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ), రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో గురువారం నిర్వహించిన 'గ్రీన్ ఆంధ్ర సమిట్-2025'లో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని ప్రసంగించారు. 'రాష్ట్రంలో హరిత భవనాల విస్తీర్ణం పెంచాలని సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. పర్యావరణహిత భవనాల నిర్మాణమే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ప్రత్యామ్నాయం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు, ప్రకృతి వ్యవసాయం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఐజీబీసీ జాతీయ ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, అమరావతి చాప్టర్ ఛైర్మన్ మేకా విజయసాయి, కో-ఛైర్మన్ గణేష్ సాయి చైతన్య, సీఐఐ ఏపీ చాప్టర్ ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్, క్రెడాయ్ ఏపీ చాప్టర్ ప్రధాన కార్యదర్శి రాంబాబు, నరెడ్కో ఏపీ చాప్టర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. (మిగతా 5లో)

కళ్లు మూసుకుని.. మనసు తెరచుకుని!

గాంధార విద్యలో రాణిస్తున్న విద్యార్థులు



కళ్లకు గంతలు కట్టుకుని క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

ఎన్నో ప్రాచీన యుద్ధకళలకు నిలయం భారతదేశం. కళ్లకు గంతలు కట్టుకుని చుట్టూ ఉన్న పరిస్థితులను మనసుతో అంచనా వేస్తూ కత్తిసాము చేయడం, దారి వెంబడి వెళ్లడం ఇవన్నీ ఒకప్పటి విద్యలు. గాంధార విద్యగా పిలిచే ఈ ప్రక్రియకు తిరిగి ప్రాచుర్యం కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు ప్రభుత్వ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కవి వరప్రసాదరావు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లెకు చెందిన 20 మంది విద్యార్థులకు నీలిమ అనే శిక్షకురాలితో ఆయన గాంధార విద్యలో ట్రైనింగ్ ఇప్పిస్తున్నారు. సుమారు 3 నెలలుగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని చదవడం, రాయడం, రంగులు గుర్తించడం, చెస్, క్యారమ్స్ ఆడటం, చెక్కభజన, కర్రసాము, సైక్లింగ్, బైక్ రైడింగ్ తదితరాలను సులభంగా చేసేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఈ విద్యతో తమకు ఏకాగ్రత పెరిగి చదువులో కూడా సులువుగా రాణిస్తున్నామని వారు చెబుతున్నారు.





చదరంగం ఆడుతూ... • సైకిళ్లు, ద్విచక్ర వాహనం నడుపుతున్న విద్యార్థులు

- న్యూస్‌టుడే, వేంపల్లె


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
ఈ వరలక్ష్మీ వ్రతానికి
జోస్ ఆలుక్కాస్‌లో స్వచ్ఛమైన బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి
లక్ష్మీ దేవిని మీ ఇంటికి స్వాగతించండి.
అతి గొప్ప బహుమతులు
గెలుచుకోండి ప్రతి వారం
లక్కీ డ్రా ద్వారా
బంగారం
చైన్‌లకు
ఫ్లాట్
5%
తరుగు ఛార్జీ
వజ్రాలపై
25% వరకు తగ్గింపు
ప్లాటినం
15% తగ్గింపు తరుగు ఛార్జీలపై
బహుమతులు
ఉచితం
బంగారు ఆభరణాల
కొనుగోలుపై
*షరతులు వర్తిస్తాయి
OPP: RADIO STATION, M.G. ROAD, VIJAYAWADA. PH: 0866-2475916
ROAD NO.4/9, BRODIPET, GUNTUR. PH: 0863-2241916
MINI BYPASS ROAD, NELLORE. PH: 0861 – 2353916
జోస్ ఆలుక్కాస్
A TRADITION OF FINE JEWELLERY
josalukkasonline.comలో షాపింగ్ చేయండి

ఆలయ ప్రాంగణాల్లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేధం

- అరిటాకుల్లో అన్నప్రసాదం.. పేపరు సంచుల్లో ప్రసాదం
- ఆదేశాలు జారీచేసిన దేవాదాయ కమిషనర్ రామచంద్రమోహన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్య ఆలయాలన్నింటా ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ దేవాదాయ కమిషనర్ కె. రామచంద్రమోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంయుక్త కమిషనర్, ఉప కమిషనర్, సహాయ కమిషనర్ కేడర్ ఆలయాల ప్రాంగణాలు అన్నింటినీ ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర-స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా.. తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

◆ 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే కవర్ల వినియోగం ఆపేసి, వాటి స్థానంలో కాటన్, జూట్ సంచులు, పేపరు బ్యాగ్‌లు వినియోగించేలా చూడాలి.

◆ ఒకసారి వినియోగించి పారేసే.. ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, బౌల్స్, స్పూన్ల స్థానంలో.. ఆకులతో చేసిన ప్లేట్లు, బౌల్స్ ఉపయోగించేలా పర్యవేక్షించాలి.

◆ థర్మోకోల్ కప్పులు, ప్లాస్టిక్ స్ట్రాలు, జెండాలు, బ్యానర్లు వినియోగించకూడదు.

◆ ఆలయాల వద్ద ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నట్లు బోర్డులు ఏర్పాటుచేయాలి. మైక్‌లో పదే పదే ప్రకటించాలి.

◆ ఆలయ ప్రాంగణ పరిధిలో వ్యాపారులెవరూ ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వినియోగించకుండా చూడాలి.

◆ ప్రసాదాలు వస్త్రం, పేపరుతో చేసిన సంచుల్లో పంపిణీ చేయాలి.

◆ అన్నప్రసాదాన్ని అరిటాకులు లేదా స్టీల్ ప్లేట్లలోనే వడ్డించాలి.

◆ ప్లాస్టిక్ నీళ్లసీసాల వినియోగం లేకుండా చూసేందుకు.. ఆలయ పరిధిలో ఎక్కువ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేయాలి. అక్కడ స్టీల్ మగ్గులు, గ్లాసులు అందుబాటులో ఉంచాలి.

◆ ప్లాస్టిక్ నిషేధం పర్యవేక్షణకు సీనియర్ సిబ్బందిలో ఒకరిని నోడల్ అధికారిగా నియమించాలి.

బెంగళూరును పేల్చేయండి!

పాక్ సైన్యాధిపతిని కోరిన శమాపర్వీన్

బెంగళూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: అల్ ఖైదా సిద్ధాంతానికి మద్దతు ఇస్తూ ఇటీవల బెంగళూరులో దొరికిపోయిన శమా పర్వీన్ అనే మహిళను జాతీయ దర్యాప్తు సంస్థ, గుజరాత్ ఏటీఎస్ అధికారులు విచారించగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో బెంగళూరును పేల్చేయాలని పాక్ సైన్యాధిపతి అసీమ్ మునీర్‌ను ఆమె కోరిందని అధికారులు గుర్తించారు. సామాజిక మాధ్యమంలో అసీమ్ ఫొటోను ఉంచి, భారత్‌లో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాలను ఏకీకరణ చేయాలని పోస్టు చేసినట్లు తెలుసుకున్నారు. ఆమెకు సామాజిక మాధ్యమంలో పది వేల మంది ఫాలోయర్లు ఉన్నారని ప్రాథమికంగా గుర్తించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ ప్రతినిధులు గురువారం పేర్కొన్నారు.

క్రీడా కోటా డీఎస్సీ పోస్టుల ప్రాథమిక జాబితా

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీలో క్రీడా కోటా ఉపాధ్యాయ పోస్టుల ప్రాథమిక జాబితాను http://sportsdsc.apcfss.in, http://sports.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని శాప్ ఎండీ అజయ్‌జైన్ తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 13 అర్ధరాత్రి 12 గంటల్లోపు వెబ్‌సైట్ ద్వారానే తెలియజేయాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు. అభ్యంతరాలు పరిష్కరించిన అనంతరం తుది జాబితాను విద్యాశాఖకు పంపనున్నారు. ఇప్పటికే డీఎస్సీ క్రీడా కోటా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యింది.

జాతీయ పురస్కారం అందుకున్న ధర్మవరం డిజైనర్



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్, సినీనటి కంగనా రనౌత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజు గురువారం దిల్లీలో కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సినీనటి, ఎంపీ కంగనా రనౌత్ చేతుల మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. దిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. చేనేత విభాగంలో డిజైన్ అభివృద్ధికి కృషి చేసిన నాగరాజుకు అవార్డుతోపాటు నవరత్నాల తామ్రపత్రం, ప్రశంసాపత్రం, రూ.2 లక్షల నగదు బహుమతి, పట్టు శాలువాను బహూకరించారు.

గ్రహం అనుగ్రహం

8-8-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం

చతుర్దశి: మ. 1-44 తదుపరి పూర్ణిమ

ఉత్తరాషాఢ: మ. 3-05 తదుపరి శ్రవణ

వర్జ్యం: రా. 7-09 నుంచి 8-47 వరకు

అమృత ఘడియలు: ఉ. 8-25 నుంచి 10-05 వరకు తిరిగి తె. 4-56 నుంచి

దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-07 వరకు తిరిగి మ. 12-31 నుంచి 1-22 వరకు

రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ.5.44; **సూర్యాస్తమయం:** సా.6.28

వరలక్ష్మీ వ్రతం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	27.0
నెల్లూరు	37.8	28.3
తాడేపల్లిగూడెం	37.8	28.1
ఒంగోలు	37.6	28.4
తిరుపతి	37.4	25.8
విశాఖపట్నం	35.8	29.0
నరసాపురం	35.8	28.0
విజయవాడ	35.6	27.8
కర్నూలు	34.3	26.7
విజయనగరం	34.0	26.0

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఘటన






ప్రమాద స్థలిలో ఆక్సిజన్ సిలిండర్లు ◆ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు

ఈనాడు-విశాఖపట్నం, జగదాంబకూడలి-న్యూస్‌టుడే: విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు కొన ఊపిరితో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం.. హార్బర్ సమీప బుక్కావీధిలో గణేశ్ అనే వ్యక్తి వెల్డింగ్ దుకాణంలో గురువారం సాయంత్రం నలుగురు సిబ్బంది పని చేస్తున్నారు. ఇక్కడ చేపల బోట్లకు మరమ్మతులు చేస్తుంటారు. వెల్డింగ్ చేస్తుండగా ఓ సిలిండర్ పేలి దుకాణంలోని సామగ్రి చెల్లాచెదురైంది. క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గణేశ్ (45), శ్రీనుల శరీర భాగాలు మాంసపు ముద్దల్లా చుట్టుపక్కల ఎగిరిపడ్డాయి. అక్కడే పనిచేసే చింతకాయల ముత్యాలు, ఎర్ర ఎల్లాజి, టి.సన్యాసిరావు, పక్కనున్న ఇనుప వ్యర్థాల దుకాణ యజమాని ఇప్పలి రంగారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నలుగురూ కాలిన గాయాలతో రోడ్డుపై నడుస్తూ కుప్పకూలిన దృశ్యాలు గగుర్పాటుకు గురిచేశాయి. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ముత్యాలు(27) మృతిచెందాడు. ఎల్లాజీ, రంగారావు, సన్యాసిరావుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో గణేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ముత్యాలుకు భార్య ప్రమీల, ఇద్దరు పిల్లలున్నారు. శ్రీను ఒడిశా వాసి. ఘటనాస్థలంలో ఎల్‌పీజీ గ్యాస్‌తో పాటు మంట హెచ్చుతగ్గులకు ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్లు పడి ఉన్నాయి. వీటిలో ఏది పేలిందన్నది నిర్ధారణ కాలేదు. పేలుడు శబ్దం కిలోమీటరు మేర వినిపించిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

జనవరి ఒకటిన క్వాంటమ్ కంప్యూటర్ వ్యాలీ

- దేశంలో తొలిసారి అమరావతిలో ఏర్పాటు
- రాష్ట్ర ఐటీ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ



మన్నవ మోహన్ కృష్ణ

తిరుమల, న్యూస్‌టుడే: దేశంలోనే మొదటిసారిగా అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ వ్యాలీ వచ్చే ఏడాది జనవరి ఒకటిన ప్రారంభం కానుందని రాష్ట్ర ఐటీ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తెలిపారు. వీఐపీ బ్రేక్‌లో ఆయన గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటర్ వ్యాలీ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దేశంలో మొదటిసారిగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చి సామాన్యుడికి ఫోన్ ద్వారానే తనకు కావాల్సిన డాక్యుమెంట్లు పొందే సదుపాయం కల్పించాం. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తాం. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే పలు పెద్ద ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చింది. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం' అని ఆయన చెప్పారు.

దుర్గమ్మ దర్శనాలకొచ్చే ప్రముఖులు ముందే సమాచారమివ్వండి

- ప్రొటోకాల్ ఇబ్బందులు లేకుండా చూస్తాం: ఈవో శీనానాయక్

ఈనాడు, అమరావతి: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రముఖుల రద్దీ పెరిగి ప్రొటోకాల్ ఇబ్బందులు వస్తుండడంతో సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు కొన్ని నిబంధనలు అమలు చేస్తున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ గురువారం ప్రకటించారు. ''ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర వ్యవస్థలకు చెందిన ప్రముఖులు, వారి కుటుంబ సభ్యులు దర్శనానికి వచ్చే సమయంలో వారికి సంబంధించిన సమాచారం ముందే దేవస్థానానికి అందించాలి. తద్వారా ప్రొటోకాల్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది పర్యవేక్షిస్తారు. ఇందుకు ప్రముఖులు సహకరించాలి'' అని ఈవో కోరారు. ఇక నుంచి సిఫార్సులపై వచ్చే వాళ్లు కచ్చితంగా సంబంధిత ప్రజాప్రతినిధి, అధికారుల లెటర్ హెడ్ లేదంటే పేపర్‌పై దర్శనాలకు వచ్చే వారి పేర్లు, వివరాలు రాసి ప్రముఖుల సంతకాలు చేయించి తీసుకురావాలి'' అని శీనానాయక్ పేర్కొన్నారు.

శ్రీవాణి భక్తులకు టోకెన్ల జారీ

- క్యూ లైన్‌లో వేచి ఉండకుండా కొత్త విధానం తెచ్చిన తితిదే





ఆధార్‌కార్డుపై స్టాంప్, పొందిన టోకెన్ చూపుతున్న భక్తుడు ◆ టోకెన్లు పొంది తమవంతు కోసం శ్రీవాణి కేంద్రంలో వేచి ఉన్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనార్థం ఇచ్చే శ్రీవాణి కోటా టికెట్ల జారీలో జాప్యాన్ని నివారించేందుకు తితిదే గురువారం నుంచి టోకెన్ల విధానం తీసుకొచ్చింది. ప్రస్తుతం టికెట్లు పొందేందుకు భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూలైన్‌లో వేచి ఉంటున్నారు. ఇలా గంటల తరబడి లైన్‌లో ఉండాల్సి రావడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులకు టోకెన్లు జారీ చేసి, ఆధార్ కార్డు నకలుపై ముద్రవేసి ఓ నంబరు కేటాయించి పంపుతున్నారు. భక్తులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు శ్రీవారి దర్శనానికి వెళ్లేలోపు ఎప్పుడైనా శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో టోకెన్లు చూపించి, డబ్బు చెల్లించి టికెట్లు పొందొచ్చు. ఎప్పటికప్పుడు టోకెన్లు, టికెట్లు జారీ చేస్తుండటంతో రెండు కేంద్రాల్లోనూ క్యూకట్టాల్సిన బాధ తప్పుతోంది.

తిరుపతిలో ముంతాజ్ హోటల్‌కు భూ కేటాయింపుల రద్దు

ఈనాడు, అమరావతి: తిరుపతి గ్రామీణ మండలం పేరూరులో ఒబెరాయ్ గ్రూపునకు చెందిన ముంతాజ్ హోటల్‌కు వైకాపా ప్రభుత్వం చేసిన 20 ఎకరాల భూ కేటాయింపును కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఆధ్యాత్మిక ప్రాంతం తిరుపతిలో ముంతాజ్ పేరుతో హోటల్ నిర్మాణంపై ధార్మిక సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేసినా అప్పట్లో పట్టించుకోలేదు. 2024 నవంబరు 18న నిర్వహించిన తితిదే పాలకవర్గ సమావేశంలో ఒబెరాయ్ గ్రూపునకు తిరుపతి గ్రామీణ మండలంలో భూ కేటాయింపులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. ప్రజలు, ధార్మిక సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. భూ కేటాయింపులపై హైకోర్టులోనూ కేసు పెండింగ్‌లో ఉంది. వీటన్నిటిని దృష్ట్యా భూ కేటాయింపులు రద్దు చేస్తూ పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం



తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీ అందిస్తున్న దాత చిరాగ్ పురుషోత్తం. చిత్రంలో మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళం అందింది. స్థానిక క్యాంపు కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసిన దాత సీకేపీసీ ప్రాపర్టీస్ ఎండీ చిరాగ్ పురుషోత్తం విరాళం డీడీని అందజేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఈనాడు

స్వామినాథన్ సిఫార్సుల అమలు ఇంకెన్నడు?

ఆరున్నర దశాబ్దాల కిందట భారతావని వరస కరవులు, అరకొర ఫలసాయాలూ ఆకలికేకలతో అల్లాడింది. విదేశాల నుంచి ధాన్యం వస్తే తప్ప మన పొయ్యిలో పిల్లి లేవని దుస్థితిని గుర్తుచేసే 'ఓడ వస్తేనే నోట్లోకి ముద్దవెళ్లేది' అనే నానుడి దేశ ప్రతిష్ఠకు మచ్చలా మారింది. అలాంటి దుర్భరావస్థ నుంచి అనతికాలంలోనే ఆహారధాన్యాల దిగుబడిలో స్వావలంబన సాధించగలిగిన స్థాయికి ఇండియా చేరుకోగలిగింది. ఎం.ఎస్.స్వామినాథన్ ఆధ్వర్యంలో విఖ్యాత శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సహకారంతో 1960ల్లో మొదలైన హరిత విప్లవం జాతి తలరాతను మార్చేసింది. అధిక దిగుబడినిచ్చే వంగడాల వినియోగం, నీటి సమర్థ వాడకం, చీడపీడల నివారణ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వడంతో హరిత విప్లవం ఆరంభమైన అయిదేళ్లలోనే దేశీయంగా గోధుమ ఉత్పత్తి దాదాపు రెట్టింపయ్యింది. రెండున్నర దశాబ్దాల్లో వరి ఉత్పాదకతలో మూడు రెట్ల వృద్ధి నమోదైంది. హరిత విప్లవం దరిమిలా జనభారతానికి ఆహార భద్రత లభించినప్పటికీ సాగుదారుల ఆదాయాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. రైతుల సంక్షేమానికి స్వామినాథన్ చేసిన మేలిమి సిఫార్సులు ఇంకా బుట్టదాఖలవుతున్నాయి. వాటిని ఆచరణలోకి తీసుకురావడంపై ప్రభుత్వాలు దృష్టిసారించినప్పుడే ఆ సాగురంగ రుషికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది!

ప్రయోగశాలల్లో ఏవో పరిశోధనలు చేసి, వాటిని పొలాలకు చేర్చడం కాకుండా స్థానిక అవసరాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు పనిచేయాలన్నది స్వామినాథన్ స్ఫూర్తిసందేశం! అందుకే, లవణీయతను తట్టుకునే వరి రకాలకోసం తన రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా మడఅడవులపై లోతైన పరిశీలనలు చేపట్టారాయన. వ్యవసాయ విశ్వవిద్యాలయాలూ సంబంధిత విజ్ఞాన సంస్థల్లో సాగే పరిశోధనల ఫలాలన్నీ రైతుల లోగిళ్లకు చేరినప్పుడే- స్వామినాథన్ ఆశించినట్లు, వాటికి సార్థకత లభిస్తుంది. రుణమాఫీల వంటి తాత్కాలిక చర్యలతో సాగుదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని స్వామినాథన్ తరచూ చెప్పేవారు. వాతావరణ విపత్తులు, మార్కెట్ మోసాలతో కష్టార్జితాలను కోల్పోతున్న రైతులకు ప్రభుత్వాలు న్యాయమైన కనీస మద్దతు ధర కల్పించాల్సిందేనని ఆయన గట్టిగా గళమెత్తేవారు. కానీ ఇప్పటికీ అది అరణ్యరోదనమే అవుతోంది. దాంతో ఆదాయాలు హరించుకుపోయి నవతరం వ్యవసాయానికి దూరమవుతోంది. సగానికి పైగా జనాభాకు జీవనాధారమైన సాగురంగాన్ని నిర్లక్ష్యం చేస్తే దేశానికి భవిష్యత్తు ఉండదన్న స్వామినాథన్ హెచ్చరిక- ప్రభుత్వాలకు మేలుకొలుపు వంటిది!

సాగులో సుస్థిరత, రైతులకు మెరుగైన రాబడే లక్ష్యాలుగా స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ కమిషన్ కేంద్రానికి పలు నివేదికలు సమర్పించింది. భూమి విలువ, కౌలు మొత్తంతో సహా వాస్తవిక వ్యయాలన్నింటినీ లెక్కించి, దానికి అదనంగా 50శాతం కలిపి సాగుదారులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న కమిషన్ సిఫార్సు నేటికీ అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. అన్నదాతల బతుకులు నిజంగా బాగుపడాలంటే స్వామినాథన్ సూచించినట్లు, కనీస మద్దతు ధర పెరగడంతో పాటు పంటల ఉత్పాదకత సైతం అధికం కావాలి. సాగు ఖర్చులు వీలైనంత దిగివచ్చేలా ప్రభుత్వాలు జాగ్రత్త వహిస్తూ సతతహరిత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన పెంచాలి. పర్యావరణ మార్పులను నిభాయించే విధంగా ఎప్పటికప్పుడు అత్యుత్తమ వంగడాలను తయారు చేసుకోవడం మరో కీలకాంశం. ఆహారధాన్యాల్లో మిగులు సాధించిన ఇండియా ఇకపై ప్రజలకు పౌష్టికాహార భద్రత కల్పించేందుకు కంకణబద్ధం కావాలి!

గెలిచినప్పుడు ఒదిగి ఉండటం, ఓడినప్పుడు ధైర్యంగా నిలబడటం... నాయకుడికి కావాల్సిన ముఖ్య లక్షణాలు. ఏ పనిలోనైనా నూటికి నూరుశాతం ప్రయత్నం పెడితే 200శాతం ప్రయోజనాలు గ్యారంటీ.

– ప్రొఫెసర్ సి.కె.ప్రహ్లాద్



సుఖశాంతుల కోసం...

అర్థం తెలుసుకుని చేసిన పని ప్రయోజనకరంగా ఆనందదాయకంగా ఉంటుంది. వరలక్ష్మీవ్రతాన్ని చేయడానికి ఎటువంటి వివక్ష లేదు. ఇన్నేళ్లు చేయాలనే నియమాలేమీ లేవు. ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం చేస్తారు. 'వర' అంటే శ్రేష్ఠమైన అని అర్థం. లక్ష్మి అంటే సంపద. మనుషులు సుఖమయమైన జీవితం గడపడానికి కావాల్సిన సమస్త అంశాలూ సంపదలో భాగమే. వాటన్నిటిలోనూ ఉత్తమమైన వాటిని ఇచ్చేది వరలక్ష్మి. వరలక్ష్మి అంటే 'వరాలనిచ్చే లక్ష్మి'.

వ్రతం అనే మాటకి నియమం, వర్తనం మొదలైన అర్థాలున్నాయి. అంటే ఒక వ్రతం ఆచరించినప్పుడు నడవడికలో మంచిమార్పు వస్తే ఆ నోము ఫలవంతమైనట్టు. అలాంటి వ్రత మాహాత్మ్యాన్ని నిరూపించే కథ వరలక్ష్మీదేవిది. దేవిని షోడశోపచారాలతో పూజించాలి. తొమ్మిది ముడులు ఉన్న తొమ్మిది పోగుల తోరం కట్టుకోవాలి. పానకం, వడపప్పు, చలిమిడి, అరటిపండ్లు, కొబ్బరికాయ నివేదనకి ప్రధానం. వీలైతే, లక్ష్మీదేవికి ఆవుపాలు, బెల్లంతో పరమాన్నం చేయొచ్చు. మగధదేశంలో కుండిన నగరంలో చారుమతి అనే గృహిణి ఉన్నదాంతో తృప్తిగా ఉండేదట. ఆమె సత్ప్రవర్తనకు మెచ్చి, వరలక్ష్మీదేవి కలలో కనిపించి, శ్రావణపూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం తనను పూజిస్తే సకలసౌభాగ్యాలూ ప్రసాదిస్తానని చెప్పింది. లక్ష్మీదేవి సెలవిచ్చిన విధంగా శుక్రవారం అన్ని ఏర్పాట్లు చేసి నగరంలోని స్త్రీలందరినీ పిలిచి వ్రతం చేసుకుంది చారుమతి. పూజానంతరం అందరికీ ఉత్తమ ఫలితాలే లభించాయి. దాంతో ఆ స్త్రీలు చారుమతిని, వరలక్ష్మిని కీర్తించి, ఏటా వ్రతం చేసుకుంటూ సకల సంపదలతో తులతూగారన్నది పౌరాణిక గాథ.



అంతర్యామి

వరలక్ష్మీదేవి అనుగ్రహించిన స్త్రీ చారుమతి. కథలో ఆమె పేరు మాత్రమే చెప్పారు కానీ భర్త, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు లేవు. చారుమతి అంటే మంచిబుద్ధి కలది కాబట్టే, పెద్దలను భక్తిశ్రద్ధలతో సేవించుకుంది. అందరిని తనతోపాటు వ్రతం చేసుకోవడానికి పిలిచింది. వరలక్ష్మి పూజ చేయమన్నది చారుమతిని ఒక్కదానినే. అయినా తనకు కలగబోయే మేలు అందరికీ కలగాలని ఆశ పడింది చారుమతి. అమ్మను పూజించటానికి అందరు అర్హులే. ఇది గుర్తించింది కనుక ఆమె 'చారుమతి' అయింది. పూజ అయ్యాక వాయనం ఇచ్చేటప్పుడు- 'ఇస్తినమ్మ వాయనం', 'పుచ్చుకొంటినమ్మ వాయనం' అంటూ చెప్పిస్తారు. 'నా వాయనం పుచ్చుకున్న వారెవరు?' అని అడిగితే 'నేనే వరలక్ష్మీదేవిని' అని సమాధానం. ఈ కార్యక్రమం వల్ల సాటి మనిషిని ఆరాధ్యదైవంగా చూడటం అలవడుతుంది.

సామూహికంగా వ్రతాలు ఆచరించడంతో సమష్టితత్వం పెరుగుతుంది. అందరికీ మంచి జరగాలనుకోవడం, ఏ విధమైన వివక్షనూ పాటించక పోవడం, పెద్దలను ఆదరించడం, ఉన్నదాంతో తృప్తి చెందడం మొదలైన చారుమతిలోని గుణాలను అందరూ పెంపొందించుకోవాలి. అప్పుడు కుటుంబం సుఖశాంతులనే శ్రేష్ఠమైన సంపదతో విలసిల్లుతుంది.

– డాక్టర్ అనంతలక్ష్మి



మహాసాగరంలో కాసుల వేట!

పెరిగిపోయిన కాలుష్యం, కట్టుతప్పుతున్న భూతాపం హరిత, సుస్థిరాభివృద్ధి వైపు మళ్లాల్సిన అవసరాన్ని ముందుకుతెస్తున్నాయి. ఆ నేపథ్యంలో ముందుకువస్తున్న కృత్రిమ మేధ, అధునాతన కమ్యూనికేషన్లు, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు కొత్త సమస్యను తెచ్చిపెడుతున్నాయి. ఈ పరిజ్ఞానాలు, పరికరాలకు లిథియం, కోబాల్ట్, టైటానియం, గాలియం, రాగి వంటి అరుదైన లోహాలు కావాలి. వీటి సరఫరా ప్రధానంగా చైనా చేతిలో ఉంది. అమెరికా ప్రారంభించిన సుంకాల సమరం అరుదైన లోహాల సరఫరా గొలుసుల విచ్ఛిన్నానికి దారితీస్తోంది. హరిత టెక్నాలజీలు అన్నింటికీ ఈ లోహాలు అవసరం కాబట్టి వాటికోసం అన్వేషణ భూతలం నుంచి సముద్ర గర్భంలోకి విస్తరిస్తోంది. సముద్రంలో 4వేల నుంచి 5వేల మీటర్ల లోతు వరకు వెళ్లి అక్కడి నుంచి భారీ యంత్రాలతో అరుదైన ఖనిజ ఖనికెలను తవ్వుకుని తీసుకురావడానికి పోటీ మొదలవుతోంది.

భూగోళంపై 71 శాతం నీరే కాబట్టి భూమి మీదకన్నా సముద్ర గర్భంలో రెండు రెట్లు ఎక్కువ అమూల్య ఖనిజ వనరులు ఉన్నాయి. సాంకేతికంగా ముందున్న దేశాలు సముద్ర గర్భం నుంచి అరుదైన లోహాలను వెలికితీసేందుకు పోటీపడుతున్నాయి. ఈ ఖనిజ వేట సాగర జలాలను కలుషితం చేసి సాగర జీవులకు ముప్పుతెస్తుంది. అసలే కర్బన ఉద్గారాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని మరింత ఎక్కువ అవుతుంది. ప్రపంచమంతటా 300 కోట్లమంది జీవనాధారం కోసం సముద్రాలపైన, తీర ప్రాంత జీవ వనరులపైన ఆధారపడుతున్నారు. వాళ్లందరికీ ఇప్పుడు ప్రమాదం పొంచి ఉంది.

అంతర్జాతీయ నియంత్రణ ఉందా?

సముద్రజలాను విచ్చలవిడిగా ఉపయోగిస్తే జీవజాతులకు, పర్యావరణానికి తీరని నష్టం కలుగుతుంది. దీన్ని నివారించడానికి ఐరాస ఛత్రం కింద కుదిరిన సముద్ర చట్ట (యుఎన్ క్లోస్) ఒప్పందం 1994 నవంబరు 16 నుంచి అమలులోకి వచ్చింది. దీనికింద ప్రతి దేశానికీ తన తీరం నుంచి సముద్రంలో 12 నాటికల్ మైళ్ల (22.22 కిలోమీటర్ల) దూరం వరకు ఉన్న జలాలపై సార్వభౌమ హక్కు ఉంటుంది. వీటిని అంతర్గత జలాలు అంటారు. ఖండపు అంచు నుంచి 200 నాటికల్ మైళ్ల (370.4 కిలోమీటర్ల) వరకు విస్తరించిన ప్రాదేశిక జలాలను ప్రత్యేక ఆర్థిక మండలంగా పిలుస్తారు. అంతర్గత, ప్రాదేశిక జలాల పరిధికి అవతల ఉన్నవాటిని అంతర్జాతీయ జలాలే. అక్కడ యుఎన్ క్లోస్ నిబంధనలు వర్తిస్తాయి. ఇదే ఒప్పందం కింద అంతర్జాతీయ సముద్ర గర్భ ప్రాధికార సంస్థ(ఐఎస్ఏ)ను నెలకొల్పారు. అది సముద్ర గర్భంలోని విలువైన ఖనిజాలు, ఇతర వనరుల వెలికితీతను నియంత్రిస్తుంది. ఐఎస్ఏలో 170 సభ్య దేశాలు ఉన్నప్పటికీ తన ఆదేశాలను అమలు చేసే అధికారం ఐఎస్ఏకి లేదు. అంటే ఏ దేశానికి ఆ దేశం సముద్ర గర్భంలో వనరుల అన్వేషణలో సంయమనం పాటించాలన్నమాట! వాస్తవానికి సముద్ర గర్భ అన్వేషణకు ఐఎస్ఏ నుంచి లైసెన్సులు పొందాల్సి ఉంది. కానీ, ఈ ఏడాది ఏప్రిల్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సముద్ర గర్భ ఖనిజ, చమురు అన్వేషణకు తానే లైసెన్సులు ఇస్తానని ప్రకటించి కలకలం రేపారు. దీంతో ఇతర ప్రధాన దేశాలు కూడా సముద్ర గర్భంలో ఖనిజాల వేటకు సిద్ధమవుతున్నాయి. [illegible] ఇది అంత తేలిక కాదు. భారీ వ్యయం, అధునాతన సాంకేతికతలు అవసరం. అందుకే ఐఎస్ఏ ఇంతవరకు 31 అన్వేషణ లైసెన్సులు ఇచ్చినా సముద్ర గర్భ వేట ఊపందుకోలేదు.

చైనాను కట్టడి చేయడం కోసమేనా?

సముద్రం అడుగున పడి ఉండే రాళ్లలో మాంగనీస్, కోబాల్ట్ తదితర అరుదైన ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం హవాయి నుంచి మెక్సికో వరకు పసిఫిక్ మహా సముద్రంలో విస్తరించిన క్లారియన్ క్లిప్పర్టన్ ఫ్రాక్చర్ జోన్(సీసీజెడ్)లో అరుదైన ఖనిజాల కోసం వేట ముమ్మరమవుతోంది. 10వేల చదరపు మైళ్ల పర్యంతం విస్తరించిన ఈ మండలం విస్తీర్ణంలో భారత్ కన్నా పెద్దది. ఇక్కడ సముద్రం అడుగున నికెల్, కోబాల్ట్, మాంగనీస్ వంటి అరుదైన ఖనిజాల శిలాగుళికలు పడి ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు కావాల్సిన ఈ ఖనిజాలను వెలికితీసుకురావడానికి పోటీ మొదలైంది. సీసీజెడ్‌లో 600 కోట్ల టన్నుల మాంగనీస్, 27 కోట్ల టన్నుల నికెల్, 23 కోట్ల టన్నుల రాగి, 5 కోట్ల టన్నుల కోబాల్ట్ నిక్షేపాలున్నాయి. వీటిని వెలికితీస్తే అరుదైన లోహాల కోసం చైనా మీద ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుందని పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. ఇప్పటికే సీసీజెడ్‌లో ఖనిజ అన్వేషణకు లైసెన్సు కోసం ఓ కెనడా కంపెనీ దరఖాస్తు పెట్టింది.

పొంచి ఉన్న ప్రమాదాలేంటి?

మానవుడు వెలువరిస్తున్న కర్బన ఉద్గారాలను అడవులకన్నా చాలా ఎక్కువగా సముద్రాలే పీల్చుకుంటున్నాయి. సముద్ర గర్భ అన్వేషణతో సాగర జీవావరణ వ్యవస్థ నాశనమవుతుంది. మహాసాగరాల్లో అనేక జీవజాతుల వినాశనానికి దారితీస్తాయి. వాటిని పునరుజ్జీవింప చేయడం అసాధ్యమని అధ్యయనాల్లో తేలింది. అసలు సముద్రంలో మనకు తెలియని జీవజాతులు లెక్కలేనన్ని ఉన్నాయి. సీసీజెడ్‌లో 5,580 జీవజాతులు ఉండగా వాటిలో 438 జాతులను మాత్రమే ఇంతవరకు గుర్తించగలిగాం. సముద్ర గర్భ ఖనిజ ఖనికెల కోసం చేపట్టే అన్వేషణ భారీ నష్టం కలిగిస్తుంది కాబట్టి, దాన్ని తక్షణం ఆపాలని ఫ్రాన్స్, జర్మనీ, న్యూజిలాండ్, చిలీ, కోస్టారికా దేశాలు కోరుతున్నాయి. మరోవైపు సముద్ర గర్భం నుంచి చేపలను వేటాడే ట్రాలర్ బోట్లు ఏటా 49 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మత్స్య సంపద నిర్మూలనకు కారణమవుతున్నాయి. సముద్ర గర్భం నుంచి ఖనిజ వనరులను తవ్వితీయడానికి భారీ వ్యయమవుతుంది కాబట్టి కంపెనీలు ప్రభుత్వ సబ్సిడీలను కోరతాయి. ఇంతచేసినా 25 శాతం ఖనికెల్లో మాత్రమే మనకు పనికి వచ్చే ఖనిజాలు ఉంటాయి. పెట్టిన ఖర్చుకు సరిపడా ప్రయోజనం లభిస్తుందా అంటే అనుమానమే. అయినా మొండిగా ముందుకెళ్తామంటే భూగోళానికీ, మానవాళికీ కోలుకోలేనంత నష్టం జరుగుతుంది.



డాక్టర్ ఎస్.అనంత్
న్యాయవాది, ఆర్థిక సామాజిక విశ్లేషకులు

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ కావాలని ఒక కల ఉంటుంది. కొందరు అదే జీవిత లక్ష్యంగా స్కూల్లో ఉన్నప్పటి నుంచే సన్నద్ధమవుతూ ఉంటారు. ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి వృత్తివిద్యలు చదివినవారు కూడా తరచుగా అఖిల భారత సర్వీసుల వైపు మొగ్గడం చూస్తుంటాం. ఎందుకు ఈ ఉద్యోగాలకు ఇంత క్రేజ్ అంటే- ఎవరి కారణం వారికి ఉంటుంది. కొందరికి ఆ హోదా నచ్చితే మరికొందరికి ప్రజలకు దగ్గరగా ఉండి సేవ చేయవచ్చన్నది నచ్చుతుంది. సమాజాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేయొచ్చన్నది ఇంకొందరి అభిప్రాయం. దానికి తగ్గట్టుగానే ఒకప్పుడు తరవాతి తరాలకు ఆదర్శంగా నిలిచిన అధికారులు ఎందరో ఉండేవారు. వారు నిష్పక్షపాతంగా, నిజాయతీగా పనిచేస్తూ దేశాభివృద్ధిలో తమదైన ముద్ర వేసేవారు. అయితే రాను రాను ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ ఆదర్శాలకు, ఉద్యోగ నియమాలకు పూర్తిగా కట్టుబడి ఉండి సేవలందించేవారి సంఖ్య తగ్గిపోతోందన్నది వాస్తవం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బి.కె.రావు అనే ఐఏఎస్ అధికారి ఉండేవారు. కేంద్ర గనుల శాఖ కార్యదర్శిగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్‌కు పునాదులు వేసిన వ్యక్తి ఆయన.

ఉన్నారా ఎవరైనా...



బాగా చదువుకున్నవారు. ఒకసారి పై అధికారి ఒకరు మీరేం చదివారని అడిగారట. దానికి జవాబుగా బి.కె.రావు 'సర్టిఫికెట్ ప్రకారం అయితే బీయస్సీ ఆనర్స్ జియాలజీ. మిగిలిన విషయాల్లో ఏం చదివానో లెక్కలేద'ని సమాధానమిచ్చారట. విషయ పరిజ్ఞానంలోనే కాదు, వ్యక్తిత్వపరంగానూ ఆయనది విలక్షణ శైలే. అందుకు దృష్టాంతంగా ఒక సంఘటనను ప్రముఖ కథారచయిత భమిడిపాటి రామగోపాలం (భరాగో) తన ఆత్మకథలో పేర్కొన్నారు. బి.కె.రావు పూర్తి పేరు భమిడిపాటి కుక్కుటేశ్వరరావు. తన ఉద్యోగ జీవిత ప్రారంభ కాలంలో శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా వెళ్లారాయన. ఆ డివిజన్‌లోని ముగ్గురు తహసీల్దారులూ వచ్చి ఆయనను కలుసుకుని పరిచయం చేసుకున్నారు. బొబ్బిలి తహసీల్దార్ పేరు భమిడిపాటి అప్పారావు. బి.కె.రావుది ఆ ప్రాంతం కాదు. అక్కడ బంధుత్వాలూ లేవు. అయినా సరే అదే రోజు రాత్రి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి బొబ్బిలి తహసీల్దార్‌ను వేరే డివిజన్‌కు బదిలీ చేయమని కోరారు. 'ఆయన నిజాయతీపరుడు. ఎందుకు బదిలీ చేయమంటున్నారో కారణం చెప్పండి' అని అడిగారు కలెక్టర్. 'మీకు సిల్లీగా అనిపించవచ్చు కానీ అతనిదీ నాదీ ఇంటి పేరొకటే. ఒకే సామాజిక వర్గం. ఆఫీసు పనుల విషయంలో తప్పు జరిగి నేను ఆయన మీద చర్య తీసుకోకపోతే వాళ్లిద్దరూ ఒకటే అని ఎవరైనా నాకు పక్షపాతబుద్ధి అంటగట్టవచ్చు. ఒకవేళ చర్య తీసుకుంటే సాటివాడు అని కూడా చూడకుండా హాని తలపెట్టాడని అనుకోనూ వచ్చు. అందుకే ఆయనను మరో చోటికి మారిస్తే బాగుంటుంది. అప్పుడిక ఏ గొడవా ఉండదు కదా' అని తన మనసులో మాట చెప్పారట. ఈ రోజుల్లో కనీసం ఇలా ఆలోచించే అధికారులు ఎందరున్నారు?

– సూర్య

విద్యుత్ కార్ల జోరు

విద్యుత్ వాహనాల వాడకం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. ముఖ్యంగా పూర్తి విద్యుత్ లేదా హైబ్రిడ్ కార్లను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. నిరుడు చైనాలో అమ్ముడైన మొత్తం కార్లలో అలాంటివే సగందాకా ఉన్నాయి. ఐరోపా సంఘ దేశాల్లో విక్రయమైన ప్రతి అయిదు కార్లలో ఒకటి ఎలక్ట్రికల్ లేదా హైబ్రిడ్ రకానిదే. అమెరికాలో ప్రతి పది కార్లలో అలాంటిది ఒకటి ఉంది. నిరుడు ఆయా దేశాల్లో అమ్ముడైన మొత్తం కార్లలో విద్యుత్, హైబ్రిడ్‌వి... (శాతాల్లో)

నార్వే	92
స్వీడన్	58
చైనా	48
యూకే	28
స్విట్జర్లాండ్	28
ఐరోపా సంఘ దేశాలు	21
కెనడా	17
ఆస్ట్రేలియా	13
అమెరికా	10
దక్షిణ కొరియా	9
బ్రెజిల్	6
జపాన్	3
ఇండియా	2

(ఆధారం: ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదిక-2025)

ఎవరో ఒకరిని బాదాల్సిందే!

'ఏయ్ సెక్యూరిటీ నాకన్నా ముందు నడుస్తావేం, నీ జీతంలో రెండొందల డాలర్లు కట్'

'అయ్యా కంప్ సర్, నాకొచ్చేదే, వంద డాలర్లు, అంతకు డబుల్ ఎట్లా కోస్తారు మహానుభావా?'

'అదంతా నాకు తెలియదు, కటింగంటే కటింగే! ఎక్కువ మాట్లాడితే ఇంకా పెంచేస్తా'

'కంప్ సార్, కాస్త దయ తలచండి'

'ముందు నువ్వెంత తగ్గించుకుంటావో చెప్పు'

'నా జీతం నేనే తగ్గించుకోవడమేంటి మహాప్రభూ'

'ఆఫీసుకు వచ్చి డిస్కస్ చేయ్, తర్వాత చూద్దాం'

'కంప్ సర్, సెక్యూరిటీ విషయంలో మనం జోక్యం చేసుకోకూడదు'

'యూ.. పీఏ, నాకే ఎదురు చెబుతావా, నీకు 285 పర్సెంట్ ఫైన్ వేస్తున్నా'

'బాగా ఓవరైనట్లుంది సర్'

'85 పర్సెంట్ తగ్గిస్తా, మూడ్రోజులు టైమిస్తా..'

'ఈ వేయడాలు, కోయడాలు ఏమిటి సర్! మీరు ఫారిన్ డెలిగేట్స్‌తో చర్చలు జరపాలి, టైమవుతోంది.'

'లేదు, ముందుగా మీడియాతో మాట్లాడాలి, ప్రెస్ మీట్ పెట్టండి.'

'మీరు మీడియాను చూడగానే ఒళ్లుమరచిపోయి, అన్నీ నేనే చేశానంటూ ఏదేదో వాగేస్తున్నారనే కంప్లయింట్లు వస్తున్నాయి'

'నా మీదే కంప్లెయింట్లా?'

'మీరిక్కడ నోటికొచ్చింది అంటున్నారు, ఆ దెబ్బకి ఆ దేశాల్లో కొట్టుకు ఛస్తున్నారు. అన్నిట్లో వేలు పెడుతున్నారని, పంచాయితీలు తెంపానని చెబుతూ, కొత్త పంచాయితీలు పెడుతున్నారని మండిపోతున్నారు'

'లేటెస్టుగా కొట్టుకుంటున్న దేశాల పంచాయితీనైనా పరిష్కరిస్తా, ఛాన్సివ్వండయ్యా!'

'నిన్నటిదాకా కొట్టుకున్న రెండు చిన్న దేశాలూ శాంతించాయి సర్! యుద్ధం విరమించాయి.'

'నో.. నో.. అలా కుదరదు. నేను చెబితేనే విరమించాయని చెప్పాల్సిందే, నన్నడక్కుండా ఎవరైనా ఎలా శాంతిస్తారు?'

'వాళ్లకి అంతకన్నా కొట్టుకునే ఓపిక లేదట సర్'

'ఓపిక లేకపోతే తెప్పిస్తాం.. ఆయుధాలిస్తాం, విమానాలిస్తాం, బాంబులిస్తాం, మనుషులనూ పంపుతాం'

'అవన్నీ మోసేంత శక్తి లేదట, అందుకే విరమించాయట'

'అయినా, సరే, నేను చెప్పిన తరవాతే ఆపెయ్యాలి. కుదరదంతే!'

'ఆగిపోయిన పంచాయితీని మొదట్నుంచీ మొదలు పెట్టమంటే ఎలా కంప్ సర్?'

'కనీసం ఓ తెల్లకాగితమైనా ఇయ్యవయ్యా, ఏదోఒక ఆర్డర్ మీద సంతకం చేస్తా'



'కొత్తగా ఇవ్వాల్సిన ఆర్డర్లేమీ లేవు సర్'

'అయితే, టారిఫ్‌లు బాదేస్తా'

'మీ అడ్డగోలు గుడ్డిబాదుడుతో ఎవరికేం తగులుతుందో కూడా తెలియడం లేదు. దోస్తులూ దూరమైతే, ప్రాబ్లమైపోతుంది సర్'

'నేనంతే, అందరినీ బాదేసే బాద్‌షాను! నా నోటి తీట, చేతి తిమ్మిరి తగ్గాలంటే ఎవరో ఒకరిని తిట్టాల్సిందే, ఏదో ఒక దేశాన్ని బాదాల్సిందే!'

★ ★ ★

'హల్లో కంప్ డ్యూడ్, ఏంటి డల్‌గా కనిపిస్తున్నారు'

'ఏంటో కన్నీర్‌మున్నీర్ భయ్యా, ఈ ప్రపంచం విలువైనవాడి విలువే గుర్తుపట్టదు. కొంచెం కూడా కృతజ్ఞత చూపదు. పెద్ద రాజ్యానికి ప్రెసిడెంటునైనా, నాకెవ్వరూ విలువ ఇవ్వడంలేదు. పంచాయితీలన్నీ నేనే తెంపానని గొంతుచించుకున్నా, ఒక్క గోబెల్ ప్రైజ్ కూడా రావడం లేదు'

'బాధపడొద్దు బ్రదర్, నీ తెలివితేటల సంగతి తెలియదా, నీకివ్వాల్సిందేనని సిఫార్సు చేశాగా.. వచ్చేస్తుందిలే!'

'నా పాలిట దేవుడివి భయ్యా! నాతో ఫ్రెండ్‌షిప్ చేసిన ఒక్కరు కూడా నాకు గోబెల్ ప్రైజ్ ఇవ్వాలని చెప్పలేదు బ్రదర్.. నువ్వొక్కడివే, ఆ మాట చెప్పావు. నీకెంత చేసినా తక్కువే. చెప్పు భయ్యా నీకేం కావాలో చెప్పు'

'మా పిరికిస్థాన్‌కు నన్ను ప్రెసిడెంటును చెయ్యి బ్రదర్. ఏదో కిందామీదా పడి, అర్హత లేకున్నా దొడ్డిదారిన ఫెయిల్డ్ మార్షల్‌నయ్యా. ఆ ప్రెసిడెంటు పోస్టు కూడా ఇప్పిస్తే, మా పిరికిస్థాన్‌కు కంపిస్థాన్ అని నీపేరే పెట్టుకుంటా!'

'బ్రదర్ ఫ్రమ్ అనదర్ మదర్ అంటే నువ్వే కన్నీర్‌మున్నీర్ భయ్యా!'

★ ★ ★

'ఏమయ్యా పీఏ... కంప్ సర్‌కి ఈ పంచాయితీలు, టారిఫ్‌ల పిచ్చి ఎక్కువైపోతోంది, ఏం చేద్దాం?'

'అంతకన్నా ముందు గోబెల్ ప్రైజ్ పిచ్చి కూడా పట్టుకుంది. అది వస్తే ఇది తగ్గుతుందేమో!'

'అయితే, ఏదోలా మేనేజ్ చేసి, ఆ గోబెల్ ఏదో కంప్ సర్‌కే వచ్చేలా చేస్తే...'

'అది కొంచెం కష్టమే, విషయం బయటికొస్తే పరువు పోతుంది'

'అలాగైతే, ఏదో తాబేల్ ప్రైజంటూ ఒకటి చేతిలో పెడితే, పిచ్చి కొంచెం కుదురుతుందేమో!'

★ ★ ★

'కంప్ సర్, ఈసారి గోబెల్ ప్రైజ్ మనకే వచ్చింది.'

'యాహూ.. ఎస్.. నేను సాధించా! వరల్డ్ లీడర్లందరినీ పిలవండి, వాళ్ల ముందే ప్రైజ్ తీసుకుంటా, కుళ్లుకుని చావాలి, ఒక్కరొక్కరూ!'

'అంతలేదు, ఇకపై గోబెల్‌ను ఆన్‌లైన్‌లో ఇస్తారట!'

'ప్రైజ్‌లనూ ఆన్‌లైన్‌లో ఇస్తారా?'

'అదంతే సర్, ఇదంతా ఏఐ కాలంకదా, మెయిల్ చేస్తారు, ప్రింట్ తీసుకోవాలంతే!'


'ఎలాగైతేనేం, ప్రైజ్ వచ్చింది చాలంతే! నా కల నెరవేరింది. నిజానికి నాలుగైదు సార్లయినా రావాలి తెలుసా!'

'దానిదేముంది సర్, ప్రింట్లే కదా, ఎన్నయినా తీసుకోవచ్చు!!!'

– శ్రీనివాస్ దరెగోని

ఓ చిలుకా.. జామపండు!

సుందరవనంలో ఒక రామచిలుక ఉండేది. అది చాలా మంచిది.. ఒకరోజు సాయంత్రం వరకు ఎంత వెతికినా దానికి అస్సలు ఆహారం దొరకలేదు. చాలా నీరసించిపోయింది. అప్పుడు ఒక జామచెట్టుకు ఒకే ఒక్క పెద్ద పండు కనిపించింది. దాన్ని తిందామనుకునే లోపే ఏదో పక్షి పిల్ల అరుపులు వినిపించాయి. ఏంటా అని.. చుట్టుపక్కల చూసింది చిలుక. అంతలో దానికి పావురాయి పిల్లను ఎత్తుకుపోవడానికి వచ్చిన గద్ద కనిపించింది. గబుక్కున వెళ్లి గద్ద నుంచి పావురాన్ని కాపాడింది చిలుక. దాని తల్లి వచ్చేంత వరకు అక్కడే ఉండి, కాసేపటికి మళ్లీ జామచెట్టు దగ్గరికి వచ్చింది. కానీ అక్కడ ఆ జామపండు మాత్రం లేదు. 'అసలే ఆకలిగా ఉందంటే.. ఇప్పుడు ఉన్న ఈ ఒక్క పండు కూడా పోయిందే' అని బాధపడింది చిలుక. ఇంకేం చేయలేక దాని గూడు దగ్గరికి వెళ్లిపోయింది.



అంతకు ముందే మరో పిట్ట వచ్చి ఆ పండును కోసుకుంది. దాన్ని కాళ్ల మధ్యలో పట్టుకుని ఎగురుతుండగా సరిగ్గా రామచిలుక ఉన్న చెట్టు కిందే ఆ పండు జారిపడింది. అది చూసిన చిలుక వెంటనే తీసుకొని తినేసింది.

హాయ్! బుజ్జీ!!


ఇదంతా గమనించిన కోయిల.. 'చిలుక.. పావురానికి చేసిన సాయం ఊరికే పోలేదు. చాలాసేపు వెతికిన తరవాత దొరికిన జామపండు, నోటికి అందినట్లే అంది జారిపోయింది. కానీ చివరికి ఆ పండే వచ్చి చిలుక దగ్గరికి చేరింది. కొన్నిసార్లు ఎంత కష్టపడినా ఫలితం రావడంలేదని బాధపడిపోతుంటారు చాలామంది. కానీ మనం నిజంగా కష్టపడితే కచ్చితంగా ఏదో ఒక రూపంలో దానికి ఫలితం వస్తుందని ఈ చిలుకను చూస్తే తెలుస్తుంది' అనుకుంది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'ప్ర' అక్షరంతోనే ప్రారంభమవుతాయి. ఓసారి ప్రయత్నించండి.

1. గుడిలో పెట్టేది..
2. జ్ఞానం, తెలివి
3. వాహనంలో చేసేది
4. వికృతికి వ్యతిరేక పదం
5. గౌరవం, మర్యాదలాంటిది..
6. లోపలికి వెళ్లడం
7. ఇవ్వడం
8. మెచ్చుకోవడం



జవాబు: 1.ప్రమిద 2.ప్రజ్ఞ 3.ప్రయాణం 4.ప్రకృతి 5.ప్రతిష్ఠ 6.ప్రవేశం 7.ప్రదానం 8.ప్రశంస



రాట్నంపై నూలు వడుకుతున్న చంద్రబాబు

నేతన్నకు ఏటా ₹25,000

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తాం. వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలలో రూ.74 కోట్లతో క్లస్టర్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఇక్కడ 1,374 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. మంగళగిరిలో అమలవుతున్న వీవర్స్ శాల వినూత్న కార్యక్రమం. బయటతో పోలిస్తే ఇక్కడ నేతన్నలకు 30 శాతం ఎక్కువ ఆదాయం వస్తోంది. వీటిని రాష్ట్రమంతా అందుబాటులోకి తీసుకొస్తాం. ఓఎన్‌డీసీ కింద చేనేత ఉత్పత్తులను విస్తరిస్తున్నాం.



వీవర్స్ శాలలో మగ్గాలను పరిశీలిస్తూ చేనేత కార్మికులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆదరణ-3 కింద ఆధునిక మగ్గాలు

ఆదరణ-3 పథకం కింద చేనేతలకు ఆధునిక మగ్గాలు అందిస్తాం. బీసీలు మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే రూ.98 వేలు రాయితీ అందిస్తాం. వీటిని ఏర్పాటు చేసుకున్న చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయడంతోపాటు వారు ఉత్పత్తి చేసిన విద్యుత్తుకు డబ్బు చెల్లిస్తాం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. చేనేతల అభివృద్ధికి పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లను సలహాదారుగా నియమించాం. ఈ రంగం అభివృద్ధికి టాటా, బిర్లా తరహా భారీ కంపెనీలు ముందుకొస్తున్నాయి. దేశంలో బెస్ట్ డిజైనర్లందరినీ ఎంప్యానల్ చేయాలని అధికారులను ఆదేశించా. చేనేత వస్త్రాలు ఏ ఊళ్లో ఎప్పుడు నేశారు... నేతన్న పడుతున్న కష్టం తెలిస్తే అధిక ధర వెచ్చించి అయినా వినియోగదారులు కొనుగోలు చేస్తారు. ఇందుకోసం ఆ ఉత్పత్తులకు ట్రేసబులిటీ ప్రవేశపెడతాం.

బార్లలోనూ గీత కార్మికులకు 10 శాతం రిజర్వ్

‘బీసీల వల్లనే అధికారంలో ఉన్నాం. తెదేపా పెట్టినప్పటి నుంచి బలపరిచిన ఏకైక వర్గం వెనుకబడిన తరగతులే. వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకున్న 34% రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించింది. దీనిపై న్యాయం చేస్తాం. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పనకు పోరాటం చేస్తాం. ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. గీత కార్మికులకు 10% మద్యం దుకాణాలు కేటాయించాం. బార్లలోనూ 10% రిజర్వ్ చేస్తాం. సీవీడ్ ఉత్పత్తిలో మత్స్యకార మహిళల్ని భాగస్వాములను చేస్తాం. 10 శాతం క్వారీలను వడ్డెరలకు కేటాయిస్తాం. యాదవులు, కురబలకు గత తెదేపా ప్రభుత్వంలో ఉన్న పథకాలను మళ్లీ అమల్లోకి తీసుకొస్తాం’ అని చంద్రబాబు ప్రకటించారు.

వైకుంఠపాళి మళ్లీ వద్దు

‘వైకాపా ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నాం. అయినా కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైకుంఠపాళి మళ్లీ వద్దు. వైకాపా ప్రభుత్వం కనీసం రహదారులపై గుంతలు కూడా పూడ్చలేదనే విషయం మరవరాదు’ అని చంద్రబాబు ప్రజలకు సూచించారు. ‘ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నాం. 5 రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నాం. ఈ నెలాఖరులోపు 16,347 మంది ఉపాధ్యాయులను నియమించి, పాఠశాలలకు పంపించబోతున్నాం’ అని వివరించారు.

చేనేత ఉత్పత్తులపై సమీకృత నివేదిక

అంతకుముందు చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. డిజైనర్లతో మాట్లాడారు. ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ గురించి ఆరా తీశారు. సెలబ్రిటీలు ఎక్కువగా మక్కువ చూపుతున్నారని వారు వివరించారు. సామాన్యులకు కూడా చేనేత ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. చేనేత ఉత్పత్తులన్నింటినీ సమీకృతం చేసి, ప్రాజెక్టు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

చేనేతలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నాం: లోకేశ్

ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో చేనేతలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నిలబెట్టుకున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. చేనేతల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ‘మంగళగిరిని మా గుండెల్లో పెట్టుకున్నాం. ఇక్కడి చేనేత వస్త్రాలను పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తున్నాం. కుటుంబపరంగా ఎక్కడికి వెళ్లినా మేం ఇచ్చేది మంగళగిరి చీరనే. ప్రధాని, ఇతర జాతీయ, రాష్ట్రస్థాయి నేతలను కలిసినప్పుడూ మంగళగిరి చేనేత శాలువానే ఇస్తున్నాం. బ్రాహ్మణి మంగళగిరి చీర కట్టిన తర్వాత అది వైరల్ అయింది. అదే రంగు చీరను ఒకే షాపు నుంచి 98 మంది కొన్నారు’ అని వివరించారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత, చేనేత,హస్తకళల ప్రత్యేక సలహాదారు సుచిత్ర ఎల్ల పాల్గొన్నారు.

భార్య, కోడలికి చేనేత చీరలు కొన్న చంద్రబాబు

మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన సీఎం అక్కడున్న వీవర్స్ శాలను పరిశీలించారు. రూ.15 వేలతో తన సతీమణి భువనేశ్వరికి, కోడలు బ్రాహ్మణికి చీరలు కొన్నారు. వీవర్స్‌శాలలో ఆధునిక చేనేత పరికరాల పనితీరును కార్మికులను అడిగి తెలుసుకున్నారు. తానే రాట్నం వడికి దారం చుట్టారు. జాకర్డ్ మగ్గంపై కూర్చుని చీర నేతను పరిశీలించారు. ప్రతి కార్మికుడి వద్దకు వెళ్లి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. వీవర్స్‌శాల విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఏర్పాటు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

బతికినంతకాలం మీ పేరు చెప్పుకొంటాం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఇచ్చిన మాట ప్రకారం ఇల్లు కట్టించారని సంతోషం వ్యక్తం చేస్తూ ఓ నిరుపేద కుటుంబం గురువారం సీఎం చంద్రబాబు కాళ్లకు నమస్కరించింది. గతేడాది జులై 1న పెనుమాకలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం సుగాలీకాలనీలోని బాణావత్ పాములు నాయక్, సీతమ్మ దంపతుల ఇంటికెళ్లి తొలి పింఛను అందజేశారు. పూరి గుడిసెలో ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను చూసిన చంద్రబాబు వెంటనే ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్ సమకూర్చిన డబ్బుతో చెప్పినట్లుగానే ఏడాది కాకముందే రూ.12 లక్షలతో ఇల్లు నిర్మించి ఇచ్చారు. లోకేశ్ ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇప్పించారు. దీంతో మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవానికి వచ్చిన పాములునాయక్ దంపతులు తమ ఇంటి ఫొటోలు సీఎంకు చూపించి, కృతజ్ఞతలు తెలిపారు. ‘ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. బతికినంతకాలం మీపేరు చెప్పుకొంటాం’ అని వేదికపై సీఎం ఎదుట సంతోషం వ్యక్తం చేశారు.



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పాములునాయక్ కుటుంబసభ్యులు. చిత్రంలో మంత్రి లోకేశ్



చంద్రబాబుకు చేనేత వస్త్రాలతో చేసిన ఆంధ్రప్రదేశ్ పటాన్ని అందజేస్తున్న చేనేత, హస్తకళల ప్రత్యేక సలహాదారు సుచిత్ర ఎల్ల, మంత్రులు సవిత, లోకేశ్ తదితరులు



ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

భాజపా, ఈసీ భారీ మోసం

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

ఈనాడు, బెంగళూరు, దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ), భాజపాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భాజపా, ఈసీ కుమ్మక్కై ఎన్నికల్లో ‘భారీ నేరపూరిత మోసానికి’ పాల్పడ్డాయని సంచలన ఆరోపణలు చేశారు. ఇది రాజ్యాంగ ద్రోహం అని విమర్శించారు. ఇందుకు కర్ణాటకలోని మహాదేవపుర శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గతేడాది ఓటరు జాబితా విశ్లేషణను ఉదహరించారు. ‘ఓట్ల చోరీ విధానం’ దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందన్నారు. తాము ప్రేమించే ప్రజాస్వామ్యం ఉనికిలో లేనందున ఈ వ్యవహారంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలపై తమ పార్టీ చేసిన విశ్లేషణను ప్రెజెంటేషన్‌గా చూపారు. ఎన్నికల ఫలితం చోరీకి గురైందన్న కాంగ్రెస్ అనుమానాలను గతేడాది మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ధ్రువీకరించాయన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను తమ పార్టీ పరిశోధన ద్వారా సేకరించిందని, దేశవ్యాప్తంగా గల అటువంటి ఆధారాలను తుడిచిపెట్టే ప్రయత్నాల్లో ఈసీ తలమునకలుగా ఉందని రాహుల్ ఆరోపించారు.

లక్ష ఓట్ల దోపిడీ

2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మహాదేవపుర శాసనసభ స్థానానికి చెందిన ఓటర్ల జాబితాను తమ పార్టీ విశ్లేషించిందని రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా 1,00,250 ఓట్లు చోరీకి గురయ్యాయని తేలిందన్నారు. ‘ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు ఉన్నారు. 40,009 మంది తప్పుడు చిరునామాలు సమర్పించారు. 10,452 మంది ఒకే చిరునామాలో ఉన్నారు. 4,132 మంది ఓటర్లవి తప్పుడు ఫొటోలు ఉన్నాయి. 33,692 మంది ఫారం-6ను దుర్వినియోగం చేశారు’’ అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

ప్రజాస్వామ్యంపై అణుబాంబు దాడి

‘‘ఓట్ల చోరీ అనేది మన ప్రజాస్వామ్యంపై అణుబాంబు దాడి’’ అని ‘ఎక్స్’లో రాహుల్ పేర్కొన్నారు. ఈ అక్రమాన్ని నిరసిస్తూ శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడంపార్క్ వద్ద తమ పార్టీ నిరసన ప్రదర్శన నిర్వహించనుందని వెల్లడించారు. ‘‘దేశవ్యాప్తంగా భారీ నేరపూరిత మోసం జరిగిందన్న విషయం ప్రజలంతా తెలుసుకోవాలి. ఈసీ, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కలిసి ఈ అక్రమానికి పాల్పడ్డాయి. ఇందుకు సంబంధించిన విస్పష్టమైన, సందేహం లేని ఆధారాలను మేం వెలుగులోకి తీసుకొచ్చాం. ఈ నేర వ్యవహారం భారత రాజ్యాంగానికి, జాతీయపతాకానికి ద్రోహం చేయడం తప్ప మరొకటి కాదు. ఎన్నికల చోరీ విధానం, అక్రమాల ఆధారాలపై పౌరులందరూ దృష్టిసారించాలి’’ అని పేర్కొన్నారు. మెజారిటీ కొరవడిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో కొనసాగేందుకు 25 లోక్‌సభ స్థానాలను తస్కరించాల్సిన అవసరం ఏర్పడగా భాజపా 25 స్థానాలను కేవలం 33 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందడం గమనించాల్సిన అంశమని రాహుల్ వ్యాఖ్యానించారు. గత 15 ఏళ్ల ఎన్నికల డేటా, సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వకపోతే ఈసీ నేరానికి పాల్పడినట్టేనని అన్నారు.

విందు భేటీకి 50 మంది నేతల హాజరు

తన నివాసంలో గురువారం రాత్రి జరిగిన ఇండియా కూటమి నేతల విందు సమావేశంలోనూ రాహుల్ ఓట్ల విశ్లేషణ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై, ఓట్ల రిగ్గింగ్ వ్యవహారంపై చర్చించారు. ఈ కార్యక్రమానికి 25 పార్టీల నుంచి సుమారు 50 మంది నేతలు హాజరయ్యారు.

ఆ ఓటర్ల వివరాలివ్వండి: ఈసీ

కర్ణాటక, మహారాష్ట్రలో ఓటర్ల జాబితాల విషయంలో రాహుల్ చేసిన ఆరోపణలపై ఆయా రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయాలు స్పందించాయి. జాబితాల్లో అక్రమంగా చేర్చారన్న, తొలగించారన్న ఓటర్ల పేర్లతో వివరాలను సంతకం చేసిన డిక్లరేషన్ రూపంలో అందజేయాలని రాహుల్‌ను కోరాయి. తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపాయి.

ఉద్దేశపూర్వక వంచన: భాజపా

ఎన్నికల సంఘంపై రాహుల్ చేసిన ఆరోపణలు ఉద్దేశపూర్వక వంచన అని భాజపా గురువారం విమర్శించింది. భారీ కుట్రతోనే ఆ పార్టీ రాజ్యాంగ వ్యవస్థలపై దాడికి పాల్పడుతోందంది. కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించకపోవడంతో నిరాశ, కోపానికి గురై ఈసీపై రాహుల్ ఆరోపణలకు దిగుతున్నారని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భాజపా ఎంపీ రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

ఢీ అంటే ఢీ

(మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. ‘అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయి’ అని ఆయన పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు.

శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ సమాధానాలు

? రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఒప్పందం కుదిరితే భారత్‌పై సుంకాలను తగ్గిస్తారా?

ఆ విషయం గురించి తరువాత ఆలోచిస్తాం. కానీ ఇప్పుడు 50శాతం చెల్లించాల్సిందే.

? చైనా, తుర్కియే కూడా రష్యా చమురును కొంటున్నాయి కదా.. మరి ఒక్క భారత్‌నే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు?

మేం భారత్‌పై సుంకాలను విధించి 8 గంటలే అయింది. కాబట్టి తదుపరి ఏం జరుగుతుందో వేచి చూద్దాం. ముమ్ముందు మరిన్ని చూస్తారు. ఆంక్షలనూ చూడబోతున్నారు. చైనా, తుర్కియేలపైనా సుంకాలు విధించొచ్చు. మేం ఏం చేస్తామనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

? చైనాపైనా అదనపు సుంకాలను విధిస్తారా?

జరగొచ్చు. నాకేమీ తెలియదు. ఇప్పుడేమీ చెప్పలేను. ప్రస్తుతం భారత్‌పై విధించాం. మరో ఇద్దరిపై అదనపు సుంకాలను విధించే అవకాశముంది. అందులో చైనా ఉండొచ్చు.

ఈ నెలలో వరుస అల్పపీడనాలు!

(మొదటి పేజీ తరువాయి)

నిపుణులు చెబుతున్నారు. వారం రోజులుగా పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ఈ నెల 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఇది పశ్చిమ దిశగా కదులుతుందని అంచనా. తర్వాత వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడతాయని, తుపాన్లుగా బలపడే పరిస్థితులు ఉన్నాయని కొన్ని వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి.

ఏకధాటి వానలు తక్కువే..

రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత రాష్ట్రంలో ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ వర్షాలు పడలేదు. జూన్, జులై నెలల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళిక సొసైటీ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున 288.8 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 215.6 మి.మీ. నమోదైంది. ‘ఈ నెలలో విస్తారంగా వర్షాలు కురిసేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. గతంలో మాదిరిగా ఏకధాటిగా వాన కురిసే పరిస్థితులు తక్కువ. సెప్టెంబరు నాటికి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది’ అని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ కేజే రమేశ్ పేర్కొన్నారు.

వింజమూరులో 73.5 మి.మీ. వర్షం..

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో, తర్వాత మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శుక్రవారం పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. గురువారం నెల్లూరు, కోనసీమ, కాకినాడ, వైఎస్సార్ కడప, అనకాపల్లి, ప్రకాశం, అనంతపురం, ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా నెల్లూరు జిల్లా వింజమూరులో 73.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

భారత సాంస్కృతిక వారసత్వానికి చేనేత ప్రతీక

- మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి : భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక.. చేనేత అని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ కొనియాడారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ‘‘వ్యవసాయం తర్వాత చేనేత వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తాం. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారాన్ని భరిస్తాం’’ అని లోకేశ్ పేర్కొన్నారు.

■ మరో సందేశంలో వైకాపా నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు దళితులపై దమనకాండ జరిపిన వాళ్లు ఇంకా అదే పంథా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిలో దళిత యువకుడిపై ఆ పార్టీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ తరహా దాడులకు రాష్ట్రంలో చోటు లేదని, వైకాపా వాళ్లు రప్పారప్పా.. అంటే పోలీసులు రప్ఫాడిస్తారని హెచ్చరించారు.

హరిత భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఐజీబీసీ ధ్రువీకరణ పొందిన హరిత భవనాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. సిల్వర్, గోల్డ్, ప్లాటినం రేటింగ్ పొందిన బహుళ అంతస్తుల భవనాలకు ఇంపాక్ట్ ఫీజులో 10, 15, 20 శాతం రాయితీ.

■ ఇంధన సామర్థ్యం, మెరుగైన నీటి వ్యవస్థతో నిర్మించి.. సిల్వర్, గోల్డ్, ప్లాటినం రేటింగ్ పొందిన భవనాలకు ఏపీ రెరా రిజిస్ట్రేషన్ ఫీజులో 10, 15, 20 శాతం రాయితీ. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఐజీబీసీ ధ్రువీకరణ సమర్పించిన వాటికి రాయితీ వర్తింపు.

■ కొత్తగా నిర్మించే మెట్రో రైల్వేస్టేషన్లలో గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేసేలా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్), సీఐఐ ఐజీబీసీల మధ్య అవగాహన ఒప్పందం. దీని ద్వారా ఇంధన సామర్థ్యం, పర్యావరణ అనుకూల సామగ్రి, నీటి సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం ఆధారంగా పట్టణ రవాణా వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యం.



గ్రీన్ ఆంధ్రా సమిట్‌లో మంత్రి నారాయణ సమక్షంలో ఐజీబీసీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న మెట్రో కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి, ఐజీబీసీ అమరావతి ఛాప్టర్ ఛైర్మన్ విజయసాయి. చిత్రంలో నరేంద్రకుమార్, శేఖర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, పర్చూరి కిరణ్ తదితరులు

■ విశాఖలో హరిత భవనాల నిర్మాణం. వ్యర్థాల నిర్వహణలో అధునాతన విధానాలు.. కాలుష్యరహితంగా నగరాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ), సీఐఐ ఐజీబీసీల మధ్య అవగాహన ఒప్పందం.

■ గ్రీన్ ఆంధ్ర సమిట్-2025 వేదికపై రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 116 కొత్త ప్రాజెక్టుల నమోదుకు అవకాశం. దీంతో ఐజీబీసీలో రిజిస్టర్డ్ ప్రాజెక్టుల సంఖ్య 500కు చేరిక. 612 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో హరిత భవనాల నిర్మాణం.

యువత వారానికోరోజు చేనేత వస్త్రాలు ధరించాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ పిలుపు

ఈనాడు, అమరావతి: 'అసంఘటిత చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఊతమిస్తోంది. యువత వారానికి ఒకసారి చేనేత వస్త్రాలు ధరిస్తే ఆ రంగంపై ఆధారపడ్డ వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన చేనేత కళాకారులకు గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. 'మంత్రిమండలి సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. నేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించనున్నాం. సొసైటీల నుంచి ఆప్కో కొనేవాటికి జీఎస్టీపై 5% రాయితీ ఇవ్వాలని నిర్ణయించాం' అని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

తురకా కిశోర్‌ను వెంటనే విడుదల చేయండి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు వైకాపా నేత తురకా కిశోర్ అరెస్టు సమయంలో చట్ట నిబంధనలను ఉల్లంఘించారని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. మెజిస్ట్రేట్ సైతం అనాలోచితంగా కిశోర్‌ను రిమాండ్‌కు పంపారని ఆక్షేపించింది. కిశోర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఈ విడుదల తమ తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. పోలీసులు కౌంటర్ వేయడానికి సమయమిస్తూ ప్రధాన వ్యాజ్యంపై విచారణను వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ ఉత్తర్వులిచ్చింది. ఓ కేసులో బెయిలుపై విడుదలైన తన బిడ్డ కిశోర్‌ను రెంటచింతల పోలీసులు హత్యాయత్నం కేసులో అక్రమంగా అరెస్ట్ చేశారంటూ తురకా సురేశ్ హైకోర్టులో వేసిన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. పోలీసుల తరఫున ఏజీపీ విష్ణుతేజ వాదనలు వినిపించారు. మెజిస్ట్రేట్ యాంత్రికంగా రిమాండ్ విధించారని పిటిషనర్ చెబుతున్నారే కానీ ఏ నిబంధనలను ఉల్లంఘించారో పేర్కొనలేదన్నారు. అరెస్టుకు కారణాలను వివరిస్తూ దస్త్రాలను అందజేయలేదనే నిందితుడు తీసుకోలేదన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు కూడా విన్న ధర్మాసనం.. 'అరెస్టుకు కారణాలను నిందితుడికి రాతపూర్వకంగా అందజేసినట్లు మెజిస్ట్రేట్ వద్ద కానీ, మా ముందున్న రికార్డుల్లో కానీ ఆధారాల్లేవు. అలా అందజేయకపోతే నిందితులను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. కిశోర్ అరెస్ట్, రిమాండ్ విధింపు సమయంలో చట్టనిబంధలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. అందువల్ల నిందితుణ్ని వెంటనే విడుదల చేయాలి' అని మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

యూరియా బస్తాలు ఏమైపోతున్నాయి?

- భారీగా అమ్మకాలు పెరగడంపై సంశయం

ఈనాడు, అమరావతి: ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో 43శాతం మేరే పంటలు వేశారని వ్యవసాయశాఖ అంచనా.. ఈ-పంట లెక్కలు చూస్తే ఇది ఇంకా తక్కువే. అయినా గత ఐదేళ్లతో పోలిస్తే ఎరువుల అమ్మకాలు భారీగా పెరిగాయి. గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో జులై ఆఖరుకు యూరియా అమ్మకం 91వేల టన్నులు పెరిగింది. అయినా ఎరువుల కోసం దుకాణాల ముందు నిరీక్షిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. మరి ఎటుపోతున్నాయి ఈ ఎరువులన్నీ అనేది అసలు ప్రశ్న. ఎరువుల సరఫరా, అమ్మకాలపై జిల్లాల్లో నిఘా కొరవడటమే దీనికి ప్రధాన కారణం. తనిఖీ బృందాలు..మొక్కుబడిదాడులతో గ్రామ, మండలస్థాయి డీలర్ల వెంటపడుతున్నాయి. యూరియా ఎక్కడ దారిమళ్లుతోందనే అంశాన్ని పట్టించుకోవడం లేదు. ఫలితంగానే రైతులు ఎరువుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్తాకు రూ.100కుపైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో వరినాట్లు ఇంకా ముమ్మరం కాలేదు.. ఇటీవలి వరకు వర్షాలూ అనుకూలంగా లేవు. జులై చివరిలో కురిసినా.. వారం నుంచి ఎండలే. దీంతో ఖాళీగా వదిలేసిన పొలాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే ఖరీఫ్‌లో సాగు నెమ్మదించింది.



పారిశ్రామిక అవసరాలకు వ్యవసాయ యూరియా

రంగుల కంపెనీలు, వార్నిష్, ప్లైవుడ్, యాడ్-బ్లూ ద్రావణం, బీరు, నాటుసారా, కోళ్లు, పశువుల దాణా, చేపలు, రొయ్యల చెరువుల్లోనూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగించాల్సిన యూరియాను వాడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్నా.. ఎందుకు కొరత వస్తోందని ఆరా తీయగా.. వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తేలింది. సరిహద్దు ప్రాంతాల్లోని జిల్లాల నుంచి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకకు యూరియా బస్తాలు తరలుతున్నాయని కొందరు అధికారులు వివరించారు. ఇతర అవసరాలకు ఉపయోగించడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.

★ వేప రసాయనం కలిపిన యూరియా అయితే ఇతర అవసరాలకు వినియోగించడం కష్టం. ప్రస్తుత సరఫరాలో ఇది 30% నుంచి 40% మాత్రమే ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే యూరియా నేరుగా బస్తాల్లో నింపి రవాణా చేస్తున్నారు.

★ యూరియా 45 కిలోల బస్తా రూ.2,234 అవుతోంది. రాయితీపై ప్రభుత్వం ఇచ్చే యూరియా రూ.266.5 మాత్రమే. ఇతర ఖర్చులు కలిపినా రూ.270 లోపే దొరుకుతోంది. వ్యవసాయ గ్రేడ్ యూరియాను ఇతర అవసరాలకు మళ్లించడానికి ఇదే ప్రధాన కారణం.

యూరియా దారి మళ్లకూడదు: సీఎస్

రైతులకు రాయితీపై ఇచ్చే యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని సూచించారు. గురువారం ఆయన కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టులో 1.65 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రస్తుతం 2.04 లక్షల టన్నులు, డీఏపీ 70వేల టన్నులకుగాను 88వేల టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

తిరుపతిలో భూమన అనుచరుల అరాచకం

- దళిత యువకుడిని నిర్బంధించి పోలీసు లాఠీతో దాడి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుల అరాచకాలు తిరుపతిలో కొనసాగుతూనే ఉన్నాయి. వైకాపా సామాజిక మాధ్యమ తిరుపతి ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్‌రెడ్డి కొందరితో కలిసి తన కార్యాలయంలో దళిత యువకుడిని పోలీసు లాఠీతో చితకబాదడం సంచలనం సృష్టించింది. తిరుపతి శ్రీనివాసం ఎదుట అనిల్‌కుమార్ రెడ్డి ఎస్వీపీ బైక్ రెంటల్స్ అండ్ రెంటల్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన పవన్‌కుమార్ ఆయనవద్ద ఓ బైక్ అద్దెకు తీసుకుని డబ్బు చెల్లించలేదు. అదేసమయంలో అనిల్ స్నేహితుడైన జగదీశ్వర్‌రెడ్డి వద్ద మరో వాహనం తీసుకున్నారు. పవన్‌కుమార్ బుధవారం ఉదయం తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించిన జగదీశ్వరరెడ్డి, అతని స్నేహితుడు అజయ్‌కుమార్ అక్కడికి వెళ్లి బైక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అనిల్‌కుమార్ రెడ్డికి అప్పగించడంతో ఆయన తన కార్యాలయానికి తీసుకొచ్చి పాకాలకు చెందిన దినేష్ చేత పోలీసు లాఠీతో చితక్కొట్టించారు. పక్కనుంచి 'రక్తం కారాలి.. సచ్చిపోనీ.. వాడిని వదలద్దు' అంటూ ఆదేశాలిచ్చాడు. పవన్ గాయాలతో స్పృహతప్పి పడిపోయారు. ఈ వీడియో వైరల్ అయ్యాక బాధితుడి ఆచూకీ లభించలేదు. దళితసంఘాలతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిరసన తెలపగా అదే సమయంలో కొందరు వైకాపా కార్యకర్తలు మరో వీడియోను విడుదల చేసి తాము దాడి చేయలేదని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. దినేష్ తమ పార్టీ వ్యక్తి కాదంటూ తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పవన్‌కుమార్ కుటుంబసభ్యులు, దళిత సంఘాలతో వాగ్వాదానికి దిగారు.



పవన్‌కుమార్‌ను లాఠీతో కొడుతున్న దినేష్



లాఠీ తీసుకుంటున్న అనిల్‌కుమార్‌రెడ్డి



భూమనతో అనిల్‌కుమార్‌రెడ్డి

గతంలోనూ బెదిరింపులు

తన కుమారుడిని లాఠీతో కొట్టిన వీడియో పంపి రూ.6లక్షలు ఇవ్వకుంటే కిడ్నీలు తీసుకుని చంపేస్తామని గతంలో కొందరు ఫోన్‌చేసి బెదిరించారని పవన్‌కుమార్ తల్లి సునీత ఆరోపించారు. డీఎస్పీ భక్తవత్సలానికి ఫిర్యాదు చేసిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు.

పోలీసుల అదుపులో నిందితులు

ఈ ఘటనపై తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు కేసు నమోదుచేశారు. దాడికి పాల్పడ్డ అనిల్‌కుమార్ రెడ్డి, జగదీశ్వరరెడ్డి, దినేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు.

విశ్రాంత ఐపీఎస్ రఘువీర్‌రెడ్డిపై విచారణ

ఈనాడు, అమరావతి: గత సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా నాయకుల అరాచకాలకు, కోడ్ ఉల్లంఘనలకు సహకరించారనే అభియోగాలు ఎదుర్కొంటున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.రఘువీర్‌రెడ్డిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇంటెలిజెన్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణను విచారణ అధికారిగా, అనంతపురం రేంజి డీఐజీ డాక్టర్ షేముషిని ప్రజెంటింగ్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఎన్నికల సమయంలో రఘువీర్‌రెడ్డి నంద్యాల ఎస్పీగా పనిచేశారు. ప్రచార సమయంలో నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి సినీ నటుడు అల్లు అర్జున్ వచ్చారు. వైకాపా వారు వ్యూహాత్మకంగా పట్టణ శివారు నుంచి ఆయనను భారీ ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఆయన పర్యటనకు అనుమతి లేకపోయినా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అదేరోజు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటన ఉండగా.. పోటీగా వైకాపా ర్యాలీకి అనుమతి ఇచ్చి వారికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రఘువీర్‌రెడ్డిపై చర్యలకు ఈసీ ఆదేశించింది. ఎన్నికల కోడ్ అమల్లో విఫలమైనందున ఆయనపై ఛార్జెస్ ఫైల్ చేయాలని ఆదేశించడంతో ఎన్నికల అధికారులు కేసు పెట్టారు. గతంలో వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం వివరణ కోరగా రఘువీర్‌రెడ్డి వాటిని తోసిపుచ్చారు. తనపై అభియోగాలు ఉపసంహరించాలని కోరారు. వివరణ పరిశీలించిన ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించింది.

స్పర్శ కోల్పోయిన కంటికి సరికొత్త చికిత్స

- ఎల్వీపీఈఐలో కార్నియల్ న్యూరోటైజేషన్ ప్రక్రియ
- తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి అందుబాటులోకి

ఈనాడు, హైదరాబాద్: నగరంలోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో మరో సంక్లిష్టమైన శస్త్ర చికిత్స అందుబాటులోకి వచ్చింది. నేత్ర వ్యాధులు, గాయాలు, మెదడులోని కణితుల తొలగింపు కారణంగా స్పర్శ కోల్పోయిన కార్నియా (న్యూరోట్రోఫిక్ కెరటిటిస్)ను తిరిగి సాధారణ స్థితికి తెచ్చే కార్నియల్ న్యూరోటైజేషన్ ప్రక్రియను ఈ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా చేపట్టారు. దేశంలో మూడు నేత్ర వైద్యశాలలే ఈ చికిత్సలు అందిస్తుండగా. . అందులో ఎల్వీప్రసాద్ ఆసుపత్రి ఒకటి. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి ఇది అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు 40 మందికి ఈ తరహా చికిత్సలతో చూపును కాపాడినట్లు ఆసుపత్రి వైద్యులు గురువారం మీడియాకు తెలిపారు. న్యూరో సర్జరీ తర్వాత కంటి నరాలు దెబ్బతిన్నప్పుడు, కంటికి తీవ్రమైన గాయాలు, పుట్టుకతో వచ్చిన కార్నియా సమస్యలు, షింగిల్స్ అనే వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా చాలామందిలో కంటిలోని కార్నియా స్పర్శ కోల్పోతుంది. ఫలితంగా కంటిలో దురద, గాయం తగిలితే గుర్తించలేని స్థితి ఏర్పడటమే కాకుండా.. కన్నీళ్లు రావడం కూడా ఆగిపోతాయి. ఇలాంటి వారికి కార్నియల్ న్యూరోటైజేషన్ సర్జరీతో పూర్తి ఉపశమనం కల్పించవచ్చని వైద్యులు వివరించారు. చికిత్సలో భాగంగా తొలుత మైక్రో సర్జరీ టెక్నిక్‌తో నుదురు, కాలి భాగాల నుంచి సున్నితమైన స్పర్శ నరాలను సేకరించి వాటిని కంటిలోని కార్నియా సమీపంలో జోడిస్తారు. ఇలా అమర్చిన నరాలు కొన్ని నెలల వ్యవధిలో కార్నియాలోకి ప్రవేశిస్తాయి. అనంతరం కార్నియా కోల్పోయిన స్పర్శ తిరిగి వస్తుందని వైద్యులు తెలిపారు.

కడప ఎంపీ అవినాష్‌రెడ్డిపై కేసు

- 150 మంది వైకాపా, 16 మంది తెదేపా నేతల పైనా

ఈనాడు- కడప, న్యూస్‌టుడే- పులివెందుల: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా వరుసగా చోటుచేసుకుంటున్న ఘర్షణలపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. తెదేపా, వైకాపా నాయకులు, కార్యకర్తలపై గురువారం మొత్తం నాలుగు కేసులు నమోదు చేశామని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ వెల్లడించారు. వివేకా హత్య కేసులో కండిషన్ బెయిల్‌పై ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డితో పాటు కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి, తుమ్మలపల్లికి చెందిన గంగాధర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఇటీవల వైకాపా నుంచి తెదేపాలో చేరిన విశ్వనాథ్‌రెడ్డిని ఫోన్‌లో బెదిరించారనే ఫిర్యాదు మేరకు వైకాపాకు చెందిన ఈ నలుగురిపై కేసు నమోదైంది. పులివెందుల వైకాపా కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి అనుమతి తీసుకోలేదనే కారణంతో.. ఎంపీడీవో కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అవినాష్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డితో సహా 150 మంది వైకాపా నాయకులపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసులు పెట్టారు. నల్లగొండువారిపల్లె గ్రామంలో తెదేపా, వైకాపా వర్గాల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. తెదేపాకు చెందిన ధనంజయను కులం పేరుతో దూషించి, దాడి చేశారనే ఫిర్యాదు మేరకు వైకాపా నేతలు వేముల రామలింగారెడ్డి, హేమాద్రితో పాటు 50 మందిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ఇదే గ్రామంలో దాడి విషయమై వైకాపా నాయకులు వేముల రామలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెదేపా నాయకులు జయభారత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డితో సహా 16 మందిపై కేసులు పెట్టారు.

పులివెందుల ఘటనపై గవర్నర్‌కు వైకాపా ప్రతినిధుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: 'పులివెందులలో జడ్పీటీసీ స్థానానికి జరుగుతున్న ఉపఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని వస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తోపాటు, పార్టీ నేతలను తెదేపా వర్గీయులు అడ్డగించి విచక్షణారహితంగా దాడిచేసి వారిని హతమార్చే ప్రయత్నం చేశారు' అని వైకాపా ప్రతినిధుల బృందం గురువారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ 'ఎమ్మెల్సీకి రక్షణ కల్పించాల్సిన కనీస బాధ్యత పోలీసులకు లేదా? ప్రభుత్వ ఆదేశాల మేరకే పోలీసులు ఈ దాడులను నిలువరించే ప్రయత్నం చేయలేదు' అని అన్నారు. స్థానిక సంస్థల ఉపఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

తెలంగాణలో కుండపోత వర్షం

- యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 14.8 సెం.మీ.

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం గంట వ్యవధిలోనే కుండపోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో ప్రారంభమై ఆగమాగం చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 14.8 సెం.మీ., నల్గొండ జిల్లా శాలిగౌరారంలో 13.6 సెం.మీ., రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో 13.15 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మహానగర పాలక సంస్థ వ్యాప్తంగా అనేక చోట్ల 5-11 సెం.మీల మధ్య వర్షం కురిసింది. ప్రధాన రహదారులు ఏరులై ప్రవహించాయి. పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో.. యూసఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో వరద పోటెత్తింది. భుజాల్లోతున నీరు ప్రవహించింది. నగరవ్యాప్తంగా పలు చెట్లు కూలాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్ గోడ రోడ్డుపై ప్రయాణిస్తున్న కారుపై పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. సాయంత్రం నుంచే ఓ మోస్తరు వర్షం ప్రారంభమైనా ఆరు గంటల నుంచి ఏడు గంటల మధ్య ఒక్కసారిగా ఉద్ధృత రూపం దాల్చింది. ఐటీ కారిడార్ మొదలు కూకట్‌పల్లి, అమీర్‌పేట, ఖైరతాబాద్, మలక్‌పేట, ఎల్బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్, మెహదీపట్నం, అత్తాపూర్ ప్రధాన మార్గాల్లో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది.



హైదరాబాద్‌లోని ఖైరతాబాద్-లక్డీకాపూల్ మార్గంలో నిలిచిన వాహనాలు

'సృష్టి' కేసులో ముగ్గురు కేజీహెచ్ వైద్యుల అరెస్టు

నిందితుల్లో వైకాపా నేత వాసుపల్లి సోదరుడు

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం' కేసులో విశాఖలోని కింగ్‌జార్జ్ ఆసుపత్రికి (కేజీహెచ్) చెందిన మరో ఇద్దరు వైద్యుల్ని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఒకరు మత్తు వైద్య విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ వాసుపల్లి రవి కాగా, మరొకరు ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి. రవి వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ తమ్ముడు. ఇదే కేసులో ఇప్పటికే అరెస్టయి, బెయిల్‌పై విడుదలైన డాక్టర్ విద్యుల్లత కేజీహెచ్ పిల్లల విభాగంలో పని చేశారు. వీరు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే సృష్టి ఫెర్టిలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పోలీసులు అరెస్టు చేశారు. వీరి అరెస్టు విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం.

గిరిజన యువత కోసం మూడు స్టడీ సర్కిళ్లు

ఈనాడు, అమరావతి: గిరిజన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తీపికబురు అందించింది. వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు మూడు స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయనుంది. విశాఖలోని వేపగుంటలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో రాష్ట్ర స్టడీ సర్కిల్‌తోపాటు విజయవాడ/గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు అనుమతిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజన మ్యూజియంకు రూ.కోటి

ఈనాడు, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట పరిధిలో అసంపూర్తిగా ఉన్న గిరిజన మ్యూజియంను పూర్తి చేసేందుకు రూ.కోటి నిధుల్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మెట్టగూడలో ఉన్న ఎన్టీఆర్ ఎడ్వెంచర్ పార్కు విస్తరణకు మరో రూ.1.50 కోట్లు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఒంగోలులో ఈ నెల 20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఎన్డీయే ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాల రూపకల్పనకు ఒంగోలులో నిర్వహించనున్న ఈ నెల 20 నుంచి 25 వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు వేదిక కానున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. రాబోయే రోజుల్లో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సంఘటితం చేసి, పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు ఈ మహాసభలు కేంద్ర బిందువు కానున్నాయని వెల్లడించారు. విజయవాడలోని దాసరిభవన్‌లో గురువారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మహాసభల్లో సాంస్కృతిక రంగానికి పెద్దపీట వేయనున్నాం. అనేక మంది కళాకారులు భాగస్వాములు కానున్నారు. 23న సాయంత్రం 3గంటలకు మహాప్రదర్శన, బహిరంగ సభ ఉంటుంది. ఈ సభలకు ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారు' అని ఆయన తెలిపారు.




శ్రావణ సందడి

శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మార్కెట్లు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. మామిడి ఆకులు, పూజా సామగ్రి, పూల కొనుగోళ్లతో పాతబస్తీలోని కాళేశ్వరరావు మార్కెట్, బీసెంటు రోడ్డు, మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని పూల మార్కెట్లు కిటకిటలాడాయి. -ఈనాడు, అమరావతి

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి

దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ అన్నారు. ఈవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్సవాల సమయంలో 11 రోజులు పాటు దుర్గమ్మను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని.. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం, ప్రసాదాలు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోపాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, మరుగు దొడ్లు, ఘాట్‌లో స్నానాలు, పాదరక్షలు, దుస్తులు మార్చుకునే గదులు, క్లోక్ రూంలు, దర్శనం క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలపై తగు ప్రణాళిక ఉండాలని సూచించారు. దుర్గగుడి ఈవో శీనానాయక్, దసరా ఉత్సవ ప్రధానాధికారి భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ విస్మరిస్తే చర్యలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ, బాధ్యత పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. వృద్ధ తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణ, పోషణ, సంక్షేమ చట్టం, నియమావళిపై నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం అవగాహన/శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడిపై వారి తల్లిదండ్రుల పోషణ చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. చాలా కుటుంబాల్లో నేటికీ వృద్ధులు నిర్లక్ష్యానికి, అగౌరవానికి, అభద్రతకు గురవుతున్నారని చెప్పారు. చట్టం కల్పించిన హక్కులు వారు పొందేలా జిల్లా, డివిజను అధికారులు కృషి చేయాలని సూచించారు. సెక్షన్ 23 ప్రకారం.. పిల్లలకు ఇచ్చిన ఆస్తిని, తిరిగి తీసుకునే అధికారం వృద్ధ తల్లిదండ్రులకు ఉందన్నారు. సెక్షన్ 24 ప్రకారం.. సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే.. 3 నెలల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తారన్నారు. వయో వృద్ధులు కార్యాలయాలకు వచ్చిన తరుణంలో వారికి సరైన మార్గదర్శకం చేయాలన్నారు. తొలుత హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాజెక్టు హెడ్ టి.రవి.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విధులకు వంతులు.. కళ్లకు గంతలు..

ఆర్అండ్‌బీలో ఇష్టారాజ్యం

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలోని ఆర్అండ్‌బీ కార్యాలయాల్లో సిబ్బంది వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. కొందరు విధులకు వస్తే మరికొందరు విలాసాలు చేస్తున్నారు. బయోమెట్రిక్‌తో ప్రమేయం లేకుండా జీతాలు తీసుకుంటున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కీలకమైన దస్త్రాలు ముందుకు కదలడం లేదు. వైకాపా పాలనలో గాలి కొదిలేసిన రహదారులను కూటమి ప్రభుత్వం ఉద్ధరిస్తున్న నేపథ్యంలో సిబ్బంది వైఖరి ప్రభుత్వ ఆశయాలను మసకబారుస్తోంది.

సొంత పనులు.. విలాసాలు

ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ సర్కిల్ పరిధిలో మూడు డివిజన్లు ఉన్నాయి. ఒక్కో కార్యాలయంలో డ్రాయింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర విభాగాల్లో 15 మంది పని చేస్తున్నారు. వీరు కార్యాలయాల్లో దస్త్రాలు వేగంగా నడిపిస్తేనే రహదారులపై వాహనాలు సాఫీగా తిరుగుతాయి. అంత కీలకమైన పనులున్నా



కొందరు సిబ్బంది బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. రెండు డివిజన్లలో చాలా మంది వారంలో మూడు రోజులు కూడా విధులకు రారు. తాజా బదిలీల్లో కొందరికి డిప్యుటేషన్ వేయగా వారు వాస్తవంగా విధులు నిర్వహించే చోట ఉండరు..డిప్యుటేషన్ వేసిన చోటా కనిపించరు. వీరంతా అంతర్గతంగా ఒప్పందం ప్రకారం కాలపట్టికను రూపొందించుకున్నారు. ఒక రోజు కొందరు వస్తే మరుసటి రోజు మరికొందరొస్తారు. అనధికారిక సెలవుల్లో విజయవాడలో విహారయాత్రలు చేయడం, సొంత పనులు, వ్యాపారాలు, వ్యవహారాలు చూసుకుంటారు.

హాజరు మాయ..

మూడు కార్యాలయాల్లో బయోమెట్రిక్, ముఖ ఆధారిత హాజరు ఉంది. వాటిలో నమోదయ్యే హాజరుతో సంబంధం లేకుండా జీతాలొచ్చేస్తాయి. హాజరు పట్టికలో సంతకం ఉంటే విధులకు వచ్చినట్లే. దీంతో విధులకు రాకుండానే వచ్చినట్లు పాత తేదీల్లో సంతకాలు పెట్టేస్తున్నారు. క్షేత్రస్థాయి విధులకు వెళ్లే కొందరి కోసం సంతకాల హాజరు విధానం పెట్టగా అందరూ అదే వేసుకుని గడిపేస్తున్నారు. ఇదంతా స్థానిక, జిల్లా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని కొందరు కింది స్థాయి అధికారులు పెదవి విరుస్తున్నారు. విధులకు డుమ్మా కొడుతున్న చాలా మంది సిబ్బందికి ఉద్యోగ సంఘాల మద్దతు ఉందని, ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

పనులెలా పట్టాలెక్కుతాయ్..

సిబ్బంది విధులు ఎగ్గొట్టేయడంతో సర్కిల్ పరిధిలో మంజూరైన పనులు పట్టాలెక్కడానికి ఆలస్యమవుతోంది. ప్రస్తుతం రూ.38 కోట్లతో 14 ఆర్అండ్‌బీ రహదారులు అభివృద్ధి చేయాల్సి ఉంది. 12 రాష్ట్ర రహదారులకు సైతం రూ.37కోట్లు మంజూరయ్యాయి. కొన్ని నెలల కిందటే ఇవి మంజూరైనా ఇప్పటికీ పట్టాలెక్కలేదు. రహదారుల పనులకు సంబంధించి సాంకేతిక అనుమతులు, అంచనాల తయారీ, టెండర్లు పిలవడం, బిల్లులు పెట్టడం, స్పందన ఫిర్యాదుల విచారణ, ఆర్టీఐ అంశాలకు సమాధానాలు ఇవ్వడం వంటి అనేక పనులు ఉంటాయి. వీరు విధులకు హాజరు కాకపోవడం వల్ల అన్ని పనుల్లో జాప్యం అవుతోంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఎస్ఈ భాస్కరరావు తెలిపారు.

కృష్ణా నదికి వరద ఉద్ధృతి

బ్యారేజీ 50 గేట్ల ఎత్తివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన, ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం వరద ఉద్ధృతి నెలకొంది. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 54,505 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. 50 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 36,250 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని సాగునీటి కాలువలకు 18,255 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన (కేఈ) కాలువకు 10,342, కృష్ణా పశ్చిమ ప్రధాన (కేడబ్ల్యూ) కాలువకు 7,713, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 5,017, బందరు 1,982, కేఈబీ 1,832, ఏలూరు కాలువకు 1,511 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

అడంగల్‌లో.. అడ్డంగా ఎక్కించారు!

ఫిబ్రవరిలోనే పశ్చిమ బైపాస్ భూమికి ఎసరు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, నున్న

విజయవాడ గ్రామీణ మండలం అంబాపురంలో పశ్చిమ బైపాస్ కోసం భూసేకరణలో తీసుకుని, పరిహారం చెల్లించిన స్థలంలో మూడు సెంట్లను ఓ వ్యక్తి మళ్లీ తన పేరుపైకి అడంగల్‌లో మార్చేసుకోవడం ఇప్పుడు వివాదంగా మారింది. అడంగల్‌ను మార్చేసి మరీ భూసేకరణ చేసిన స్థలాన్ని ఇలా పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడాన్ని ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ తీవ్రంగా పరిగణించి విచారణకు ఆదేశించారు. దీంతో తెరవెనుక జరిగిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా ఈ వ్యవహారం విజయవాడ గ్రామీణ మండల తహసీల్దారు కార్యాలయం కేంద్రంగానే జరిగినట్లు గుర్తించారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో తహసీల్దార్ డిజిటల్ సంతకం పక్కాగా చేసి మరీ అడంగల్‌లోకి ఎక్కించేసి మూడు సెంట్లకు యజమాని చాగంటి లక్ష్మారెడ్డిగా ధ్రువీకరిస్తూ పట్టాదారు పహనీ కాపీని జారీ చేసేశారు. దీనిపైనే ప్రస్తుతం జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



చాగంటి లక్ష్మారెడ్డి పేరుతో అడంగల్ కాపీ

తహసీల్దార్ డిజిటల్ సంతకంతో.. పశ్చిమ బైపాస్ విస్తరణ కోసం అంబాపురం గ్రామ పరిధిలో 1,13,274 చదరపు మీటర్ల స్థలాన్ని సేకరించారు. దీనిలోనే చాగంటి లక్ష్మారెడ్డి పేరుతో తాజాగా అడంగల్ పట్టాదారు కాపీ జారీ చేసిన మూడు సెంట్ల భూమి కూడా ఉంది. ఎలాంటి లింక్ డాక్యుమెంట్లు లేకుండా ఎలా అడంగల్‌లోకి ఎక్కించేశారనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. తహసీల్దారు డిజిటల్ సంతకాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో పెట్టినట్టు గుర్తించారు. ఇందుకు సహకరించిన సిబ్బంది ఎవరనేదానిని తేల్చే పని ఆరంభించారు. ఈ విషయం బయటకు వచ్చిన వెంటనే కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు నున్న సబ్ రిజిస్ట్రార్‌కు తహసీల్దారు బి.సుగుణ లేఖ రాశారు. పాత సర్వే నంబరు 14/1ఎఫ్3లో మూడు సెంట్ల భూమికి అడంగల్ పట్టాదారు కాపీ తీసుకుని వచ్చి రిజిస్ట్రేషన్ చేయమంటే, చేయొద్దని.. హోల్డ్‌లో పెట్టాలంటూ సుగుణ కోరారు. దీంతో రిజిస్ట్రేషన్ చేయకుండా నున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిలిపేసింది.

ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదో చెప్పండి.. అంబాపురంలోని తనకు చెందిన మూడు సెంట్ల స్థలం అడంగల్‌లో నమోదు చేసి ఉన్నప్పటికీ ఎందుకు దానిని తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపారో చెప్పాలంటూ చాగంటి లక్ష్మారెడ్డి గురువారం వచ్చి నున్న సబ్‌రిజిస్ట్రార్‌ను రాత పూర్వకంగా ప్రశ్నించారు. కారణాలు చెప్పాలంటూ లేఖ ఇవ్వడం గమనార్హం.

దీనిపై కఠినంగా వ్యవహరిస్తాం: లక్ష్మీశ, కలెక్టర్

తహసీల్దార్ డిజిటల్ సంతకంతో సహా అడంగల్‌లో ఎలా ఎక్కించారనే దానిపై దృష్టి పెట్టాం. అడంగల్‌లోనే అక్రమాలకు పాల్పడే వరకూ వచ్చారంటే దీనిపై కఠినంగా వ్యవహరిస్తాం.

కాదేదీ చేనేతకనర్హం..

ఈనాడు, అమరావతి: చేనేత అనగానే వస్త్రాలు మాత్రమే కాకుండా వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని నిరూపిస్తున్నారీ మహిళలు. చేనేత వ్యర్థాలతో ఇటుక తయారు చేశారు. ఇది ఎంతో చల్లగా ఉండి గదుల విభజనకు గోడలా ఉపయోగపడుతుంది. పొందూరు రాసిల్క్ వస్త్రంపై తోలు బొమ్మలను అతికించి డెకరేషన్ ఐటంగా.. కంప్యూటర్ మౌస్‌ప్యాడ్..చేనేత వ్యర్థాలతో సినిమా థియేటర్ నుంచి ధ్వని తరంగాలు బయటకు రాకుండా తగ్గించడానికి షీట్‌లా, కీచైన్‌లు, పర్సులు.. కళ్లజోడు పౌచ్‌లు..ఫోల్డర్ ప్యాడ్స్..టిష్యూ పేపర్ పెట్టుకునే పౌచ్..పుస్తకం ఏ పేజీ దగ్గర చదవడం ఆపామో తెలిపే బుక్‌మార్క్స్..కళంకారీ వస్త్రంతో ఫోల్డర్లు.. ఇలా ఒకటేమిటి ఎన్నోరకాల వస్తువులు తయారు చేసే వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. చేనేత విభాగానికి ప్రభుత్వ కన్సల్టెంట్ యశస్విని పెద్ది ఆధ్వర్యంలో కంచికచర్ల మండలం పేరకలపాడు పంచాయతీ సర్పంచి మన్నె సాత్విక, స్థానిక డ్వాక్రా మహిళలతో ప్రయోగాత్మకంగా ఉత్పత్తులు తయారు చేయిస్తున్నారు. చేనేత వస్త్రాల్లో మిగిలిన ముక్కలు..వ్యర్థాలు ఉపయోగించి కుటీర పరిశ్రమలా మహిళలను ప్రోత్సహించవచ్చని జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలో తమ ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబుకు వివరించారు.



తయారు చేసిన వస్తువులు చూపుతున్న మహిళలు



సీఆర్‌డీఏ కార్యాలయానికి ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సెల్ గుర్తింపు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : విజయవాడ నగరంలో గురువారం నిర్వహించిన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సెల్ గ్రీన్ (ఐజీబీసీ) ఆంధ్ర సమ్మిట్-2025లో ఏపీ సీఆర్‌డీఏ అధికారులు హాజరయ్యారు. ఇందులో భాగంగా అమరావతిలో నిర్మాణంలో ఉన్న సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఐజీబీసీ గ్రీన్ క్రూసేడర్ కార్యక్రమం కింద రిజిస్టర్ చేశారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను సీఆర్‌డీఏ చీఫ్ ఆర్కిటెక్ట్ సందీప్ దీక్షిత్‌కు అందించారు. దీనిని గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుకు చీఫ్ ఆర్కిటెక్ట్ సందీప్ దీక్షిత్, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డిలు అందించారు.



కమిషనర్ కన్నబాబుకు ఐజీబీసీ సర్టిఫికెట్ ఇస్తున్న సందీప్ దీక్షిత్, గోపాలకృష్ణారెడ్డి

స్పందించారు.. అవస్థలు తీర్చారు..



స్పందనకు వందనం

విజయవాడ బస్టాండులో ప్రయాణికులు దిగే 54వ ప్లాట్‌ఫాం నుంచి 60 వరకు కుర్చీలు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఏప్రిల్ 15న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. 119 కుర్చీలను కొనుగోలు చేసి వేయడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీరాయి. – ఈనాడు, అమరావతి

అక్రమార్కులపై జరిమానాల కొరడా

వైకాపా హయాంలో మట్టి అక్రమ తవ్వకాలను నిర్ధారించిన అధికారులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రామీణ, జి.కొండూరు మండలాల్లోని గ్రామాల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిగినట్లుగా గనులు, భూగర్భ శాఖ అధికారులు గుర్తించారు. మాజీ మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. లక్షలాది క్యూబిక్ మీటర్ల మేర మట్టిని అక్రమంగా తరలించారు. నాటి వైకాపా ప్రభుత్వ హయాంలో మట్టి అక్రమంగా తవ్వకాలు జరిగాయని, ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ కొత్తూరుతాడేపల్లికి చెందిన జమలయ్య ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గతేడాది ఫిర్యాదు చేశారు. ఆ అర్జీపై గనులు, భూగర్భ శాఖ ఎన్టీఆర్ జిల్లా అధికారి ఎ.శ్రీనివాసకుమార్ స్పందించారు. ఆయా గ్రామాల పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలను గుర్తించి, బాధ్యులైన వారిని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేసినట్లుగా వెల్లడించారు. అపరాధ రుసుం చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వసూలు చేస్తామని పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, వివిధ న్యాయస్థానాల్లో కేసులు ఉన్నాయని, మట్టి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఏపీ చిన్న తరహా ఖనిజ నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయా గ్రామాల పరిధిలోని రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో కార్యాలయ సాంకేతిక సిబ్బంది మట్టి అక్రమంగా తవ్వకాలు జరగకుండా పర్యవేక్షిస్తారని వివరించారు.


కొత్తూరుతాడేపల్లిలో అక్రమంగా మట్టి తవ్వుతూ

ఎవరెవరికి ఎంతంతంటే..?

● కొత్తూరుతాడేపల్లి గ్రామంలోని పలు సర్వే నంబర్లలో 10,43,772 క్యూబిక్ మీటర్ల మట్టి రవాణా చేసినట్లుగా అధికారులు గుర్తించారు. 33 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే వారికి రూ.57,86,67,203 నోటీసులు ఇచ్చారు. కొత్తూరులో సర్వే నం.34, 34బి1లో 3 లక్షల 90వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వినట్లు నిర్ధారించి మేఘా ఇంజినీరింగ్ సంస్థ వారికి రూ.21,62,80,610 జరిమానా విధిస్తూ డిమాండ్ నోటీసులు ఇచ్చారు. ● వెలగలేరు గ్రామంలోని పలు సర్వే నంబర్లలో తవ్వకాలు జరిపి రవాణా చేసిన 59 మందిని గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారికి రూ.31,91,40,659 జరిమానా విధిస్తూ నోటీసులు అందించారు. ● నైనవరం గ్రామంలో దావు వెంకటేశ్వరరావు మట్టి తవ్వకాలు చేసినట్లు గుర్తించి రూ.14,42,21,616 జరిమానా విధించారు. ● వేమవరం గ్రామంలోని పలు సర్వే నంబర్లలో 18 మందిని అధికారులు గుర్తించి వారికి రూ.30,99,57,981 జరిమానా విధించారు. ● జక్కంపూడి గ్రామంలో 240 క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిపారని బాధ్యుడికి రూ.లక్ష 29 వేలు జరిమానా విధిస్తూ నోటీసులు ఇచ్చారు. ● పాతపాడు గ్రామంలో ఉంగరాల రాజశేఖర్, వేల్పుల జ్యోత్స్నలకు రూ.1,20,320 చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు.

శాతవాహన కళాశాల వివాదాన్ని సుమోటోగా స్వీకరించాలి

ప్రిన్సిపల్‌ను బెదిరించలేదు : ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

చుట్టుగుంట, న్యూస్‌టుడే : శాతవాహన కళాశాల వివాదాన్ని కోర్టు సుమోటోగా స్వీకరించాలని శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. చుట్టుగుంటలోని కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలను కబ్జా చేసేందుకు కుట్ర పన్నినట్లు తనపై తప్పుడు ప్రచారం జరిగిందని, అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. తాత్కాలిక ప్రిన్సిపల్‌గా ఉన్న వంకాయలపాటి శ్రీనివాస్‌ను తాను బెదిరించలేదని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి. పక్కన రమా సత్యనారాయణ, కృష్ణమోహన్, సాంబిరెడ్డి

సొసైటీలో చీలికలు తెచ్చారు..

2011లో విద్యాశాఖ మంత్రిగా ఉన్న తనను సొసైటీలో కార్యదర్శిగా చేర్చుకున్నారని ఆలపాటి చెప్పారు. సిబ్బంది జీతాలు, పన్నులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ వ్యవస్థాపకులైన ప్రజాపతిరావు వృద్ధాప్యాన్ని ఆసరాగా చేసుకొని కొందరు సొసైటీలో తగాదాలు, చీలికలు తెచ్చారని... తప్పుడు సంతకాలు చేసి తనను బయటకు పంపే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. దీంతో కోర్టును ఆశ్రయించానని వివరించారు. 1972లో పట్టణ భూగరిష్ఠ పరిమిత చట్టం కింద ప్రభుత్వానికి అందజేసిన స్థలాన్ని.. సొసైటీ నిధులతో 1976లో కొనుగోలు చేశారని తెలిపారు. వంకాయలపాటి శ్రీనివాస్ పూర్వ భూ యజమానులైన బోయపాటి వారితో చేతులు కలిపి, డబ్బుకు అమ్ముడుపోయారని ఆరోపించారు. తప్పుడు సంతకాల ద్వారా వచ్చిన లోక్ అదాలత్ తీర్పును ఆసరాగా చేసుకొని.. జూన్ 5వ తేదీ అర్ధరాత్రి వేళ తరగతి గదులను కూల్చివేశారన్నారు. గేట్లు మూసేశారని చెప్పారు. పూర్వ విద్యార్థుల చొరవతో మళ్లీ గేట్లు తెరిపించినట్లు వెల్లడించారు. కళాశాలను సవ్యంగా నిర్వహిద్దామని, కంప్యూటర్లు, ఫ్యాన్లు, బల్లలు, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను తిరిగి తీసుకురావాలని సొసైటీ కరస్పాండెంట్ రమా సత్యనారాయణ ఫోన్ ద్వారా ప్రిన్సిపల్‌కు చెప్పారన్నారు.

హోదాను అడ్డుపెట్టుకుని : కళాశాల కరస్పాండెంట్ రమాసత్యనారాయణ, పూర్వ ప్రిన్సిపల్ కుందేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. తాత్కాలిక ప్రిన్సిపల్ హోదాను అడ్డుపెట్టుకొని శ్రీనివాస్ అందరిపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై ఇప్పటికే పలు పోలీసు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సొసైటీ కార్యదర్శిపై తప్పుడు ఫిర్యాదులు చేసిన శ్రీనివాస్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పిన్నమనేని కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు వి.సాంబిరెడ్డి, కోశాధికారి యార్లగడ్డ రాజేష్, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు ఓట్ర శ్రీనివాసరావు, కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు వల్లూరు నాగబాబు, రవి కిరణ్ పాల్గొన్నారు.

ఆలపాటిపై శాతవాహన ప్రిన్సిపల్ ఫిర్యాదు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : తెదేపా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో తన ప్రాణానికి ప్రమాదం ఉందని నగరంలోని శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ వంకాయలపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాల వ్యవహారంపై తనను బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు న్యాయవాదితో కలిసి పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబుకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం సీపీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఆయనతో ఆలపాటి చరవాణిలో మాట్లాడిన మాటల ఆడియో అంటూ.. మీడియాకు విడుదల చేశారు.


న్యాయవాదితో కలిసి ఫిర్యాదు కాపీ చూపుతున్న శ్రీనివాస్

'కలిసి వస్తానంటే రా...' 'నాకు నువ్వు ఏం చేస్తున్నావో.. ఎక్కడకు వెళుతున్నావో అన్ని తెలుసు. దిల్లీ వెళ్లి ఇంప్లీడ్ పిటిషన్‌పై సంతకం చేసిన విషయం నాకు తెలుసు. దిల్లీలో నువ్వు కలిసిన కృష్ణారావు నాకు చెప్పరని ఎలా అనుకున్నావు. నాకు అన్నీ తెలుసు. నువ్వు బెంగళూరు వెళ్లావని చెప్పి దిల్లీ వెళ్లావని కూడా తెలుసు. గతంలో వివాదాలు సృష్టించిన వారు తిరిగి వచ్చారు. నువ్వు కూడా వస్తానంటే రా. వస్తే నేను చెప్పినట్లు వినాల్సిందే. కలిసి వస్తావో ముందుకు వెళతావో అంతా నీ ఇష్టం. నీ కుటుంబం జోలికి రాను. ఆ అవసరం నాకు లేదు. తప్పు చేసింది నువ్వు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే. చిత్తశుద్ధిగా కలిసి నాతో నడిస్తే క్షమిస్తా. 13 ఏళ్లుగా నాతోనే ఉన్నావు కాబట్టి చెబుతున్నా. నీ గురించి చాలా సేకరించా. సీఐడీ వాళ్లు నీ సంభాషణలు మొత్తం తీశారు. కలిసి వస్తే నీకు ఉపయోగం' అంటూ ఆలపాటి తనను బెదిరించారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

నేనేమైనా అసాంఘిక శక్తినా..

నా ఫోన్‌ను సీఐడీతో ట్యాపింగ్ చేయిస్తున్నానని ఆలపాటి బెదిరించారని శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. నేనేమైనా అసాంఘిక శక్తినా? నా ఫోన్‌ను ట్యాప్ చేయటానికి అని.. ప్రశ్నించారు. సీఎంకు ఈ విషయం చెప్పానంటూ భయపెడుతున్నారని, గతంలో ఒకసారి కుటుంబం మొత్తాన్ని చంపేస్తానని బెదిరించారని ఆరోపించారు. వారం క్రితం మళ్లీ ఫోన్ చేసి నన్ను వదలనని హెచ్చరించారని చెప్పారు. దీనిపై డీజీపీ, సీపీకి ఫిర్యాదు చేశానని వివరించారు. కళాశాల విషయంలో ఆలపాటికి సంబంధం లేకపోయినా ఆయన చెప్పినట్లు వినాలని బెదిరిస్తున్నారని.. అధికార పార్టీ అవడం వల్ల నేనేం చేయలేక రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించానని వివరించారు. నాకు ఏదైనా జరిగితే దానికి ఆలపాటే కారణమని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200. అనుపల్లి పౌల్ట్రీ ఫార్మ్స్ & ట్రేడర్స్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 490 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

ప్రైవేటు సంస్థల చేతుల్లోకి పర్యాటక ప్రదేశాలు

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడలోని పర్యాటక ప్రదేశాలైన భవానీద్వీపం, హరిత బరంపార్కులోని కొన్ని విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నారు. తద్వారా ఆదాయం పెంచుకోవాలనే ఉద్దేశంతో అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి హరిత బరంపార్కు, భవానీ ద్వీపంలోని రెస్టారెంట్లు, కాటేజీలు నష్టాల్లో నడుస్తున్నాయి.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల నేటి నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే పవిత్రోత్సవాలను పురస్కరించుకొని యాగశాలలో ఉదకశాంతి కార్యక్రమాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలు నిలిపివేశారు. శుక్రవారం వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, అలంకరణ, పవిత్రమాలాధారణ, బాలభోగ నివేదన అనంతరం ఉదయం 9.30 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు గణపతి పూజ మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మూలమంత్ర హవనాలు, వేదపారాయణలు నిర్వహిస్తారు. 9న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మండపారాధన, సర్వదేవతారాధన, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మూల మంత్ర హవనాలు, వేదపారాయణ, 10న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మండపారాధన, 10.30 గంటలకు పూర్ణాహుతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలను నిర్వహిస్తారని స్థానాచార్య తెలిపారు.


ఉదకశాంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

దుర్గమ్మ సన్నిధిలో 108వ కచేరీ పూర్తి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని గాయని వరలక్ష్మి మొక్కు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: తెదేపా అధినేత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 108 ఆధ్యాత్మిక కచేరీలు పూర్తి చేస్తానని మొక్కానని, చివరి కచేరీ జగన్మాత దుర్గమ్మ సన్నిధిలో పూర్తి చేయడం ఆనందంగా ఉందని గాయని ఎన్.వరలక్ష్మి అన్నారు. తన చివరి కచేరీలో భాగంగా గురువారం జగన్మాత సన్నిధిలోని కళావేదికపై దుర్గమ్మ కీర్తనలు ఆమె పాడిన గీతాలు భక్తులను అలరించాయి. ఆమె జన్మస్థలం గుంటూరు జిల్లా నారాకోడూరు కాగా ప్రస్తుతం ముంబయిలో నివాసం ఉంటున్నారు. తెలంగాణ నుంచి విడిపోయిన తరువాత కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయించేది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అప్పట్లో మొక్కుకున్నట్లు చెప్పారు. అన్నవరం దేవాలయంలో ప్రారంభమైన కచేరీ దుర్గమ్మ ఆలయంలో ముగిసినట్లు వివరించారు. ద్వారకా తిరుమల, మంగళగిరి, తిరుమల వంటి పుణ్యక్షేత్రాల్లో కచేరీ చేసినట్లు పేర్కొన్నారు.


కళావేదికపై గీతాలాపన చేస్తున్న వరలక్ష్మి

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

వత్సవాయి, న్యూస్‌టుడే: లింగాల కాజ్‌వే పనులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం ప్రారంభించారు. కూటమి నాయకులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి కాజ్‌వేకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జెండా ఊపి వాహనాల రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది మునేరుకు వచ్చిన వరదలకు దెబ్బతిన్న కాజ్‌వేకు రూ.1.90 కోట్లతో శాశ్వత మరమ్మతులు చేశామన్నారు. ఈ ఏడాది కాలంలో వాహనదారులు కొంత ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. కాజ్‌వే స్థానంలో ఎత్తయిన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, తొండపు జగన్మోహన్‌రావు, చిట్టూరి రామ్, సర్పంచి చల్లా విజయకుమారి, ఎంపీటీసీ సభ్యుడు వేముల శివ, పెద్ది రామారావు, మన్నె నారాయణరావు, కీలారు సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ వర కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.


కాజ్‌వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.నాగేశ్వరరావు అన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో చలో విద్యుత్ సౌధ ముట్టడి కార్యక్రమం జరిగింది. వందలాది మంది కార్మికులను అరెస్టు చేశారు. మాచవరం, పటమట, మహిళా పోలీస్ స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామికవాదులు ఖండించాలని వారంతా నినదించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్తు సంస్థల ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కంలలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న 27,153 మంది ఒప్పంద, పొరుగు సేవల కార్మికులు పనిచేస్తున్నారని, వీరిని రెగ్యులరైజ్ చేయాలని, తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశామన్నారు. ఇంకా 2022 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, వేతన వ్యత్యాసాలు సరిచేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ.కోటి బీమా సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య కార్డులు, టెక్నికల్, కంప్యూటర్ ఆపరేటర్లకు అసిస్టెంట్ వేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ (గ్రాట్యుటీ రూ.10 లక్షలు) చెల్లించాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించినా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలమైనా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ మాట్లాడారు.


ప్రదర్శనగా వెళుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, విద్యుత్తు ఒప్పంద కార్మికులు

మునేరులో ట్రాక్టర్ పల్టీ.. డ్రైవర్ మృతి

రెయిలింగ్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు వద్ద మునేరులో గురువారం ట్రాక్టర్ పల్టీ కొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై అర్జున్ తెలిపిన వివరాల మేరకు వత్సవాయి మండలం దేచుపాలెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పెరుమాళపల్లి రాజు (45) పెనుగంచిప్రోలులో గురువారం పొలంలో దమ్ము పనులు పూర్తి చేసి తిరిగి ఇంటికి బయలుదేరారు. కాజ్‌వేపై ప్రయాణిస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ను దాటుకొని ఆటో ముందుకెళ్లింది. ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి కాజ్‌వే రెయిలింగ్‌ను ఢీకొని ఆగిపోయింది. వెనుక వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించేందుకు సడన్ బ్రేక్ వేయడంతో పక్కకు దూసుకెళ్లి కాజ్‌వే పైనుంచి మునేరులోకి పల్టీ కొట్టింది. ట్రాక్టర్ మునేరులో పడిపోగా.. డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందారు. రెయిలింగ్‌ను ఢీకొన్న ఆటోలో డ్రైవర్‌తో కలిపి ముగ్గురు ఉన్నారు. వారిలో దావాజీగూడెంకు చెందిన బాలాజీ వెంకటేశ్వరరావు మునేరులోకి పడిపోగా.. నడుము, కాళ్లకు గాయాలయ్యాయి. అనిగండ్లపాడుకు చెందిన వృద్ధురాలు తులశమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు.


రాజు (పాత చిత్రం)


మునేరులో పడిన ట్రాక్టర్ పక్కన డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

ఈనాడు, అమరావతి : మద్యం కుంభకోణంలో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ప్రాసిక్యూషన్‌కు నోటీసుల నిమిత్తం 11వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. రెండోసారి చాణక్య వేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణల బెయిల్ పిటిషన్లపై గురువారం జరగాల్సిన వాదనలు సోమవారానికి వాయిదా పడ్డాయి. మరో నిందితుడు దిలీప్ బెయిల్ పిటిషన్‌పై విచారణ 12వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు..

సజ్జల శ్రీధర్‌రెడ్డికి పంటి చికిత్స

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డిని జిల్లా జైలు అధికారులు గురువారం విజయవాడ ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు తీసుకొచ్చారు. ఆయనకు పంటి నొప్పి ఉండడంతో మంగళవారం ఒకసారి తీసుకొచ్చిన అధికారులు.. వైద్యుల సూచన మేరకు గురువారం మరోసారి తీసుకొచ్చి చికిత్స చేశారు.

నాలుగు మండలాల్లో వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. గురువారం నమోదైన వివరాలు ఇలా. ఇబ్రహీంపట్నం 2.4, రెడ్డిగూడెం 2.2, మైలవరం 1.8, జి.కొండూరులో 0.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? పొందుగల రోడ్డులోని బీసీ బజారు ప్రాంతంలో మురుగు కాలువల్లో పూడికలతో వర్షపునీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. - **వెంకటేశ్వరరావు, మైలవరం** ✔ కాలువల్లో పూడిక తొలగించి, నీరు పారేలా చర్యలు తీసుకుంటాం **- ఎం.డి.రఫీ, కార్యదర్శి, – న్యూస్‌టుడే, మైలవరం**

? తాడిగూడెం కూడలి దగ్గర తారురోడ్డుపైకి మురుగు నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- రమేష్, స్థానికుడు** ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రామారావు, రంగాపురం పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి** – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? కొండపల్లి ఖిల్లా రోడ్డు విజయవాడ, ఇబ్రహీంపట్నం వెళ్లడానికి గతంలో బస్టాప్ ఉండేది. ప్రస్తుతం అది తొలగించడంతో విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- వై.గోపి, స్థానికుడు** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- కమిషనర్, రమ్యకీర్తన**

? కొండపల్లి పురపాలికలో నిర్మాణాల సందర్భంగా ఆ సామగ్రిని రహదారులపై పోస్తున్నారు. అటుగా వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- శ్రీధర్, కొండపల్లి**

✔ అలా చేయడం వాహనదారులకు ఇబ్బందే. ఆయా వ్యక్తులు అనుమతులు కూడా తీసుకోవడం లేదు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వెంకటరత్నం, సంబంధిత మేనేజర్ –** న్యూస్‌టుడే, కొండపల్లి



◆ జి.కొండూరులో పులివాగు వంతెన శివారులో కాలువలు పూడిక పేరుకుపోయి అవస్థలు పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపిన సమస్యను కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో గురువారం శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

◆ గొల్లపూడి సాయిపురంకాలనీలోకి పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా రావడం లేదంటూ పంచాయతీ అధికారులకు తెలుపగా స్పందించారు. సిబ్బందిని పంపి చెత్తను తీయించారు.

◆ రామరాజ్యనగర్ ప్రాంతంలో వీధిదీపాలు వెలగడంలేదని పంచాయతీ అధికారులకు తెలుపగా సిబ్బందిని పంపి కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. – న్యూస్‌టుడే, గొల్లపూడి

పిడుగుపాటుతో పిట్టగోడ ధ్వంసం



మండలంలో గురువారం పలుచోట్ల పిడుగులు పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం ఒక్కసారిగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై పడడంతో గోడ స్వల్పంగా ధ్వంసమైంది. దీంతో విద్యుత్తు స్విచ్ బోర్డులు కాలిపోవడంతో, సరఫరా నిలిచింది. అంతర్జాలానికి అంతరాయం కలిగింది. స్థానిక రైతు బజారులోనూ రావిచెట్టుపై పిడుగు పడడంతో వ్యాపారులు, వినియోగదారులు ఉలిక్కిపడ్డారు.

- న్యూస్‌టుడే, మైలవరం

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

మైలవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పలు రహదారులు, వంతెనలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులివ్వాలని మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోరినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే తనయుడు ధీమంత్‌సాయితో కలిసి మంత్రిని కలిసినట్లు పేర్కొన్నారు. హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై వంతెన నిర్మాణానికి, విజయవాడ-విస్సన్నపేట రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సొసైటీ అధ్యక్షులకు ఎమ్మెల్యే అభినందన

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు, వెలగలేరు, చెవుటూరు సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన చెరుకూరి గంగాధర్‌రావు, మంచినీళ్ల రాజశేఖర్, ఈమని మురళీలు గొల్లపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో వసంత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



కవులూరు సొసైటీ అధ్యక్షుడు గంగాధర్‌రావును సత్కరించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

వ్యర్థాల పారబోత.. రైతన్నకు గుండెకోత

మైలవరం, న్యూస్‌టుడే:

★ ఐదేళ్ల కిందట ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం శివారు సాగర్‌కాలువలో ఎక్కడి నుంచో తెచ్చిన వ్యర్థాలను కలిపేశారు. దీంతో కాలువకు సమీప ఉన్న చేతిపంపులో మలిన నీరు వచ్చింది. నేటికీ అక్కడే అదే పరిస్థితి ఉండడంతో ఆ పంపును వాడడమే మానేశారు.

★ గతంలో చంద్రగూడెంలో మల్లె తోటల పక్కన పారబోయగా రైతుల తోటల్లోని చెట్లు కాలిపోయాయి.

★ వెలగలేరులో రహదారి పక్కన కాలువలో పెద్ద మొత్తంలో పడేయగా ఆ రహదారిపై వెళ్లేవారి ముక్కులదిరేలా నేటికీ ఘాటు వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

ఇలా పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన రసాయన వ్యర్థాలను పచ్చనిచేలల్లో, కాలువల్లో పారబోస్తున్నారు. దీంతో ఆ నీరు చేలల్లోకి చేరి పంటలు నాశనమవుతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో సడేమియా చందంగా అర్ధరాత్రి దాటాక చేస్తున్న చర్యలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఒకట్రెండు సందర్భాల్లో పట్టుకున్నా.. వ్యర్థాల పారబోత ఆగడంలేదు.



రసాయన వ్యర్థాలు పోయడంతో రంగుమారిన నీరు

రహదారుల పక్కనే

మైలవరం, జి.కొండూరు మండలాల్లో రసాయన వ్యర్థాల పారబోత దీర్ఘకాలంగా పెద్ద సమస్యగా మారింది. ఒకప్పుడు మైలవరం మండలంలోని దాసుళ్లపాలెం సమీప అటవీ ప్రాంతాన్ని ఎంచుకుని హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి సైతం తెచ్చి ఇక్కడ పారబోసేవారు. క్రమేపీ రహదారుల పక్కన, పొలాల్లో పోసే స్థితికి చేరారు. కొన్ని నెలలుగా జి.కొండూరు మండలంలోని పలు ప్రాంతాల్లోనూ రహదారుల పక్కనే పారబోసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. తొలుత అది సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలుగా భావించిన రైతులకు తీరా ఆ ప్రాంతంలో ఉన్న మొక్కలు మాడిపోవడాన్ని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. నిఘా ద్వారా అక్రమార్కులను గుర్తించి, అందుకు కారకులైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పచ్చని పొలాలపై రసాయనాల పడగ

ఖర్చులు భారమని..

వాస్తవానికి రసాయన పరిశ్రమల్లో వ్యర్థాలను శుద్ధి చేశాక, పర్యావరణానికి ప్రమాదం కలగని ప్రాంతాల్లో వదిలేయాలి. కానీ అలా చేయడం కొన్ని కంపెనీలు భారీ ఖర్చుగా భావిస్తుంటాయి. అలాంటి యాజమాన్యాలే వ్యర్థాలను అక్రమంగా తరలించే ట్యాంకర్ల నిర్వాహకులకు అప్పజెప్పడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ట్యాంకర్లతో రసాయనాలను జిల్లాలోని జగ్గయ్యపేటతో పాటు తెలంగాణా ప్రాంతం నుంచి సైతం మైలవరం, తిరువూరు ప్రాంతాలకు తెచ్చి అనర్థాలకు కారకులవుతున్నారు. వాస్తవానికి పరిశ్రమల నుంచి వచ్చే రసాయనాలను శుద్ధి చేయడానికి ప్రత్యేకంగా ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. కొండపల్లి ఐడీఏలో గతంలో ప్లాంటు ఏర్పాటు చేసినా, ప్రస్తుతం అంతగా పనిచేయడం లేదు.

అన్నదాతలకు అండగా ఉండండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పీఏసీఎస్ ద్వారా అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను అన్నదాతలకు అందించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. మండల పరిధిలో సొసైటీలకు అధ్యక్షులుగా నియమితులైన గరికపాటి శ్రీనివాసరావు(మూలపాడు) చెరుకూరి రామకృష్ణ(గుంటుపల్లి), నల్లూరి పెద్ద అప్పారావు(దాములూరు) యడ్లూరి వెంకట శివ(కొటికలపూడి) వల్లూరి కిషోర్(ఈలప్రోలు)లు గురువారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో ముందస్తు వరలక్ష్మీ వ్రతాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు వరలక్ష్మీ ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజాదికాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మస్తాన వలీ, సాదిక్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

భీమరాజు గుట్ట సమస్య పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: 24వ డివిజన్ భీమరాజు గుట్ట ఆర్టీసీ డిపో వెనుక భాగం వర్షం సందర్భంలో నీరు పోయే మార్గం లేక తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. దీనిపై పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని డివిజన్ కౌన్సిలర్ పులి అరుణకుమారి అధికారులను కోరారు. కౌన్సిలర్ వినతి మేరకు కమిషనర్ రమ్యకీర్తన, ఛైర్మన్ చిట్టిబాబులు ఆ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు.

స్పందించారు.. చెత్త తొలగించారు



చెవుటూరు గ్రామంలో సంపద తయారీ కేంద్రం ఆవరణలో చెత్త చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైందని స్థానికులు న్యూస్‌టుడేకు తెలిపిన సమస్యపై గత నెల 27 వ తేదీన 'ఆధ్వాన్నం..సంపద తయారీ కేంద్రం' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సంపద తయారీ కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, [illegible] సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

పాడి రైతులకు రూ.1.76 కోట్ల బోనస్

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న పీ4 స్ఫూర్తిగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాడి రైతులను ఆదుకునేందుకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు [illegible]



లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో [illegible] చెక్కు అందజేస్తున్న కేఎంయూ అధ్యక్షుడు ఆంజనేయులు

చంద్రబాబు ఆదేశాల మేరకు అవనిగడ్డ, నందిగామ మండలాల పరిధిలోని [illegible] పశువుల వసతిగృహాలను త్వరలో ప్రారంభిస్తామని [illegible] పాలు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వామిత్వ సర్వే

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట గ్రామ పంచాయతీలో ఇంటింటికీ ప్రధానమంత్రి స్వామిత్వ యోజన పథకం సర్వే ముమ్మరంగా జరుగుతుంది. [illegible] గ్రామస్థులు సహకరించాలని [illegible] పాల్గొన్నారు.

మొక్కలు పరిరక్షిస్తేనే పర్యావరణానికి రక్ష



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపూడి [illegible] మొక్కలు నాటారు. [illegible] పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుందరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నెమలి కృష్ణాలయంలో ఘనంగా పవిత్రోత్సవాలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు విశేషాభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో [illegible] ప్రధాన హోమాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పూర్ణాహుతి సమర్పించారు. ఉత్సవాలకు ఆర్థిక చేయూతనందించిన ఉభయ దాతలకు పవిత్రాలను బహూకరించారు. తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ప్రధాన హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అధికారులు, అర్చకులు

బోధనకే సమయం కేటాయించాలి

మైలవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో బోధన సమయం తగ్గిపోతుందని, [illegible] దానికే కేటాయించేలా చూడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ పేర్కొన్నారు. సంఘ సభ్యత్వ నమోదుపై బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. యాప్‌లను, ఆన్‌లైన్ కార్యక్రమాలను బాగా పెంచారని, దాని వల్ల బోధనా సమయం తగ్గిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి రూ.25 వేల కోట్ల బకాయిలున్నాయని చెప్పారు. [illegible] చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాసిం, భూక్యా వసరాం, శ్రీనివాసరావు, ఖాదర్, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాద్

రవీంద్రనాథ్ ఠాగూర్ సేవలు ఎనలేనివి



ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పించిన నారాయణరావు, నాగరాజు తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వీ.నారాయణరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవీంద్రనాథ్‌ఠాగూర్ సాహిత్యం, విద్య, సామాజిక సంస్కరణలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డా. పీ.నాగరాజు, మాధవరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం మండల ఎంఈవో-2 గా పి.వి.మాలిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు హరిప్రసాద్, రెడ్‌స్టార్, మండలశాఖ అధ్యక్షులు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆర్మ్‌స్ట్రాంగ్, గౌరవ అధ్యక్షులు కృష్ణారావులతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆమెను కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో పుష్పలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాలినిని సత్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ఇద్దరి ప్రాణాలు కాపాడిన ఉచిత ఇంజక్షన్

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఇంజక్షన్ ఇద్దరి ప్రాణాలను నిలబెట్టింది. విస్సన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పావని తెలిపిన వివరాల మేరకు..గురువారం తాతకుంట్లకు చెందిన సాలి భీమయ్య (52), విస్సన్నపేటకు చెందిన గోళ్లపల్లి రామారావు (52)లకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకువచ్చారు. సకాలంలో స్పందించిన స్థానిక వైద్యులు రూ.45,000 విలువగల టెనెక్టిప్లెస్ ఇంజక్షన్‌ను వారికి చేయగా ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో ఆయా వైద్యులకు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. గుండెపోటు అనుమానం వచ్చిన వెంటనే 108కు ఫోన్ చేసి విసన్నపేట ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకొని ప్రాణాలు కాపాడుకోవాలని ఆమె సూచించారు.



గుండె సమస్య బాధితుడికి ఇంజక్షన్ చేస్తున్న వైద్యుడు

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

వావిలాల(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని వావిలాలకు చెందిన చిరసాని నాగేశ్వరరావు(50) ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు గురువారం కేసు నమోదైందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పొలంలో ఉన్న వేపచెట్టుకు విద్యుత్తు తీగతో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. దీనిపై భార్య విజయలక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కృష్ణారావుపాలెం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణారావుపాలెం శివారు మాన్‌సింగ్ తండాకు చెందిన భరోతు వెంకటేశ్వరరావు అదృశ్యమైనట్లు భార్య త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణ గురువారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వెంకటేశ్వరరావు తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు భార్య ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లేకపోవడంతో రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు.

నేత్రాలు దానం


తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో మాచిబోయిన లక్ష్మీనారాయణ(92) మృతి చెందగా లయన్స్‌క్లబ్ సభ్యుల చొరవతో కుటుంబ సభ్యుల అంగీకారంతో గురువారం అతని నేత్రాలను దానం చేశారు. విజయవాడ ఎల్వీప్రసాద్ నేత్రాలయం వైద్యులు వృద్ధుడి కంట్లోని కార్నియాను సేకరించుకుని తీసుకువెళ్లారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కొమ్మినేని రాజేశ్‌ఖన్నా, సీహెచ్.శంకరరావు, డీజే.నరసింహారావు పాల్గొని ఆ కుటుంబ సభ్యులను అభినందించారు. పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.



మాచిబోయిన లక్ష్మీనారాయణ

కాయగూరల వ్యాపారి..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెదకొమిర శివారు తోటమూలలో కూరగాయల వ్యాపారి కొత్తూరు శ్రీనివాసరావు(54) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందగా లయన్స్‌క్లబ్ ప్రతినిధి, న్యాయవాది జి.కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు అతని నేత్రాలను విజయవాడ ఎల్వీప్రసాద్ నేత్రాలయానికి దానం చేశారు. ఆసుపత్రి వైద్యులు శ్రీనివాసరావు కంట్లోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.



కొత్తూరు శ్రీనివాసరావు

పేదలకు ఫలాల పంపిణీ

విసన్నపేట, న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నాయకులు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సూపర్ బజార్ శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ పల్లెపాం రాంబాబు, పార్టీ మండల కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కొంగుల శ్రీనివాసరావు, కమతం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంటపాటు.. కుండపోత

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను పరిసరాల్లో గురువారం మధ్యాహ్నం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి గ్రామంలో ప్రధాన రహదారిపై నీరంతా స్తంభించింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వరద నీరు ప్రధాన రహదారిపై ప్రవహించడంతో ప్రజలకు, వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. మరో వైపు ఈ వర్షంతో పత్తి, వరికి మేలు చేకూరిందని, మిరప మొక్కలు నాటేందుకు భూమి పదునైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెనుగొలనులో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వాన నీరు

అంతర్గత మార్గాలకు నూతన రూపు

నాగులూరు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం సాయన్నపాలెంలో అంతర్గత రహదారులు నూతన రూపు సంతరించుకున్నాయి. గ్రామంలోని మార్గాలు వర్షాకాలంలో బురద కయ్యలుగా మారి ద్విచక్రవాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో అధ్వాన మార్గాలకు మోక్షం లభించింది. నాగులూరు పంచాయతీలోని సాయన్నపాలెం గ్రామంలో రూ.49 లక్షలు నిధులను ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. వాటితో గ్రామంలోని రెండు రహదారులు రూ.23లక్షలు, రూ.26లక్షల అంచనాలతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సమస్యలు తీరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



సాయన్నపాలెంలో వేసిన సీసీ రహదారి

సరికొత్త సర్పం



ఐజ్వాల్: మిజోరం విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగ పరిశోధకులు 'స్మిత్‌సోఫిస్ లాప్తోపోసూయస్' అనే కొత్త పాము జాతిని కనుగొన్నారు. జాతి లక్షణాలు, డీఎన్‌ఏ తదితర అంశాలపై పరిశోధన చేసిన తర్వాత దాన్ని కొత్త జాతిగా గుర్తించినట్లు విభాగ అధిపతి ప్రొఫెసర్ హెచ్.టి.లాల్‌రెమ్‌సంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు ఐదు రకాల స్మిత్‌సోఫిస్ పాము జాతులను కనుగొన్నట్లు తెలిపారు. ఇవి ప్రధానంగా భారతదేశంలో ఈశాన్య ప్రాంతాల్లో కనిపిస్తాయని పేర్కొన్నారు. ఈ పాము విషపూరితం కాదని, కీటకాలను ఆహారంగా తీసుకుంటుందని, దట్టమైన అడవుల్లో నివసిస్తుందని వెల్లడించారు.

ఎరక్కపోయినా ఇరుక్కున్నట్లే



వాషింగ్టన్: ఎవరైనా స్కూలు విద్యార్థిని తన సహాధ్యాయులతో ఆన్‌లైన్ చాటింగ్‌లో 'మెక్సికన్లను చంపేద్దాం' అని జోక్ చేసిందనుకోండి. వెంటనే పోలీసులు వచ్చి ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపితే ఎలా ఉంటుంది? స్కూళ్లలో కాల్పుల ఘటనలు ఎక్కువగా జరిగే అమెరికాలో ఇప్పుడు గ్యాగిల్, లైట్‌స్పీడ్ ఎలర్ట్ అనే ఆన్‌లైన్ నిఘా సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను ఇందుకోసం విద్యాలయాలు వాడుతున్నాయి. హత్య, ఆత్మహత్య వంటి మాటలను విద్యార్థులెవరైనా వాడితే వెంటనే పోలీసులను, పాఠశాల నిర్వాహకులను అవి హెచ్చరిస్తాయి. సరదా కోసమో, వెటకారంగానో పిల్లలు వాడే మాటలను తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

పెళ్లికి వేళాయె.. పడవే దిక్కాయె



బలియా: వరదల కారణంగా రహదారులన్నీ జలమయం కావడంతో ఓ పెళ్లి బృందం పడవల్లో ప్రయాణం చేయాల్సి వచ్చింది. బిహార్‌లోని బక్సర్ జిల్లాకు చెందిన రాజేశ్ కుమార్.. ఉత్తర్‌ప్రదేశ్ బలియా జిల్లాలోని బెయాసి గ్రామంలో ఓ యువతిని బుధవారం వివాహం చేసుకోవాల్సి ఉంది. గంగానది ఉప్పొంగి రహదారులు జలదిగ్బంధం కావడంతో వరుడి కుటుంబ సభ్యులు పడవల్లో ప్రయాణం చేశారు. వరుడు రాజేశ్‌తో పాటు దాదాపు 25 మంది అతిథులు వేర్వేరు పడవల్లో ప్రయాణించి వధువు ఇంటికి చేరుకున్నారు.

చేయని నేరానికి 20 ఏళ్లు జైల్లో..

రూ.11 కోట్ల పరిహారం



మెల్‌బోర్న్: కడుపున పుట్టిన నలుగురు పిల్లలను కడతేర్చిందన్న నేరారోపణలపై 20 ఏళ్ల జైలు జీవితం గడిపిన ఓ మహిళకు 2 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ.11 కోట్లు) పరిహారంగా ఇచ్చేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ కేసులో ఆమె నిర్దోషి అని తేలడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. న్యూసౌత్ వేల్స్‌కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్(58)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 1989-99 మధ్య కాలంలో ఆ నలుగురూ ఆకస్మికంగా మృతి చెందారు. కన్నతల్లే వారిని హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం...పిల్లల పెంపకం, కష్టాలపై కాథ్లీన్ ఫోల్బిగ్ తన డైరీలో రాసుకున్న రాతలు, ఇతరత్రా సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30ఏళ్ల జైలు శిక్ష విధించింది. తాను ఏ తప్పు చేయలేదని ఆమె న్యాయ పోరాటం చేశారు. ఆమె పిల్లలు నలుగురూ సహజ కారణాలతోనే మరణించి ఉంటారని శాస్త్రీయ ఆధారాలు తేల్చాయి.

సుప్రీం తీర్పుతో విభేదించిన హైకోర్టు జడ్జీలు

లేఖపై 13 మంది అలహాబాద్ న్యాయమూర్తుల సంతకాలు

ప్రయాగ్‌రాజ్: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు ఆయన రిటైరయ్యేంత వరకూ క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మరో న్యాయ వివాదానికి తెరతీసింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలు కాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు కోరినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు జడ్జీలు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ కూడా రాశారని సమాచారం. అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అరిందం సిన్హా హైకోర్టు నియమానుసారం ఈ లేఖ రాయగా దానిపై మరో 12 మంది న్యాయమూర్తులు సంతకాలు చేశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలు చేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. సుప్రీం ధర్మాసనం మాటల్లోని తీవ్రతను ఫుల్ కోర్టు తీర్మానం తప్పు పట్టాలని విజ్ఞప్తి చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు రిటైరయ్యేంత వరకూ ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈ నెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.

దోషారోపణ సబబే



జస్టిస్ వర్మ

దిల్లీ: ఇంట్లో భారీగా నగదు బయటపడిన కేసులో తనను దోషిగా తేల్చిన సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ దర్యాప్తు నివేదికపై జస్టిస్ యశ్వంత్ వర్మ అభ్యంతరాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆ నివేదిక ఆధారంగా జస్టిస్ వర్మ తొలగింపునకు చర్యలు చేపట్టాలన్న అప్పటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫార్సు నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేసింది. అంతర్గత కమిటీ దర్యాప్తు సమయంలో, ఆ తర్వాత జస్టిస్ వర్మ ప్రవర్తన విశ్వసనీయంగా లేదనీ ఆక్షేపిస్తూ ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎ.జి.మసీహ్ ధర్మాసనం కొట్టేసింది.

పట్టువీడని విపక్షం

దిల్లీ: ఉద్దేశపూర్వకంగా కొందరు ఓటర్లను పెద్దఎత్తున తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టారని ఆరోపిస్తూ విపక్షాలు పార్లమెంటు ఉభయసభల్లో నిరసనలు కొనసాగిస్తున్నాయి. దీనిపై సమగ్రంగా చర్చించాకే ఇతర అంశాలను చేపట్టాలని డిమాండ్ చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకోవడంతో లోక్‌సభ, రాజ్యసభ గురువారమూ స్తంభించిపోయి శుక్రవారానికి వాయిదాపడ్డాయి. గందరగోళం మధ్యనే 'కోస్టల్ షిప్పింగ్ బిల్లు-2025'ని రాజ్యసభ ఆమోదించింది. వాయిదా తీర్మాన నోటీసులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. ప్రస్తుత సమావేశాల్లో 51 గంటలు వృథా అయ్యాయని చెప్పారు. మణిపుర్ ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించి లోక్‌సభ వాయిదాపడింది. పార్లమెంటు సముదాయంలో నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ ముప్పును పెంచే

ఫ్రెంచ్ ఫ్రైస్



దిల్లీ: వారానికి మూడుసార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తింటే మధుమేహం వచ్చే ముప్పు 20 శాతం పెరుగుతుందని ఓ అధ్యయనం వెల్లడించింది. అంతే మొత్తంలో ఉడికించిన, వండిన బంగాళాదుంపలను తిన్నా ఆ స్థాయిలో ముప్పు ఉండదని పేర్కొంది. హార్వర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలకు చెందినవారు సహా పలువురు పరిశోధకులు 40 ఏళ్లు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 2 లక్షల మంది నుంచి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యం గురించి సమాధానాలు సేకరించారు. "ఆలూను సమీకృత ధాన్యాలతో కలిపి తింటే మధుమేహం ముప్పు చాలా తక్కువ. అన్నంతో తినే అలవాటుంటే జాగ్రత్త పడాల్సిందే. నూనెలో బాగా వేయించి, ఉప్పు-కారం వేసుకుని ఫ్రెంచ్ ఫ్రైసలా తింటే 20 శాతం మధుమేహాన్ని ఆహ్వానించినట్టే. ఇతర ఏ రూపంలో తిన్నా ఈ ముప్పు 5 శాతానికి పరిమితమవుతుంది' అని తేలింది.

భారత్‌కు చైనా మీడియా మద్దతు


ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను చైనా మీడియా తప్పుపట్టింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు కాదని.. తాము కోరుకున్నది చేయనందుకే భారత్‌పై అమెరికా చర్యలు తీసుకుంటోందని 'గ్లోబల్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. అమెరికా ప్రయోజనాలను అనుసరిస్తున్నంత వరకే భారత్‌ను ఆ దేశం తన సన్నిహిత భాగస్వామిగా పరిగణిస్తుందని పేర్కొంది.

లైంగిక సమ్మతికి 18 ఏళ్లు తప్పనిసరి



దిల్లీ: పద్దెనిమిదేళ్లు దాటినవారే లైంగిక చర్యకు సమ్మతి తెలపడానికి అర్హులన్న నియమాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించింది. ఈ వయోపరిమితిని 18 నుంచి 16 సంవత్సరాలకు తగ్గించాలంటూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ చేసిన వాదనకు స్పందనగా ప్రభుత్వం ఈ విషయాన్ని కోర్టుకు తెలిపింది. మైనారిటీ తీరనివారిని లైంగిక మోసాలు, దోపిడీల నుంచి కాపాడేందుకు ఈ విధానాన్ని ఉద్దేశపూర్వకంగా, బాగా ఆలోచించి అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. యువతీ యువకుల మధ్య శృంగార భరిత ప్రేమ పేరుతో ఈ వయోపరిమితిని సవరించడం చట్టవ్యతిరేకమే కాక ప్రమాదకరం కూడా అని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి లిఖిత పూర్వకంగా తెలియజేశారు. పిల్లల మౌనాన్ని, భావోద్వేగాలను ఆసరాగా చేసుకొని లైంగిక దురాగతాలకు పాల్పడే వారిని ఈ పరిమితి కట్టడి చేస్తుందని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. వయోపరిమితిని తగ్గిస్తే అదే సాకుగా పిల్లల అక్రమ రవాణా, బాలలపై జరిగే నేరాలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతాయని అభిప్రాయపడింది.

త్వరలో భారత్‌కు పుతిన్



మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌కు రానున్నారు. ఈ ఏడాది చివర్లో ఆయన పర్యటన ఉండనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన తేదీల ఖరారుపై కసరత్తు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ వెల్లడించారు. రష్యా పర్యటనలో ఉన్న డోభాల్.. గురువారం రష్యా భద్రతామండలి కార్యదర్శి సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. మరోవైపు పుతిన్‌తోనూ డోభాల్ సమావేశమయ్యారు.

★ బ్రెజిల్ అధ్యక్షుడు లుయిజ్ ఇనాసియో లులా డసిల్వా గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో సంభాషించారు. భారత్‌పై అమెరికా సుంకాల భారం మోపిన వేళ మోదీతో బ్రెజిల్ అధ్యక్షుడు సంభాషించడం గమనార్హం.

ఆ మూడు.. మూలస్తంభాలు



ఆరోగ్యం, సంపద, సమయం..
జీవితంలో విజయవంతమయ్యేందుకు
ఇవి మూడూ మూలస్తంభాలుగా
పనిచేస్తాయి. అయితే చాలామంది
సంపదను పెంచుకునే ప్రయత్నంలో
ఆరోగ్యాన్ని నాశనం
చేసుకుంటున్నారు. ఎంతటి
ధనవంతులైనాసరే..
ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు దాన్ని తిరిగి
పొందడం కోసం తమ యావత్
సంపదను వదులుకునేందుకూ
వెనకాడరని గ్రహించండి.

– కార్ల్ మాట్ బటన్, ఫిట్‌నెస్ కోచ్


ఉప రాష్ట్రపతి ఎన్నిక షురూ

దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ వెలువరించింది. తొలిరోజు వచ్చిన 3 నామినేషన్లు సక్రమంగా లేవని తిరస్కరించారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఈ పదవి ఖాళీ అయింది.

నామినేషన్లకు తుది గడువు	:	ఆగస్టు 21
పరిశీలన	:	ఆగస్టు 22
ఉపసంహరణకు గడువు	:	ఆగస్టు 25
పోలింగు తేదీ	:	సెప్టెంబరు 9

★ ఉప రాష్ట్రపతి ఎన్డీయే అభ్యర్థిగా ఎవరికి అవకాశం ఇవ్వాలనేది నిర్ణయించే అధికారాన్ని ప్రధాని మోదీ, రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డాలకు అప్పగిస్తూ కూటమి తీర్మానించింది.

ఈడీ దుండగుడు కావొద్దు



దిల్లీ: చట్ట పరిమితులకు లోబడి ఈడీ పనిచేయాలే తప్ప దుండగుడిలా ప్రవర్తించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ సంస్థ చేపట్టిన కేసుల్లో నేర నిరూపణ శాతం తక్కువగా ఉన్న విషయాన్ని ఎత్తిచూపింది. ఈడీ ప్రతిష్ఠ దిగజారుతోందని తామూ ఆందోళన చెందుతున్నట్టు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద అరెస్టు చేయడానికి, ఆస్తుల జప్తునకు ఈడీకి అధికారం ఉందంటూ 2022లో వెలువడిన తీర్పుపై సమీక్ష పిటిషన్లను గురువారం విచారణకు చేపడుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

సవతి తల్లీ.. మాతృమూర్తే

దిల్లీ: కుటుంబ పెన్షన్‌తో సహా సామాజిక సంక్షేమ పథకాల అమలులో తల్లి అనే నిర్వచనాన్ని ఉదారంగా సవరించి సవతి తల్లిని తల్లిగానే పరిగణించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు నిబంధనల్ని సరళీకరించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం సూచించింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తల్లి అతడి చిన్నతనంలోనే చనిపోయింది. సవతి తల్లి అతడిని పెంచింది. పెద్దయ్యాక వాయుసేనలో పనిచేస్తూ ఆ కుమారుడు ప్రాణాలు కోల్పోగా సవతి తల్లికి కుటుంబ పెన్షన్ ఇచ్చేందుకు సాయుధ దళాల ట్రైబ్యునల్ నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని ఆమె సుప్రీంలో సవాల్ చేశారు.





సైనికుల సాయంతో దేహ్రాదూన్ విమానాశ్రయానికి చేరుకొంటున్న పర్యాటకులు
★ ధరాలి వరదల్లో చిక్కుకొన్న వృద్ధురాలిని ఉత్తరకాశీ హెలిప్యాడ్ వద్దకు చేరుస్తున్న సిబ్బంది

ఉత్తర కాశీలో ఉద్ధృతంగా

వరద సహాయక చర్యలు

దేహ్రాదూన్: వరద బీభత్సంతో విలవిల్లాడిన ఉత్తర కాశీ ప్రాంతంలో, ముఖ్యంగా ధరాలీ గ్రామంలో సహాయ పునరావాస కార్యక్రమాలు గురువారం ఊపందుకున్నాయి. ప్రకృతి విపత్తు కారణంగా వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 275 మందికిపైగా పర్యాటకుల్ని వాతావరణం మెరుగు పడటంతో వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆకస్మిక వరద బారిన పడిన 50 మంది పౌరులతోపాటు 9 మంది సైనిక సిబ్బంది జాడ ఇంతవరకూ తెలియలేదని సైన్యం వెల్లడించింది. జాడ తెలియనివారి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గత మంగళవారం మధ్యాహ్నం సంభవించిన ఆకస్మిక వరదలో నలుగురు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఇందులో ఇద్దరి మృతదేహాలు ఇప్పటి వరకూ లభ్యమయ్యాయి. మరోవైపు గంగోత్రిలో చిక్కుకుపోయిన పర్యాటకులకు సైన్యం, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు, తదితర బలగాలు సంయుక్తంగా ఆహారం, వసతి, వైద్య సదుపాయాలు కల్పించాయని అధికారిక ప్రకటన తెలియజేసింది. ఇలా చిక్కుకు పోయిన వారిలో తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, యూపీ, తదితర రాష్ట్రాలకు చెందినవారున్నారు.

త్వరలో గాజా యుద్ధానికి ముగింపు: నెతన్యాహు



జెరూసలెం: గాజాను ఆక్రమించే, స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. యుద్ధానికి త్వరలో ముగింపు పలుకుతామని స్పష్టం చేశారు. గాజా పాలనను తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పారు. 'గాజాను పాలస్తీనా అథారిటీకిగానీ, హమాస్‌కు గానీ అప్పగించం. హమాస్ తన ఆయుధాలను అప్పగిస్తే యుద్ధం వెంటనే ఆగిపోతుంది' అని తెలిపారు. గురువారం ఆయన భారత్‌కు చెందిన జర్నలిస్టులతో మాట్లాడారు. ఈ సందర్భంగా త్వరలో భారత్‌లో పర్యటించాలన్న ఆసక్తిని నెతన్యాహు వ్యక్తపరిచారు. అమెరికా సుంకాలపైనా స్పందించారు. ఇరు దేశాలు తమ సంబంధాలను దృష్టిలో ఉంచుకొని సుంకాల సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఉగ్రవాదం విషయంలో భారత్‌తో కలిసి పనిచేస్తామని, నిఘా సమాచారాన్ని పంచుకుంటామని చెప్పారు. ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జె.పి.సింగ్‌తోనూ నెతన్యాహు సమావేశమయ్యారు. ఈ భేటీలో ద్వైపాక్షిక సంబంధాలు చర్చకు వచ్చాయని, ముఖ్యంగా ఆర్థిక, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

17 నుంచి రాహుల్ మత్‌దాతా అధికార్ యాత్ర

పట్నా: త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఈ నెల 17 నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 15 రోజుల పాటు 'మత్‌దాతా అధికార్ యాత్ర' చేపట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో అక్రమాల ఆరోపణలపై ముమ్మర ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బీపీసీసీ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ ప్రకటించారు. ఇదిలా ఉండగా ఎస్ఐఆర్‌లో ఓట్లను తొలగించారన్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోపణలను ఈసీ ఖండించింది.

చతుర్విధ సాగుతో సత్ఫలితం

- స్వామినాథన్ శత జయంతి సదస్సులో ప్రధాని మోదీ పిలుపు



ఎం.ఎస్.స్వామినాథన్ శత జయంతి అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీతో ఎంఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సౌమ్యా స్వామినాథన్, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు

దిల్లీ: భారత వ్యవసాయ రంగంలో చతుర్విధ లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పోషకాహార భద్రత, పంటల్లో భిన్నత్వం, వాతావరణాన్ని తట్టుకునే పంటలు, టెక్నాలజీలు ఈ నాలుగు లక్ష్యాలని పేర్కొన్నారు. హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం దిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామినాథన్‌కు నివాళిగా ప్రత్యేక నాణేన్ని, పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. అనంతరం ప్రసంగించారు. 'వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధను, మెషీన్ లెర్నింగ్‌ను ఉపయోగించుకుని కరవును, వేడిని, వరదలను తట్టుకునే పంటలను అభివృద్ధి చేయాలి. రియల్ టైమ్‌లో నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. దీనిని ప్రతి జిల్లాలో అందుబాటులోకి తేవాలి. తద్వారా పంటల దిగుబడిని, తెగుళ్ల నివారణను, సాగు విధానాలను పర్యవేక్షించాలి. పంటల మార్పిడిపై పరిశోధనలు జరగాలి. భూములకు సరిపడే పంటలను నిర్ణయించాలి. సౌర విద్యుత్తు ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలి' అని మోదీ పిలుపునిచ్చారు. దేశ వ్యవసాయ రంగానికి దివంగత స్వామినాథన్ చేసిన కృషిని ప్రధాని కొనియాడారు. ఆయన మన దేశానికి ఓ రత్నం లాంటి వారని పేర్కొన్నారు. 'ఎంఎస్ స్వామినాథన్ భారత మాతకు నిజమైన పుత్రుడు. ఆయన విజ్ఞానాన్ని ప్రజా సేవకు మాధ్యమంగా మార్చారు. దేశ ఆహార భద్రతను తన జీవిత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఆలోచనలు నేటి వ్యవసాయ రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

వచ్చే వారం ట్రంప్‌తో పుతిన్ భేటీ!

మాస్కో: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చే వారం భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పుతిన్ గురువారం ప్రకటించారు. ఈ సమావేశానికి యూఏఈ వేదిక కావొచ్చని ఆయన పేర్కొన్నారు. మూడేళ్లుగా ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధానికి ముగింపు పలికే దిశగా పురోగతి చూపడానికి రష్యాకు ట్రంప్ మూడు రోజులు గడువిచ్చిన నేపథ్యంలో పుతిన్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ భేటీలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొంటారన్న వార్తలను పుతిన్ విదేశాంగ సలహాదారు యూరి ఉషాకోవ్ ఖండించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పుతిన్‌తో సమావేశం జరగడం ఇదే తొలిసారి అవుతుంది.

మరోసారి అమెరికా పర్యటనకు పాక్ ఆర్మీ చీఫ్!

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ఈ వారంలో అమెరికా వెళ్లే అవకాశమున్నట్లు గురువారం పలు మీడియా కథనాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆయన అమెరికా వెళ్లడం ఇది రెండోసారి. జూన్‌లో ఐదు రోజుల అమెరికా పర్యటనలో అసీం మునీర్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి చమురు ఒప్పందం సహా పలు రంగాల్లో అమెరికా-పాకిస్థాన్ సహకారం గురించి చర్చించారు.

పాఠ్యాంశాల్లో ఫిర్యాదులపై ఎన్‌సీఈఆర్‌టీ కమిటీ

దిల్లీ: నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా రూపొందించిన పాఠ్య పుస్తకాలకు సంబంధించిన ప్రజాభిప్రాయాలను పరిశీలించడానికి ఎన్‌సీఈఆర్‌టీ ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఫిర్యాదులు, సూచనల్ని ఈ కమిటీ విశ్లేషించి వీలైనంత త్వరగా నివేదిక సమర్పిస్తుంది. పాఠ్య పుస్తకాలకు సంబంధించిన సలహాలు సూచనలు, ఫిర్యాదులు పెద్దసంఖ్యలో అందినప్పుడు వాటిని పరిశీలించేందుకు కమిటీని నియమించడం ఎన్‌సీఈఆర్‌టీ ఆనవాయితీగా పాటిస్తోంది. ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో ప్రచురించిన ఒక పాఠంలో మొగల్ పాలకులైన అక్బర్, బాబర్, ఔరంగజేబులను గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

సూచనలిచ్చే వ్యవస్థల ఏర్పాటు

మరోవైపు- ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వృత్తిపరమైన సూచనలు అందించేందుకు, వారి మానసిక పరిపుష్టికి సీబీఎస్‌ఈ రెండు ప్రత్యేక వ్యవస్థల్ని ఏర్పాటు చేసింది. వృత్తిపరమైన సలహా సూచనల కోసం "కెరీర్ గైడెన్స్ డ్యాష్ బోర్డు", విద్యార్థులకు మానసిక మార్గదర్శనం చేసే "కౌన్సెలింగ్ హబ్- స్పోక్ మోడల్"లను సంస్థ ఛైర్మన్ రాహుల్ సింగ్ ప్రారంభించారు.

విదేశాంగ విధానం విఫలం: కాంగ్రెస్



దిల్లీ: భారత్‌పై 50 శాతం ప్రతీకార సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం మన విదేశాంగ విధానాల వైఫల్యానికి అద్దం పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ పరిణామాలను ఎలా ఎదుర్కోవాలో మోదీ ప్రభుత్వానికి తెలియదని దుయ్యబట్టారు. ఎన్నో నెలలుగా చర్చలు జరుగుతున్నా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని విమర్శించారు. సుంకాల విషయంలో దేశ ప్రయోజనాలే ముఖ్యమని గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. 'ప్రతీకార సుంకాలు విధిస్తానని ట్రంప్ చాలా నెలల నుంచే హెచ్చరిస్తూ వస్తున్నారు. ఈ విషయం మనందరికీ తెలుసు. అయినప్పటికీ వ్యవసాయం, చిన్న పరిశ్రమలపై సుంకాల ప్రభావాన్ని నివారించడానికి మీ (మోదీ) ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మీ మంత్రులు కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారు. వారిలో కొంతమంది కొన్ని రోజులు వాషింగ్టన్‌లో మంతనాలు జరిపారు. అయినా మీ విధానాలు విఫలమయ్యాయి. ఇప్పుడు ట్రంప్ మనల్ని బెదిరిస్తున్నారు. కానీ మీరు మౌనంగా కూర్చున్నారు' అని ఖర్గే ధ్వజమెత్తారు.

● భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపైనా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

దిల్లీ: కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఓట్ల అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమర్థించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవలసిన సమయం వచ్చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో పలు దేశాలు శిక్షణ కోరిన దశ నుంచి మన ఎన్నికల సంఘం అధికార పార్టీ ప్రతినిధిగా వ్యవహరించే స్థాయికి దిగజారిపోయిందని గురువారం 'ఎక్స్'లో విమర్శించారు.

దర్యాప్తు జరపాలి: కపిల్ సిబల్

ఎన్నికల భారీ అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చిన రాహుల్ గాంధీ నిజమైన దేశభక్తుడంటూ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ గురువారం ప్రశంసలు కురిపించారు. ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా మారిపోతోందంటూ విమర్శించారు. రాహుల్ చేసిన ఆరోపణలపై తగు దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆరోపణలు అశాస్త్రీయం: ప్రహ్లాద్ జోషి

ఎన్నికల కమిషన్, బిహార్ ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు అశాస్త్రీయమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం తప్పుపట్టారు. ఓట్ల కోసం సమాజంలోని కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని పీటీఐ వీడియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారాలపై పార్లమెంటు చర్చించజాలదని లోక్‌సభ మాజీ స్పీకర్ బలరాం జాఖడ్ రూలింగ్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

6 నెలలు అధ్యయనం చేశాం

నకిలీ ఓటర్ల సమాచారంపై సిద్ధరామయ్య

బెంగళూరు: నకిలీ ఓటర్ల దందాపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు కేంద్ర లోక్‌సభ నియోజకవర్గంలోని మహదేవపుర సెగ్మెంట్లో నకిలీ ఓటర్ల దందాపై రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సమీక్ష చేపట్టామని వివరించారు. ఆరు నెలల పాటు చేసిన ఈ అధ్యయనంలో నకిలీ ఓటర్ల సమాచారాన్ని సమగ్రంగా సేకరించినట్లు వెల్లడించారు. ఈ పరిధిలో మూడు లక్షల మంది ఓటర్లుండగా భాజపా అభ్యర్థి 1,00,250 ఓట్లు అక్రమంగా పొందారని ఆరోపించారు. ఒకే ఓటరు నాలుగుసార్లు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటేయటం, 40,009 మంది నకిలీ ఓటర్లు తప్పుడు చిరునామాతో ఈ క్షేత్ర జాబితాలో నమోదు కావడం. . వీరి చిరునామాలో అర్థం కాని ఆంగ్ల పదాలు ముద్రించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే చిరునామాలో 10,452 మంది ఉన్నట్లు చూపడమేంటని ప్రశ్నించారు.

వసుంధర

vasundhara@eenadu.net

తెలుగుదనం ఉట్టిపడే కట్టుబొట్టు, శ్రావ్యమైన స్వరం, ప్రశాంతమైన మోము... ఆ అక్కాచెల్లెళ్లను చూస్తే ఎవరికైనా ఇవే గుర్తొస్తాయి. 'సుమనస వందిత సుందరి మాధవి...' అంటూ అష్టలక్ష్మీస్తోత్రం ఆలపిస్తుంటే మనసు భక్తి పారవశ్యంలో మునిగిపోవాల్సిందే. వాళ్లే వాసుకూరి శ్రీసూర్య హిమజ, సుప్రజలు. వారి ప్రయాణం అక్క హిమజ మాటల్లో...



సుప్రజ, హిమజ

ఆ ప్రశంసలే ప్రేరణ...


మాది తణుకు. అమ్మ శ్రీసూర్య లక్ష్మి, తెలుగు టీచర్. సంగీతంలో డిప్లొమా చేశారు. నాన్న వీవీవీ సత్యనారాయణ వ్యాపారం చేస్తారు. నాకూ, చెల్లికీ చిన్నప్పటి నుంచి అమ్మే సంగీతం నేర్పించింది. అయితే, అటు టీచింగ్, ఇటు సంగీతం... రెండూ కష్టమవటంతో బయట టీచర్ దగ్గర నేర్చుకున్నాం. ఇంటినుంచి స్కూలుకీ, మ్యూజిక్ క్లాసుకీ చాలా దూరం ఉండేది. అమ్మ, నేను, చెల్లి... ముగ్గురం ఒకే స్కూల్. నాన్న మా ముగ్గురినీ స్కూల్ దగ్గర దింపటం, తీసుకురావటం, మళ్లీ సాయంత్రం మా ఇద్దర్నీ మ్యూజిక్ క్లాసుకి పంపి, తీసుకురావటం ఎంతో ఓపిగ్గా చేసేవారు. ఎక్కడ ఏ వర్క్‌షాప్‌లు జరిగినా అసలు మిస్ కానివ్వరు. అలా అమ్మానాన్నల ప్రోత్సాహంతో సంగీతంతో పాటు కూచిపూడి నృత్యం, వయొలిన్‌లను నేర్చుకోగలిగాం. చెల్లి, నేను కలిసే పాడుతున్నాం. కర్ణాటక సంగీతంలో 'పేరిందిన ప్రియా సిస్టర్స్' మాకు స్ఫూర్తి. అందరు అక్కాచెల్లెళ్లలానే మేమూ కొట్టుకుంటాం, కానీ, సారీ చెప్పుకోం. నాకు మాత్రం ఎప్పుడూ చెల్లి పక్కనే ఉండాలి. తనే నా ధైర్యం. తనలా నన్ను ఇంకెవరూ అర్థం చేసుకోలేరని నా ఫీలింగ్. తణుకు విమెన్స్ కాలేజీలో బీఎస్సీ పూర్తిచేశా. చెల్లి ప్రస్తుతం బెంగళూరులో మామయ్య వాళ్ల దగ్గర ఉండి డిగ్రీ చేస్తోంది. తనను వదిలి ఉండాలనిపించలేదు. అందుకే, నేనూ అక్కడికే వెళ్లా.

'తణుకు సిస్టర్స్'గా...

ఓసారి గుళ్లో వ్రతం జరుగుతుంటే పాడటానికి మమ్మల్ని ఆహ్వానించారు నిర్వాహకులు. అక్కడికి తిరుపతి నాదార్చన బృందం వచ్చింది. వారిలో ఒకరు మా పాట విని 'మీకు మంచి భవిష్యత్తు ఉంటుంది. మంచి అవకాశాలు వస్తాయి' అంటూ 'తణుకు సిస్టర్స్'గా పేరు పెట్టారు. ఆ పేరుతోనే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లనూ కొనసాగిస్తున్నాం. మొదట వాటిలో ఆడియో సాంగ్స్‌ని అప్‌లోడ్ చేసేవాళ్లం. కానీ, ఆ తరవాత మా అత్తయ్య సలహాతో మేమూ కూడా కనిపించేలా వీడియోలను రూపొందించాం. ఇందుకు సంబంధించిన పనులన్నీ మామయ్య చూసుకునేవారు. నిజానికి ఏదో యాక్టివిటీలా ఉంటుందని సరదాగా సామాజిక మాధ్యమాల్లోకి ప్రవేశించాం. కానీ, అందరికీ మా పాటలు నచ్చటం, ప్రశంసించటం... ఊహించలేదు. అందరూ 'మీ పాటలు వింటుంటే ప్రశాంతంగా ఉంటుంది. మీ తల్లిదండ్రులు అదృష్టవంతులు' అని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. అదే మాకు ప్రేరణ కూడా. గతేడాది విజయదశమికి విడుదల చేసిన అయిగిరి నందిని, కాలభైరవాష్టకం, అష్టలక్ష్మీ స్తోత్రం... వంటి వీడియోలు మంచి ఆదరణ పొందాయి. రాష్ట్రస్థాయి అన్నమాచార్య పోటీలు, త్యాగరాజ ఆరాధనోత్సవాలు... వంటి ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని అవకాశాల్ని దక్కించుకున్నాం. భవిష్యత్తులో ఎంఏ మ్యూజిక్ చేయాలనుకుంటున్నాం. మేం ఏ వృత్తిలో ఉన్నా, పాటను మాత్రం వదలం.

అనుబంధాల సందేశం
వరలక్ష్మీ వ్రతం

చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగమైనా... కూర్చొనేది కంప్యూటర్ ముందైనా... శ్రావణంలో యువతులో సంప్రదాయ స్పృహ మేల్కొంటుంది. కట్టుబొట్టులో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది. బాధ్యతలు, ఒత్తిడి దాటి మనసు పూజాదివైపు మళ్లుతుంది. ముఖ్యంగా శ్రావణ పూర్ణిమకు ముందొచ్చే వరలక్ష్మీ వ్రతం మహిళల జీవితాల్లో సరికొత్త శోభనూ, ఉత్సాహాన్నీ నింపుతుంది.



అష్టలక్ష్ముల్లో వరలక్ష్మి విశిష్టమైన దేవత. 'వర' అంటేనే శ్రేష్ఠమైన అని అర్థం. మనం అందరిలో ఉత్తమమైన వారిగా ఎదగాలి, శ్రేష్ఠమైనదే పొందాలని అమ్మవారు ఇలా తన పేరు ద్వారా తెలియజేస్తారని చెబుతారు. అయితే సిరిసంపదలు, హోదాల్లో కాదు, వ్యక్తిత్వంలో శ్రేష్ఠ స్త్రీలా చేరుకోవాలని హితవు పలుకుతుంది. లక్ష్మీదేవిని చంద్రుని సోదరి అనీ, ఆయన నుంచి పుణికిపుచ్చుకున్న ప్రసన్నత ఆమె ప్రధాన లక్షణమనీ పురాణాలు అమ్మవారిని వర్ణించాయి. ఆ దేవి నుంచి మనం అలవరచుకోవాల్సిన గొప్పగుణం 'ప్రసన్నత'. సౌమ్యత్వం ఉన్నచోట వరలక్ష్మి స్థిరనివాసం ఉంటుందని చెబుతారు. కాబట్టి, ప్రతి మగువా తొలుత ప్రసన్న వదనంతో సంసిద్ధం కావాలి. చల్లని మనసు, చిరునవ్వులు విరిసే ముఖంతో వ్రతం చేస్తే, అన్ని ఆభరణాలూ అలంకరించినట్లుగానే అమ్మవారు భావిస్తారట.

'చారుమతి' ఏం చెబుతోందంటే...

వరలక్ష్మీ వ్రతాన్ని చారుమతి అనే స్త్రీ పరిచయం చేసిందంటారు. ఆమెది సనాతన కాలమైనా అధునాతన స్త్రీలకు ఏమాత్రం తీసిపోదు. లక్ష్మీదేవి కలలో కనిపించి వ్రతం చేయమనగానే 'నాకే అన్ని వరాలు దక్కా'లని స్వార్థబుద్ధితో ఆలోచించలేదు. ఇరుగుపొరుగు వారినీ భాగస్వాముల్ని చేసి... శుభాన్ని పెంచేదేదైనా నలుగురితో పంచుకోవాలని చెప్పకనే చెప్పింది. తన, పర భేదాల్లేకుండా అన్ని వర్గాల వాళ్లనీ వ్రతానికి ఆహ్వానించింది. అలంకరణ దగ్గర నుంచి అన్ని విషయాల్లోనూ నిరాడంబరతనే ప్రదర్శించింది. ఆడంబరాల కన్నా ఆత్మీయతలకు ప్రాధాన్యమిస్తే ఏ అనుబంధమైనా కలకాలం నిలుస్తుందని చారుమతి వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించిన తీరు బట్టి అర్థమవుతుంది. సామూహికంగా చేసుకునే కార్యక్రమాలతో సమైక్య భావం పెరుగుతుందని నిరూపించింది.

వాయనాల్లో విశేషాలు...

భారతీయ ఆచార వ్యవహారాల్లో కనిపించే అరుదైన దృశ్యం వాయనాలు. 'ఇస్తినమ్మ వాయనం' అంటూ పుచ్చుకొంటినమ్మ వాయనం'మంటూ మంగళకరమైన వస్తువుల్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా ఇతరులతో పంచుకునే స్వభావం అలవాటవుతుంది. పైగా వ్రతం రోజు ఎదురుగా నిలుచున్న స్నేహితురాల్ని సాక్షాత్తూ వరలక్ష్మీదేవిగా భావిస్తారు. దీంతో మనసులో మనకు ఆ వ్యక్తిపై గౌరవభావం పెరుగుతుంది. అప్పటివరకూ ఆమెతో ఉన్న చిన్నచిన్న అభిప్రాయభేదాలూ తొలగిపోతాయి. ఆధునిక వ్యక్తిత్వ వికాస సూత్రాలు సూచించే, మనస్పర్థలు తొలగించే సూత్రమిది. సామాజికంగా ఆత్మన్యూనతతో మగ్గిపోతున్న స్త్రీలు ఈ వ్రతాల వల్ల, అలాంటి మానసిక స్థితి నుంచి బయటపడతారు. ఆత్మవిశ్వాసం పెరిగి, ముందుకు సాగుతారు.

కుటుంబంలో కళాకాంతులు...

మగువలు చేసుకునే వ్రతాలు, నోముల ప్రభావం కుటుంబం అంతటిపైనా పడుతుంది. ఆమె ఆచారాలు భర్త, పిల్లల దినచర్యల్లో మార్పులు తెస్తాయి. ఇంటి వాతావరణాన్ని మార్చేస్తాయి. బద్ధకం, అలసత్వం వంటి తమోగుణాలు తొలగి, సాత్విక భావనలు ప్రేరేపితం అవుతాయి. ఇంట్లో కళాకాంతులు ప్రసరిస్తాయి. చారుమతిని అనుగ్రహిస్తూ 'వ్రతాన్ని నియమనిష్ఠలతో పూర్తి చేస్తే నీ ఇంట్లో సిరిసంపదలు కురుస్తాయి' అని ఆశీర్వదించిందట వరలక్ష్మీదేవి. కుటుంబ బాంధవ్యాలు, సామాజిక సంబంధాలు మెరుగుపడటం కన్నా సిరిసంపదలు, శుభపరిణామాలు ఏముంటాయి? అందుకే ఈ వరలక్ష్మీదేవిని ఆరాధించి ఆమె అనుగ్రహానికి పాత్రులమవుదాం!

- మనోజ్ఞ

పిల్లల కోసం బ్రేక్ తీసుకున్నాక తిరిగి వచ్చి కెరియర్‌లో రాణించగలనా లేదా అనే సంశయంలో పడతారు మహిళలు. ఆ సమయంలో వాళ్లకి తగిన ప్రోత్సాహం, మార్గనిర్దేశం, శిక్షణ అందిస్తే తిరిగి నిలదొక్కుకుంటారు. మా దగ్గర ఇలా తిరిగి వచ్చిన వారికి ఒకరిని తోడుగా నియమిస్తాం. ఇంటర్నేషనల్ విమెన్ ఇన్ లీడర్‌షిప్, అడ్వాన్సింగ్ విమెన్ ఇన్ టెక్ లాంటి కార్యక్రమాల్లో భాగం చేస్తాం. వీటివల్ల ఇప్పుడు నాయకత్వ స్థానాల్లో మహిళలు ఎక్కువగా కనిపిస్తున్నారు.



- జయా జగదీష్, కంట్రీ హెడ్, ఏఎమ్‌డీ ఇండియా

ఏదీ వృథా కాదు ఇలా చేస్తే..!

పూజకి నిండుదనం... ఇంటికి ఆధ్యాత్మిక శోభ తెచ్చే వాటిల్లో పువ్వులు ఒకటి. ఎంత అంచనాగా తెచ్చుకున్నా... ఎన్నో కొన్ని మిగిలిపోతూనే ఉంటాయి. అదీకాక, పూజలోనూ వీటి వాడకం ఎక్కువే. అంతా అయ్యాక... వాటిని నీళ్లలోనో, మొక్కల్లోనో వేస్తాం. ఈ రెండూ పర్యావరణానికి చేటే... ఈసారి ఇలా ప్రయత్నించి చూడండి.





- పూలని బాగా ఎండబెట్టి, పొడి చేయండి. దానికి కాస్త గుగ్గిలం, మల్లె, లావెండర్, గులాబీ లాంటి నేచురల్ ఆయిల్స్‌లో నచ్చినదాన్ని రెండు మూడు చుక్కలు కలిపితే సరి. ధూప్‌స్టిక్స్‌గా మనకు కావాల్సిన ఆకారంలో చేసుకుంటే... రోజూ ఇంట్లో వెలిగించుకోవచ్చు.
- కొంచెం పొడిని వేడి నీళ్లలో వేసి... రూమ్ స్ప్రేగానూ వాడుకోవచ్చు. బయట దొరికే వాటికంటే మేలు. ముఖ్యంగా వానాకాలంలో ఇల్లంతా చెమ్మగా, చికాకుగా ఉంటుంది కదా... అలాంటప్పుడు దీన్ని స్ప్రే చేస్తే సువాసనలు వెదజల్లుతాయి.
- చామంతులు, గులాబీ లాంటి పువ్వుల్ని... వేరు చేసి, బాగా ఎండబెట్టి కాటన్ వస్త్రంలో చుట్టి టీ-బ్యాగులుగా తయారుచేసుకుంటే... ఎప్పుడు కావాలంటే అప్పుడు చామంతి, గులాబీ టీలని తాగొచ్చు.
- వీటిని పొడి చేసుకుని దాచుకుంటే... అవసరమైనప్పుడు మిశ్రమంగా కలిపి ముఖానికి పూతలా వేసుకోవచ్చు. వేడి నీటిలో కలిపి ముఖానికి స్ప్రే చేసుకున్నా తాజాదనం వస్తుంది.
- ఈ పొడిని కాటన్ వస్త్రాల్లో చుట్టి... అల్మారాలు, బీరువాల్లో పెడితే చెదల సమస్య ఉండదు. దుస్తులకు పరిమళాల్నీ ఇస్తాయి.

అంతేనా పసుపు, కుంకుమలు ఎక్కువైనప్పుడు వాటిని మరుసటి రోజు కాస్త ఎండబెట్టి, నిల్వ చేసుకుంటే తర్వాత పూజలకూ వాడుకోవచ్చు. శనగలు కాటన్ వస్త్రంలో చుట్టి పెడితే... మొలకలు వచ్చి మంచి ప్రొటీన్ ఫుడ్ తయారవుతుంది. ఉడకబెట్టుకుని తిన్నా మంచిదే. ఆలోచించాలే కానీ ఎన్ని ఉపాయాలో! వీటిని పాటిస్తూ వృథాకు అడ్డుకట్ట వేస్తారు కదూ!

నడుస్తూ... ఫోన్ చూస్తే!



వ్యాయామమంటే మనకు ఎక్కువగా గుర్తొచ్చేది నడకే! ఉదయమో, సాయంత్రమో అలా చల్లగాలికి నడుస్తూ ఉంటే మనసూ తేలిక పడుతుంది. పిల్లల చదువులు, పనులు, ఆఫీసు... ఏవైతేనేం వేళలు సరిపోకపోతే ఆడవాళ్లకు తోడు దొరకడం కష్టమే. అలాంటప్పుడు ఒంటరిగా నడవక తప్పదు. బోర్ కొట్టడం సాధారణమే కదూ! అందుకే పాటలను ఆశ్రయిస్తుంటాం. వింటూ నడిస్తే సరే కానీ... వీడియోలు, రీల్స్ చూస్తూ నడవట్లేదు కదా? ఇది మీ పోశ్చర్‌ని దెబ్బతీస్తుంది. దీంతో మీరు కోరుకున్న ఆరోగ్య ప్రయోజనాలు అందకపోగా మెడ, నడుము నొప్పుల బారిన పడతారు. అంతేనా, కార్టిసాల్ హార్మోను విడుదల పెరిగి, ఒత్తిడి పెరగడం అదనం. ఇవే కాదు, ఫోన్ ధ్యాసలో పడితే చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఏం గమనిస్తాం? పొరపాటున చూసుకోకపోతే ఏదైనా తగిలి కింద పడిపోయే ప్రమాదం ఉంది. గాయాల పాలూ అవొచ్చు. ఎవరైనా దాడి చేసినా, మెడలో నగలు, చేతిలో మొబైల్ ఇలా ఏది లాక్కుని పోయినా గమనించుకోం. చూశారా... లేనిపోని సమస్యలు, నష్టాలే. అరగంటో, గంటో... అంతేగా! చక్కగా ఫోన్ పక్కన పెట్టేయండి. ప్రకృతిని ఆస్వాదిస్తూ నడిచేయండి. శారీరకంగా మానసికంగా అప్పుడే లాభం.

ఫ్యాషన్ ఫ్యాషన్

పరికిణీ... ఓణీ...
జత కుదిరింది!







పెళ్లి వేడుకంటే ఒకప్పుడు యువతులంతా లంగా ఓణీల్లో సిద్ధమైపోయేవారు. అసలు మండపంలో సందడంతా వాళ్లదే. అది చూసి 'ఎవరండీ ఆ అమ్మాయి' అంటూ ఆరాలూ మొదలయ్యేవి. పెళ్లి కాని అమ్మాయిలకే పరికిణీ ఓణీ అన్న ముద్ర ఉండేది. మరి ఇప్పుడో? వయసు భేదాలే లేవు. ముఖ్యంగా వధువుల బ్రైడల్ అటైర్‌ల్లో ఒక్కటైనా పరికిణీ ఓణీ ఉండాల్సిందే! పెళ్లి కూతురుని చేసేటప్పుడో, మెహందీ సమయంలోనూ లేదంటే రిసెప్షన్‌లో అయినా ఇది లేనిదే వేడుకకి కళ రాదని భావిస్తున్నారు కూడా. సమస్యల్లా ఏది ఎంచుకోవాలనే? పరికిణీ- ఓణీ అనగానే సరిపోయిందా! పట్టు పరికిణీనా ఫ్యాన్సీదా? ఓణీలు మాత్రం తక్కువా? ఎంబ్రాయిడరీ, సిల్క్, కాంట్రాస్ట్, పట్టు, నెట్... జాబితా రాయాలే కానీ ఆప్షన్లు బోలెడు. ఎన్ని ఉన్నా తమకంటూ ప్రత్యేకత ఉండాలనుకుంటున్నారు నేటి వధువులు. వాళ్ల మనసు పడుతోంది దేని మీదో తెలుసా? ప్రతి కొన్నేళ్లకీ ఫ్యాషన్ చక్రం వెనక్కి తిరుగుతుంది అంటుంటారు ఫ్యాషనిస్టులు. అంటే... గత డిజైన్లే తిరిగి తెరమీదకి వస్తాయన్నమాట. ఒకప్పుడు అంచున్న పట్టు పరికిణీ, అదే విధంగా ఉండే బ్లవుజు, రంగు వేరైనా అంచుతో కూడిన ఓణీ... మహాలక్ష్ముల్లా ఉండేవారంటే కాదనగలమా? అదే అందాల్ని కోరుకుంటున్నారు నేటి వధువులు. పెద్ద అంచున్న పట్టు పరికిణీలూ అదే అంచుతో ఓణీలను ధరించేస్తున్నారు. ఆధునికత కోసం కాంట్రాస్ట్ రంగులు, లేసులు వంటివి జోడిస్తూ మోడరన్ మహాలక్ష్ములు అనిపించేసుకుంటున్నారు. భలేగున్నాయి కదూ! మీకూ నచ్చాయా? ఇంకేం ప్రయత్నించేయండి మరి!

మీకు తెలుసా?

శిశువుల ఎదుగుదలకు స్పర్శ(టచ్) చాలా ముఖ్యం. ఇది వారి శారీరక, మానసిక, సామాజిక బంధాలపై సానుకూల ప్రభావం చూపిస్తుందట. పిల్లల శరీర ఉష్ణోగ్రతను నియంత్రించటంలోనూ, ఆరోగ్యకరమైన బరువు పెరగటంలోనూ, అనుబంధం ఏర్పరచుకోవటంలోనూ కీలకపాత్ర పోషిస్తుందట.



సమాధానం చెప్పలేకపోతున్నా!

నా చిన్నప్పుడే నాన్న చనిపోయారు. అమ్మే ఉద్యోగం చేస్తూ నన్ను పెంచుతోంది. నేనిప్పుడు ఇంటర్ చదువుతున్నా. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే అమ్మ సహోద్యోగి ఒకరు సాయం చేస్తుంటారు. ఆయన తరచూ మా ఇంటి దగ్గర కనిపిస్తోంటే స్నేహితులు, పక్కింటివాళ్లు ఎవరని అడుగుతున్నారు. నాకు సమాధానం చెప్పడం ఇబ్బంది అవుతోంది. అమ్మతో మాట్లాడనా?

– ఓ సోదరి

నాన్న లేకపోయినా అమ్మ కష్టపడి నిన్ను చదివిస్తోంది. అందుకు ముందు ఆమెను అభినందించాలి. చాలామందికి నీలా అవకాశం ఉండదు. ఆవిడకు తన సహోద్యోగి సాయంగా ఉండటాన్ని సానుకూలంగా తీసుకోవాలి. అమ్మ మీద నమ్మకం, తన వ్యక్తిత్వం మీద గౌరవం ఉన్నప్పుడు ఆమెకు అండగా నిలబడాలి. ఇతరులు అనుమానిస్తున్నా, కించపరుస్తూ మాట్లాడుతున్నా నువ్వు వాళ్లకి దీటుగా సమాధానం చెప్పాలి. లేదంటే ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ అయినా పోవాలి. అమ్మ ఒక్కరే ఎవరి సాయం లేకుండా జీవితాన్ని గడుపుతూ నీకు మంచి జీవితాన్ని అందించే ప్రయత్నం చేస్తోంది. నిజానికి అందుకు నువ్వు ఆమెకు తోడు నిలవాలి. ఒకవేళ నీకు మరీ ఇబ్బందిగా ఉంది, అందరి మాటలు బాధిస్తున్నాయి అనిపిస్తే అమ్మతో మాట్లాడు. అయితే తన మనసు నొప్పించకుండా అర్థమయ్యేలా చెప్పు. ఆమె ప్రతిస్పందన ఏంటో కూడా నీకు తెలుస్తుంది. దాని ఆధారంగా ఇతరులకు ఎలా సమాధానం చెప్పాలో నీకు కూడా స్పష్టత వస్తుంది.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

అలా వెళ్తే నవ్వుతున్నారు!

చాలా తరాల తరవాత మా ఇంట్లో నేనే అమ్మాయిని. దాంతో మహాలక్ష్మి పుట్టిందని ఇంట్లో చాలా ముద్దుగా పెంచుతారు. నాన్నయితే మరీ. నేను పొడవైన జడ, పెద్ద బొట్టుతో కనిపిస్తే నాన్నకు ఇష్టం. కాలేజీకి అలా వెళ్తేనేమో నవ్వుతున్నారు. ఆయన మనసు గాయపరచలేను. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

– ఓ సోదరి

ఆడపిల్లని మహాలక్ష్మిగా భావించి, సంప్రదాయబద్ధంగా తయారు చేసి మురిసిపోవడం మన సంస్కృతిలో సహజమే. కాకపోతే మారుతున్న కాలంతోపాటు మనమూ కొన్ని విషయాల్లో మారాల్సి ఉంటుంది. ముఖ్యంగా కళాశాల, ఉద్యోగం చేస్తున్న సంస్థనుబట్టి మన వస్త్రాలు, వేషధారణ ఉండాలి. అలాగని పూర్తిగా పాశ్చాత్య వస్త్రాలు, అచ్చంగా సంప్రదాయ దుస్తులే ధరించమని కాదు. మన సౌకర్యం, వెసులుబాటునీ చూసుకోవాలి. ఎంచుకున్న కోర్సుకి భిన్నంగా నీ ఆహార్యం ఉంటే మీ నాన్నగారితో ఓసారి మాట్లాడి చూడు. ఆయన మనసు నొప్పించకుండా కళాశాలకి రోజూ సంప్రదాయ లుక్‌లోనే వెళ్లడం సాధ్యం కాదని చెప్పు. పండగలు, వేడుకలకి ఆయనకు నచ్చినట్టుగా సిద్ధమవుతానని ఒప్పించు. ఎంతో గారాబంగా, ముద్దుగా పెంచుకుంటున్నారు కాబట్టి, నీ అసౌకర్యాన్నీ పరిస్థితినీ తప్పక అర్థం చేసుకుంటారు. ఇతరులు గేలి చేయడమే, కోర్సు పరంగా ఇబ్బంది లేదనుకుంటే నిన్ను నువ్వు ఎవరికోసమో మార్చుకోవాల్సిన పనీ లేదు. ఆలోచించి, నీకేం కావాలో నిర్ణయం తీసుకో.

ఆదాయ మార్గాలు వెతుకుతున్నారు...



'చేస్తోన్న ఉద్యోగమే కాకుండా... వేరే ఆదాయం కూడా ఉండాలి. అనుకోకుండా పనిపోతే... ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడకూడదు' ఇదివరకు అబ్బాయిల ఆలోచనా విధానం ఇది. అమ్మాయిలకి ఆ సమయం ఎక్కడుంది? ఇల్లు, కాలేజీ, ఆఫీసు తప్ప! కానీ జెన్‌జీ అమ్మాయిలు ఈ సమస్యను అధిగమించారు. అన్నింట్లోనూ తమదైన ప్రతిభతో రాణిస్తున్నారు. మంచి ఉద్యోగం సాధించడమే తమ లక్ష్యంగా భావించడం లేదు... వాళ్లు కూడా వేర్వేరు ఆదాయ మార్గాలు ఉండాలని ఆలోచిస్తున్నారు. దాని పర్యవసానమే 'ట్రావెల్ రెంటల్ రూమ్స్'. కెరియర్‌లో రాణిస్తున్నాం, కాస్త స్థిరపడుతున్నాం అన్నాక ఇళ్లు, విల్లాలు కొనడానికి ఇష్టపడుతున్నారు. వీకెండ్, సీజనల్ వేళల్లో వాటిని అద్దెకి ఇచ్చి... ఆదాయ మార్గాల్ని సృష్టిస్తున్నారట. సంబంధిత అప్లికేషన్లు, వెబ్‌సైట్లలో నమోదు చేసుకుని వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. ఓవైపు పెట్టుబడినీ, మరోవైపు ఆదాయాన్నీ సమతౌల్యం చేస్తున్నారు. అంతేనా, ట్రావెలింగ్ ఏజెన్సీలు, ఫండింగ్, ఏంజిల్ ఇన్వెస్టింగ్ అంటూ ఎన్ని మార్గాల్ని అనుసరిస్తున్నారో లెక్కే లేదు. ఈ ఆలోచన మెచ్చిన మిలీనియల్స్ కూడా ఈ ట్రెండ్‌ను ఫాలో అయిపోతున్నారట. చూశారా జెన్‌జీ అమ్మాయిలకు ఎంత దూరదృష్టో!

బంగారం - వెండి
7న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,790	94,400	1,17,853
విజయవాడ	1,00,840	94,000	1,17,700
ప్రొద్దుటూరు	1,00,400	92,370	1,17,800
రాజమహేంద్రవరం	1,02,550	94,000	1,27,000
విశాఖపట్నం	1,02,180	93,500	1,25,000
తమిళనాడు	-----	94,000	1,27,000

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

ఛాంపియన్స్


అర్జున్

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

అర్జున శుభారంభం

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్‌లో భారత స్టార్ అర్జున్ ఇరిగేశి శుభారంభం చేశాడు. గురువారం మొదటి రౌండ్లో అమెరికాకు చెందిన అవాండర్ లియాంగ్‌పై అతడు విజయం సాధించాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్.. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో పరాజయంపాలయ్యాడు. నెదర్లాండ్స్ ఆటగాడు జోర్డెన్ వ్యాన్‌ను విదిత్ గుజరాతి నిలువరించాడు. ప్రణవ్, కార్తికేయ మురళి మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. అనిష్ గిరి (నెదర్లాండ్స్), రే రాబ్సన్ (అమెరికా) పాయింట్ పంచుకున్నారు. టోర్నీ క్లాసికల్ ఫార్మాట్లో 9 రౌండ్ల పాటు సాగుతుంది. ఛాలెంజర్స్ విభాగం తొలి రౌండ్లో దిప్తాయన్ ఘోష్ చేతిలో హారిక ఓడిపోయింది. ల్యూక్ మెండోంకా, పర్ణేశ్ విజయాలు సాధించారు. ఇనియన్ తో గేమ్‌ను వైశాలి డ్రాగా ముగిచింది. అధిబన్, అభిమన్యు పాయింట్ పంచుకున్నారు.

ప్రపంచ పాఠశాలల చెస్

వేలమ్మాళ్ విద్యాలయకు స్వర్ణం



ట్రోఫీతో వేలమ్మాళ్ జట్టు

దిల్లీ: ప్రపంచ పాఠశాలల టీమ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో వేలమ్మాళ్ విద్యాలయ జట్టు స్వర్ణం గెలిచింది. అమెరికాలోని వర్జీనియాలో జరిగిన పోటీల్లో ఎనిమిది గేమ్‌లలో 16 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. కేపీ ప్రణవ్ తదితరులు విజయంలో కీలకపాత్ర పోషించారు. వేలమ్మాళ్ విద్యాలయ చాన్నాళ్లుగా చెస్‌కు చిరునామాగా ఉంది. ఇక్కడే చదువుకున్న దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ అయ్యాడు. ప్రజ్ఞానంద, వైశాలి టాప్ ప్లేయర్లుగా పేరు తెచ్చుకున్నారు. సేతురామన్, మెండోంకా, కార్తికేయన్, శ్రీనాథ్ లాంటి వాళ్లు ఈ పాఠశాల నుంచే వచ్చారు. గతంలో వరుసగా అయిదేళ్లు ప్రపంచ స్కూల్ చెస్‌లో వేలమ్మాళ్ విజేతగా నిలిచింది.

నార్త్ జోన్‌కు

గిల్ సారథ్యం


గిల్

దిల్లీ: భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దేశవాళీ క్రికెట్లో బరిలో దిగనున్నాడు. దులీప్ ట్రోఫీలో పాల్గొనే నార్త్ జోన్ జట్టుకు గిల్ సారథ్యం వహించనున్నాడు. పేసర్లు అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్‌లతో కూడిన 15 మంది జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఈనెల 28న దులీప్ ట్రోఫీ ప్రారంభంకానుండగా.. సెప్టెంబరు 11న ఆఖరి మ్యాచ్ మొదలవనుంది. అయితే యూఏఈ ఆతిథ్యమివ్వనున్న ఆసియా కప్ సెప్టెంబరు 10న ప్రారంభంకానుంది. సెప్టెంబరు 10న యూఏఈ, 14న పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. దీంతో దులీప్ ట్రోఫీ మొత్తానికి గిల్ అందుబాటులో ఉండకపోచ్చు.

నార్త్ జోన్ జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), శుభం కజూరియా, ఆయుష్ బదోని, యశ్ ధూల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధూ, సాహిల్ లోత్రా, మయాంక్ డాగర్, యుధ్‌వీర్‌సింగ్ చరక్, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబి, కన్హయ్య (వికెట్ కీపర్)

నన్ను వదిలేయండి

రాజస్థాన్‌ను కోరిన సంజు శాంసన్


సంజు శాంసన్

జైపుర్: సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌ను వీడనున్నాడు. 2026 ఐపీఎల్ వేలం నేపథ్యంలో తనను వదిలేయాలని అతడు రాయల్స్‌ను కోరాడు! ఐపీఎల్ 2025 ముగిసిన వెంటనే శాంసన్.. తన ఉద్దేశాన్ని ఆర్‌ఆర్ మేనేజ్‌మెంట్‌తో చెప్పినట్లు తెలుస్తోంది. రాజస్థాన్.. శాంసన్‌ను వదిలేయాలనుకుంటే అతణ్ని వేరే ఫ్రాంఛైజీకి బదిలీ చేయొచ్చు లేదా వేలానికి పంపొచ్చు. నిబంధనల ప్రకారం ఈ విషయంలో తుది నిర్ణయం ఫ్రాంఛైజీదే. 30 ఏళ్ల శాంసన్ మొదట 2013 నుంచి 2015 వరకు రాజస్థాన్‌కు ఆడాడు. తర్వాతి రెండేళ్లు దిల్లీకి ఆడాక తిరిగి 2018లో రాయల్స్ జట్టులో చేరాడు. 2021లో ఆ జట్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు.

పంత్‌కు క్షమాపణ చెప్పా


వోక్స్

లండన్: ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో తన డెలివరీకి గాయపడ్డ భారత బ్యాటర్ రిషబ్ పంత్‌కు క్షమాపణలు చెప్పానని ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ తెలిపాడు. అతడి ఉదారత తనను కదిలించిందని చెప్పాడు. మాంచెస్టర్‌లో నాలుగో టెస్టు సందర్భంగా వోక్స్ బంతి పాదానికి తగలడంతో పంత్ గాయపడ్డాడు. నడవడమే కష్టంగా ఉన్నా తిరిగి రెండో రోజు బ్యాటింగ్‌కు దిగాడు. ఇక వోక్స్ అయిదో టెస్టులో స్థానభ్రంశం చెందిన భుజానికి కట్టుతో ఆఖరి రోజు బ్యాటింగ్‌కు వచ్చాడు. గాయాలతో ఆడిన ఈ ఇద్దరు అందరి మన్ననలు పొందారు. "రిషబ్ పంత్.. సెల్యూట్ ఎమోజితో ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫొటో పెట్టడం చూశా. కృతజ్ఞతలు చెబుతూ అతడికి బదులిచ్చా. పాదం ఎలా ఉందని అడిగా" అని ఓ ఇంటర్వ్యూలో వోక్స్ చెప్పాడు. ఆ తర్వాత పంత్ తనకో వాయిస్ సందేశం పంపాడని తెలిపాడు. "అంతా బాగుందని ఆశిస్తున్నా. నువ్వు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఏదో ఒక రోజు మళ్లీ కలుద్దాం" అని పంత్ అన్నాడని వోక్స్ చెప్పాడు. పంత్ కాలి గాయానికి కారణమైనందుకు అతడికి క్షమాపణ చెప్పానని తెలిపాడు. గాయంతోనూ బ్యాటింగ్‌కు వచ్చినందుకు భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తనకు అభినందనలు తెలిపాడని వోక్స్ వెల్లడించాడు. తాను బ్యాటింగ్‌కు దిగకూడదని ఎప్పుడూ అనుకోలేదని పేర్కొన్నాడు.

లవ్లీనా ఫిర్యాదుపై ఐఓఏ విచారణ


లవ్లీనా

దిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కల్నల్ అరుణ్ మలిక్ తనతో అమర్యాదకరంగా ప్రవర్తించినట్లు, లింగ వివక్ష చూపించినట్లు టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహెయిన్ ఆరోపించింది. లవ్లీనా ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోందని, త్వరలో నివేదిక సమర్పిస్తారని భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) అధికారి తెలిపారు. జులై 8న జూమ్ సమావేశంలో మలిక్ అవమానించాడని, తన విజయాలను తక్కువ చేస్తూ మాట్లాడాడంటూ కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, సాయ్ డీజీ, టాప్స్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), బీఎఫ్ఐలకు లవ్లీనా ఫిర్యాదు చేసింది. ఆన్‌లైన్ సమావేశంలో సాయ్, టాప్స్ అధికారులు కూడా పాల్గొన్నారు. తన వ్యక్తిగత కోచ్‌ను జాతీయ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు.. తనతో పాటు ప్రయాణించేందుకు అనుమతించాలని లవ్లీనా కోరింది. "నోరు మూసుకో. తలదించుకుని మేం చెప్పినట్లు చెయ్ అని మలిక్ అన్నాడు. అతని మాటలు అగౌరవంతో పాటు లింగ వివక్ష, నిరంకుశ ఆధిపత్య ధోరణిలో ఉన్నాయి. దేశానికి గౌరవం తీసుకొచ్చిన మహిళకు ఇలాంటి పరిస్థితి ఎదురవకూడదు" అని లవ్లీనా తన ఫిర్యాదులో పేర్కొంది. అయితే లవ్లీనా ఆరోపణల్ని మలిక్ ఖండించాడు. బీఎఫ్ఐ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున లవ్లీనా అభ్యర్థనలను గౌరవపూర్వకంగా తిరస్కరించినట్లు తెలిపాడు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఐఓఏ.. టాప్స్ సీఈఓ ఎన్.ఎస్.జోహాల్, ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్ శరత్ కమల్, మహిళా న్యాయవాదితో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండు వారాల్లో తన నివేదికను ఇవ్వనుంది. లవ్లీనా, మలిక్ సంభాషణతో పాటు సమావేశాన్ని అధికారులు రికార్డు చేశారు.


ఏపీఎల్ జట్ల కెప్టెన్లతో ఏసీఏ కోశాధికారి శ్రీనివాసరావు, ఏపీఎల్ పాలక మండలి ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

సీజన్-4 ఆరంభం నేడే

ఏపీఎల్‌కు వేళాయె

తొలి మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ ఢీ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-4కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఈ టోర్నీ ఆరంభం కానుంది. "ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగే ప్రారంభ వేడుకలకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీఎల్ ప్రచారకర్త, నటుడు వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారు. హీరోయిన్ ప్రగ్యాజైస్వాల్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల ప్రదర్శనలతో పాటు, లేజర్‌షో, డ్రోన్ షో ఉంటుంది. ఏడు జట్లు తలపడే టోర్నీలో మొత్తం 25 మ్యాచ్‌లు జరుగుతాయి. వీటిలో 21 లీగ్ మ్యాచ్‌లు, 4 ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ఉంటాయి. తొలిమ్యాచ్‌లో కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ జట్లు తలపడతాయి. టోర్నీ విజేతకు రూ.35 లక్షలు, రన్నరప్‌కు రూ.20 లక్షలు నగదు బహుమతి లభిస్తాయి. అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తాం" అని ఏపీఎల్ పాలకమండలి ఛైర్మన్ వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు పేర్కొన్నారు. అంతకుముందు నోవాటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఏడు జట్ల కెప్టెన్లు హేమంత్‌రెడ్డి (భీమవరం బుల్స్), రికీభుయ్ (సింహాద్రి వైజాగ్ లయన్స్), రషీద్ (రాయల్స్ ఆఫ్ రాయలసీమ), కె.ఎస్.భరత్ (కాకినాడ కింగ్స్), మహీప్‌కుమార్ (తుంగభద్ర వారియర్స్), హనుమ విహారి (అమరావతి రాయల్స్), అశ్విన్ హెబ్బర్ (విజయవాడ సన్‌షైనర్స్), ఏసీఏ కోశాధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారత్ @ 63

దిల్లీ: తాజా ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఏడు స్థానాలు మెరుగై 63వ ర్యాంకులో నిలిచింది. ఇటీవల ఏఎఫ్‌సీ ఆసియాకప్ క్వాలిఫయర్స్ ఫైనల్లో థాయ్‌లాండ్‌పై గెలిచి ప్రధాన టోర్నీకి అర్హత సాధించిన భారత్.. ర్యాంకుల్లోనూ మెరుగుపడింది. రెండేళ్ల తర్వాత భారత్‌కు ఇదే ఉత్తమ ర్యాంకు. చివరిగా 2023లో 61వ స్థానం సాధించింది. స్వదేశంలో జరిగిన గత ఆసియాకప్‌లో జట్టులో కొంతమంది ప్లేయర్లకు కరోనా సోకడంతో భారత్ పోటీ నుంచి వైదొలిగింది.

సీఓఈకి కొత్త సిబ్బంది

బెంగళూరు: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (గతంలో ఎన్‌సీఏ)లో నూతన సహాయక సిబ్బందిని బీసీసీఐ నియమించనుంది. ప్రముఖ బౌలింగ్ కోచ్ ట్రాయ్ కూలీతో పాటు మరికొందరి పదవీకాలం పూర్తవడంతో కొత్తవాళ్ల కోసం బీసీసీఐ గురువారం దరఖాస్తులు ఆహ్వానించింది. బౌలింగ్, బ్యాటింగ్, స్పోర్ట్స్ సైన్స్- మెడిసిన్ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనుంది. 2021లో జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆస్ట్రేలియా మాజీ ఫస్ట్‌క్లాస్ బౌలర్ కూలీ మూడేళ్ల పదవీకాలం పూర్తవగానే.. అతనికి బీసీసీఐ పొడిగింపు ఇచ్చింది. కూలీ ఆధ్వర్యంలో పనిచేసిన భారత మాజీ పేసర్ వీఆర్‌వీ సింగ్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించే అవకాశముంది. వైద్య బృందం చీఫ్ నితిన్ పటేల్ ఇప్పటికే రాజీనామా చేశాడు. స్పిన్ బౌలింగ్ కోచ్ పదవికి వీడ్కోలు పలికిన సాయిరాజ్ బహుతులె రాజస్థాన్ రాయల్స్ సహాయక బృందంలో చేరాడు. బ్యాటింగ్ కోచ్ సితాంషు కొటక్.. భారత జట్టులో బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. సీఓఈ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ పదవీ కాలం ఈ ఏడాదితో ముగియనుంది. అతను పొడిగింపు కోరకపోవచ్చని తెలుస్తోంది. అయితే 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగమని లక్ష్మణ్‌ను బీసీసీఐ కోరే అవకాశముంది.

ఐఎస్ఎల్‌పై అదే సందిగ్ధత?

దిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 2025-26 సీజన్ జరగడంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఐఎస్ఎల్ క్లబ్‌లకు తగినన్ని పోటీ మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం కల్పించేందుకు సెప్టెంబరు రెండో వారం లేదా మూడో వారం నుంచి సూపర్ కప్ నిర్వహణకు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ప్రతిపాదించింది. "క్లబ్‌లకు తగినన్ని పోటీ మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం కల్పించేందుకు ఏఐఎఫ్ఎఫ్ సెప్టెంబరు రెండో వారం లేదా మూడో వారంలో సూపర్ కప్ నిర్వహించాలని అనుకుంటోంది. ఆ కప్ తర్వాత ఐఎస్ఎల్ ఆడొచ్చు. దేశ ప్రయోజనాల రీత్యా ఏఐఎఫ్ఎఫ్, 13 ఐఎస్ఎల్ క్లబ్‌లు సమష్టిగా ఈ నిర్ణయం తీసుకున్నాయి" అని ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే చెప్పాడు. ఐఎస్ఎల్ క్లబ్‌ల ప్రతినిధులతో సమావేశం సందర్భంగా ఫుట్‌బాల్ సమాఖ్య ఈ ప్రతిపాదన చేసింది. సూపర్‌కప్ సాధారణంగా సీజన్ ఆఖర్లో జరుగుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఈ టోర్నీతోనే దేశవాళీ సీజన్ మొదలయ్యే అవకాశముంది. లీగ్‌ను నిర్వహించే ఎఫ్ఎస్‌డీఎల్, ఏఐఎఫ్ఎఫ్ మధ్య ఒప్పందం పునరుద్ధరణపై అనిశ్చితి ఏర్పడడంతో ఐఎస్ఎల్ వచ్చే సీజన్ జరగడం సందిగ్ధంగా మారింది. ఏఐఎఫ్ఎఫ్ రాజ్యాంగానికి సంబంధించిన కేసు సుప్రీం కోర్టులో ఉంది. కోర్టు ఆదేశించడంతో ఎఫ్ఎస్‌డీఎల్‌తో ఒప్పంద పునరుద్ధరణ చర్చలను ఏఐఎఫ్ఎఫ్ నిలిపివేయాల్సివచ్చింది.

సెమీస్‌లో అయిదుగురు భారత బాక్సర్లు


బ్యాంకాక్: ఆసియా అండర్-19 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. తాజాగా మరో అయిదుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్లో అడుగుపెట్టి పతకాలు ఖాయం చేసుకున్నారు. పురుషుల విభాగంలో శివమ్ (55కేజీ), మౌసమ్ సుహాగ్ (65కేజీ), రాహుల్ కుందు (75కేజీ), గౌరవ్ (85కేజీ), హేమంత్ సంగ్వాన్ (90) ముందంజ వేశారు. ఇంతకు ముందు ఏడుగురు భారత అమ్మాయిలు సెమీఫైనల్లో ప్రవేశించారు. అంటే అండర్-19 విభాగంలో భారత్‌కు 12 పతకాలు ఖాయమన్నమాట. అండర్-22లో కూడా భారత్‌కు 13 పతకాలు ఖరారయ్యాయి. అయిదుగురు బాక్సర్లు స్వర్ణాల కోసం పోటీపడనున్నారు.

జింబాబ్వే 125 ఆలౌట్


కాన్వే

బులవాయో: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో జింబాబ్వే తడబడింది. తొలి రోజు, గురువారం తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే ఆలౌటైంది. మూడున్నర సంవత్సరాల విరామం తర్వాత పునరాగమనం చేసిన బ్రెండన్ టేలర్ (44) ఆదుకోకపోతే ఆ జట్టు మరింత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేది. సిగా (33 నాటౌట్) కూడా రాణించి స్కోరు 100 దాటించాడు. ఆట చివరికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 171 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (79 బ్యాటింగ్), డఫీ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. విల్ యంగ్ (74)తో కలిసి కాన్వే తొలి వికెట్‌కు 162 పరుగులు జత చేసి కివీస్‌కు శుభారంభం అందించాడు. "నిషేధానికి గురైన మూడేళ్లు చాలా బాధను అనుభవించా. నాకిష్టమైన క్రికెట్ ఆడలేకపోతున్నానన్న వేదనతో మంచం కూడా దిగాలని అనిపించలేదు. ఈ సమయంలో కుటుంబం అండగా నిలిచింది" అని బ్రెండన్ టేలర్ చెప్పాడు. ఐసీసీ అవినీతి వ్యతిరేక నిబంధనలను అతిక్రమించినందుకు టేలర్‌పై 2022 జనవరిలో నిషేధం పడింది.

తర్వాతి లక్ష్యం ఆసియా క్రీడలే


మన్‌ప్రీత్ సింగ్

దిల్లీ: 2026 ఆసియా క్రీడల్లో సత్తా చాటడమే తన తర్వాతి ప్రధాన లక్ష్యమని భారత హాకీ జట్టు సీనియర్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. జట్టులో కొనసాగాలంటే ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోవాలని 32 ఏళ్ల ఈ మిడ్‌ఫీల్డర్ తెలిపాడు. "2024 పారిస్ ఒలింపిక్స్, ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత నా కెరీర్‌ను మరింత కాలం పొడిగించుకోవాలన్న ఆలోచన కలిగింది. ఇది సాధ్యం కావాలంటే ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకోవాలి. జట్టులో యువ ఆటగాళ్లతో పోటీపడాలి. అందుకే ఈ దిశగా కృషి చేస్తున్నా. స్వీట్లు తినడం ఆపేశాను. హై ప్రొటీన్ ఆహారమే తీసుకుంటున్నా. ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోనే నాకు స్ఫూర్తి. అతడు 40 ఏళ్ల వయసులోనూ గొప్ప ఫిట్‌నెస్‌తో ఉన్నాడు. జట్టులో ఆటగాళ్లంతా మెరుగైన ఫిట్‌నెస్‌తో ఉండడం వల్లే గత రెండు ఒలింపిక్స్‌లో బలమైన జట్లను ఓడించగలిగాం. 2026 ఆసియా క్రీడల్లో రాణించడమే నా తదుపరి లక్ష్యం. ఆసియాకప్‌లో భారత్ సత్తా చాటితే వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ బెర్తు సంపాదించొచ్చు" అని మన్‌ప్రీత్ తెలిపాడు. ఇప్పటిదాకా 402 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మన్‌ప్రీత్.. దిలీప్ టిర్కీ (412) తర్వాత అత్యధిక మ్యాచ్‌ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఘనత సాధించాడు. 2020 టోక్యో, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో చరిత్రాత్మక కాంస్య పతకాలు నెగ్గిన భారత జట్లలో మన్‌ప్రీత్ సభ్యుడు.

ఇండియా-ఎ పరాజయం

మెకే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా పర్యటనను ఇండియా-ఎ మహిళల జట్టు పరాజయంతో మొదలుపెట్టింది. గురువారం జరిగిన తొలి టీ20లో ఆసీస్-ఎ 13 పరుగుల తేడాతో ఇండియా-ఎను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. అనిక లెరాయిడ్ (50 నాటౌట్; 44 బంతుల్లో 7×4), అలీసా హీలీ (27; 18 బంతుల్లో 5×4) సత్తాచాటడంతో మొదట ఆసీస్-ఎ 6 వికెట్లకు 137 పరుగులు సాధించింది. ఇండియా-ఎ బౌలర్లలో ప్రేమ రావత్ (3/15), సైమ ఠాకూర్ (1/30), సంజీవన్ సజన (1/9) సఫలమయ్యారు. అనంతరం ఇండియా-ఎ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 124 పరుగులే చేయగలిగింది. ఉమ ఛెత్రి (31; 31 బంతుల్లో 4×4), రాఘవి బిస్త్ (33; 20 బంతుల్లో 2×4, 2×6), కెప్టెన్ రాధ యాదవ్ (26 నాటౌట్; 22 బంతుల్లో 3×4) పోరాడినా ఫలితం లేకపోయింది.

ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్‌తో భారత్ పోరు

దిల్లీ: ఏఎఫ్‌సీ మహిళల అండర్-17 ఫుట్‌బాల్ ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో గ్రూప్ దశలో ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్‌లతో భారత్ తలపడనుంది. కౌలాలంపూర్‌లో అక్టోబర్ 13న ఆరంభమయ్యే ఈ టోర్నీలో గ్రూప్-జిలో ఉన్న భారత్.. అక్టోబర్ 13న కిర్గిజ్‌స్థాన్.. 17న ఉజ్బెకిస్థాన్‌ను ఢీకొంటుంది. టోర్నీలో మొత్తం 32 జట్లను 8 గ్రూపులుగా విభజించారు. గ్రూప్ విజేతగా నిలిచిన జట్లు ఆసియా కప్‌నకు అర్హత సాధిస్తాయి. 2005లో చివరిగా భారత్ ఆసియాకప్‌లో ఆడింది.

బెంగళూరులో ప్రపంచకప్ జరిగేనా?

బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మహిళల వన్డే ప్రపంచకప్ జరగడం అనుమానంగా మారింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 30న ఈ మెగా టోర్నీ ఆరంభ మ్యాచ్‌కు బెంగళూరే ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే అక్కడ క్రికెట్ మ్యాచ్‌లకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. మహారాజా ట్రోఫీ టీ20 లీగ్ నిర్వహణకు పోలీసుల అనుమతి లేకపోవడంతో కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) నాలుగో సీజన్ వేదికను మైసూరుకు తరలించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 11 నుంచి 28 వరకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో లీగ్ జరగాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ 4న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటపై దర్యాప్తు కొనసాగుతున్నందున పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రపంచకప్ మ్యాచ్‌లకు అనుమతి లభించకపోతే.. మరో వేదికకు మ్యాచ్‌లను తరలించాలని బీసీసీఐ కూడా భావిస్తోంది.

● హైదరాబాద్‌కు చెందిన ఓ యువతికి సమీప బంధువుతో పెళ్లి నిశ్చయమైంది. అతడి ప్రవర్తన బాగాలేదని తెలుసుకొని వివాహం రద్దు చేసుకుంది. కక్ష పెంచుకున్న నిందితుడు ఆమె ఫొటోలను అసభ్యంగా మార్చి వేధింపులు మొదలు పెట్టాడు. పరువు పోతుందనే ఉద్దేశంతో బాధితురాలు ఆ బాధను మౌనంగా భరించింది.

● సికింద్రాబాద్‌కు చెందిన యువతికి స్నాప్‌చాట్‌లో పరిచయమైన ఓ యువకుడు చనువుగా ఉన్న సమయంలో వీడియోలు సేకరించాడు. వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి రూ.లక్షల్లో వసూలు చేశాడు.

సరదాగా దిగిన ఫొటో..
అకస్మాత్తుగా అసభ్యంగా మారితే..?
కుటుంబ పరువు పోతుందనో..
నిందితుల బెదిరింపులకు భయపడో..
ఎందరో మహిళలు మౌనం వహిస్తున్నారు.
ఈ పరిస్థితులను ఎదుర్కోవడం ఎలా?



అదరొద్దు.. బెదరొద్దు!

ఎప్పుడో సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఫొటో.. అకస్మాత్తుగా నగ్నంగా మారి పోర్న్ వెబ్‌సైట్లలో కనిపిస్తుంది. బస్టాపులో నిల్చున్నప్పుడు.. మార్కెట్‌లో నడుస్తున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు తీసిన వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారతాయి. స్నేహితుడితో ఏకాంతంగా ఉన్న ఫొటో, వీడియో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో చక్కర్లు కొడుతుంది. వీటికితోడు డీప్‌ఫేక్‌తో ఫొటోలను అసభ్యంగా మారుస్తున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పరువు పోతుందనే ఉద్దేశంతో లోలోపల కుమిలిపోతుంటారు. కనీసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పకుండా వేదన అనుభవిస్తుంటారు. కొందరు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు యత్నిస్తుంటారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే బాధితులు అధైర్యపడకుండా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. ఫొటోలు, వీడియోలను తొలగిస్తామని.. ఫిర్యాదుదారుల వివరాలు బయటపడవని భరోసా ఇస్తున్నారు.

ఫిర్యాదు చేసేదిలా...

- బాధితులు డయల్ 100 లేదా టోల్‌ఫ్రీ నంబరు 1930, స్థానిక పోలీస్‌స్టేషన్లు, సైబర్‌క్రైమ్ ఠాణాల్లో ఫిర్యాదు చేయొచ్చు.
- షీటీమ్స్‌ను ఆశ్రయిస్తే బాధితులకు ఇబ్బంది లేనిచోట కలిసి వివరాలు సేకరిస్తారు.
- ఏ మాధ్యమంలో మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయో.. యూఆర్ఎల్, చిత్రాలు అందించాలి.
- ముందుగా కేసు నమోదు చేసి ఫొటో, వీడియో ఉన్న మాధ్యమ (గూగుల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) సంస్థలకు పోలీసు శాఖ తరఫున లేఖ రాస్తారు.
- కేసు వివరాలు పంపి.. సదరు ఫొటోలు, వీడియోలను మాధ్యమాల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటారు. నిందితులను కటకటాల్లోకి పంపిస్తారు.

స్వచ్ఛంద సంస్థ తోడ్పాటు

- నగ్న చిత్రాల వేధింపులు ఎదురైనప్పుడు పోలీసులతోపాటు కొన్ని స్వచ్ఛంద సంస్థలు బాధితులకు సహకారం అందిస్తున్నాయి.
- బ్రిటన్‌కు చెందిన రివెంజ్ పోర్న్ హెల్ప్‌లైన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలోని stopncii.org వెబ్‌సైట్‌లో బాధితులు ఫిర్యాదు చేయాలి.
- ఆన్‌లైన్‌లో ఉన్న ఫొటోలు ఏ సమయంలోనివో తెలియజేస్తూ వాటిని ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇక్కడ ఫిర్యాదు పురోగతి ఏ స్థాయిలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఏ మాధ్యమంలో ఉన్నా సరే ప్రత్యేక సాంకేతికత సహాయంతో వెతికి వాటిని తొలగిస్తారు.
- లైంగిక వేధింపులు, ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులు.. ఇలా ఘటన ఏదైనా బాధితులు సంప్రదిస్తే పోలీసులు వివరాలను గోప్యంగా ఉంచుతారు.

ఇక్కడ సహాయం...

- నేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా సైబర్‌క్రైమ్ ఠాణాకు వెళ్లాలి.
- రాష్ట్ర స్థాయి షీటీమ్స్ వాట్సప్ నంబరు 87126 56858
- హైదరాబాద్ వాట్సప్ 94906 16555
- సైబరాబాద్ వాట్సప్ 94906 17444
- రాచకొండ వాట్సప్ 87126 62111
- ఏపీలో బాధితులు శక్తి వాట్సప్ నంబరు: 79934 85111 ద్వారా సహాయం పొందవచ్చు.
- మహిళా విభాగం హెల్ప్‌లైన్: 181

-ఈనాడు, హైదరాబాద్



మోదీ కీ బెహన్..

రక్షాబంధన్ నాడు సోదరుడిగా భావించిన వారికి రాఖీ కట్టడం మామూలే. ఏటా ప్రధానికి కట్టేవారూ చాలామందే. అయితే ఓ పాకిస్థానీ మహిళ ఏటా మోదీకి రాఖీ కడతారని తెలుసా? గత 30 ఏళ్లుగా ఆమె దీన్ని కొనసాగిస్తున్నారు. ఆమె పేరు ఖమర్ మోసిన్ షేక్. పుట్టింది పాకిస్థాన్‌లోని కరాచీ అయినా పెళ్లయ్యాక ఆమె భారత్‌లోనే స్థిరపడ్డారు. ప్రస్తుతం అహ్మదాబాద్‌లో నివసిస్తున్నారు. మోదీ ఆర్ఎస్ఎస్‌లో పనిచేస్తున్న రోజుల్లో ఆమెకు పరిచయమయ్యారట. తొలిసారి మాట్లాడినప్పుడు ఆయనపై సోదర భావం కలిగిందట. అప్పట్నుంచీ ఆయనకోసం రాఖీ సిద్ధం చేయడం మొదలు పెట్టారామె. కొవిడ్ సమయంలో మాత్రం ఆంక్షల కారణంగా కట్టలేకపోయారట. అంతేకాదు, ముస్లిం మహిళ. అయితేనేం, ఈ రాఖీలను ఖమర్ స్వయంగా సిద్ధం చేస్తారు. వాటిల్లో బాగా నచ్చినదాన్ని ప్రధానికి కడతారట. ఈసారి 'ఓం' గుర్తుతో రాఖీని ఆయన కోసం రూపొందించారామె.

– వసుంధర డెస్క్

ఈ డ్రమ్ములను చూస్తే ట్రంప్‌నకు కోపం రావచ్చు!



రష్యా నుంచి భారత్ ఇంధనం దిగుమతి చేసుకుంటోంది.. దీనిపై ట్రంప్ భగ్గుమంటున్నారు. హైదరాబాద్‌లోని ఓ సంస్థ నుంచి పది వేల డ్రమ్ములను ఏటా రష్యాకు పంపిస్తున్నారు. వీటి ద్వారా పెట్రోల్ తెచ్చుకుంటున్నామేమోనని.. ట్రంప్‌నకు మళ్లీ కోపం రావచ్చు! అయితే వీటిని తెరచి చూస్తే ఆయనకూ నోరూరవచ్చు. ఎందుకంటే ఈ డబ్బాల్లో రష్యాకు పంపిస్తుంది కీర దోసలు కాబట్టి. హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని వాల్జై ఫుడ్స్ కంపెనీ.. తెలుగు రాష్ట్రాల రైతుల నుంచి కీర దోసలు కొనుగోలు చేసి ఈ డబ్బాల్లో ఆహార నిల్వ రసాయనాల్లో ఉంచి.. నౌకల ద్వారా రష్యాకు ఎగుమతి చేస్తోంది. ఇందుకోసం



గద్వాల్, వికారాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు పరిసర గ్రామాల్లో చిన్నకారు రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తుంది. పండించిన పంటను కొనుగోలు చేసి.. ఇక్కడకు తీసుకువచ్చి రసాయనాలు కలిపిన డ్రమ్ముల్లో నిల్వ చేస్తున్నారు. రష్యాలో కీర వినియోగం అధికంగా ఉంటుందని.. అక్కడ అన్ని కాలాల్లో ఈ పంట పండదని.. దీంతో దిగుమతులపై ఆధారపడుతుందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఒక్కో డబ్బాలో 190 కిలోల చొప్పున కీర దోసలు నిల్వ చేసి.. రష్యాకు పంపిస్తామని వివరించారు. ఇది రైతులకూ లాభదాయకంగా ఉందని చెప్పారు.

– ఈనాడు, హైదరాబాద్

అయ్యారే.. పుట్ట'గొడుగే'



యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి వెళ్లే దారిలో రైతు ఎల్లయ్య చేలో మొలిచిన భారీ పుట్టగొడుగు అబ్బురపరుస్తోంది. అరడుగు ఎత్తు, 15 ఇంచుల పొడవు, 13 ఇంచుల వెడల్పు, మూడు కిలోల బరువుతో ఉంది.

– న్యూస్‌టుడే, మోత్కూరు



వారి నోళ్లను నియంత్రించేందుకు ప్రయత్నించకండి

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి అత్యుత్తమ మార్గం ఏంటో తెలుసా..? అహాన్ని విడనాడటం! చుట్టూ ఉన్నవారి నోళ్లను నియంత్రించేందుకు ప్రయత్నిస్తూ సమయం వృథా చేసుకోకండి. వారి మాటల్లో మీకు ఉపయోగపడేది ఏమైనా ఉంటే తీసుకొని, అవసరమైన చోట వర్తింపజేసుకోండి. లేదంటే పట్టించుకోకుండా వదిలేయండి. అహానికి పోయి.. ఇతరుల పనికిరాని మాటల్ని మనసుకు మాత్రం తీసుకోకండి.

– జూలీ గుర్నర్, పర్ఫార్మెన్స్ కోచ్




సాగర తీరంలో సత్యభామ

ఈ శిలను జాగ్రత్తగా గమనిస్తే ఓ అందమైన యువతి సాగరం ఒడ్డున సేద తీరుతున్నట్లు కనిపిస్తోంది కదూ..! అందుకే స్థానికులు కూడా ఈ శిలను సత్యభామ శిల అని పిలుస్తారు. అందంగా పమిటంచు పరచుకుని ప్రకృతిని ఆస్వాదిస్తున్న యువతిలా ఉన్న ఈ శిల్పం విశాఖలోని గాజువాక సమీప పాత గంగవరం వద్ద ఉంది. మత్స్యకారులు భక్తితో కొలిచే ఈ శిలను దర్శించుకోవడమంటే సాహసమే. అయినా భక్తి ముందు అదేమీ కష్టం కాదని ఇక్కడి వారి విశ్వాసం. సందర్శకులు కూడా శిల్ప సౌందర్యాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలోనే వస్తుంటారు.

– ఈనాడు, విశాఖపట్నం; గాజువాక, న్యూస్‌టుడే

60 ఏళ్ల చెట్లకు పింఛను!



జేఎన్‌టీయూ(కాకినాడ)లో 60 ఏళ్ల పైబడిన చెట్లు ఆరు ఉన్నాయి. అందులో వందేళ్లు దాటిన నిద్రగన్నేరు చెట్టు కూడా ఉంది. వీటి సంరక్షణకు పూర్వపు ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 'హెరిటేజ్ ట్రీ'లుగా పేర్కొంటూ ఒక్కోదానికి ఏడాదికి రూ.2500 పింఛను ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని వాటి పరిరక్షణకే వాడుతున్నారు. నిద్రగన్నేరు చెట్టు విశేషాల్ని వివరిస్తూ అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)



దేశానికి జాతిపిత.. ఈ ఊరికి మాత్రం దేవత!

"భరతమాత తలరాతను మార్చిన విధాతరా గాంధీ.. తరతరాల యమయాతన తీర్చిన వరదాతరా గాంధీ" అన్నారొక సినీ కవి.

మహాత్మాగాంధీ అంటే జాతిపితగానే అందరికీ తెలుసు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో 350 ఇళ్లున్న కేదారిపురం గ్రామస్థులు మాత్రం ఆయనను దైవంగా కొలుస్తుంటారు. 'గాంధమ్మ' పేరుతో దేవతలా పూజిస్తారు. ఏటా గాంధమ్మకు పూజలు చేసిన తర్వాతే దమ్ములు ప్రారంభిస్తారు. స్వాతంత్ర్య కాలం నుంచి ఈ ఆచారం కొనసాగిస్తున్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభించడానికి సన్నాహకంగా గురువారం గాంధమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహం ఎదురుగా ఆయన చిత్రపటం పెట్టి పూలు, పసుపు, కుంకుమతో అలంకరించి పూజలు చేశారు. నానబెట్టిన పెసరపప్పులో కొబ్బరి కోరు, పంచదార వేసి ప్రసాదాలు తయారు చేశారు. ఎర్రమ్మ, భూలోకమ్మ తదితర ఆలయాలకు మేళతాళాలతో వెళ్లి పూజించారు. ప్రతి ఇంటి నుంచి నైవేద్యం, ముర్రాటలు సమర్పించారు. పంటలు బాగా పండేలా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. 'దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ అంటే మాకు చాలా అభిమానం. ఆయనలో తెలియని శక్తి ఉంది' అని సర్పంచి ధనుంజయ తెలిపారు. 'పొలం పనులు ప్రారంభించే ముందు గాంధమ్మను కొలిస్తే పంటలు బాగా పండుతాయని మా నమ్మకం' అన్నారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఈ వృక్ష శిలాజం 16 కోట్ల ఏళ్ల నాటిది!

ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగంలోని మ్యూజియానికి సుమారు 16 కోట్ల ఏళ్ల నాటి (డైనోసార్ల కాలం) వృక్ష శిలాజాన్ని అటవీశాఖ విశ్రాంత చీఫ్ కన్జర్వేటర్ అంపిలి భరత్ కుమార్ గురువారం అందజేశారు. దీన్ని 1987లో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాలోని యమనపల్లి (వేమనపల్లి) ప్రాంతంలో ఒక వాగు ఒడ్డు నుంచి ఆయన సేకరించారు. తన వద్ద ఇంతకాలం భద్రంగా ఉంచిన వృక్ష శిలాజాన్ని ఏయూకు అందించారు. ఇప్పటివరకు ఏయూ వృక్షశాస్త్ర విభాగం మ్యూజియంలో 6.5 కోట్ల ఏళ్లనాటి వృక్ష శిలాజమే ఉంది.



–న్యూస్‌టుడే, విశాఖపట్నం

నడిమధ్యలో నగుబాటు!

ఒకప్పుడు మీడియం సైజ్ చొక్కా చక్కగా సరిపోయేది..
ఇప్పుడది డబుల్ ఎక్స్‌ఎల్ అయ్యింది..
ప్యాంటు సైజు 36 నుంచి 44కు మారిపోయింది.
బెల్టుకు రంధ్రాలు పెంచాల్సి వస్తోంది..
ఫొటోలకు పోజు ఇవ్వాలంటే
ఊపిరి బిగపట్టి బొజ్జ వెనక్కిలాగాల్సి వస్తోంది...
అద్దం ముందు నిల్చుంటే తనపై తనకే వికారం...
నలుగురిలోకి వెళ్తే మధ్యప్రదేశ్ ఇలా
పెంచేశావేంట్రా అంటూ వెటకారాలు.



ఎందుకిలా..?

వయసు మీరాక శరీర ఆకృతి మారిందంటే అందుకు కారణాలు వెతకొచ్చు. కానీ యుక్త వయసులోనే చాలామందిని బొజ్జ సమస్య వేధిస్తోంది. ఆహారపుటలవాట్లు, జీవనశైలిలో మార్పులు.. నడక, యోగా లాంటి కనీస వ్యాయామాలూ మానేయడంతో బొడ్డు చుట్టూ.. నడుముకు ఇరువైపులా కొవ్వు పెరిగి శరీరం ఆకృతి మారిపోతోంది. ఆకారం చూసి నలుగురూ నవ్వుకుంటారో లేదో పక్కనపెడితే.. వయసుకు మించిన కొవ్వుతో అనేక ఆరోగ్య సమస్యలు తప్పవని, తక్షణమే అప్రమత్తం కాకపోతే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలా ప్రయత్నించి చూడండి..

- పొద్దున్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు, గ్రీన్ టీ, నిమ్మరసం- తేనె, మెంతి గింజల నీరు, జీలకర్ర నీరు వంటివి తీసుకోవాలి.
- మెటబాలిజం పెంచే బాదం, వాల్‌నట్.. ఫైబర్, ఒమేగా-3 ఉండే అవిసె, చియా గింజలు.. తక్కువ క్యాలరీలతో ఆకలి తీర్చే దోసకాయ, ఆకుకూరలు తినండి.
- ఉదయం పాల ప్యాకెట్లకో, కూరగాయల కోసమో వెళ్లాల్సి వస్తే.. సరదాగా నడుచుకుంటూనో, సైకిల్‌పైనో వెళ్లండి.
- లిఫ్టులు, ఎలివేటర్, ఎస్కలేటర్లు ఎక్కకుండా మెట్లు ఎక్కి, దిగడానికి ప్రయత్నించండి.
- టీవీ, మొబైల్ చూస్తూ భోజనం చేస్తే అవసరానికి మించి తినే ప్రమాదం ఉంది. నిద్రకు రెండు గంటల ముందే ఆహారం తీసుకోండి.
- మైదా, చక్కెర, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండండి.. ప్రొటీన్లు, ఫైబర్ ఉండే ఆహారం తీసుకోండి.
- వేళకు తినాలి... రోజుకు 3 లీటర్ల నీళ్లు తాగాలి.

ఇటీవల భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిర్వహించిన అధ్యయనంలో మన దేశంలో ఎక్కువమందికి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) తక్కువగా ఉన్నా.. బొడ్డు చుట్టూ పేరుకుపోయే కొవ్వు అధికంగా ఉన్నట్లు తేలింది. పట్టణ ప్రాంతాల్లోని 6.98 లక్షల మందిని అధ్యయనం చేస్తే వీరిలో 13.85 శాతం మందిలో సాధారణ ఊబకాయం.. 57.71 శాతం మందిలో అబ్డామినల్ ఒబెసిటీ (బొడ్డుచుట్టూ కొవ్వు) ఉన్నట్లు వెల్లడైంది. ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కొవ్వున్న ఆహారంతో ఈ సమస్య పెరుగుతోంది.

పొట్ట కాదు... సమస్యల పుట్ట!

- మధుమేహం, రక్తపోటు, అధిక బరువుతో శరీరంలో సమతుల్యత దెబ్బతింటుంది. గుండె ప్రమాదంలో పడుతుంది.
- శరీరంలో చక్కెర స్థాయి అదుపు తప్పి.. కిడ్నీ, నరాల సంబంధిత సమస్యలు వస్తాయి.
- మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత, గర్భధారణ సమస్యలు తలెత్తుతాయి.
- చురుకుదనం తగ్గుతుంది. శ్వాస సమస్యలు, జీర్ణ సంబంధిత సమస్యలకు ఆస్కారం.
- ఆత్మవిశ్వాసం లోపించి, మానసిక ఒత్తిడి పెరుగుతుంది.

బొడ్డు చుట్టూ పేరుకు పోయిన కొవ్వు వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. ఇది టైప్ 2 డయాబెటిస్, ఫ్యాటీ లివర్ లాంటి అనారోగ్యాలకు కారణమవుతుంది.

- హార్వర్డ్ వర్సిటీ నివేదిక

సరైన జీవనశైలితో పరిష్కారం..

రోజువారీ నడక, వ్యాయామం లేకపోతే బొడ్డుచుట్టూ కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉంది. ఈ సమస్యతో శరీర ఆకృతి మారడంతోపాటు.. అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ప్రమాదకరమైన ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చెయ్యొద్దు. పిల్లలు ఆటలకు దూరం అవ్వడం, సెల్‌ఫోన్ చూసుకుంటూ తినడం, జంక్ ఫుడ్ లాంటివీ బొజ్జ సమస్యకు కారణం. సరైన నిద్ర లేక పోవడం, వ్యసనాలు లాంటివీ చేటు చేస్తున్నాయి.

– డాక్టర్ కొణతం రాంబాబు, విమ్స్ డైరెక్టర్, విశాఖపట్నం

- ఈనాడు, అమరావతి

ఇక్కడ మాత్రం నేనెందుకు వద్దు?

పెళ్లి సంబంధాలు వెతకడంలో 'మ్యాట్రిమోని' సైట్లు ఒక మలుపు. ఇప్పుడు మరో మలుపు కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం. అనేక మ్యాట్రిమోని యాప్‌లు ఏఐని వినియోగించుకుంటూ వాటి సేవల్ని మెరుగుపరుచుకుంటున్నాయి. మ్యాట్రిమోని యాప్‌లలోని లక్షల ప్రొఫైళ్లను కృత్రిమ మేధ వడపోస్తోంది. సరిపోయే వ్యక్తిని.. . వయసు, ప్రాంతం, వృత్తి, అభిరుచుల వంటి అనేక ప్రాధాన్యతల ఆధారంగా శోధించడానికి సహాయ పడుతుంది. ఎదుటి వ్యక్తికి నచ్చామో లేదా అని ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరమూ ఉండదు. మనకు వచ్చిన భాషలోనే ఎంచుకోవాలనే అవసరం లేకుండా ఎలాంటి వ్యక్తినైనా ఎంచుకునే సౌలభ్యం వీటిలో ఉంది. వ్యక్తి పంచుకున్న సమాచారం ప్రకారం... అత్యంత అనుకూలమైన వ్యక్తిని సిఫార్సు చేయడంలో ఇది ఉపయోగపడుతుంది. ఆయా వ్యక్తుల జాతకాలనూ వివరిస్తుంది. మ్యాట్రిమోని వేదికల్లో నకిలీ ప్రొఫైల్‌తో ఎదుటి వ్యక్తిని నమ్మించే అవకాశం ఉంటుంది. ఎదుటి వారు ఎన్ని విషయాలు చెప్పినా.. తమ వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. "పరిచయం ఏర్పడిన వెంటనే ఫొటోలు పంపించొద్దు. ఎటువంటి సమయాల్లోనూ ఆర్థిక లావాదేవీలు జరపొద్దు. పరిచయం ఏర్పడగానే.. కలుద్దామా అంటే ముందు వీడియో కాల్స్ ఉపయోగించండి. ప్రొఫైల్లో ఇచ్చే సమాచారానికి.. ఆ వ్యక్తి ప్రవర్తించే పద్ధతికి మధ్య చాలా తేడా ఉంటే.. వారిపై సంబంధిత అధికారులకు తెలపడం మంచిది. కొంతమంది ఎమోషనల్‌గా దగ్గర అవుతారు. భావోద్వేగాలతో వారి చెప్పుచేతల్లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. వీటిపై అప్రమత్తంగా ఉండాలి. ఇన్‌స్టాగ్రామ్ వివరాలు, వాట్సప్ నంబరు అడిగినా.. ఇవ్వకపోవడమే మంచిది" అని నిపుణులు సూచిస్తున్నారు.



– ఈనాడు డిజిటల్, హైదరాబాద్



చచ్చి బతికిన కౌజు పిల్లలు

నాగుపాము కడుపులో నుంచి బయటపడ్డ కౌజు పిట్ట గుడ్లను ఇంక్యుబేటర్‌లో పొదిగించగా.. వాటి నుంచి కౌజు పిట్ట పిల్లలు బయటికొచ్చాయి. ఈ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తిరునెల్వేలి జిల్లాలోని అంబాసముద్రం ప్రాంతంలో విజయలక్ష్మి అనే మహిళ ఇంట్లో జులై 27న నాగుపాము ఉన్నట్లు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది దానిని పట్టుకునేందుకు వచ్చారు. ఆ సమయంలో పాము నోటి నుంచి ఏడు గుడ్లు బయటపడ్డాయి. అవి పగలకపోవడంతో జిల్లాలోని పశువైద్య అధికారి మనోహరన్‌కు అప్పగించారు. ఆయన వాటిని పరిశీలించి, కౌజు పిట్ట గుడ్లని నిర్ధారించారు. ఆ తర్వాత ఇంక్యుబేటర్ ద్వారా వాటిని పొదిగించారు. ఈ క్రమంలో గురువారం నాలుగు గుడ్ల నుంచి కౌజు పిట్ట పిల్లలు బయటకు రావడం విశేషం.

– న్యూస్‌టుడే, చెన్నై (టీనగర్)

మూసీ జలతరంగాలు నీటికాకుల సయ్యాటలు

నల్గొండ జిల్లాలోని మూసీ జలాశయం వద్ద నీటికాకుల(లిటిల్ కార్మోరెంట్) వేట పర్యాటకులను ఆకట్టుకుంటుంది. పైనుంచి వస్తున్న వరదతో మూసీ జలాశయం రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరదలో కొట్టుకువచ్చే చేపల కోసం వందల సంఖ్యలో నీటికాకులు వరద నీటికి ఎదురీదుతూ, నీటిలో మునకలు వేస్తూ చేపలను గుటుక్కుమనిపిస్తున్నాయి.

– ఈనాడు, నల్గొండ, న్యూస్‌టుడే, నకిరేకల్





తమిళనాడులోని కీళడి ప్రాంతంలో చేపట్టిన తవ్వకాలు ప్రతిబింబించేలా ఉన్న జ్ఞాపికను ప్రధాని మోదీకి అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్

తమిళుల ప్రయత్నాలకు అండగా ఉండండి

ప్రధానికి కమల్ విజ్ఞప్తి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళుల ప్రయత్నాలకు అండగా ఉండాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేసినట్లు సినీ నటుడు కమల్‌హాసన్ తెలిపారు. రాజ్యసభ ఎంపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన.. ప్రధానిని దిల్లీలో గురువారం కలిశారు. ‘‘ఓ కళాకారుడిగా, తమిళనాడు ప్రతినిధిగా ప్రధానికి కొన్ని అభ్యర్థనలు చేశా. తమిళజాతి ప్రాచీనత, తమిళ నాగరికత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటే మా ప్రయత్నాలకు అండగా ఉండాలని కోరాను’ అని ఎక్స్‌లో కమల్ పేర్కొన్నారు.

ట్రిపుల్‌ఐటీల్లో భోజనాలకు హెచ్‌కేఎంసీఎఫ్‌తో ఒప్పందం

ఈనాడు, అమరావతి: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో భోజనం అందించే బాధ్యతలను ఏపీ హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ (హెచ్‌కేఎంసీఎఫ్)కు అప్పగించినట్లు రిజిస్ట్రార్ అమరేంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

మద్యం అలవాటు మాన్పిస్తానని ముంచేశాడు

నాటు వైద్యుడు ఇచ్చిన ఔషధం తాగి నలుగురి మృతి

కలబురగి, న్యూస్‌టుడే: మద్యం అలవాటు మానేందుకు నాటు ఔషధం తాగిన నలుగురు అస్వస్థతకు గురై మృతి చెందారు. ఈ ఘటన కర్ణాటకలోని కలబురగి జిల్లాలో చోటుచేసుకుంది. బురగపల్లికి చెందిన లక్ష్మీ నరసింహులు(45), ఆయన కుమారుడు నింగప్ప నరసింహులు(22), శహబాద్ పట్టణానికి చెందిన గణేశ్ రాథోడ్(30), మదకల్ గ్రామ నివాసి భీమేశప్ప గడుగు(25) మద్యం అలవాటును మానేందుకు సేడం తాలూకా ఇమడాపురలోని నాటు వైద్యుడైన తాయప్ప అలియాస్ ఫకీరప్ప ముత్యా వద్దకు గురువారం వెళ్లారు. వారందరితో ఆయన ఓ ఔషధాన్ని తాగించాడు. మరో ఔషధాన్ని ముక్కులో వేశాడు. కొంత సమయానికే వారంతా అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికి నలుగురూ చనిపోయారు.



చిన్ని జీవితంలో అలా ఉండొద్దు!

జీవితం చాలా చిన్నది. కాబట్టి-

- మీరు ద్వేషిస్తున్న ఉద్యోగంలో కొనసాగకండి.
- మీ కలలను సాకారం చేసుకునే దిశగా ప్రయత్నించకుండా ఉండకండి.
- మీ ప్రేమను ఆవలి వ్యక్తులకు వ్యక్తపరచకుండా దాచుకోకండి.
- మీరు కోరుకున్న పనులు చేయకుండా ఆగిపోకండి.

– కోరీ విల్సన్, మైండ్‌సెట్ కోచ్

రూ.35.5 కోట్ల బిల్లులకు రూ.5 కోట్ల లంచం

- అడ్డంగా దొరికిన గిరిజన సంక్షేమశాఖ అధికారి
- మూడోసారి ఏసీబీ కేసులో ఈఎన్‌సీ శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్న ఓ ఉన్నతాధికారి ఈలోపే అందినంతా చక్కబెట్టుకునే యత్నంలో.. రూ.5 కోట్ల లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సబ్బవరపు శ్రీనివాస్ విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఆయన అవినీతి నిరోధక శాఖ కేసుల్లో ఇరుక్కోవడం ఇది మూడోసారి. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకుడు చెరుకూరి కృష్ణంరాజు ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, ఇతరత్రా పనులు చేశారు. వాటికి రూ.35.5 కోట్ల వరకు బిల్లులు రావలసి ఉంది. ఈఎన్‌సీ శ్రీనివాస్‌ను సంప్రదించగా తనకు రూ.5 కోట్లు ఇస్తేనే మంజూరు చేస్తానన్నారు. పనులు చేయడానికి బ్యాంకుల్లో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న గుత్తేదారు ఈ విషయాన్ని ఏసీబీకి తెలిపారు. దీంతో విజయవాడ, శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీలు సుబ్బారావు, రమణమూర్తిల నేతృత్వంలో ఆయనపై నిఘా పెట్టారు. రూ.5 కోట్ల లంచం డిమాండ్ చేసిన ఈఎన్‌సీ అడ్వాన్స్‌గా రూ.25 లక్షలు తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్నారు. శుక్రవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.



రూ.25 లక్షల లంచం సొమ్ముతో ఏసీబీకి చిక్కిన ఈఎన్‌సీ శ్రీనివాస్

గతంలోనూ చిక్కిన తిమింగలం

విజయనగరం జిల్లాకు చెందిన శ్రీనివాస్ మూడేళ్లుగా గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీగా ఉన్నారు. ఆయన గతంలో విశాఖ ఎస్ఈ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నప్పుడు అనేక ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని తేలింది. 2001లో కేసు నమోదు చేయగా శాఖాపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. 2014లో శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏఈగా పని చేస్తున్నప్పుడు బిల్లులు మంజూరుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ కేసులో ఇరుక్కున్నారు. ఆ కేసులోనూ శ్రీనివాస్‌పై శాఖాపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. తాజా కేసు మూడోది.

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా లారా ఇ.విలియమ్స్ బాధ్యతలు



లారా ఇ.విలియమ్స్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కొత్త యూఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా ఇ.విలియమ్స్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అమెరికా విదేశీ వ్యవహారాల సీనియర్ అధికారిగా దౌత్యం, సాంకేతికత, నూతన ఆవిష్కరణల్లో విస్తృత అనుభవం ఉంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ‘తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో అమెరికా-భారత్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. ఇరు దేశాల అభివృద్ధి, శ్రేయస్సు కోసం బలమైన పునాదులు నిర్మించేందుకు కట్టుబడి ఉన్నాను. హైదరాబాద్ కాన్సులేట్ జనరల్‌గా పనిచేసిన జెన్నిఫర్ లార్సన్ తన పదవీకాలంలో అద్భుతమైన సేవలు అందించారు. ఆమె అడుగుజాడల్లో నడుస్తూ అన్ని రంగాల్లోని ప్రముఖులు, భాగస్వాములతో పనిచేస్తూ భారత్, అమెరికా ఉమ్మడి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తాను’ అని విలియమ్స్ తెలిపారు.

జస్టిస్ ఎన్.వి.రమణకు

మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం

- 9న అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ప్రదానం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణకు మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ప్రకటించారు. ఈనెల 9న సాయంత్రం కృష్ణా జిల్లా అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే, మండలి ఫౌండేషన్ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం బుద్ధప్రసాద్ తన కార్యాలయంలో విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. ‘దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆఖరి ఘట్టంగా 1942 ఆగస్టు 9న మొదలైన క్విట్ ఇండియా ఉద్యమంలో మహాత్మా గాంధీ పిలుపుతో వెంకట కృష్ణారావు ప్రభావితుడయ్యారు. విద్యార్థి దశలోనే ఉద్యమంలో పాల్గొని, తద్వారా రాజకీయ రంగప్రవేశం చేశారు. తర్వాత ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి పదవులు చేపట్టారు. రాజకీయ విలువలు కాపాడుతూ, గాంధేయ మార్గంలో నిరాడంబర జీవితం గడిపారని గుర్తు చేశారు. ‘ఈ పురస్కారాన్ని గతంలో ప్రసిద్ధ గాయని పి.సుశీల, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, రక్షణరంగ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్‌రెడ్డిలకు ప్రదానం చేసి గౌరవించాం. ఈ ఏడాది జస్టిస్ ఎన్.వి.రమణకు అందజేస్తున్నాం. జస్టిస్ రమణ.. కృష్ణా జిల్లాలో ఓ కుగ్రామంలో జన్మించి పట్టుదల, కృషితో అంచెలంచెలుగా ఎదిగి భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. తెలుగువారు గర్వించే న్యాయకోవిదుడాయన. జస్టిస్ ఎన్.వి. రమణకు ఈ పురస్కారం అందించడం మాకెంతో గర్వకారణం’ అని బుద్ధప్రసాద్ వివరించారు.



జస్టిస్ ఎన్.వి.రమణ

నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోండి

- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడండి
- రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించేలా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో కోర్టుల జోక్యం చాలా పరిమితమైనదని తెలిపారు.

★ జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పోలీసు భద్రత కల్పించాలని, ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని, సీసీటీవీ కెమెరాలతో పోలింగ్‌ను రికార్డ్ చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ వైకాపా ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వడ్లమూడి కిరణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి సమర్పించామన్నారు. ఎన్నికల సంఘం తరఫున స్టాండింగ్ కౌన్సెల్ వాదనలు వినిపిస్తూ.. అప్పిరెడ్డి వినతిని డీజీపీకి పంపామన్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంయుక్త కలెక్టర్లను నియమించామన్నారు.

నేరం బయటపడుతుందని.. ఏటీఎంకు నిప్పు

- డబ్బు నింపే సిబ్బంది నిర్వాకం

యానాం, న్యూస్‌టుడే: ఏటీఎం కేంద్రంలోని నగదును సొంతానికి వాడుకుని, ఆ నేరం బయటపడకుండా అగ్ని ప్రమాదం కుట్రకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. యానాం కొత్తబస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం జులై 8న తెల్లవారుజామున మంటల్లో చిక్కుకుని కాలిబూడిదైంది. తొలుత ఇది ప్రమాదంగా భావించారు. అనంతరం పోలీసుల విచారణలో కుట్ర కోణం బయటపడింది. ఏటీఎంలో నగదు నింపే ఇద్దరు సిబ్బంది పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు గుర్తించారు. నాగాబత్తుల వెంకటేశ్ అలియాస్ బిట్టూ, వనమూరు అనిల్‌బాబు రెండేళ్లుగా ఏటీఎంలలో నగదు నింపే విధుల్లో ఉన్నారు. వీరు విడతల వారీగా రూ.12 లక్షలు స్వాహా చేశారు. సరైన ఆడిటింగ్ లేకపోవడంతో అధికారులు గుర్తించలేదు. ఈ వ్యవహారం ఎప్పటికైనా బయటపడుతుందని భావించిన ఆ నిందితులు.. ఆ రోజు ఉదయం నాలుగున్నర తర్వాత ఏటీఎం కేంద్రంలో 10 లీటర్ల పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఆ క్రమంలో ప్రధాన నిందితుడు బిట్టూ రెండు కాళ్లకూ మంటలు అంటుకోగా, పరుగెత్తుకుంటూ వెళ్లి సమీపంలోని కారెక్కి పారిపోయిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. దాని ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు.



నిందితులతో యానాం పోలీసులు





మద్యం మత్తులో నేలపై నిద్రపోయిన తహసీల్దారు హరిరమణారావు



కష్టమ్మీద లేచి కూర్చునేందుకు ప్రయత్నిస్తూ..

కటిక నేలనే.. పట్టు పానుపు అనుకుని!

- మద్యం తాగి కార్యాలయంలో నిద్రపోయిన తహసీల్దారు
- క్షేత్ర పర్యటనలో ఉన్నారని ప్రజలకు అబద్ధాలు

వంగర, న్యూస్‌టుడే: ఆయన ఓ తహసీల్దారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషిచేయాలి. కానీ, ఇలా కటిక నేల మీద నిద్రపోయారు. పనిభారం వల్ల అలసిపోయి అలా పడుకున్నారని అనుకుంటే పొరబడినట్లే. ఆయన పూటుగా తాగి.. హాయిగా నిద్రపోయారు!! ఈ ఘటన విజయనగరం జిల్లా వంగర మండలంలో చోటుచేసుకుంది. వివిధ పనులపై వెళ్లిన ప్రజలను రోజుల తరబడి తిప్పిస్తున్నారు. తహసీల్దారు హరిరమణారావు గురువారం మధ్యాహ్నం మద్యం తాగి నేలపై నిద్రపోయారు. సిబ్బందికి చెప్పి, గది బయట తాళాలు వేయించారు. పనుల నిమిత్తం వెళ్లినవారు తహసీల్దారు ఎక్కడని అడిగితే.. క్షేత్ర పర్యటనకు వెళ్లారని సమాధానం చెప్పారు. కిటికీలో నుంచి చూడగా ఆయన పడుకుని ఉండటం గుర్తించి మీడియాకు సమాచారం ఇచ్చారు. వెంటనే తాళాలు తీయగా మద్యం మత్తులో ఆయన లేవలేని స్థితిలో ఊగుతూ.. సీట్లో కూర్చునేందుకు ప్రయత్నించి పడిపోయారు. మీడియా అక్కడకు చేరుకుని తహసీల్దారును ప్రశ్నించగా.. విధినిర్వహణలో అలసిపోయినట్లు సమాధానం ఇచ్చారు. ఇంతలో వీఆర్ఏ ఉదయ్‌కుమార్ చేరుకుని ద్విచక్రవాహనంపై ఆయన్ను తీసుకెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఆర్డీవో ఆశయ్య వద్ద ప్రస్తావించగా.. చాలారోజుల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, మద్యం తాగి విధులకు రావడం నేరమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

సెలూన్లకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: సెలూన్లకు ఉచిత విద్యుత్ పథకం కింద ప్రస్తుతం నెలకు ఇస్తున్న 150 యూనిట్లను 200 యూనిట్లకు ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.



EENADU Vol: 51, Issue: 360 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


హృతిక్ రోషన్, ఎన్టీఆర్

కలిసి స్టెప్పేస్తే.. సలామే అనాలి

దేశంలోని అత్యుత్తమ డ్యాన్సర్లలో కథానాయకులు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఎవరికి వారే సాటి. ఇప్పుడీ ఇద్దరూ కలిసి 'వార్ 2' కోసం కాలు కదిపిన సంగతి తెలిసిందే. "సలామే అనాలి.." అంటూ సాగే ఆ పాట ప్రోమోను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. "రేయ్ పగలు ఏదైన గానీ.. మన ముంటే కదా దీవాలీ" అంటూ హుషారుగా సాగుతున్న ఈ పాటకు ప్రీతమ్ స్వరాలు సమకూర్చారు. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. నకాష్ అజీజ్, యాజిన్ నిజార్ ఆలపించారు. బోస్కో లెస్లీ మార్టిస్ నృత్యరీతులందించారు. ఈ గీతంలో హృతిక్, ఎన్టీఆర్ వేసిన స్టెప్స్ ఆకర్షణగా నిలిచాయి. మరి ఈ పూర్తి పాటను చూడాలంటే ఈ నెల 14న సినిమా విడుదలయ్యే వరకు వేచి చూడక తప్పదు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను అయాన్ ముఖర్జీ తెరకెక్కించారు. కియారా అద్వాణీ కథానాయిక.

ఈనాడు సినిమా

సినీసీమకు పెద్ద పండగ సంక్రాంతి. దీన్ని లక్ష్యం చేసుకోవడం కోసం ఏడెనిమిది నెలల ముందు నుంచే కసరత్తులు ప్రారంభించేస్తుంటారు దర్శక నిర్మాతలు. చిత్రీకరణలకు శ్రీకారం చుడుతూనే తమ అగ్రతారల్ని పండగ బరిలో దింపనున్నట్లు సంకేతాలిచ్చి, బెర్తులు ఖరారు చేసుకునే పనిలో పడిపోతారు. అయితే ముగ్గుల పండక్కి సమయం దగ్గరపడే కొద్దీ ఈ లెక్కలన్నీ తారుమారవ్వడమూ పరిపాటే. పండగ పోరులో తప్పక చూస్తామనుకున్న చిత్రాలు అకస్మాత్తుగా రేసు నుంచి తప్పుకోవడం.. అసలు పోటీలోనే లేని సినిమాలు అనూహ్యంగా బాక్సాఫీస్ బరిలోకి దిగిపోవడం ఏటా చూస్తూనే ఉంటాం. సంక్రాంతికి నెల ముందు వరకు ఈ మార్పులు చేర్పులు కనిపిస్తూనే ఉంటాయి. ప్రస్తుతం 2026 పెద్ద పండగ రేసు విషయంలోనూ లెక్కలు మారనున్నట్లు సినీవర్గాల నుంచి సంకేతాలు అందుతుండటం అందరిలోనూ ఆసక్తికరేకెత్తిస్తోంది.

సంక్రాంతి లెక్క మారనుందా!


చిరంజీవి, రవితేజ, ప్రభాస్, బాలకృష్ణ

నిజానికి 2026 సంక్రాంతి చిత్రాలకు సంబంధించి ఇప్పటికే ఓ జాబితా ఖరారైపోయింది. ఈ రేసులో తొలి బెర్తును చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమా ఖరారు చేసుకుంది. ఈ ఏడాది ఆరంభంలో ఈ కలయిక ఖరారైనప్పుడే పండగని లక్ష్యం చేసుకున్నట్లు ప్రకటించేశారు. ఇప్పుడు దీనికి తగ్గట్లుగానే చిత్రీకరణ చకచకా సాగిపోతోంది. చిరు తర్వాత మరో అగ్ర హీరో రవితేజతో పాటు యువ హీరో నవీన్ పొలిశెట్టి ముగ్గుల పండగ బరిలో నిలవనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం రవితేజ నటిస్తున్న ఆ కొత్త చిత్రాన్ని కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్నారు. ఇది పండగ లక్ష్యంగానే చిత్రీకరణను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసింది. మరోవైపు నవీన్ నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' ఇప్పటికే ముగింపు దశకు చేరువైనట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడీ జాబితాలోకి మరికొన్ని సినిమాలు జత కలిసే అవకాశం లేకపోలేదని సంకేతాలందుతున్నాయి.

అవకాశం వీళ్లకేనా!

ప్రస్తుతం సంక్రాంతి రేసుపై కన్నేసిన సినిమాల్లో 'ది రాజాసాబ్' ముందు వరుసలో కనిపిస్తోంది. కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. మారుతి తెరకెక్కిస్తున్నారు. దీన్ని డిసెంబరు 5న తీసుకురానున్నట్లు ఇప్పటికే ప్రకటించినా.. పండగ బరిలో నిలిచే అవకాశమూ లేకపోలేదని చిత్ర వర్గాల నుంచి సంకేతాలు అందుతున్నాయి.


నవీన్ పొలిశెట్టి

ప్రభాస్ అభిమానులు, తెలుగు ట్రేడ్ వర్గాలు 'రాజాసాబ్'ను సంక్రాంతి బరిలో చూడాలని కోరుకుంటున్నాయని ఇటీవలే నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత బలాన్నిచ్చాయి. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ 'అఖండ 2: తాండవం', పవన్ కల్యాణ్ 'ఓజీ' దసరా బరిలో పోటీ పడనున్నట్లు ఆయా చిత్ర నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే ఇప్పటికే 'ఓజీ' బృందం పాటలతో ప్రచార పర్వాన్ని ప్రారంభించేసింది. కానీ, 'అఖండ 2' టీమ్ వైపు నుంచి ఇంకా ఎలాంటి అప్‌డేట్స్ రాకపోతుండటంతో ఇది వాయిదా పడే అవకాశమున్నట్లు నెట్టింట ప్రచారం ఊపందుకుంది. అదే జరిగితే బాలయ్య సినిమా కూడా ముగ్గుల పండగ వైపే మొగ్గు చూపే అవకాశమున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికైతే సెప్టెంబరు 25 లక్ష్యంగానే 'అఖండ 2' డబ్బింగ్ పనుల్ని.. నిర్మాణానంతర కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తున్నారని తెలిసింది.

అనువాదాలూ ఉన్నాయి..

ఏటా సంక్రాంతి బరిలో తెలుగు సినిమాలతో పాటు అనువాద చిత్రాల సందడి కనిపించడమూ పరిపాటే. ఇప్పటికే ఈ విజయ్ 'జన నాయకుడు'గా పండగ బరిలో వినోదాలు పంచనున్నట్లు అధికారికంగా ప్రకటించేశారు. ఇది 2026 జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఇక దీంతో పాటే శివ కార్తికేయన్ నటిస్తున్న 'పరాశక్తి' కూడా సినీప్రియుల్ని అలరించడం ఖాయంగా కనిపిస్తోంది. సుధా కొంగర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై అటు తమిళ్‌తో పాటు ఇటు తెలుగులోనూ మంచి అంచనాలు నెలకొని ఉన్నాయి. మరి ఈ అనువాదాలతో పాటు తెలుగు సినిమాల్ని కలుపుకుంటే ఇప్పటికి సంక్రాంతి లెక్క 7కు తేలుతోంది. మరి ఈ రేసులో ఆఖరికి మిగిలేవెన్ని.. పోటీ నుంచి తప్పుకునేవెన్ని తేలాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

నేటితరం పిల్లలకు ఇట్టిమాని గుణపాఠం

జీవితానికి దగ్గరగా ఉండే ఎన్నో కథలతో అలరిస్తుంది ఈటీవీ విన్. ఇప్పుడు ఉద్యోగాల పేరుతో కన్నవాళ్లను పట్టించుకోని పిల్లలను.. తన పట్ల ఎలా ప్రవర్తించినా సర్దుకుపోయే ఓ తల్లి మనసును కళ్లకు కట్టినట్టు చూపించింది. కనీసం తల్లిదండ్రుల్ని చూడడానికి కూడా సమయం లేని నేటి తరం పిల్లలకు ఈ సినిమాతో గుణపాఠం చెప్పింది. అదే 'ఇట్టిమాని:మేడ్ ఇన్ చైనా'.



సినిమా: 'ఇట్టిమాని: మేడ్ ఇన్ చైనా'
జానర్: కామెడీ డ్రామా
ప్లాట్‌ఫామ్: ఈటీవీ విన్ (తెలుగు)

కథాంశం: చైనాలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతుంటారు ఇట్టి మాదన్ (మోహన్‌లాల్). ఆయన భార్య దేవమ్మ. వీరికి ఇట్టిమాని (మోహన్‌లాల్) జన్మించిన తర్వాత భారతదేశానికి తిరిగొస్తారు. ఐందయాలో [?] ఓ చైనీస్ హోటల్‌ను ప్రారంభిస్తాడు ఇట్టి మాదన్. ఆయన తదనంతరం ఇట్టిమాని వాళ్ల వ్యాపారాన్ని చూసుకుంటాడు. వాళ్ల ఇంటి పక్కనే అన్నమ్మ(రాధిక) అనే మహిళ ఒంటరిగా జీవిస్తుంటుంది. ఆమె ముగ్గురు కొడుకులు పెళ్లిళ్లు చేసుకొని ఎక్కడెక్కడో బతుకుతుంటారు. కనీసం తల్లి వంక తొంగి కూడా చూడరు. ఆ బాధలోనే అన్నమ్మకు గుండెపోటు వస్తుంది. అయినా కొడుకులు రారు. దీంతో అన్నమ్మ బాధను చూడలేక ఇట్టిమాని ఓ నిర్ణయం తీసుకుంటాడు. మరి అదేంటి? అన్నమ్మ పిల్లలకు ఆయన ఎలా బుద్ధి చెప్పాడు? అనేదే 'ఇట్టిమాని: మేడ్ ఇన్ చైనా'. హనీ రోజ్, రాధికా శరత్ కుమార్ తదితరులు నటించిన ఈ సినిమాను జిబి - జోజు [?] తెరకెక్కించారు.


◆ ఉద్యోగాలు, పెళ్లిళ్లు అయ్యాకా.. వారి సంతోషాలే చూసుకుంటూ.. పిల్లల రాక కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న ఎంతో మంది మాతృమూర్తుల ఆవేదనను చూపించింది చిత్రం. పిల్లల్ని అల్లారు ముద్దుగా పెంచే తల్లిదండ్రుల్ని అనాథ ఆశ్రమంలో, గుళ్లల్లో వదిలి పెట్టే వారందర్నీ ఆలోచింపజేస్తుంది చిత్రం. 'ఆతిరే కన్నీరు [?].. ఒంటరితనం మిగులుతుందని తెలిసి కూడా వాళ్ల జీవితాన్ని పిల్లల కోసమే త్యాగం చేసిన తల్లుల కోసమే ఇదంతా' లాంటి ఆసక్తికర సంభాషణలతో రూపొందించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.


సాయి శ్రీనివాస్, అనుపమ

చుక్కలకు చుట్టానివా.. మబ్బులకు సంద్రానివా!

"మంచి హారర్ మిస్టరీ కథతో రూపొందిన చిత్రం 'కిష్కింధపురి'. పిల్లలు, పెద్దలు అందరూ మెచ్చేలా ఉంటుంది" అన్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన.. అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించారు. సాహు గారపాటి నిర్మించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "చుక్కలకు చుట్టానివా.. మబ్బులకు సంద్రానివా.. నింగి నేల దారే వేసే వర్షానివా వర్ణానివా" అంటూ సాగే ఈ మెలోడీ పాటకు చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. పూర్ణాచారి సాహిత్యమందించారు. జావేద్ అలీ ఆలపించారు. రాజు సుందరం నృత్యరీతులందించారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. "ఇది చాలా ప్రత్యేకమైన సినిమా. తప్పకుండా థియేటర్స్‌లో చూసి ఆస్వాదించండి" అంది. ఈ కార్యక్రమంలో కౌశిక్, చైతన్ భరద్వాజ్, మనీషా ఎ దత్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌స్పెక్టర్ జెండే' ఆన్‌డ్యూటీ


మనోజ్ బాజ్‌పేయీ

శక్తిమంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ విలక్షణ నటుడు మనోజ్ బాజ్‌పేయీ. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఇన్‌స్పెక్టర్ జెండే'. చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ... ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. "దొంగాపోలీసుల ఆట ఇప్పుడే ప్రారంభమవుతుంది. ఇన్‌స్పెక్టర్ జెండే ఆన్‌డ్యూటీలో ఉన్నారు. సెప్టెంబరు 5న సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో జెండే అనే పోలీసు అధికారిగా మనోజ్, జిమ్.. కిల్లర్‌గా కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు. ముంబయి పోలీసు అధికారి మధుకర్ జెండే, సీరియల్ కిల్లర్ కార్ల్ భోజరాజ్ మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఓం రౌత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కార్మికుల వేతనాల పెంపుపై కొనసాగుతున్న చర్చలు

● నిర్మాతలు చేసిన నాలుగు ప్రతిపాదనల్లో రెండింటికి ఫెడరేషన్ అంగీకారం

సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై నిర్మాతలు - ఫిల్మ్ ఫెడరేషన్ నాయకుల మధ్య జరుగుతున్న చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ అంశంపై కో-ఆర్డినేషన్ కమిటీ గురువారం ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు, నిర్మాతలు, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో చర్చలు జరిపింది. మరో నాలుగు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని కో-ఆర్డినేషన్ ఛైర్మన్ వీరశంకర్ తెలియజేశారు. నిర్మాతలకు, కార్మికులకు న్యాయం జరిగేలా ఇద్దర్నీ ఒప్పించగలమన్న నమ్మకం తమకుందని.. ఈ సమస్యకు చర్చల ద్వారానే సామరస్యపూర్వక పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ చిన్న చిత్ర నిర్మాతలతో జరిగిన చర్చల వివరాల్ని పంచుకున్నారు. "చిన్న సినిమా నిర్మాతలు పైసా కూడా వేతనాలు పెంచే పరిస్థితుల్లో లేరని తెలియజేయమన్నారు. చిన్న చిత్ర నిర్మాతలు ఎవరితో పని చేయించుకున్నా తమని ఇబ్బంది పెట్టొద్దని కోరార"ని కల్యాణ్ తెలియజేశారు.

వేతన పెంపు పర్సెంటేజీపై నిర్మాతలు స్పష్టత ఇవ్వాలి..

వేతనాల పెంపునకు సంబంధించిన పర్సెంటేజీపై నిర్మాతల నుంచి స్పష్టత వచ్చే దాకా.. తమకు 30శాతం పెంపుతో వేతనాలు ఇచ్చిన నిర్మాతల సినిమా చిత్రీకరణల్లోనే పాల్గొంటామని ఫిల్మ్ ఫెడరేషన్ మరోసారి తేల్చి చెప్పింది. తమకు నిర్మాతలు చేసిన నాలుగు ప్రతిపాదనల్లో రెండింటికి అంగీకారం తెలిపినట్లు వెల్లడించింది ఫిల్మ్ ఫెడరేషన్. చిన్న నిర్మాతలకు ఫిల్మ్ ఫెడరేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని.. వాళ్ల ప్రతిపాదనలపై నిర్మాతల మండలి నిర్ణయం తీసుకుంటుందని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ చెప్పారు.

సంగీత ప్రాధాన్యమున్న ప్రేమకథతో..

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా భాను తెరకెక్కించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. కనకదుర్గారావు పప్పుల నిర్మించారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని "ఎవరే నువ్వు" అనే గీతాన్ని హీరో విజయ్ సేతుపతి ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు భాను మాట్లాడుతూ.. "ఇది సంగీత ప్రాధాన్యమున్న ప్రేమకథతో రూపొందిన సినిమా. ఇలాంటి చిత్రం ఈ మధ్య కాలంలో రాలేదు. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: సిద్ధార్థ్ సాలూర్, ఛాయాగ్రహణం: భాస్కర్ శ్యామల.


ప్రీతి, సాత్విక్

మేఘం వర్షించదా నీతోడుగా..


సిజా రోజ్, రామరాజు

"మనసుల్ని హత్తుకునే బలమైన భావోద్వేగాలతో నిండిన క్రీడా నేపథ్య చిత్రం 'అర్జున్ చక్రవర్తి'" అంటున్నారు దర్శకుడు విక్రాంత్ రుద్ర. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో విజయ రామరాజు టైటిల్ పాత్ర పోషించారు. శ్రీని గుబ్బల నిర్మించారు. సిజా రోజ్ కథానాయిక. హర్ష్ రోషన్, అజయ్ ఘోష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 29న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని 'మేఘం వర్షించదా నీతోడుగా..' అనే గీతాన్ని గురువారం విడుదల చేశారు. ఈ పాటకు విఘ్నేశ్ భాస్కరన్ స్వరాలు సమకూర్చగా.. విక్రాంత్ రుద్ర సాహిత్యమందించారు. కపిల్ కపిలన్, మీరా ప్రకాశ్, సుజిత్ శ్రీధర్ ఆలపించారు.

వినోదాల లిటిల్ హార్ట్స్

"ప్రేక్షకుల్ని కిందపడి కడుపుబ్బా నవ్వుకునేలా చేసే చిత్రం 'లిటిల్ హార్ట్స్'. దీన్ని చూస్తున్నంత సేపూ ప్రతి ఒక్కరికీ తమ కాలేజీ రోజులు, అప్పటి సంఘటనలు, మిత్రులు గుర్తొస్తారు" అన్నారు నిర్మాత బన్నీవాస్. '#90స్' వెబ్‌సిరీస్ ఫేమ్ దర్శకుడు ఆదిత్య హాసన్ నిర్మించిన తొలి చిత్రమిది. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ పతాకంపై సాయి మార్తాండ్ తెరకెక్కించారు. మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా నటించారు. ఈ సినిమాని నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి సెప్టెంబరు 12న థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్రంలోని "రాజా గాడికి.." అనే గీతాన్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని కాలేజీ విద్యార్థుల కోసం ఫ్రీ షోస్ వేయాలనుకుంటున్నాం. ఈ సినిమా చూస్తూ థియేటర్లో ప్రేక్షకులు పొట్టలు పగిలిపోయేలా నవ్వుకుంటారు" అన్నారు. "టైటిల్‌కు తగ్గట్లుగానే మనసుల్ని హత్తుకునే చిత్రమిది" అన్నారు నిర్మాత ఆదిత్య హాసన్. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "మీరు టికెట్ కోసం పెట్టే ప్రతి రూపాయికీ విలువైన వినోదాన్ని అందించే చిత్రమిది. ఈటీవీ విన్‌లో మా సినిమాల్ని ఆదరించినట్లే థియేటర్స్‌లోనూ ఆదరిస్తారని కోరుకుంటున్నా" అన్నారు.


వంశీ, సాయికృష్ణ, శివాని, మౌళి, బన్నీవాస్, సాయి మార్తాండ్, ఆదిత్య

అందుకే బయట వాళ్లను తీసుకొస్తున్నాం..

"టాలీవుడ్ అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. కానీ, ఎన్ని సినిమాలు ఆ స్థాయికి వెళ్తున్నాయన్నది కూడా గుర్తించాలి. ఓ పది చిత్రాల్ని దృష్టిలో పెట్టుకుని లెక్కలేసుకోవడం, మన రెవెన్యూ పెరిగిపోయిందని అనుకోవడం సరైంది కాదు" అన్నారు నిర్మాత బన్నీ వాస్. ప్రస్తుతం ధరలు పెరిగాయని.. ఎంత చిన్న చిత్రమైనా రూ.12కోట్ల బడ్జెట్ అవుతోందని.. బ్లాక్‌బస్టర్ హిట్ అయితే తప్ప నిర్మాతలకు లాభాలు రావట్లేదని చెప్పారు. సినీ కార్మికులు వేతనాల పెంచాలనడంలో తప్పులేదు.. కానీ, వాళ్లు కోరుతున్న పర్సెంటేజ్ బాగా ఎక్కువగా ఉందన్నారు. దాన్ని బ్యాలెన్స్ చేయమని ఫెడరేషన్ నాయకుల్ని నిర్మాతలు అడుగుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఇప్పుడు తెలుగు సినిమా టెక్నీషియన్ల స్కిల్‌ను అప్‌డేట్ చేయాల్సిన అవసరముందన్నారు. "పూర్తిగా మన వారితో అంతర్జాతీయ స్థాయి సినిమాని చేయలేం. అందుకే బయట నుంచి టెక్నీషియన్లను తీసుకొస్తున్నాం. అలా బడ్జెట్‌లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మన వాళ్లు ఆ స్థాయిని అందుకునే వరకు బయట వాళ్ల రాక తప్పదు" అని బన్నీ వాస్ వివరించారు.

నవ్విస్తూ.. భయపెట్టే చిత్రమిది

"సు ఫ్రమ్ సో'.. కర్ణాటకలో విడుదలయ్యేటప్పుడు చిన్న సినిమాలు ఆడవనే వాతావరణం ఉండేది. కానీ, ఈ చిత్రం అద్భుతాలు సృష్టించింది. పరిమిత బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా ఇప్పటికే అక్కడ రూ.34కోట్లు వసూలు చేసింది" అన్నారు దర్శక నిర్మాత, నటుడు రాజ్ బి శెట్టి. ఇప్పుడాయన నిర్మాణంలో జేపీ తుమినాడ్ రూపొందించిన ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా ఈ రోజు థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ బి శెట్టి మాట్లాడుతూ.. 'ఇది చాలా మంచి ఎంటర్‌టైనర్. గ్రామీణ నేపథ్యంగా సాగే కామెడీ హారర్ చిత్రంగా ఉంటుంది. దీన్ని తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తారని నమ్ముతున్నా" అన్నారు. "ఒకప్పుడు ఈవీవీ సత్యనారాయణ చిత్రాల్లో మంచి వినోదం ఉండేది. తర్వాత దాన్ని చాలా రోజులు మిస్సయ్యాం. ఆలోటును ఈ చిత్రం పూరిస్తుంది" అన్నారు నిర్మాత మైత్రీ శశిధర్ రెడ్డి.


మైత్రీ శశి, జేపీ తుమినాడ్, నవీన్, రాజ్ బి శెట్టి

తీర ప్రాంత ఆచారాల నేపథ్యంలో..

రాజ్ బి.శెట్టి, ప్రజ్వల్ దేవరాజ్ ప్రధాన పాత్రధారులుగా గురుదత్ గనిగ తెరకెక్కించిన కన్నడ చిత్రం 'కరవాలి'. ఈ సినిమా త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని రాజ్ పాత్ర ఫస్ట్‌లుక్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గురుదత్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రం కర్ణాటకలోని తీర ప్రాంత ఆచారాల నేపథ్యంలో సాగుతుంది. రాజ్ బి.శెట్టి పాత్ర శక్తిమంతంగా ఉంటుంద'న్నారు.

● 'సినీ కార్మికుల సమ్మె ప్రభావం తమ 'ఉస్తాద్ భగత్‌సింగ్'పై పడలేద'న్నారు నిర్మాత నవీన్ ఎర్నేని. పవన్ కల్యాణ్ పాత్రకు సంబంధించి వారం రోజుల చిత్రీకరణ మిగిలి ఉందని చెప్పారు. ఆ తర్వాత మరో 25రోజుల షెడ్యూల్‌తో మొత్తం సినిమా పూర్తి కానుందన్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీలీల కథానాయిక.



స్థిరాస్తి మార్కెట్.. స్థిరంగా

హౌసింగ్.కామ్, ఐఎస్‌బీ నివేదిక

దిల్లీ: దేశంలోని 13 ప్రధాన నగరాల్లో స్థిరాస్తి ఆస్తుల క్రయవిక్రయాల తీరుతెన్నులను ప్రతిబింబించే సూచీ అయిన హౌసింగ్ ప్రైస్ ఇండెక్స్ (హెచ్‌పీఐ) ఈ ఏడాది మార్చిలో 8 పాయింట్లు పెరిగి 132 పాయింట్లకు చేరుకుంది. హెచ్‌పీఐని సంయుక్తంగా నిర్వహిస్తున్న హౌసింగ్.కామ్, ఐఎస్‌బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్) తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించాయి. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఫరీదాబాద్, గాంధీనగర్, ఘజియాబాద్, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, కోల్‌కతా, ముంబయి, నోయిడా, పుణె నగరాలు ఇందులో ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో ఈ సూచీ 131 పాయింట్ల వద్ద ఉంది. దీని ప్రకారం దేశంలోని ప్రధాన నగరాల్లో స్థిరాస్తి రంగంలో పెద్దగా కదలిక లేని విషయం స్పష్టమవుతోంది. అంతకు ముందు కొంతకాలం పాటు ధరలు బాగా పెరిగాయని, ప్రస్తుతం 'స్థిరీకరణ' చోటుచేసుకుంటున్నట్లు హౌసింగ్.కామ్ మాతృ సంస్థ అయిన రియా ఇండియా సీఓఓ ప్రవీణ్ శర్మ తెలిపారు. ఈ దశ కొంతకాలం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత కొనుగోలుదార్లు ముందుకు రావచ్చన్నారు. ధరల స్థిరీకరణ వల్ల స్థిరాస్తి మార్కెట్లో స్థిర వృద్ధికి అవకాశం ఉంటుందని ఐఎస్‌బీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ) శేఖర్ తోమర్ అభిప్రాయపడ్డారు.

విశాఖలో కార్గో టెర్మినల్, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్

అభివృద్ధి చేయనున్న స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా

దిల్లీ: విశాఖపట్నంలో సాధారణ కార్గో టెర్మినల్, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ (ఎంఎంఎల్‌పీ)ను అభివృద్ధి చేసేందుకు వైజాగ్ ప్రొఫైల్స్ లాజిస్టిక్స్, హింద్ టెర్మినల్స్ సంస్థలతో వ్యూహాత్మక నాన్ బైండింగ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా గురువారం వెల్లడించింది. విశాఖపట్నం, చుట్టుపక్కల ప్రాంతాల్లో లాజిస్టిక్స్ సామర్థ్యాల మెరుగుదల, రవాణా సమయం తగ్గించడం, కార్గో నిర్వహణ సొల్యూషన్స్‌ను అందించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపింది. ఉక్కు తయారీతో పాటు మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ రంగాల్లో విస్తరించాలన్న కంపెనీ చర్యల్లో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా సంయుక్త ఎండీ సురేశ్ కుమార్ బండి వెల్లడించారు.

విజ్ఞానాన్ని పంచే ఐఎస్‌బీ డిస్కవర్

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సరికొత్త ప్రయోగాన్ని చేపట్టింది. ఐఎస్‌బీ డిస్కవర్ (డిస్కవర్.ఐఎస్‌బీ.ఎడు) పేరుతో విజ్ఞానాన్ని పంచే వేదిక (నాలెడ్జ్ ప్లాట్‌ఫామ్)ను రూపొందించింది. ఐఎస్‌బీ నిర్వహించే పరిశోధనలపై అవగాహన కల్పించడం, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, విద్యార్థులకు వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేయడం ప్రధాన లక్ష్యంగా దీన్ని ఆవిష్కరించినట్లు ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల తెలిపారు. మనదేశంలో ఇటువంటి ప్రాజెక్టును చేపట్టిన తొలి బిజినెస్ స్కూలుగా ఐఎస్‌బీ గుర్తింపు పొందుతుందన్నారు.

కోడి గుడ్లు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	445
వరంగల్	447
విజయవాడ	490
గోదావరి	485
విశాఖపట్నం	500
చిత్తూరు	513

50% భారం మోయక తప్పదా?

- ఈనెల 27 నుంచి అదనపు 25% అమలు చేస్తామన్న ట్రంప్
- చర్చల కోసం 25న రానున్న అమెరికా వాణిజ్య బృందం
- గడువులోపు మధ్యంతర ఒప్పందం కష్టమే అంటున్న విశ్లేషకులు
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగితే సుంకాలు తగ్గొచ్చు
- జౌళి, రసాయనాల వంటి రంగాలకు ప్రభుత్వ మద్దతు!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన ఉత్పత్తులపై ప్రకటించిన 50% సుంకాన్ని, ఎగుమతిదార్లు చెల్లించక తప్పేలా లేదు. ఎందుకంటే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఏమీ తేలకపోవడంతో ఆగస్టు 7 నుంచి 25%, ఆగస్టు 27 నుంచి మరో 25% సుంకాన్ని అమలు చేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆరో దఫా వాణిజ్య చర్చల కోసం అమెరికా బృందం ఈనెల 25న భారత్‌కు రానుంది. అదనపు 25% సుంకం వసూలుకు అప్పటికి మరో 2 రోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో.. మధ్యంతర ఒప్పందం శరవేగంగా కుదురుతుందనే ఆశలు సన్నగిల్లుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

రష్యా యుద్ధం ఆపితే

రష్యా నుంచి ముడిచమురు కొంటున్నందునే భారత్‌పై అదనపు సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై దాడుల విరమణ కోసం ఈనెల 8 వరకు రష్యాకు ట్రంప్ సమయం ఇచ్చారు. యుద్ధం ముగింపు దిశగా జరుగుతున్న చర్చల్లో కీలక పురోగతి కనిపించిందనీ ట్రంప్ అన్నారు. ఒక వేళ యుద్ధ విరమణకు రష్యా అంగీకరిస్తే భారత్‌పై సుంకాల తగ్గింపు ఉంటుందనీ సూచనప్రాయంగా తెలిపారు. అది ఎంతో తేలాల్సి ఉంది.

టారిఫ్ గోడలు కడితే.. ప్రత్యామ్నాయ అన్వేషణే

'ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే భారత వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి ట్రంప్ చేర్చారు. ఎటువంటి తర్కం, కారణం కానీ లేకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) దమ్ము రవి అన్నారు. ఏదైనా దేశం టారిఫ్‌తో అడ్డు గోడలు కడుతుంటే, మన ఎగుమతిదార్లు కొత్త మార్కెట్ల వైపు పయనించడమే పరిష్కారమని.. మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, దక్షిణాసియాలపై దృష్టి సారించొచ్చని రవి చెబుతున్నారు. ఈ సమస్య తాత్కాలికమేనని, ఇరు పక్షాలకు ప్రయోజనం కలిగే ఒప్పందం దిశగా అడుగులు పడగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

వాహన విడిభాగాల తయారీదార్లకు సవాళ్లే

అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో కొత్త, వైవిధ్య మార్కెట్లను వాహన విడిభాగాల తయారీదార్లు ఎంచుకోవాల్సి వస్తుందని పరిశ్రమ సంఘం ఏసీఎంఏ చెబుతోంది. పోటీతత్వాన్ని పెంచుకోవడంతో పాటు, విలువ జోడింపును బలోపేతం చేసుకోవాలని తెలిపింది.

✦ 2024-25లో మన ఎగుమతుల్లో 27% (22.9 బి.డాలర్లు) అమెరికాకే చేరాయి.

ఈ 9 రకాల ఎగుమతులు 50-70% తగ్గొచ్చు

అమెరికా 50% టారిఫ్ వల్ల 9 ఉత్పత్తుల విభాగాలపై తీవ్ర ప్రభావం ఉండొచ్చని మేధో సంపత్తి సంస్థ జీటీఆర్ఐ అంటోంది. దీని ప్రకారం..

తీవ్ర ప్రభావం పడే రంగాలు: ✦ రొయ్యలు ✦ ఆర్గానిక్ రసాయనాలు ✦ కార్పెట్లు ✦ నిట్టెడ్-ఓవెన్ దుస్తులు ✦ అపారెల్ మేడప్స్ ✦ రత్నాలు ✦ పసిడి-ఆభరణాలు ✦ మెషినరీ-మెకానికల్ వస్తువులు, ✦ ఫర్నిచరు-బెడ్డింగ్. 2024-25లో రూ.17,400 కోట్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతయ్యాయి. (వీటి ఎగుమతులు 50-70% తగ్గొచ్చు)

ఎక్కువ ప్రభావం పడే రంగాలు: ✦ ఉక్కు ✦ అల్యూమినియం ✦ రాగి ✦ వాహన విడిభాగాలు. (వీటి ఎగుమతులు 30-50% పడిపోవచ్చు)

తక్కువ ప్రభావం పడే రంగాలు: ✦ ఔషధాలు ✦ స్మార్ట్‌ఫోన్లు ✦ పెట్రోలియం ఉత్పత్తులు.

వేలమంది జీవితాలు రోడ్డున పడతాయ్



50% టారిఫ్ వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సత్వరం విధాన సంస్కరణలు అవసరమని రత్నాభరణాల ఎగుమతిదార్ల సంఘం జీజేఈపీసీ అంటోంది. ఎగుమతులు ఆగితే, వేలమంది ఉపాధి కోల్పోతారని జీజేఈపీసీ ఛైర్మన్ కిరిట్ భన్సాలీ అంటున్నారు. పోటీ దేశాలైన తుర్కియే (15%), వియత్నాం (20%), థాయ్‌లాండ్(19%)లకు తక్కువ టారిఫ్ ఉండడమూ ఇబ్బందికరమేనని తెలిపారు.

ఎందుకు ఇబ్బందంటే: మన రత్నాభరణాల ఎగుమతుల్లో దాదాపు 30% అంటే 10 బి.డాలర్ల మేర అమెరికాకే వెళుతున్నాయి.

✦ కట్, పాలిష్డ్ వజ్రాల్లో సగం అమెరికాకే వెళతాయి.

వస్త్ర కంపెనీల స్థితి దారుణమవుతుంది



తక్షణం ప్రభుత్వం నుంచి ఆర్థిక మద్దతు లభించకపోతే వస్త్రాలు తయారు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థలు మూలనపడతాయని దుస్తుల ఎగుమతిదార్ల సంఘం ఏఈపీసీ అంటోంది. కార్మికులు అధికంగా పని చేస్తుంటారు కనుక, ఉపాధికీ ప్రమాదం ఏర్పడుతుంది.

ఇబ్బంది ఇలా: మన నుంచి ఎగుమతి అవుతున్న రెడీమేడ్ దుస్తుల్లో అమెరికాకు 33% వెళతాయి.

✦ 2024-25లో దుస్తుల ఎగుమతులు 8.4 బి.డాలర్లుగా ఉన్నాయి.

అమెరికా ప్రజలకు ఇబ్బందనే ఫార్మాకు మినహాయింపు: ఫార్మెగ్జిల్

అమెరికా ప్రజలకు అందుబాటు ధరలో ఔషధాలను అందించడంలో, మన ఫార్మా రంగానిది కీలక పాత్ర. అందుకే టారిఫ్ నుంచి భారత ఔషధ ఎగుమతులకు తాత్కాలిక మినహాయింపు ఇచ్చినట్లు ఔషధ ఎగుమతి ప్రోత్సాహక మండలి ఫార్మెగ్జిల్ తెలిపింది. అమెరికాలో ఉపయోగించే జనరిక్స్‌లో 40% మనదేశమే సరఫరా చేస్తోంది. మన ఔషధ ఉత్పత్తులపై సుంకం విధిస్తే, అమెరికా వినియోగదార్లకు ధరలు పెరుగుతాయని ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు.

ప్రభావిత రంగాలకు ప్రభుత్వ మద్దతు!

ట్రంప్ టారిఫ్‌ల వల్ల తీవ్ర ప్రభావానికి లోనయ్యే జౌళి, రసాయనాల వంటి రంగాలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎగుమతిదార్లతో వాణిజ్య శాఖ చర్చలు జరుపుతోందని, ప్రభావాన్ని మదింపు చేశాక.. సహకార చర్యలు చేపట్టనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

భారత తయారీ ఐఫోన్లకు సుంకం లేనట్లే!?

విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కంప్యూటర్ చిప్‌లపై 100% టారిఫ్ విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. అమెరికాలో తయారు చేస్తే మాత్రం సుంకాలే ఉండవని. యాపిల్ సీఈఓ టిమ్‌కుక్‌తో సమావేశం సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు. అదేవిధంగా అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టే అమెరికా కంపెనీలకు, దిగుమతి సుంకం నుంచి కొన్ని మినహాయింపులుంటాయన్నారు. యాపిల్ గత 500 బి.డా.కు అదనంగా 100 బి.డా. పెట్టుబడులకు హామీ ఇచ్చినందున, భారత్-చైనాల్లో చేసే ఐఫోన్లకు సుంకం మినహాయింపు లభిస్తుందని భావిస్తున్నారు.

హెచ్‌పీసీఎల్ లాభంలో 548% వృద్ధి



దిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.4,110.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.633.94 కోట్లతో పోలిస్తే ఇది 548% అధికం. ముడి చమురు ధరలు తగ్గినా, ఇంధన రిటెయిల్ విక్రయ ధరల్లో మార్పు చేయకపోవడంతో మార్జిన్లు పెరగడం, నిల్వలపై అధిక లాభాల వల్ల నికర లాభంలో గణనీయ వృద్ధి నమోదైంది. కార్యకలాపాల ఆదాయం రూ.1,21,488.56 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.1,20,700.34 కోట్లకు పరిమితమైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం ద్వారా కంపెనీ 3.08 డాలర్లను ఆర్జించింది.

ఎల్ఐసీ లాభం రూ.10,987 కోట్లు



దిల్లీ: ప్రభుత్వరంగ ఎల్ఐసీ, జూన్ త్రైమాసికంలో రూ.10,987 కోట్ల నికర లాభాన్ని పొందింది. 2024-25 ఇదే కాల లాభం రూ.10,461 కోట్లతో పోలిస్తే ఇది 5% ఎక్కువ. మొత్తం ఆదాయం సైతం రూ.2,10,910 కోట్ల నుంచి రూ.2,22,864 కోట్లకు పెరిగింది. ఎల్ఐసీ సీఈఓ, ఎండీగా నియమితులైన ఆర్.దొరైస్వామి త్రైమాసిక ఫలితాలపై మాట్లాడుతూ 'లాభదాయకత పెంచుకోవడంపై దృష్టి సారించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో రెండంకెల వృద్ధిని సాధిస్తామ'ని పేర్కొన్నారు.

✦ తొలి ఏడాది ప్రీమియం ఏడాది వ్యవధిలో రూ.7,470 కోట్ల నుంచి రూ.7,525 కోట్లకు, రెన్యువల్ ప్రీమియం రూ.56,429 కోట్ల నుంచి రూ.59,885 కోట్లకు పెరిగింది.

రూ.150 కోట్లతో పిట్టీ విస్తరణ

హైదరాబాద్: పిట్టీ ఇంజినీరింగ్‌తో పాటు అనుబంధ సంస్థలు పిట్టీ ఇండస్ట్రీస్, దక్షిణ్ ఫౌండ్రీ తయారీ సామర్థ్యాలను పెంచేందుకు రూ.150 కోట్లు పెట్టుబడి పెడతామని పిట్టీ ఇంజినీరింగ్ వెల్లడించింది. దశలవారీగా 18 నెలల్లో పనులు పూర్తిచేస్తామని తెలిపింది.

✦ ఏప్రిల్-జూన్‌లో రూ.463.97 కోట్ల ఆదాయంపై రూ.22.88 కోట్ల లాభాన్ని సంస్థ నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.394.80 కోట్లు, లాభం రూ.19.36 కోట్లు మాత్రమే.

ఏప్రిల్-జూన్‌లో కొత్తగా 1.67 కోట్ల సిప్ ఖాతాలు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కొత్తగా 1.67 కోట్ల క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) ఖాతాలు ప్రారంభమయ్యాయి. 2025 జనవరి-మార్చిలో కొత్తగా ప్రారంభమైన సిప్ ఖాతాలు 1.41 కోట్లే. స్టాక్ మార్కెట్లో ఒడుదొడుకులున్నా, మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడులపై చిన్న మదుపర్లలో ఆసక్తి కొనసాగుతుండటాన్ని ఇది సూచిస్తోంది.

✦ ఏప్రిల్-జూన్‌లో అత్యధికంగా గ్రో ప్లాట్‌ఫామ్‌పై 41.9 లక్షల కొత్త సిప్ ఖాతాలు తెరిచారు. మార్కెట్ వాటా 25 శాతంగా నమోదైంది. ఒక్క జూన్‌లోనే గ్రో వద్ద 15.7 లక్షల కొత్త సిప్ ఖాతాలు నమోదయ్యాయి. తద్వారా ఒక నెలలో అత్యధిక కొత్త సిప్ ఖాతాలు ఆరంభించిన డిస్ట్రిబ్యూటర్‌గా గ్రో నిలిచింది.

✦ ఏప్రిల్-జూన్‌లో 15 లక్షల కొత్త ఖాతాలతో ఏంజెల్ వన్ రెండో స్థానంలో నిలిచింది. ఎన్‌జే ఇండియాఇన్వెస్ట్ వద్ద 5.9 లక్షలు, ఎస్‌బీఐ సెక్యూరిటీస్ వద్ద 4.3 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ వద్ద 3.8 లక్షలు చొప్పున కొత్త సిప్ ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌పైనా సుమారు 5.9 లక్షల ఖాతాలు ఆరంభమయ్యాయి.

రిటెయిల్.. డిజిటల్ సేవలు.. మీడియా.. వినోదం..

- రిలయన్స్ భవిష్యత్తు వృద్ధి ఇంజిన్లు ఇవే
- కంపెనీ ఛైర్మన్ ముకేశ్ అంబానీ



దిల్లీ: రిటెయిల్, డిజిటల్ సేవలు, మీడియా, వినోదం రూపంలో 4 అధిక వృద్ధి ఇంజిన్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్మించిందని, తదుపరి దశ విస్తరణకు ఇవి దోహదపడతాయని కంపెనీ ఛైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించారు. సరికొత్త తరం డీప్ టెక్ సంస్థగా రిలయన్స్ మారుతోందని కంపెనీ వార్షిక నివేదికలో ఆయన వివరించారు. ఇప్పటి వరకు చమురు, పెట్రో రసాయనాల విభాగాలు కంపెనీ వృద్ధికి కీలకంగా ఉండగా.. గత కొన్నేళ్లలో రిటెయిల్, టెలికాం, డిజిటల్ సేవల్లో రిలయన్స్ శరవేగంగా విస్తరించింది. వార్తలు, వినోద చానెళ్ల ద్వారా మీడియా సామ్రాజ్యాన్ని సృష్టించింది. శుద్ధ ఇంధనంలోకి అడుగుపెట్టేందుకు గిగా ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తోంది. చమురు-రసాయనాల (ఓ2సీ) వ్యాపారంలో బలపడతామని కేవలం వ్యాపారాలను విస్తరించడమే కాకుండా.. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేస్తున్నామని ముకేశ్ అంబానీ తెలిపారు.

6జీ టెక్నాలజీ అభివృద్ధిలో జియో: 6జీ టెక్నాలజీ ఆవిష్కరణ కోసం పరిశోధన, అభివృద్ధి ప్రక్రియలో తమ డిజిటల్ సేవల కంపెనీ జియో క్రియాశీలంగా ఉందని.. ఈ విభాగంలో అంతర్జాతీయ సంస్థగా అవతరించాలని భావిస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. మన దేశంలోని వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో కంపెనీ వాటా దాదాపు 60 శాతమని రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. ఈ ఏడాది మార్చికి జియో 5జీ వినియోగదారుల సంఖ్య 19.1 కోట్లుగా ఉంది.

వరుసగా అయిదో ఏడాదీ వేతనం తీసుకోని ముకేశ్: వరుసగా అయిదో ఏడాదీ రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ముకేశ్ అంబానీ ఎటువంటి వేతనం తీసుకోలేదు. డివిడెండ్ ఆదాయాన్ని మాత్రమే పొందారు. 2008-09 నుంచి 2019-20 మధ్య ఏటా రూ.15 కోట్ల వార్షిక వేతనాన్ని ఆయన అందుకున్నారు. కొవిడ్-19 పరిణామాల్లో 2020-21లో ముకేశ్ అంబానీ స్వచ్ఛందంగా వేతనాన్ని వదులుకున్నారు.

భారత్‌లో డేటా చౌర్యం పెరిగింది

- ఒక్కో సంస్థపై సగటు భారం రూ.22 కోట్లు
- ఐబీఎం నివేదిక



ముంబయి: భారత్‌లో డేటా చౌర్యం గణనీయంగా పెరుగుతోంది. డేటా చౌర్యం కారణంగా 2025లో ఒక్కో సంస్థపై పడిన సగటు భారం 13% పెరిగి రూ.22 కోట్లకు చేరింది. 2024లో ఇది రూ.19.5 కోట్లుగా ఉందని టెక్ దిగ్గజ సంస్థ ఐబీఎం తాజా నివేదికలో పేర్కొంది. ఎక్కువగా వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించేందుకు.. మోసపూరిత సందేశాలు లేదా ఫిషింగ్‌ను వినియోగిస్తున్నారు. మొత్తం ఘటనల్లో వీటి వాటా 18 శాతంగా ఉంది. థర్డ్ పార్టీ వెండర్, సప్లై చెయిన్ హామీలు (17%), బలహీనతల ద్వారా దోచుకోవడం (13%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. డేటా చౌర్యం కారణంగా భారత పరిశోధనా రంగంపై ఎక్కువ ప్రభావం పడుతోంది. ఇక్కడ సగటు వ్యయం రూ.28.9 కోట్లుగా ఉంది. రవాణా పరిశ్రమ (రూ.28.8 కోట్లు), పారిశ్రామిక రంగం (రూ.26.4 కోట్లు) తర్వాత నిలుస్తున్నాయి. డేటా చౌర్యానికి గురైన సంస్థల్లో దాదాపు 60% వాటిలో ఏఐ విధానాలు లేకపోవడం లేదా అభివృద్ధి చేసే దశలోనే ఉన్నాయి. ఏఐ అందిపుచ్చుకునేందుకు కొన్ని సంస్థలు సాధారణ భద్రతను పక్కన పెడుతున్నాయి.

మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ ఆదాయాల్లో క్షీణత

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ సేవల సంస్థ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్, ఏకీకృత ఖాతాల ప్రకారం జూన్ త్రైమాసికానికి రూ.33.29 కోట్ల ఆదాయం, రూ.68.47 లక్షల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోలిస్తే ఆదాయం, నికరలాభం తగ్గాయి. అమెరికాలో నిర్మాణ రంగం కోలుకుంటున్నందున, సమీప భవిష్యత్తులో మంచి కాంట్రాక్టులు లభించే అవకాశాలున్నాయని కంపెనీ వివరించింది. జూన్ చివరకు రూ.53.86 కోట్ల నగదు నిల్వలున్నందున, నిర్మాణ రంగంలోని కంపెనీలను కొనుగోలు చేయగలమని పేర్కొంది. కంపెనీలోని మెకానికల్ డివిజన్ హైబ్రిడ్ టెక్నాలజీ, ప్రాసెస్ ఇంజినీరింగ్‌పై దృష్టి కేంద్రీకరించినందున కొత్త అవకాశాలు లభిస్తాయని సీఎండీ లక్ష్మణరావు తెలిపారు.

గ్లోబల్ ఫౌండ్రీస్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: గ్లోబల్ ఫౌండ్రీస్ (జీఎఫ్) అనే ప్రపంచంలోని అత్యుత్తమ సెమీకండక్టర్ ఫౌండ్రీస్ కంపెనీతో హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ అనుబంధ సైయెంట్ సెమీకండక్టర్స్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం సైయెంట్ సెమీకండక్టర్స్, జీఎఫ్ తరఫున సెమీకండక్టర్ ఉత్పత్తి, సేవలు అందించడానికి అధీకృత విక్రయదారుగా వ్యవహరిస్తుంది. జీఎఫ్‌తో ఒప్పందం వల్ల ఫ్యాబ్రికేషన్ సేవలు, సాంకేతిక సలహాలు, డిజైన్, అసెంబ్లింగ్, టెస్టింగ్.. తదితర సేవలను వినియోగదార్లకు అందించగలుగుతుంది. సైయెంట్ సెమీకండక్టర్స్ సీఈఓ సుమన్ నారాయణన్ స్పందిస్తూ, తమకు ఉన్న టర్న్‌కీ-ఏఎస్ఐసీ సామర్థ్యానికి జీఎఫ్ తోడు వల్ల వాహన, పారిశ్రామిక, వైద్య రంగాలకు మెరుగైన సేవలు అందించగలుగుతామని పేర్కొన్నారు.

10 నిమిషాల్లో ఔషధాలు: జెప్టో

దిల్లీ: ఆన్‌లైన్ ఫార్మసీ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫాం జెప్టో ప్రకటించింది. ఎంపిక చేసిన మెట్రో నగరాల్లో 10 నిమిషాల్లోపే ఔషధాలు డెలివరీ చేస్తామని అంటోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఈ సేవలను మొదలుపెట్టినట్లు కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆదిత్ పలిచా తెలిపారు. 12 నెలల పాటు నమూనా దశలను అధిగమించాకే, ఈ సేవలను ఆవిష్కరించినట్లు తెలిపారు.

యూనివర్సల్ బ్యాంక్‌గా ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

ముంబయి: యూనివర్సల్ బ్యాంక్‌గా మారేందుకు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం వెల్లడించింది. 2015లో ఎస్ఎఫ్‌బీ లైసెన్స్ పొందిన ఏయూ ఫైనాన్షియర్స్, 2017 ఏప్రిల్ నుంచి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా సేవలందిస్తోంది.

భారీ నష్టాల నుంచి కోలుకున్నాయ్

సెన్సెక్స్ -732 నుంచి +79 పాయింట్లకు..

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,997 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.10,864 కోట్లు

సెన్సెక్స్ ▲ 79 — 80623

నిఫ్టీ ▲ 22 — 24596

సమీక్ష

సూచీలు భారీ నష్టాల నుంచి చివరి గంటలో కోలుకున్నాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు ఉపకరించాయి. మన ఉత్పత్తులపై సుంకాన్ని 50 శాతానికి చేరుస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో, మదుపర్లు విక్రయాలకు దిగినందున ఉదయం సూచీలు పడ్డాయి. అయితే రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగించేందుకు అమెరికా తలపెట్టిన చర్చలు సానుకూలంగా ఉన్నాయనే వార్తలతో చివర్లో లాభాల్లోకి వచ్చాయి. డాలరుతో పోలిస్తే, రూపాయి మారకపు విలువ 14 పైసలు లాభపడి 87.58 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.72% పెరిగి 67.37 డాలర్ల వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు సానుకూలంగా ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.16,000 కోట్లు పెరిగి, రూ.445.35 లక్షల కోట్ల (5.08 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 80,262.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,543.99 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు నష్టాల్లోనే కొనసాగిన సూచీ ఒక దశలో 79,811.29 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత ఒక్కసారిగా పెరిగిన సూచీ 80,737.55 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 79.27 పాయింట్ల లాభంతో 80,623.26 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 21.95 పాయింట్ల లాభంతో 24,596.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,634.20-24,344.15 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 1.68%, హెచ్‌సీఎల్ టెక్ 1.17%, ఎటెర్నల్ 0.97%, యాక్సిస్ బ్యాంక్ 0.85%, మారుతీ సుజుకీ 0.80%, టాటా స్టీల్ 0.63%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.63%, ఏషియన్ పెయింట్స్ 0.59%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.51% చొప్పున పెరిగాయి. అదానీ పోర్ట్స్ 1.55%, ట్రెంట్ 1.06% నష్టపోయాయి.

త్రైమాసిక ఫలితాల ప్రభావం

✦ నికర నష్టం రూ.455.50 కోట్లకు చేరడంతో, భెల్ షేరు బీఎస్ఈలో 4.94% తగ్గి రూ.227.80 వద్ద ముగిసింది. ఒక దశలో 7.15% క్షీణించి రూ.222.50కి చేరింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,126.24 కోట్లు తగ్గి రూ.79,321.40 కోట్లకు పరిమితమైంది.

నేటి బోర్డు సమావేశాలు: ఎస్‌బీఐ, టాటా మోటార్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, సీమెన్స్, వోల్టాస్, వోఖార్డ్, మణప్పురం ఫైనాన్స్, ఐఎఫ్‌సీఐ, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎన్ఐఐటీ

✦ **వస్త్రాలు, తోలు ఉత్పత్తుల షేర్లు డీలా:** అమెరికా అదనపు టారిఫ్ ప్రకటన నేపథ్యంలో, వస్త్రాలు, తోలు, మత్స్య ఉత్పత్తుల సంబంధిత షేర్లు డీలా పడ్డాయి. టెక్స్‌టైల్స్ స్టాక్స్‌లో అరవింద్ 2.64%, కేపీఆర్ మిల్ 2.25%, పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 1.98%, లక్స్ ఇండస్ట్రీస్ 1.38%, పేజ్ ఇండస్ట్రీస్ 1.16%, డాలర్ ఇండస్ట్రీస్ 0.56% పడ్డాయి. తోలు ఉత్పత్తుల స్టాక్స్‌లో ఏకేఐ ఇండియా 4.73%, జెనిత్ ఎక్స్‌పోర్ట్స్ 4.11%, ఖాదిమ్ 1.77%, సూపర్‌హౌస్ 1.24%, మెట్రో బ్రాండ్స్ 1.13% నష్టపోయాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థల్లో జీల్ ఆక్వా 3.81%, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 2.98%, అవంతీ ఫుడ్స్ 2.27%, వాటర్‌బేస్ 2% పడ్డాయి.



ఐపీఓ సమాచారం

✦ ఐసీఓడీఈఎక్స్ పబ్లిషింగ్ సొల్యూషన్స్ రూ.42.03 కోట్ల ఐపీఓ ఈనెల 11-13 తేదీల్లో రాబోతోంది. ధరల శ్రేణి రూ.98-102. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై ఈ షేరు నమోదు కానుంది.

✦ రూ.306 కోట్ల సమీకరణ లక్ష్యంతో **రీగల్ రిసోర్సెస్** ఐపీఓ ఈనెల 12-14 తేదీల్లో రాబోతోంది. ధరల శ్రేణి రూ.96-102. తాజా షేర్ల జారీ ద్వారా రూ.210 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.96 కోట్లు సమీకరించనుంది.

300 రెట్ల స్పందన

ముంబయి: హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపీఓ ముగిసే సరికి మదుపర్ల నుంచి 300.61 రెట్ల స్పందన లభించింది. రూ.130 కోట్ల సమీకరణ కోసం 1,60,43,046 షేర్లను కంపెనీ ఆఫర్ చేయగా, 4,82,27,45,343 షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. రిటెయిల్ విభాగంలో 155.58 రెట్ల స్పందన దక్కింది.

సంక్షిప్తంగా..

✦ స్లొవేకియాకు చెందిన **ఐఏసీ గ్రూప్‌**ను కొనుగోలు చేసేందుకు వాహన విడిభాగాల తయారీ సంస్థ **టాటా ఆటోకాంప్ సిస్టమ్స్** ఒప్పందంపై సంతకం చేసింది. లావాదేవీ విలువను వెల్లడించలేదు.

5 లక్షల చ.అ.కు రూ.50 కోట్ల వార్షిక అద్దె

బెంగళూరు: బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని క్యాపిటల్ టవర్స్ వాణిజ్య భవనంలో 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని స్థిరాస్తి సంస్థ **సుమధుర గ్రూప్** అద్దెకు ఇచ్చింది. దీనిపై వార్షికంగా రూ.50 కోట్ల అద్దె ఆదాయం పొందనున్నట్లు సంస్థ తెలిపింది.

✦ **కోటక్ మహీంద్రా బ్యాంక్‌**లో రూ.2,035.36 కోట్ల విలువైన 1,03,57,024 షేర్లను (0.52%) ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ **ఓపెన్‌హైమర్ ఫండ్స్** గురువారం విక్రయించింది. ఒక్కో షేరును సగటున రూ.1,965.20 వద్ద విక్రయించింది.

✦ జాక్‌మాకు చెందిన **యాంట్ ఫైనాన్షియల్**.. జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల మాతృ సంస్థ ఎటెర్నల్‌లో 1.46% వాటాను రూ.4,097 కోట్లకు ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విక్రయించింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
గ్లోబల్ హెల్త్	159	106	1031	861
మెట్రోపోలిస్ హెల్త్	45	38	386	313
అపోలో టైర్స్	12.8	302	6561	6335
సెంచురీ ప్లైబోర్డ్స్	53	34	1169	1005
క్రాంప్టన్‌గ్రీవ్స్	124	152	1998	2138
కేపీఐఎల్	214	84	6188	4609
కల్యాణ్‌జువెలర్స్	264	178	7268	5528
గోద్రేజ్ కన్జూమర్	452	451	3662	3332
టైటన్	1091	715	14,814	12,223
మ్యాప్‌మై ఇండియా	45.8	35.9	121.6	101.5

'అవకాశం ఒకసారి చేజారితే తిరిగి రాదు'.. జీవితంలో ఏదైనా సాధించే క్రమంలో ఇది ఎంతో విలువైన మాట. కానీ, ఏదో ఒక వస్తువు కొనకపోతే.. అద్భుతమైన అవకాశాన్ని కోల్పోతాం అనుకోవడంతోపాటు, ఈ సూత్రాన్ని దానికి అన్వయించడం సరికాదు. సామాజిక వేదికల ప్రభావంతో డిజిటల్ యుగంలో ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) భావన చాలామందిలో కనిపిస్తోంది. ఆర్థిక నిర్ణయాల్లో ఫోమో ఎప్పుడూ మనల్ని తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. చాలామంది ఒక షేరు లేదా మరో పథకం గురించి మాట్లాడుతున్నారనుకుంటాం. వెంటనే మనమూ ఆ పెట్టుబడి పెట్టకపోతే.. జీవితంలో ఎంతో నష్టపోతాం అనే భయం కలుగుతుంది. ఇది మనల్ని ఆలోచనతో కాకుండా, హడావిడిగా నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది.

- **అనవసర ఖర్చులు:** వస్తువులు కొనుగోలు చేయాలనే తొందర వల్ల బడ్జెట్ దెబ్బతింటుంది.
- **పెట్టుబడి నష్టాలు:** షేర్ మార్కెట్ లేదా క్రిప్టో కరెన్సీలో తెలియకుండా మదుపు చేస్తే, డబ్బు కోల్పోయే ప్రమాదం ఉంది.
- **అప్పులు:** ఫోమో కారణంగా అనవసరమైన రుణాలు తీసుకోవడం, ఇది దీర్ఘకాలంలో ఆర్థిక ఒత్తిడికి దారి తీస్తుంది.

ఫోమో బారిన పడొద్దు



ఏం చేయాలి?

ఫోమోను అధిగమించాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే.

- **బడ్జెట్‌ను రూపొందించండి:** మీ ఆదాయం, ఖర్చులను సమీక్షించండి. అవసరమైన ఖర్చులకే ప్రాధాన్యం ఇవ్వండి. వృథా ఖర్చులను అరికట్టండి. అత్యవసర నిధి కోసం కొంత డబ్బును కేటాయించండి.
- **ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి:** స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను గుర్తించండి. ఉదాహరణకు, ఇంటి కొనుగోలు, విద్య, పదవీ విరమణ ప్రణాళికలకు పొదుపు చేయడం.
- **పరిశోధన చేయండి:** సామాజిక వేదికల్లో ప్రచారం చేసే పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా షేర్ల ఎంపికలో. అందరూ కొనండి.. ఇప్పుడు మంచి అవకాశం అన్నట్లు గొప్పలు చెబుతుంటారు. కానీ, ఆ తర్వాత ఏ ధరకు అమ్మాలి అనే విషయం ఎవరూ చెప్పరు. ఎందుకంటే, మనతో కొనిపించడం వరకే వారి పని. ఆ తర్వాత దాని సంగతి వారికి పట్టదు. కాబట్టి, ఆ మాయ మాటలు నమ్మొద్దు. అందుకే, సొంత లెక్కలే ఎప్పుడూ మంచిది.
- **ఆలోచించండి:** ఒక షేరు గురించి అందరూ మాట్లాడుతున్నారు అంటే, వీలైనంత వరకు దాని జోలికి వెళ్లకపోవడమే మంచిది. మీ ఆర్థిక లక్ష్యాలను సంబంధం లేని కంటెంట్‌ను చూడటం మానేయండి. ట్రెండ్‌కు తగ్గట్లు ఉండాలి కానీ, ప్రతి ట్రెండ్‌ను అనుసరించాల్సిన అవసరం లేదు.
- **స్వీయ నియంత్రణ:** ఒక వస్తువును కొనుగోలు చేసే ముందు కనీసం 48 గంటలు ఆలోచించండి. నాకు ఇది నిజంగా అవసరమా? అని స్వయంగా ప్రశ్నించుకోండి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోండి. పెట్టుబడి పథకాల విషయంలోనూ మీ ఆర్థిక లక్ష్యాలకు సరిపోతుందా లేదా అనేది చూడాలి.

సోదరికి ఆర్థిక కానుక

రాఖీ పండగ సోదర సోదరీమణుల మధ్య అనుబంధాన్ని గుర్తు చేసుకునే సందర్భం. సోదరుడు తన సోదరితో రాఖీ కట్టించుకొని, ఆమె రక్షణ కోసం హామీ ఇస్తారు. కానుకలూ బహూకరిస్తారు. అయితే సోదరికి కేవలం సంప్రదాయ కానుకలు ఇవ్వడంతోనే సరిపెట్టుకోవద్దు. తనకు భరోసాను అందించేలా ఆర్థిక బహుమతులు ఇవ్వడం ద్వారా భవిష్యత్తుకు భరోసా కల్పించొచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

సోదరి పేరిట ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ప్రారంభించడం మేలైన ఆర్థిక బహుమతి. ఇది ఆమె డబ్బును సురక్షితంగా ఉంచడమే కాకుండా, స్థిరమైన వడ్డీ ఆదాయాన్నీ అందిస్తుంది. బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఈ డిపాజిట్లు వివిధ కాల వ్యవధులతో అందుబాటులో ఉంటాయి. ఆమె ఆర్థిక లక్ష్యాలను బట్టి, 1-5 సంవత్సరాల వరకూ ఎఫ్‌డీని ఎంచుకోవచ్చు. ఈ కానుక ఆమెకు ఆర్థిక భరోసాతో పాటు, డబ్బు పొదుపు ప్రాముఖ్యతనూ నేర్పుతుంది.

మ్యూచువల్ ఫండ్లు

మ్యూచువల్ ఫండ్లలో ఒకేసారి లేదా క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) మరో గొప్ప కానుక. మీ సోదరి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు వీలుగా ఆమె పేరిట ఒక సిప్ ఖాతాను ప్రారంభించవచ్చు. నెలవారీ చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా, భవిష్యత్తులో మంచి రాబడి అందుకునే ఏర్పాటు చేయొచ్చు. ఆమె ఆసక్తి, నష్టభయాన్ని భరించే సామర్థ్యాన్ని బట్టి, ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. ఇది ఆమెకు ఆర్థిక స్వేచ్ఛ వైపు అడుగు వేయడానికి సాయం చేస్తుంది.



పసిడి రూపంలోనూ

భారతీయ సంప్రదాయంలో బంగారం ఎంతో విలువైనది. ఈ రాఖీ సందర్భంగా మీ సోదరికి బంగారు నాణెం లేదా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (గోల్డ్ ఈటీఎఫ్)ను బహుమతిగా ఇవ్వడం మంచి ఎంపిక. గోల్డ్ ఈటీఎఫ్‌లు బంగారంలో పెట్టుబడి పెట్టేందుకు సులభమైన, సురక్షితమైన మార్గం. ఇవి భౌతిక బంగారాన్ని నిల్వ చేయాల్సిన అవసరాన్ని తప్పిస్తూనే, దాని విలువను అందిస్తాయి. సోదరి పెట్టుబడుల జాబితాకు వైవిధ్యాన్ని జోడిస్తుంది. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తినిస్తుంది.

ఆరోగ్య బీమా

సోదరి ఆరోగ్యాన్ని మించి విలువైనది ఏదీ ఉండదు. ఆమె పేరిట ఒక ఆరోగ్య బీమా పాలసీని తీసుకోండి. తద్వారా ఆమె ఆరోగ్య సంరక్షణ అవసరాలకు ఆర్థిక రక్షణ కల్పించవచ్చు. ఈ రాఖీ పర్వదినాన ఆమెకు ఆరోగ్య బీమా పాలసీని బహుమతిగా ఇస్తే ఊహించని వైద్య ఖర్చుల బారినపడకుండా చూసినట్లే. ఇది ఆమె పట్ల మీరు చూపే ప్రేమ, శ్రద్ధను చూపిస్తోంది. ఇప్పటికే తనకు ఆరోగ్య బీమా పాలసీ ఉంటే, దానికి సూపర్ టాపప్ చేయించండి.

ఆర్థిక అవగాహన పెంచేలా

ఆర్థిక కానుకలతోపాటు, సోదరికి ఆర్థిక అవగాహనను నేర్పించడమూ మంచి ఆలోచనే. ఆర్థిక ప్రణాళికలు, బడ్జెట్ వేసుకోవడం, పెట్టుబడి ఎంపికల గురించి నేర్పించండి. అవసరమైతే వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికల నిపుణులతో సలహాలు ఇప్పించండి. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు అవసరమైన జ్ఞానాన్ని అందిస్తుంది. ఇది ఆమె భవిష్యత్తులో స్వయంగా డబ్బును నిర్వహించుకునేందుకు బాటలు వేస్తుంది.

గిఫ్ట్ కార్డులతో..

ఒకవేళ మీ సోదరికి పెట్టుబడులపై పెద్దగా ఆసక్తి లేకపోతే, ఆమెకు డిజిటల్ వాలెట్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ గిఫ్ట్ కార్డు ఇవ్వొచ్చు. తనకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసే స్వేచ్ఛను ఇస్తుంది. కనీసం ఏడాది గడువు తేదీ ఉన్న కార్డును కొనడం మర్చిపోవద్దు.

సిరి

siri@eenadu.net

ఆ ఫైల్‌ను నమ్మితే

రోజుకో కొత్త మార్గంలో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారు. వీరిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పలు సూచనలు చేస్తోంది. ముఖ్యంగా ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులకు సూచిస్తోంది.

ఏపీకే స్కాములో మోసగాళ్లు తాము బ్యాంకు ఉద్యోగులం లేదా ప్రభుత్వ అధికారులుగా చెబుతారు. ఏపీకే ఫైల్‌ను పంపించామని, దానిని మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిందిగా సూచిస్తుంటారు. ఈ ఫైల్ మొబైల్‌లోకి చేరిందా మోసగాళ్ల చేతిలోకి వెళ్లినట్లే.

ఏం చేయాలి?

- అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయొద్దు. ఆర్‌టీఓ, ఆదాయపు పన్ను శాఖ, బ్యాంకు అధికారులమని చెప్పినా.. ఆ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు. బ్యాంకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇలాంటివి పంపదు.
- అధికారిక మూలాల నుంచి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవతలి వ్యక్తి సందేశాల రూపంలో పంపిన ఫైల్స్‌ను పట్టించుకోవద్దు.
- మీకు వచ్చిన సందేశాలపై అనుమానం ఉంటే, వెంటనే బ్యాంకు వినియోగదారుల కేంద్రానికి ఫోన్ చేయాలి. మోసపోయినట్లు గుర్తిస్తే 1930కు ఫోన్ చేయాలి.

చిన్న మొత్తంతోనూ బంగారం

దీర్ఘకాలిక మదుపరులకు బంగారంపై పెట్టుబడి పెట్టే అవకాశాన్ని కల్పించేందుకు బరోడా బీఎన్‌పీ పారిబస్ మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని రూపొందించింది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర దేశీయ మార్కెట్లో రూ.1లక్షకు దగ్గరగా ఉన్న విషయం విదితమే. సాధారణ ప్రజలతో పాటు వివిధ దేశాలకు చెందిన కేంద్ర బ్యాంకులూ కొంతకాలంగా పసిడిని అధికంగా కొంటున్నాయి. భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అనిశ్చితి వల్ల బంగారం ధర దిగి రావడం లేదు. ఈ నేపథ్యంలో **బరోడా బీఎన్‌పీ పారిబస్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌**లో కనీస మొత్తంతో యూనిట్లు కొనుగోలు చేసి, బంగారం అవసరం ఉన్నప్పుడు ఆ యూనిట్లను విక్రయించి, ఆ సొమ్ముతో ఆభరణాలు కొనుగోలు చేసుకోవచ్చు.

ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 14 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా రూ.500లతో పెట్టుబడి ప్రారంభించవచ్చు.

అగ్రశ్రేణి కంపెనీల్లో

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా **కోటక్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్** అనే ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ సూచీ ఆధారంగా ఈ పథకాన్ని నిర్వహిస్తారు. ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 11. ఎన్‌ఎఫ్‌ఓలో కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి. స్టాక్ మార్కెట్లో నమోదైన 300 అగ్రగామి కంపెనీల జాబితా నుంచి ఎంపిక చేసిన 50 కంపెనీలతో నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్‌ను రూపొందిస్తారు. కోటక్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్ పోర్ట్‌ఫోలియో దాదాపుగా ఈ సూచీని పోలి ఉంటుంది. వివిధ రంగాల్లోని అగ్రశ్రేణి కంపెనీలు కాబట్టి, సహజంగానే ఆయా షేర్ల ధరల్లో హెచ్చుతగ్గులు తక్కువగా ఉంటాయి.

ఒకేసారి 5 'జియో బ్లాక్‌రాక్' పథకాలు

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్, ఒకేసారి అయిదు మ్యూచువల్ ఫండ్ పథకాలను ఆవిష్కరించింది. ఇవన్నీ నిఫ్టీ సూచీల ఆధారంగా రూపొందించినవే. **జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 8– 13 ఇయర్ జీ–సెక్ ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250** ఇండెక్స్ ఫండ్ ఇందులో ఉన్నాయి. ఈ పథకాల ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 12 వరకూ ఉంటుంది. ప్రతి పథకంలోనూ కనీస పెట్టుబడి రూ.500. బ్లాక్‌రాక్ ఎంతో పేరున్న అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ. రిలయన్స్ గ్రూపునకు చెందిన జియో భాగస్వామ్యంతో ఈ సంస్థ మనదేశంలో మ్యూచువల్ ఫండ్ల మార్కెట్లోకి కొత్తగా అడుగుపెట్టింది. నాలుగు ఈక్విటీ, ఒక డెట్ పథకాన్ని తీసుకొచ్చింది. ఇవన్నీ ప్యాసివ్ పద్ధతిలో నిర్వహించే పథకాలు కావడం గమనార్హం. అంటే ఫండ్ మేనేజర్ పాత్ర పరిమితంగా ఉంటుంది. ఫండ్ వ్యయాలూ, తక్కువగానే ఉంటాయి. ప్రధానంగా ఆయా పథకాలకు కొలమానంగా ఉన్న సూచీల్లోని షేర్లపై పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించటం ఈ పథకాల లక్ష్యం.

ఎఫ్‌డీ.. భద్రంగా

ఫిక్స్‌డ్ డిపాజిట్ల భద్రత కోసం యాక్సిస్ బ్యాంక్ తన ఖాతాదారుల కోసం 'లాక్ ఎఫ్‌డీ' అనే సౌకర్యాన్ని తీసుకొచ్చింది. బ్యాంకు మొబైల్ యాప్ ఓపెన్, అన్ని శాఖల్లోనూ ఇది లభిస్తుంది. సైబర్ ముప్పు నుంచి మరో అంచె రక్షణ కల్పించడమే దీని లక్ష్యమని బ్యాంకు వివరించింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్లను గడువుకు ముందే రద్దు చేసే ప్రయత్నాలను ఇది నిరోధిస్తుంది. ఎఫ్‌డీ లాకర్‌ను వినియోగించుకున్న ఖాతాదారులు, తమ ఎఫ్‌డీని ముందే రద్దు చేసుకోవాలంటే కచ్చితంగా బ్యాంకు శాఖకు వెళ్లాల్సిందే. దీనివల్ల డిజిటల్ మోసాల బారిన పడే అవకాశం ఉండదు.

అప్పు చేసి పెట్టుబడులు వద్దు

1 కొన్ని అనారోగ్య సమస్యలున్నాయి. నా వయసు 52. నేను ఆరోగ్య బీమా తీసుకునేందుకు వీలవుతుందా? నాకున్న ఇబ్బందులను బీమా సంస్థకు తెలియజేయాలా? ఆన్‌లైన్‌లో పాలసీ తీసుకుంటే సులువుగా ఇస్తారా? **- అరుణ**

ఆరోగ్య సమస్యలున్నప్పటికీ ఆరోగ్య బీమా తీసుకునే అవకాశం కొన్నిసార్లు ఉంటుంది. ఆరోగ్య సమస్యలు, తీవ్రతను బట్టి బీమా సంస్థల విచక్షణ మేరకు పాలసీ లభిస్తుంది. కొన్ని వ్యాధులకు 2-3 ఏళ్లపాటు వేచి ఉండే వ్యవధి ఉంటుంది. ఆ తర్వాతే వాటి చికిత్సకు పరిహారం వస్తుంది. మంచి క్లెయిమ్ పరిష్కార చరిత్ర ఉన్న కంపెనీల నుంచి బీమా పాలసీ తీసుకోండి. దరఖాస్తు పత్రంలో అన్ని వివరాలూ కచ్చితంగా పూర్తి చేయండి. మీకున్న ఆరోగ్య సమస్యల గురించి తెలియజేయండి. బీమా సంస్థ మీ దరఖాస్తును పరిశీలించి, నిబంధనల మేరకు పాలసీనిచ్చే అవకాశం ఉంటుంది. ప్రీమియం లోడింగ్ వచ్చే అవకాశమూ ఉంది. అంటే, సాధారణ ప్రీమియంకన్నా కాస్త అధికం అన్న మాట. ఆన్‌లైన్‌లోనూ పాలసీ తీసుకోవచ్చు. కానీ, మంచి సేవను అందించే బీమా సలహాదారు ద్వారా తీసుకుంటే, ఏదైనా క్లెయిమ్ చేసుకోవాలనుకున్నప్పుడు వారు సహాయం అందించేందుకు వీలుంటుంది.

2 నా వయసు 17. మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాను. వీలవుతుందా? ఎలాంటి ఫండ్లను ఎంచుకోవాలి? **- చైత్ర**

చిన్న వయసులోనే పెట్టుబడుల గురించి ఆలోచించడం అభినందనీయం. మీరు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. కానీ, నేరుగా ఇప్పుడే మదుపు చేయలేరు. మేజర్ అయ్యాకే మీరు సొంతంగా మదుపు చేసుకోవచ్చు. అప్పటి వరకూ మీ తల్లిదండ్రుల/సంరక్షకుల పేరుతో పెట్టుబడి పెట్టండి. దీర్ఘకాలం కోసం పెట్టుబడులు పెట్టాలనుకుంటేనే మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోండి. కనీసం 10 ఏళ్లపాటు పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయి. అధిక రాబడి రావాలంటే, కాస్త నష్టభయం భరించాల్సి ఉంటుంది. ఈక్విటీ డైవర్సిఫైడ్ ఫండ్లలో మదుపు చేయండి. మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లలోనూ మీ పెట్టుబడి మొత్తంలో 40 శాతం మదుపు చేయండి. మార్కెట్లో హెచ్చుతగ్గులు వచ్చినా ఆందోళన చెందవద్దు.

3 నేను దీర్ఘకాలిక లక్ష్యంతో మదుపు చేయాలని అనుకుంటున్నాను. నా వయసు 27. నెలకు రూ.10వేల చొప్పున పెట్టుబడి పెడుతూ, ఏడాదికి 10 శాతం పెంచాలని ఆలోచన. 20 ఏళ్లలో ఎంత మొత్తం అవుతుంది? ఎలాంటి ఫండ్లను ఎంచుకోవాలి? ఇప్పటికే టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలున్నాయి. **- సాయితేజ**

పెట్టుబడులు పెట్టేటప్పుడు ఒక ఆర్థిక లక్ష్యం ఉండాలి. ఎంతకాలం మదుపు చేస్తామనే విషయంపైనా స్పష్టత ఉండాలి. మీరు భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ 20 ఏళ్లపాటు మదుపు చేయడం మంచిదే. నెలనెలా ఒకే మొత్తాన్ని కొన్నేళ్లపాటు కొనసాగించడం కన్నా, ఏడాదికి 10 శాతం పెంచుకుంటూ వెళ్తే మంచి ఫలితాలు ఉంటాయి. నెలకు రూ.10వేల చొప్పున 12 శాతం రాబడితో.. ఏటా 10 శాతం పెంచుకుంటూ వెళ్తే.. 20 ఏళ్ల తర్వాత రూ.1.75 కోట్ల వరకూ జమ అయ్యే అవకాశం ఉంది. పెట్టుబడిని పెంచకుండా నెలకు రూ.10వేలు స్థిరంగా పెట్టుబడి పెట్టుకుంటూ వెళ్తే.. 20 ఏళ్ల తర్వాత రూ.86,46,293 మాత్రమే అయ్యే అవకాశం ఉంది. డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకొని, మదుపు చేయండి.



4 ఏడాది క్రితం రూ.10లక్షల వ్యక్తిగత రుణం తీసుకున్నాను. ఈ మొత్తాన్ని కొన్ని షేర్లలో పెట్టుబడి పెట్టాను. నెలనెలా ఈఎంఐ నా ఆదాయంలో నుంచే చెల్లిస్తున్నాను. షేర్లలో కొంత రాబడి కనిపిస్తోంది కానీ, కాస్త భయం వేస్తోంది. వాటిని పూర్తిగా అమ్మేసి, రుణం చెల్లించడం మంచిదా? దీర్ఘకాలం కొనసాగిస్తే ఇంకా అధిక లాభాలు వస్తాయా? **– మధుకర్**

కొవిడ్ తర్వాత స్టాక్ మార్కెట్‌లో చాలా అధికంగా రాబడి వచ్చిన మాట నిజమే. కానీ, నాలుగైదేళ్ల రాబడులను చూసి, షేర్లు అంటే ఎప్పుడూ లాభాలే వస్తాయనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. కొంతమంది కొత్త మదుపరులు అప్పులు చేసి, మార్కెట్లో పెట్టుబడులు పెట్టారు. ఈక్విటీల్లో ఎప్పుడూ సొంత డబ్బును మాత్రమే పెట్టుబడి పెట్టాలి. రుణాలు తీసుకొని, మదుపు చేయడం సరికాదు. వ్యక్తిగత రుణానికి కనీసం 13-15 శాతానికి పైగా వడ్డీ ఉంటుంది. స్టాక్ మార్కెట్లో ఇంతకు మించి లాభాలను ఆర్జించగలగాలి. ఇటీవలి కాలంలో సూచీలు గరిష్ఠ స్థాయి నుంచి పడిపోయాయనే విషయం మరవరాదు.

మీరు అప్పు చేసి, షేర్లలో పెట్టుబడి పెట్టారు. లాభంలోనే ఉన్నారు కాబట్టి, ప్రస్తుతానికి వీటిని విక్రయించడమే మంచిది. వచ్చిన మొత్తంతో రుణం తీర్చేయండి. ఇప్పటి వరకూ ఈఎంఐ చెల్లిస్తున్న మొత్తాన్ని మార్కెట్‌లోకి మళ్లించే ఏర్పాటు చేసుకోండి. మీకు షేర్లపైన అవగాహన ఉంటే, మంచి వాటిని ఎంచుకొని, పెట్టుబడులు కొనసాగించండి. ప్రత్యామ్నాయంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లనూ పరిశీలించవచ్చు. మదుపరులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఒకటుంది.. స్టాక్ మార్కెట్లో కొన్నిసార్లు నాలుగైదేళ్లపాటు ఎలాంటి లాభాలూ రాకపోవచ్చు. ఆరేడేళ్ల తర్వాత మంచి రాబడి కనిపించవచ్చు. కాస్త ఓపికగా ఎదురుచూస్తూ, క్రమశిక్షణతో, క్రమానుగతంగా పెట్టుబడులు పెట్టడం అలవాటు చేసుకోవాలి.

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను (siri@eenadu.netకు మెయిల్ చేయండి.)

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఉద్యోగులూ.. ఇవి మర్చిపోకండి

ఆదాయం పెరిగినప్పుడు, బోనస్ అందినప్పుడు చాలామంది ఉద్యోగులు తమ ఖర్చులనూ పెంచేస్తుంటారు. దీన్ని జీవన శైలి ద్రవ్యోల్బణం అని అంటారు. నియంత్రణ లేని ఖర్చులు మీ పొదుపు, పెట్టుబడులను ఖాళీ చేయొచ్చు. మరి, దీనికి పరిష్కారం ఏమిటి?

ఉద్యోగులకు ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యం. కానీ, అనుకోకుండా చేసే కొన్ని సాధారణ తప్పిదాలు వారి భవిష్యత్తు ప్రణాళికలను ప్రభావితం చేయొచ్చు. ముఖ్యంగా వేతనం పెరినప్పుడు ఖర్చులు అధికంగా చేయడం, క్రెడిట్ కార్డును అధికంగా వినియోగించడం, పెట్టుబడులను పట్టించుకోకపోవడం, అత్యవసర నిధి లేకపోవడం, బడ్జెట్ తయారు చేయకపోవడం వంటి పొరపాట్లు భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభానికి కారణం కావచ్చు.

పెట్టుబడులను వాయిదా వేస్తే..

వేతనం పెరిగితే, జీవన శైలి ఒక్కసారిగా మారిపోతుంది. ఖరీదైన వస్తువులు కొనడానికీ వెనకాడం. ఫలితంగా మీ ఆదాయం పెరిగినా, భవిష్యత్తుకు ఉపయోగపడకపోవచ్చు. జీతం పెరిగినప్పుడు ఆ పెరిగిన మొత్తంలో కనీసం 50 శాతం పెట్టుబడులు పెట్టడం అలవాటు చేసుకోవాలి. ఉదాహరణకు రూ.5వేలు జీతం పెరిగితే, వెంటనే అందులో నుంచి రూ.2,500 దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడి పథకాలకు మళ్లించాలి.

క్రెడిట్ కార్డ్ ఉందిగా

క్రెడిట్ కార్డు ఉందని చాలామంది చిన్నపాటి కొనుగోలుకూ దాన్ని ఉపయోగించడం మొదలుపెడతారు. క్రెడిట్ కార్డు ఛార్జీలు, ఆలస్య రుసుము, వడ్డీ రేట్ల గురించి తెలియకపోతే ఇది ఆర్థికంగా భారంగా మారొచ్చు. క్రెడిట్ కార్డును పరిమితంగా, జాగ్రత్తగా ఉపయోగించండి. బిల్లులు సమయానికి చెల్లించండి. అనవసర కొనుగోళ్లను నివారించండి. ఎప్పుడూ పూర్తి బిల్లును ఒకేసారి చెల్లించేలా చూసుకోండి. కనీస చెల్లింపుతో వడ్డీ భారం అవుతుంది. క్రెడిట్ కార్డు పరిమితిలో గరిష్ఠంగా 40 శాతానికి మించి వినియోగించడం క్రెడిట్ స్కోరుకు మంచిది కాదు.



పెట్టుబడులు మర్చిపోవడం

చాలామంది పొదుపు, పెట్టుబడులను 35 ఏళ్ల తర్వాతే మొదలుపెట్టాలని ఆలోచిస్తుంటారు. కానీ, ఇది పెద్ద తప్పు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచే మీ జీతంలో 20-30 శాతం వరకూ పొదుపు, పెట్టుబడులకు కేటాయించడం ప్రారంభించండి. ఉదాహరణకు క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మ్యూచువల్ ఫండ్లలో చిన్న మొత్తంతోనూ పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీర్ఘకాలంలో చక్రవడ్డీ ప్రభావంతో మంచి నిధి సమకూరుతుంది. తొందరగా పెట్టుబడులు పెట్టడం వల్ల పదవీ విరమణ, ఇతర ఆర్థిక లక్ష్యాలకు తగినంత డబ్బు జమ అవుతుంది.

అత్యవసర నిధి

అనుకోని ఖర్చులు ఎప్పుడైనా రావచ్చు. అందుకే, అత్యవసర నిధిని దాచుకోవడం ఉద్యోగులకు తప్పనిసరి. మీ నెలవారీ ఖర్చులకు కనీసం ఆరు రెట్లు ఈ నిధి ఉండాలి. అదే సమయంలో బృంద ఆరోగ్య బీమా పాలసీ ఉన్నా, సొంతంగా ఒక పాలసీ తీసుకోవడం మర్చిపోవద్దు. మీ నెలవారీ ఖర్చులు రూ.50వేలు ఉంటే, కనీసం రూ.3లక్షల అత్యవసర నిధి అందుబాటులో ఉండాలి. అన్ని రకాల ఆసుపత్రి ఖర్చులను కవర్ చేసేలా ఒక ఆరోగ్య బీమా తీసుకోవాలి. అప్పుడే మీ పెట్టుబడులు సురక్షితంగా ఉంటాయి.

బడ్జెట్ లేకపోవడం

మీ జీతం ఎక్కడ ఖర్చు అవుతుందో తెలియకపోతే, డబ్బు గురించి అవగాహన లేనట్లే. బడ్జెట్ లేకుండా ఖర్చు చేయడం ఆర్థిక క్రమశిక్షణకు చేటు. మీ ఖర్చులను వర్గాల వారీగా విభజించండి. ఉదాహరణకు అద్దె, కిరాణా, పొదుపు, వినోదం.. జీతంలో 50 శాతం ఇలాంటి అవసరమైన ఖర్చులకూ, 30 శాతం కోరికలకూ, 20 శాతం పెట్టుబడులకూ కేటాయించండి. బడ్జెట్ తయారుచేసుకుంటే, వృథా ఖర్చులు తగ్గి, ఆర్థిక లక్ష్యాలను సాధించడం సులువవుతుంది.

అపోహలు వీడాలి ధీమాగా ఉండాలి

అనుకోని పరిస్థితుల్లో ఆర్జించే వ్యక్తికి ఏదైనా జరిగినప్పుడు.. అతని/ఆమె కుటుంబానికి ఆర్థికంగా రక్షణ కల్పించేది బీమా. ఇప్పుడు పాలసీలను తీసుకోవడం ఎంతో సులభం. దీంతోపాటు అవగాహనా పెరుగుతోంది. అయినప్పటికీ, చాలామంది కొన్ని చిన్న చిన్న అపోహలతో తమ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో విఫలం అవుతున్నారు. ఈ నేపథ్యంలో బీమా పాలసీలపై ఉన్న అపోహలు, వాస్తవాల గురించి తెలుసుకుందాం.

అపోహ: జీవిత బీమా అర్థం చేసుకోవడం కష్టం.
వాస్తవం: గతంలో జీవిత బీమా అంటే ఎన్నో పత్రాలు, నిబంధనలు, అర్థం కాని పదాలతో కూడిన దరఖాస్తులుండేవి. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బీమా సంస్థలు డిజిటల్‌లోనే పాలసీలను విక్రయిస్తున్నాయి. పాలసీ దరఖాస్తు నుంచి పాలసీ డాక్యుమెంట్ వరకూ అన్నీ డిజిటల్‌లోనే. ఇ-కేవైసీలాంటివి చేస్తే చాలు. ఒక్క రోజులోనే పాలసీ జారీ అవుతోంది. ఇంకా బీమా పాలసీలు అర్థం కావు అనే మాట అనడం పాత ఆలోచనలే.




అపోహ: జీవిత బీమా ఖరీదైనది
వాస్తవం: జీవిత బీమా పాలసీ ఖరీదైనది అనే అపోహ చాలామందిలో ఉంటుంది. కానీ, టర్మ్ పాలసీలు తక్కువ ప్రీమియంతోనే ఎక్కువ రక్షణ లభిస్తాయి. ఉదాహరణకు ఒక 30 ఏళ్ల వ్యక్తి (ధూమపానం చేయని) రూ.1కోటికి పాలసీ తీసుకుంటే, నెలకు రూ.800 ప్రీమియంతో లభిస్తుంది. సెక్షన్ 80సీ పరిమితికి లోబడి (పాత పన్ను విధానం) బీమా పాలసీలకు చెల్లించిన ప్రీమియానికి రూ.1.5 లక్షల వరకూ పన్ను మినహాయింపు ఉంటుంది.

అపోహ: జీవిత బీమా యువతకు అవసరం లేదు.
వాస్తవం: చాలామంది యువకులు తమ జీవిత బీమా తీసుకునే అంశాన్ని వాయిదా వేయొచ్చని భావిస్తారు. కానీ, ఇది ఇంటిని నిర్మించే ముందు బలమైన పునాది వేయడంతో సమానం. చిన్న వయసులో ఉన్నప్పుడే బీమా తీసుకుంటే, ప్రీమియం తక్కువగా ఉంటుంది. కవరేజీ ఎక్కువ కాలం కొనసాగించేందుకు వీలవుతుంది. ఆదాయం ఉన్న వారికి, ముఖ్యంగా తమపై ఆధారపడి ఉన్న వారు వీలైనంత తొందరగా బీమా తీసుకోవడం మంచిది.

అపోహ: క్లెయిం త్వరగా పరిష్కారం కాదు.
వాస్తవం: బీమా కంపెనీలు క్లెయిములను తిరస్కరిస్తాయని చాలామంది భావిస్తారు. కానీ, ప్రముఖ బీమా సంస్థలు 98 శాతానికి పైగా క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తితో ఉన్నాయి. కొన్ని సంస్థలు ఒక రోజులోనే క్లెయిమ్ సెటిల్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. పాలసీ నిబంధనలను సరిగా అర్థం చేసుకొని, క్లెయిమ్ గురించి నామినీకి స్పష్టంగా చెప్పడం పాలసీదారుడి బాధ్యత. మిగతాదంతా బీమా సంస్థ చూసుకుంటుంది.

అపోహ: పాలసీదారు మరణిస్తేనే జీవిత బీమా పరిహారం
వాస్తవం: జీవిత బీమా పాలసీల్లో ఎన్నో రకాలున్నాయి. టర్మ్ పాలసీ తీసుకున్నప్పుడు, పాలసీదారుడు మరణించిన సందర్భాల్లోనే నామినీకి పరిహారం అందుతుంది. యూనిట్ ఆధారిత బీమా పాలసీలు, ఎండోమెంట్, మనీ బ్యాక్, యాన్యుటీ ఇలా అనేక రకాల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పొదుపు, పెట్టుబడుల కోసమూ వాడుకోవచ్చు. పదవీ విరమణ ప్రణాళికల్లో ఇవి ఎంతో కీలకంగానూ ఉంటాయి.

ప్రోటీన్‌లు జీవకణాల్లో అత్యంత ముఖ్యమైన అణువులు. ఇవి అమైనో ఆమ్లాలతో రూపొందిన పాలీపెప్టైడ్ గొలుసులు. ఇవి శరీరంలో నిర్మాణాత్మక, క్రియాత్మక, నియంత్రణ పాత్రలను నిర్వహిస్తాయి. ప్రోటీన్ల ధర్మాలు, నిర్మాణం, విధులు, నిర్దిష్టత, జీవసంశ్లేషణ వాటిని జీవ వ్యవస్థల్లో అనివార్యమైన అణువులుగా చేస్తాయి. ఇవి కణ విధులు, శరీర నిర్మాణం, రోగనిరోధక రక్షణ, జీవక్రియలో కీలకపాత్ర పోషించడం వల్ల వీటిని జీవం పునాదిగా అభివర్ణిస్తారు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

ఉడికించిన గుడ్డుకి గట్టిదనం ప్రోటీన్ విస్వాభావికత..

ప్రోటీన్‌లు

నిర్మాణం

ప్రోటీన్లు 20 రకాల అమైనో ఆమ్లాలతో రూపొందిన పాలీపెప్టైడ్ గొలుసులు. ఈ అమైనో ఆమ్లాలు పెప్టైడ్ బంధాలతో అనుసంధానితమై ఉంటాయి. ఈ బంధాలు ఒక అమైనో ఆమ్లానికి చెందిన కార్బాక్సిల్ సమూహం (–COOH), మరొక అమైనో ఆమ్లానికి చెందిన అమైనో సమూహం ($-NH_2$) మధ్య ఏర్పడతాయి.

✦ అమైనో ఆమ్లాల వరుస క్రమం ప్రోటీన్ నిర్దిష్ట విధిని నిర్ణయిస్తుంది.

ఉదా: ఇన్సులిన్ ప్రోటీన్‌లో 51 అమైనో ఆమ్లాలు నిర్దిష్ట క్రమంలో ఉంటాయి. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయులను నియంత్రించడంలో సహాయపడుతుంది.

త్రిమితీయ నిర్మాణం: ప్రోటీన్ల నిర్మాణాన్ని వాటి క్రియాత్మకత ఆధారంగా నాలుగు స్థాయుల్లో వివరించవచ్చు. అవి:

ప్రాథమిక నిర్మాణం: ఈ నిర్మాణం అమైనో ఆమ్లాల రేఖీయ క్రమాన్ని తెలియజేస్తుంది. ఈ క్రమం DNAలోని జన్యు సమాచారం ఆధారంగా ఉంటుంది. ఒక్క అమైనో ఆమ్లంలో మార్పు కూడా ప్రోటీన్ పని తీరును మార్చవచ్చు

ఉదా: సికిల్‌సెల్ అనీమియాలో హిమోగ్లోబిన్

ద్వితీయ నిర్మాణం: హైడ్రోజన్ బంధాల ద్వారా ఏర్పడే స్థానిక నమూనాల లాంటి α-హెలిక్స్ (స్పైరల్ ఆకారం), β-ప్లీటెడ్ షీట్స్ (మడతపెట్టిన షీట్ ఆకారం) నిర్మాణాలు ప్రోటీన్ల ద్వితీయ నిర్మాణాలను సూచిస్తాయి.

ఉదా: జుట్టు, గోళ్లలోని కెరాటిన్, ఎక్కువగా α-హెలిక్స్ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది.

తృతీయ నిర్మాణం: ప్రోటీన్ గొలుసు త్రిమితీయ ఆకృతిలో మడతపడి ఉంటుంది. ఇది హైడ్రోజన్ బంధాలు, డైసల్ఫైడ్ బంధాలు, హైడ్రోఫోబిక్ అనుసంధానాలు, అయానిక్ బంధాల ద్వారా స్థిరీకరించి ఉంటుంది. ఈ నిర్మాణం ప్రోటీన్ క్రియాశీల స్థానాన్ని ఏర్పరుస్తుంది.

ఉదా: ఎంజైమ్‌ల్లో చర్య స్థానాలు

చతుర్థ నిర్మాణం: ఈ రకమైన ఉన్నత స్థాయి నిర్మాణం బహుళ పాలీపెప్టైడ్ గొలుసుల ఉప ప్రమాణాల సమాహారం. ఇది ఒక సంపూర్ణ క్రియాత్మక ప్రోటీన్లను ఏర్పరుస్తుంది.

ఉదా: హిమోగ్లోబిన్ నాలుగు సబ్‌యూనిట్లతో కూడిన చతుర్థ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఇది ఆక్సిజన్ రవాణాకు సహాయపడుతుంది.

విస్వాభావికత

అధిక ఉష్ణోగ్రత, తీవ్రమైన pH మార్పులు లేదా రసాయనాల (యూరియా లాంటివి) ప్రభావంతో ప్రోటీన్లు తమ స్వాభావిక త్రిమితీయ నిర్మాణాన్ని కోల్పోతాయి. దీన్ని విస్వాభావికత లేదా డీనేచురేషన్ అంటారు.

▮ డీనేచురేషన్ వల్ల ప్రోటీన్ క్రియాశీల స్థానం దెబ్బతిని, దాని క్రియాశీలతను కోల్పోతుంది.

ఉదా: గుడ్డు ఉడికించినప్పుడు ఆల్బుమిన్ ప్రోటీన్ డీనేచర్ అవుతుంది. ఫలితంగా అది గట్టిగా మారుతుంది.

బఫరింగ్ సామర్థ్యం

ప్రోటీన్లు అమైనో ఆమ్లాల్లోని విద్యుత్ ఆవేశాన్ని కలిగి ఉంటాయి. ఇవి కణాల్లో pHని నియంత్రించడంలో సహాయపడతాయి.

ఉదా: హిమోగ్లోబిన్ రక్తంలో pH సమతౌల్యతను కాపాడుతుంది.

నిర్దిష్టత

ప్రోటీన్లు అత్యంత నిర్దిష్టమైన విధులను కలిగి ఉంటాయి. ఇవి వాటి అమైనో ఆమ్ల క్రమం, త్రిమితీయ నిర్మాణంపై ఆధారపడతాయి.

ఉదా: లైసోజైమ్ ఎంజైమ్ బ్యాక్టీరియా గోడల్లోని నిర్దిష్ట పాలీశాకరైడ్‌లను మాత్రమే విచ్ఛిన్నం చేస్తుంది.

❖ ఈ నిర్దిష్టతను 'లాక్ అండ్ కీ' లేదా 'ఇండ్యూస్డ్ ఫిట్' మోడల్ ద్వారా వివరించవచ్చు.

ప్రోటీన్ జీవసంశ్లేషణ

ప్రోటీన్ జీవసంశ్లేషణ (Protein Biosynthesis) కణాల్లో ప్రోటీన్లను తయారుచేసే జీవ ప్రక్రియ. ఇది ట్రాన్స్‌క్రిప్షన్ (అనులేఖనం), ట్రాన్స్‌లేషన్ (అనువాదం) అనే రెండు ప్రధాన దశల్లో జరుగుతుంది:

జన్యు అనులేఖనం: ఈ దశలో DNAలోని జన్యు సమాచారం mRNA (మెసెంజర్ RNA లేదా రాయబారి RNA)గా కాపీ లేదా తర్జుమా అవుతుంది.

◆ కణ కేంద్రకంలో DNA డబుల్ హెలిక్స్ నిర్మాణం తెరిచి ఉండి RNA పాలీమరేస్ ఎంజైమ్ ద్వారా mRNA సంశ్లేషణ జరుగుతుంది.

◆ ఫలితంగా ఏర్పడిన mRNA కణ కేంద్రకం నుంచి సైటోప్లాజం లేదా కణద్రవ్యంలోకి వెళ్తుంది.

జన్యు అనువాదం: సైటోప్లాజంలో mRNA రెండు ఉప ప్రమాణాలు ఉన్న రైబోసోమ్‌లతో బంధిస్తుంది.

◆ tRNA (ట్రాన్స్‌ఫర్ RNA) అణువులు mRNAలోని కోడాన్‌లకు అనుగుణంగా అమైనో ఆమ్లాలను రైబోసోమ్‌కు రవాణా చేస్తాయి.

జలవిశ్లేషణ

ప్రోటీన్లు జలవిశ్లేషణ ద్వారా అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నమవుతాయి. ఈ ప్రక్రియ జీర్ణక్రియలో ముఖ్యమైంది. జలవిశ్లేషణ చర్య ఆమ్లాలు, క్షారాలు ఎంజైమ్‌ల సమక్షంలో జరుగుతుంది. ఇక్కడ ఎంజైమ్‌లు (పెప్సిన్, ట్రిప్సిన్ లాంటివి) ఆహారంలోని ప్రోటీన్లను చిన్న పెప్టైడ్‌లు లేదా అమైనో ఆమ్లాలుగా విభజిస్తాయి. వీటిని శరీరం గ్రహిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. ప్రోటీన్ల ప్రాథమిక బిల్డింగ్ బ్లాక్స్ ఏమిటి?
   1) గ్లూకోజ్ 2) అమైనో ఆమ్లాలు 3) ఫ్యాటీ ఆమ్లాలు 4) న్యూక్లియోటైడ్స్
2. కింది వాటిలో ప్రోటీన్ల ద్వితీయ నిర్మాణాన్ని నిర్ణయించేది?
   1) పెప్టైడ్ బంధాలు 2) హైడ్రోజన్ బంధాలు 3) డైసల్ఫైడ్ బంధాలు 4) అయోనిక్ బంధాలు
3. హిమోగ్లోబిన్ ఏ రకమైన ప్రోటీన్?
   1) స్టోరేజ్ ప్రోటీన్ 2) ట్రాన్స్‌పోర్ట్ ప్రోటీన్ 3) స్ట్రక్చరల్ ప్రోటీన్ 4) హార్మోనల్ ప్రోటీన్
4. ప్రోటీన్ సంశ్లేషణకు అవసరమయ్యే అంశం?
   1) ట్రైగ్లిసరైడ్స్ 2) రైబోజోమ్స్ 3) స్టార్చ్ 4) ఫాస్ఫోలిపిడ్స్

సమాధానాలు
1-2, 2-2, 3-2, 4-2.

ద్రావణీయత

ప్రోటీన్ల ద్రావణీయత వాటి అమైనో ఆమ్లాల ధ్రువణత (పోలారిటీ), నిర్మాణంపై ఆధారపడుతుంది.

ఉదా: గ్లోబులర్ ప్రోటీన్లు (హిమోగ్లోబిన్ లాంటి) నీటిలో ద్రావణీయమవుతాయి. కానీ ఫైబ్రస్ ప్రోటీన్లు (కొల్లాజెన్ లాంటి) తక్కువ ద్రావణీయతను కలిగి ఉంటాయి. ద్రావణీయత pH, ఉష్ణోగ్రత, లవణీయతపై కూడా ఆధారపడుతుంది.

విధుల నిర్వహణలో బహుముఖత్వం

ప్రోటీన్లు జీవ ప్రక్రియల్లో వివిధ రకాల పాత్రలను పోషిస్తాయి. విధుల ఆధారంగా ప్రోటీన్‌లను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

ఎంజైమాటిక్ ప్రోటీన్లు: ఎంజైమ్‌లు జీవరసాయన చర్యలను వేగవంతం చేస్తాయి. అందుకే వీటిని జీవ ఉత్ప్రేరకాలు అంటారు.

ఉదా: అమైలేస్ కార్బోహైడ్రేట్లను విచ్ఛిన్నం చేస్తుంది. DNA పాలీమరేస్, DNA ప్రతికృతిలో కీలకపాత్ర పోషిస్తుంది.

నిర్మాణాత్మక ప్రోటీన్లు: కొల్లాజెన్ (చర్మం, ఎముకలు), కెరాటిన్ (జుట్టు, గోళ్లు) కణజాలాలకు బలం, నిర్మాణాన్ని అందిస్తాయి.

రవాణా జరిపే ప్రోటీన్లు: హిమోగ్లోబిన్ రక్తంలో ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. సంబంధ ప్రోటీన్లు (ఛానెల్ ప్రోటీన్‌లు), అయాన్‌లు, చిన్న అణువుల రవాణాను సులభతరం చేస్తాయి.

రోగనిరోధక ప్రోటీన్లు: యాంటీబాడీలు, రోగకారకాలను (వైరస్‌లు, బ్యాక్టీరియా) గుర్తించి తటస్థీకరిస్తాయి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

నియంత్రణ జరిపే ప్రోటీన్లు: ట్రాన్స్‌క్రిప్షన్, ఫ్యాక్టర్స్, జన్యు వ్యక్తీకరణను నియంత్రిస్తాయి. హార్మోన్లు (ఉదా: ఇన్సులిన్), శరీర ప్రక్రియలను సమన్వయం చేస్తాయి.

సిగ్నలింగ్ ప్రోటీన్లు: రిసెప్టర్ ప్రోటీన్లు (ఉదా: ఇన్సులిన్ రిసెప్టర్) కణాల మధ్య సిగ్నల్ లేదా సంజ్ఞల బదిలీని సులభతరం చేస్తాయి.



రచయిత
కొర్లాం సాయివెంకటేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్

735 Word of the Day

Quench

Telugu meaning: చల్లార్చు, సంతృప్తిపరచు

English meaning: The word quench (క్వెన్చ్) is a verb that describes the act of satisfying thirst or extinguishing something, especially fire or desire.

Synonyms: Extinguish, Satisfy


Antonyms: Ignite, Intensify

Usage: 1. After the long hike, she drank a bottle of cold water to quench her thirst.

2. Firefighters worked tirelessly to quench the flames that had engulfed the building.

నోటిఫికేషన్స్

బ్యాంకులో ఉద్యోగాలు



ఎస్‌బీఐ – జూనియర్ అసోసియేట్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) - క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) ఉద్యోగాల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 6,589. దరఖాస్తు ఫీజు రూ.750. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

బ్యాంక్ ఆఫ్ బరోడా – మేనేజర్ ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ బరోడా వివిధ విభాగాల్లో మేనేజర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 417. దరఖాస్తు ఫీజు రూ.850. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2025 ఆగస్టు 26.

క్విట్ ఇండియా ఉద్యమం

ఆగస్టు 8
చరిత్రలో ఈనాడు

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో జాతికి స్ఫూర్తినిచ్చిన మహోన్నత ఘట్టంగా 'క్విట్ ఇండియా ఉద్యమాన్ని' పేర్కొంటారు. 'విజయమో వీర స్వర్గమో' అంటూ మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలంతా ఉత్తేజితులై, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. సంపూర్ణ స్వరాజ్యమే ధ్యేయంగా వారు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. దాని ఫలితంగానే అయిదేళ్ల తిరిగేసరికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఇంతటి మహోజ్వలమైన క్విట్ ఇండియా ఉద్యమం 1942, ఆగస్టు 8న ప్రారంభమైంది. ఉద్యమం నాటి ముఖ్య విశేషాల గురించి నేటి స్టడీ జోన్‌లో తెలుసుకుందాం..!

▮ క్రిప్స్ రాయబారం విఫలం కావడంతో భారత జాతీయ కాంగ్రెస్ 1942 జులై 14న అహ్మదాబాద్‌లో సమావేశమై క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానాన్ని రూపొందించింది. 1942 ఆగస్టు 8న బొంబాయి గోవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ నేతలతో గాంధీజీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానాన్ని ఆమోదించారు. గాంధీ 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) అనే నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారు. 'భారతదేశాన్ని వదిలి వెళ్లండి' (క్విట్ ఇండియా) అంటూ పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైంది.

▮ బొంబాయిలో కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మానం చేసిన వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం ఆ పార్టీని నిషేధించింది. గాంధీతోసహా ముఖ్య నాయకులందరినీ నిర్బంధించింది. ఎలాంటి సూచనలు, ఆదేశాలు లేకుండా ప్రజలే స్వయంగా ఉద్యమం ప్రారంభించారు. ఇందులో అన్ని వర్గాలవారు పాల్గొన్నారు.



▮ గోపాలస్వామి రచించిన 'బాంబే - గాంధీ' గ్రంథంలో క్విట్ ఇండియా నినాదాన్ని మొదట యూసుఫ్ మెహర్ అలీ ఇచ్చినట్లు ఉంది. యూసఫ్ 1942 నాటికి బొంబాయి నగర మేయర్‌గా ఉన్నారు.

▮ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించారు. మహ్మద్ అలీ జిన్నా నాయకత్వంలోని ముస్లింలీగ్ కూడా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ 'డివైడ్ అండ్ క్విట్' అనే నినాదాన్నిచ్చింది.


▮ మొదట్లో ప్రజలు హర్తాళ్లు, నిరసన ప్రదర్శనలు జరిపారు. స్వచ్ఛందంగా సత్యాగ్రహాలు చేశారు. 1942 ఆగస్టు 12న తెనాలి రైల్వే స్టేషన్‌పై దాడి సమయంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఆరుగురు మరణించారు. దీంతో ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. పోలీస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారు.

▮ ఉద్యమాన్ని అణిచేందుకు బ్రిటిష్ ప్రభుత్వం నిరసనకారులందరినీ జైళ్లలో బంధించింది. హింసాత్మక చర్యలు చేపట్టింది. అధికారిక గణాంకాల ప్రకారం, సైనికుల కాల్పుల్లో 10 వేల మందికి పైగా మరణించగా 60వేలకు పైగా అరెస్టయ్యారు.

▮ గాంధీ యుగంలో జరిగిన అత్యంత హింసాత్మక ఉద్యమంగా క్విట్ ఇండియా ఉద్యమం పేరొందింది.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

ఉష్ణం - ఉష్ణోగ్రత



శక్తి స్వరూపం

ఉష్ణం శక్తి స్వరూపం. ఇది పదార్థం లేదా వస్తువు చల్లగా లేదా వేడిగా ఉండటాన్ని తెలియజేస్తుంది. ఉష్ణశక్తి నిరంతరం అధిక ఉష్ణోగ్రత నుంచి అల్ప ఉష్ణోగ్రత వైపు ప్రసరిస్తుంది. పదార్థం లేదా వ్యవస్థలోని పరమాణువులు, అణువులు, ఇతర సూక్ష్మ కణాల యాదృచ్ఛిక (Random) చలనం వల్ల కలిగే గతిజ, స్థితిజ శక్తుల మొత్తమే దాని ఉష్ణశక్తి.

ఉష్ణోగ్రత

వస్తువు చల్లదనం లేదా వెచ్చదన తీవ్రతను నిర్ణయించే ఒక సాపేక్ష ఉష్ణీయ స్థితిని ఉష్ణోగ్రత (Temperature) అంటారు. దీన్ని థర్మామీటర్ లేదా ఉష్ణోగ్రతా మాపకంతో కొలుస్తారు. ఉష్ణోగ్రతను కొలిచే శాస్త్రాన్ని థర్మోమెట్రి (Thermometry) అంటారు. ఉష్ణోగ్రతకు SI ప్రమాణం కెల్విన్ (K), వాడుకలో ఉన్న ఇతర ప్రమాణాలు సెల్సియస్, ఫారెన్‌హీట్.

Laokhowa Wildlife Sanctuary located in..

Current Affairs

1. "The Rise of the Hitman" is authored by which of the following writers?
   A) R. Kaushik B) Vikram Chandra
   C) Suketu Mehta D) Anuja Chauhan
2. Shibu Soren, former Chief Minister and prominent political leader, was associated with which Indian state?
   A) Chhattisgarh B) Jharkhand
   C) Odisha D) Bihar
3. Which state inaugurated India's first AI-powered Anganwadi center, located in Waddhamna village?
   A) Maharashtra B) Karnataka
   C) Tamil Nadu D) Gujarat
4. Which Indian state received the national award for the highest organ donation rate in 2024, with an average of 4.88 donors per million population?
   A) Tamil Nadu B) Karnataka
   C) Maharashtra D) Telangana
5. Who has assumed charge as the Inspector General cum Principal Chief Security Commissioner (IG.cum.PCSC) of the Railway Protection Force (RPF) for the Southern Railway zone based in Chennai?
   A) K. Arul Jothi
   B) G. M. P. Reddy
   C) Laxman Singh
   D) Daniel Jason Dhas

General Knowledge

6. Kathakali music traditionally follows which classical style from Kerala?
   A) Carnatic Sangeet B) Hindustani Sangeet
   C) Rabindra Sangeet D) Sopana Sangeet
7. In which year was the National Organic Chemical Industry Limited (NOCIL) established?
   A) 1956 B) 1961 C) 1965 D) 1971
8. Who is the author of Akhada: 'The Authorized Biography of Mahavir Singh Phogat'?
   A) Saurabh Duggal B) Chetan Bhagat
   C) Rashmi Bansal D) None of the above
9. Which of the following institutions offers training in mountaineering and allied adventure sports and is located in Manali, Himachal Pradesh?
   A) Himalayan Mountaineering Institute
   B) Nehru Institute of Mountaineering
   C) National Institute of Mountaineering and Allied Sports
   D) Atal Bihari Vajpayee Institute of Mountaineering and Allied Sports

SSC Exams Special

General Awareness

History

10. Which of the following temples is correctly matched with the Chola dynasty and located in Tamil Nadu?
    A) Valisvara Temple - Thanjavur
    B) Jagannath Temple - Puri
    C) Virupaksha Temple - Hampi
    D) Kampaheswarar Temple - Thirubuvanam
11. Which legislation introduced the dual system of control between the British Government and the East India Company?
    A) Regulating Act, 1773
    B) Pitt's India Act, 1784
    C) Charter Act, 1813
    D) Government of India Act, 1858
12. Which Indian leader is known for the quotes: "A man is but the product of his thoughts. What he thinks, he becomes." and "Nobody can hurt me without my permission"?
    A) Jawaharlal Nehru
    B) Bhagat Singh C) Mahatma Gandhi
    D) Sardar Vallabhbhai Patel
13. Who led a reform movement in Kerala promoting spiritual enlightenment and social equality with the message, "One caste, one religion and one god for all"?
    A) Periyar E.V. Ramasamy
    B) Jyotiba Phule C) Narayan Guru
    D) Swami Vivekananda

Geography

14. Which of the following statements about the Banas River are correct?
    1. It originates from the Khamnor Hills of the Aravalli Range.
    2. It is a tributary of the Chambal River.
    3. It is also known as 'Van ki Asha'.
    4. It flows directly into the Yamuna River.
    A) 1, 2, and 3 only B) 1 and 4 only
    C) 2 and 3 only D) All of the above
15. Which of the following statements about the Chhota Nagpur Plateau are correct?
    1. It is rich in minerals like mica, bauxite, copper, limestone, iron ore, and coal.
    2. It extends across Jharkhand, Chhattisgarh, West Bengal, Odisha, and Bihar.
    3. It is India's largest alluvial plain region.
    4. It is known for its industrial and mining activities.
    A) 1, 2, and 4 only B) 1 and 3 only
    C) 2, 3, and 4 only D) All of the above
16. Which of the following statements about Laokhowa Wildlife Sanctuary are correct?
    1. It is located in the state of Assam.
    2. It is situated on the south bank of the Brahmaputra River.
    3. It lies in the Nagaon district.
    4. The sanctuary covers an area of more than 100 km².
    A) 1, 2, 3 only B) 1, 4 only
    C) 2, 3, 4 only D) All

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

ఈనాడు ప్రతిభ
శుక్రవారం, ఆగస్టు 8, 2025
19 https://pratibha.eenadu.net https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

✿ 'ఇందిరాగాంధీ అండ్ ది ఇయర్స్ దట్ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇండియా' పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు?
జ: శ్రీనాథ్ రాఘవన్



✿ ఐక్యరాజ్య సమితి ఏటా ఏ రోజున గ్లోబల్ పేరెంట్స్ డే ను నిర్వహిస్తోంది? (2012 నుంచి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)
జ: జూన్ 1

✿ 2025 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల పట్టికలో ఎన్నో స్థానంలో నిలిచింది?
జ: రెండో స్థానం (కొరియా రిపబ్లిక్‌లోని గుమిలో జరిగిన ఈ టోర్నీలో 8 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్యాలు గెలుచుకుని భారత్ పతకాల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. ఈ 26వ ఎడిషన్ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చైనా అగ్రస్థానంలో నిలిచింది.)

మాదిరి ప్రశ్నలు

✿ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో మత్స్య సబ్సిడీలపై ఒప్పందాన్ని అధికారికంగా ఆమోదించిన 101వ సభ్య దేశంగా ఇటీవల ఏది వార్తల్లో నిలిచింది?)
జ: నికరాగ్వా

✿ ఏ రాష్ట్రంలోని ఖిచాన్, మెనార్ చిత్తడి నేలలను ఇటీవల ప్రపంచ ప్రఖ్యాత రామ్‌సర్ జాబితాలో చేర్చారు? (వీటి చేరికతో భారత్‌లోని మొత్తం రామ్‌సర్ ప్రదేశాల సంఖ్య 91కు చేరింది.)
జ: రాజస్థాన్

మరింత సమాచారం



వరుస కుదిరితే మార్కు దక్కినట్లే!



భవన నిర్మాణంలో మెట్లు కట్టేటప్పుడు అవి ఒకే ఎత్తు, ఒకే దూరంలో ఉండాలి. అంటే ఒక నమూనాను అనుసరించాలి. లేకపోతే మెట్లు అసౌకర్యంగా, ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఈ విధంగా సంఖ్యాశ్రేణులు ఇంజినీరింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, పజిల్స్, గేమ్స్ తదితరాల్లో అవసరమవుతుంటాయి. నిర్దిష్ట నియమం లేదా నమూనా ప్రకారం అమరి ఉన్న సంఖ్యల వరుసను సంఖ్యాశ్రేణి అంటారు. సాధారణంగా అంకగణిత ప్రక్రియలు లేదా సంక్లిష్ట తర్కాల ఆధారంగా ఈ శ్రేణులు ఏర్పడతాయి. సంఖ్యలకు సంబంధించి తార్కిక నైపుణ్యాలను పరీక్షించడానికి రీజనింగ్‌లో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కూడికలు, తీసివేతలు, గుణకార, భాగహారాలు మొదలైన ప్రాథమిక గణిత పరిక్రియలపై అవగాహన పెంచుకోవాలి. వర్గాలు, పట్టికలు, ప్రధాన సంఖ్యల గురించి తెలుసుకోవాలి. మిశ్రమ నమూనాలు అంటే ఒకే శ్రేణిలో ఒకటి కంటే ఎక్కువ నమూనాలు ఉండే ప్రశ్నలను ప్రాక్టీస్ చేస్తే మంచి మార్కులు సంపాదించుకోవచ్చు.

సంఖ్యా శ్రేణి

పోటీ పరీక్షల్లో 'సంఖ్యా శ్రేణి' అనే అంశం నుంచి సాధారణ ప్రశ్నలతోపాటుగా ఈ మధ్యకాలంలో ప్యూర్ మ్యాథమేటిక్స్‌లో భాగంగా ఉండే అంకశ్రేఢి, గుణశ్రేఢి లాంటి అంశాల నుంచి కూడా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి వివిధ రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు రకరకాల శ్రేఢులపైనా అవగాహన కలిగి ఉండాలి.

శ్రేఢి: నిర్దిష్టమైన నియమాన్ని పాటించే సంఖ్యల సమూహాన్ని 'శ్రేఢి' అంటారు.

ఉదా: 1) 5, 8, 11, 14, 17, ...
2) 3, 6, 12, 24, 48, ...

అంకశ్రేఢి: శ్రేఢిలో ఏ రెండు వరుస పదాల మధ్య వ్యత్యాసమైనా సమానంగా ఉంటే దాన్ని అంకశ్రేఢి అంటారు.

ఉదా: 11, 15, 19, 23, 27, ...

పై శ్రేఢిలో ప్రతి రెండు వరుస పదాల మధ్య బేధం '4' గా ఉంది.

★ అంకశ్రేఢి సాధారణ రూపం

$a, a + d, a + 2d, a + 3d, ... a + (n - 1)d$

a = మొదటి పదం

d = పదాంతరం $d = (t_n - t_{n-1})$



★ అంకశ్రేఢిలో 'n'వ పదం

$t_n = a + (n - 1)d$

★ అంకశ్రేఢిలో 'n' పదాల మొత్తం $S_n = \frac{n}{2}[2a+(n-1)d]$

గుణశ్రేఢి: ఏ రెండు వరుస పదాల మధ్య నిష్పత్తి అయినా సమానంగా ఉంటే, ఆ శ్రేఢిని గుణశ్రేఢి అంటారు.

ఉదా: 5, 10, 20, 40, 80, 160, ...

★ గుణశ్రేఢి సాధారణ రూపం

$a, ar, ar^2, ar^3, ... ar^{n-1}$



★ గుణశ్రేఢిలో 'n' పదాల మొత్తం

a = మొదటి పదం

r = సామాన్య నిష్పత్తి $\left(\frac{t_n}{t_{n-1}}\right)$

$t_n = \frac{a(r^n - 1)}{(r - 1)} (r > 1) = \frac{a(1 - r^n)}{1 - r} (r < 1)$

1. 8, 13, 18, 23, ... శ్రేణిలో 12వ పదం ఏది?

1) 68 2) 63 3) 74 4) 64

వివరణ: 8, 13, 18, 23, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 8, d = 13 – 8 = 5, n = 12వ పదం

$t_n = a + (n - 1)d = 8 + (12 - 1)5$

$= 8 + 11 \times 5 = 8 + 55 = 63$

∴ 12వ పదం = 63 జ: 2



2. 6, 14, 22, 30, 38, ... శ్రేణిలో 19వ పదం ఏది?

1) 145 2) 185 3) 105 4) 150

వివరణ: 6, 14, 22, 30, 38, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 6, d = 14 – 6 = 8, n = 19వ పదం

$t_n = a + (n - 1)d = 6 + (19 - 1)8$

$= 6 + 18 \times 8 = 6 + 144 = 150$

19వ పదం = 150 జ: 4

3. 11, 16, 21, 26, 31, ... శ్రేణిలో మొదటి 15 పదాల మొత్తం ఎంత?

1) 820 2) 640 3) 690 4) 730

వివరణ: 11, 16, 21, 26, 31, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 11, d = 16 – 11 = 5, n = 15 పదాలు

$S_n = \frac{n}{2}[2a + (n - 1)d]$

$= \frac{15}{2}[2 \times 11 + (15 - 1)5]$

$= \frac{15}{2}[22 + 70]$

$= \frac{15}{2} \times 92 = 15 \times 46 = 690$ జ: 3

4. 72, 75, 78, 81, ... శ్రేణిలో 11 పదాల మొత్తం ఎంత?

1) 957 2) 948 3) 1024 4) 975

వివరణ: 72, 75, 78, 81, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 72, d = 75 – 72 = 3, n = 11 పదాలు

$S_n = \frac{n}{2}[2a + (n - 1)d]$

$= \frac{11}{2}[2 \times 72 + 10 \times 3]$

$= \frac{11}{2}[144 + 30]$

$= \frac{11}{2} \times 174 = 11 \times 87 = 957$ జ: 1


5. 5, 10, 15, 20, 25, ... ఎన్ని పదాల మొత్తం 1155 అవుతుంది?

1) 20 2) 21 3) 23 4) 19

వివరణ: 5, 10, 15, 20, 25, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

$a = 5, d = 10 - 5 = 5, S_n = 1155, n = ?$

$S_n = \frac{n}{2}[2a + (n - 1)d]$



మాదిరి ప్రశ్నలు



జనరల్ స్టడీస్
రీజనింగ్

$1155 = \frac{n}{2}[2 \times 5 + (n - 1)5]$

$1155 \times 2 = n[10 + 5n - 5]$

$2310 = 5n + 5n^2$

$2310 = 5[n^2 + n]$

$n^2 + n = \frac{2310}{5} = 462$

మొదటి ఆప్షన్ ప్రతిక్షేపించగా n = 20

$20^2 + 20 \neq 462$

రెండో ఆప్షన్ ప్రతిక్షేపించగా n = 21

$21^2 + 21$

441 + 21 = 462 జ: 2

6. 3, 6, 12, 24, ... శ్రేణిలో 9వ పదం ఏది?

1) 768 2) 678 3) 867 4) 687

వివరణ: 3, 6, 12, 24, ... గుణశ్రేఢిలో ఉన్నాయి.

$a = 3, r = \frac{6}{3} = 2, n = 9$

$t_n = ar^{n-1}$

$= 3(2)^{9-1} = 3 \times 2^8$

$= 3 \times 256 = 768$ జ: 1

7. 5, 10, 20, 40, 80, ... శ్రేణిలో 15వ పదం ఏది?

1) 80920 2) 81092
3) 80900 4) 81920

వివరణ: 5, 10, 20, 40, 80, ... గుణశ్రేఢిలో ఉన్నాయి.

$a = 5, r = \frac{10}{5} = 2, n = ?$

$t_n = ar^{n-1} = 5 \times 2^{15-1}$

$= 5 \times 2^{14} = 5 \times 16384 = 81920$ జ: 4

8. 2, 4, 8, 16, 32, ... శ్రేణిలో ఎన్నో పదం 8192 అవుతుంది?

1) 12 2) 13 3) 11 4) 14

వివరణ: 2, 4, 8, 16, 32, ... అంకశ్రేఢిలో ఉన్నాయి

$a = 2, r = \frac{4}{2} = 2, n = ?\ t_n = 8192$

$t_n = ar^{n-1} \Rightarrow 8192 = 2 \times 2^{n-1}$

$2^{13} = 2^n \Rightarrow n = 13$ జ: 2

9. 4, 8, 16, 32, 64, ... శ్రేణిలో ఎన్నో పదం 32768 అవుతుంది?

1) 15 2) 16 3) 14 4) 17



వివరణ: 4, 8, 16, 32, 64, ... గుణశ్రేఢిలో ఉన్నాయి.

$a = 4, r = \frac{8}{4} = 2, t_n = 32768, n = ?$

$t_n = ar^{n-1} \Rightarrow 32768 = 4 \times 2^{n-1}$

$2^{15} = 2^{n+1}$

$n + 1 = 15 \Rightarrow n = 14$ జ: 3

10. 4, 8, 12, 16, ... శ్రేణిలో 16వ పదం ఏది?

1) 68 2) 64 3) 74 4) 78

వివరణ: 4, 8, 12, 16, ... లు అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 4, d = 8 – 4 = 4, n = 16

$t_n = a + (n - 1)d$

$= 4 + (16 - 1)(4)$

$= 4 + 60 = 64$ జ: 2

11. 15, 19, 23, 27, ... శ్రేణిలో 15 పదాల మొత్తం ఎంత?

1) 680 2) 720
3) 645 4) 650

వివరణ: 15, 19, 23, 27, ... అంకశ్రేఢిలో ఉన్నాయి.

a = 15, d = 19 – 15 = 4, n = 15

$S_n = \frac{n}{2}[2a + (n - 1)d]$

$= \frac{15}{2}[2 \times 15 + (15 - 1)4]$

$= \frac{15}{2}[30 + 56]$

$= \frac{15}{2} \times 86$

$= 15 \times 43 = 645$ జ: 3



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి


దామోదర్ నదిపై తొలి బహుళార్థ సాధక ప్రాజెక్ట్!

నదీ ప్రవాహాలను నియంత్రించి వ్యవసాయానికి మళ్లించే భారీ ఆనకట్టలే సాగునీటి ప్రాజెక్టులు. ఇవి అధిక జనాభాతో వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశంలో కరవు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే ప్రధాన సాధనాలు. వ్యవసాయంలో స్థిరత్వానికి, ఆహారభద్రతకు ఆధారాలు. దేశవ్యాప్తంగా నిర్మించిన పలు డ్యామ్‌లు తాగు, సాగునీటిని అందిస్తూ, పారిశ్రామిక అవసరాలను తీర్చడంతో పాటు జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. అందుకే తొలి ప్రధాని నెహ్రూ వీటిని ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించారు. నదులు, రాష్ట్రాల వారీగా నిర్మించిన బహుళార్థ సాధక ప్రాజెక్టులు, ఇతర పెద్ద ఆనకట్టల విశేషాలు, వాటి నుంచి తవ్విన ప్రధాన కాలువలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జాతీయ ప్రాజెక్టులుగా గుర్తింపు పొందినవి, రాష్ట్రాల ఉమ్మడి, వివాదాస్పద ప్రాజెక్టుల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

నీటిపారుదల ప్రాజెక్టులు

1. కింది వాక్యాలను సరిచూడండి.




ఎ) బాగ్లిహార్ డ్యామ్ చీనాబ్ నదిపై ఉంది.
బి) సింధూ నది ఉప నదుల్లో చీనాబ్ నది అతి పెద్దది.
సి) జీలం నదిపై ఊరి, తుల్‌బుల్ ప్రాజెక్టులు ఉన్నాయి.
డి) రాజస్థాన్ కాలువ (ఇందిరా గాంధీ కాలువ) బియాస్, సట్లెజ్ నదులు కలిసే 'హరికే' అనే ప్రాంతంలో ప్రారంభమవుతుంది.
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి లు సరికావు; సి, డి లు సరైనవి.

2. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) కాక్రపార డ్యామ్	1) గోదావరి నది
బి) మాతా తిల్లా డ్యామ్	2) రావి నది
సి) థెయిన్ ప్రాజెక్టు	3) బెట్వా నది
డి) జయక్వాడి	4) నర్మదా నది

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-2, సి-3, డి-1
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-2, డి-3

3. నర్మదా నది లోయకు, ప్రాజెక్టుకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.




ఎ) ఈ ప్రాజెక్టులో భాగంగా దాదాపు 30 భారీ ప్రాజెక్టులు, 135 మధ్యతరహా ప్రాజెక్టులు, 3 వేలకు పైగా చెక్‌డ్యాములు ఉన్నాయి.
బి) నర్మదా నది లోయలో భాగంగా సర్దార్ సరోవర్ డ్యామ్‌ను గుజరాత్‌లో నిర్మించారు. ఇది నర్మదా నది లోయ ప్రాజెక్టుల్లోనే పెద్ద డ్యామ్.
సి) ఇందిరాసాగర్ డ్యామ్‌ను మధ్యప్రదేశ్‌లో నర్మదా నదిపై నర్మదానది లోయలో భాగంగా నిర్మించారు.
డి) నర్మదానది లోయ ప్రాజెక్టు నిర్మాణాన్ని 1987లో ప్రారంభించారు.
1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరికావు.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, సి, డి లు సరైనవి.

4. కింది వాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
ఎ) రంజిత్ సాగర్	1) సింధూ నది
బి) తెహ్రీ డ్యామ్	2) సట్లెజ్ నది
సి) నాథ్‌పాజెక్రీ డ్యామ్	3) భగీరథ నది
డి) చుటక్ డ్యామ్	4) రావి నది

1) ఎ-1, బి-3, సి-4, డి-2 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

5. దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు గురించి వాక్యాలను సరిచూడండి.



ఎ) దామోదర వ్యాలీ ప్రాజెక్టును 1948లో ప్రారంభించారు. ఇది దేశంలో మొదటి బహుళార్థ సాధక ప్రాజెక్ట్.
బి) దామోదర వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ)ను చట్టబద్ధ సంస్థగా అమెరికాలోని టెన్నెసీ రివర్ వ్యాలీ ఆధారిత స్ఫూర్తితో నిర్మించారు.
సి) ఈ ప్రాజెక్టులో భాగంగా పాంచట్‌హిల్ డ్యామ్‌ను దామోదర్ నదిపై నిర్మించారు.
డి) ఇందులో మైథాన్, తిలయ ప్రాజెక్టులు అంతర్భాగం.
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

డ్యామ్‌లు	రాష్ట్రాలు
ఎ) ఉకాయ్	1) నర్మదా
బి) ఓంకారేశ్వర్	2) తపతి
సి) విష్ణుప్రయాగ్	3) సీలేరు
డి) బలిమెల	4) అలకనంద

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

7. హీరాకుడ్ ప్రాజెక్టుకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.
ఎ) ఈ ప్రాజెక్టును మహానది, ఇబ్ నదులు కలిసే చోట నిర్మించారు.
బి) ఈ ప్రాజెక్టు నమూనాను మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1937లో తయారుచేశారు.
సి) ఈ ప్రాజెక్టు సగటు పొడవు 4,800 మీటర్లు.
డి) జవహర్‌లాల్ నెహ్రూ దీనికి 1948లో శంకుస్థాపన చేయగా, 1957 నాటికి నిర్మాణం పూర్తయింది.
1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిని జతపరచండి.

జాతీయ ప్రాజెక్టు	నది
ఎ) షాపూర్ కంది	1) భాగ నది
బి) కిషావు	2) గిరి నది
సి) రేణుకాజి	3) టోన్స్ నది
డి) జిష్పు	4) రావి నది

1) ఎ-4, బి-1, సి-3, డి-2 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4

9. కింది వాటిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.




ఎ) శ్రీరాంసాగర్‌ను 'పోచంపాడు ప్రాజెక్టు' అంటారు.
బి) దీన్ని 1963, జులై 26న ప్రారంభించారు.
సి) తెలంగాణలో గోదావరి నదిపై నిర్మించారు.
డి) ఈ ప్రాజెక్టు మొదటి దశలో 'లక్ష్మీ', 'సరస్వతి', కాకతీయ కాలువలను నిర్మించారు.
1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) తెనుఘాట్	1) గోదావరి నది
బి) కృష్ణ రాజసాగర్	2) వంశధార నది
సి) గొట్టా బ్యారేజీ	3) కావేరి నది
డి) ఎల్లంపల్లి	4) దామోదర నది

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-2, డి-3
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-4, బి-3, సి-1, డి-2

11. కింది వాటిలో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.



ఎ) నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం 1955, డిసెంబరు 10న ప్రారంభించారు.
బి) దీని నిర్మాణం 1967, ఆగస్టు 4న పూర్తయింది.
సి) ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువను 'జవహర్ కాలువ' అంటారు.
డి) ప్రధాన ఎడమ కాలువను 'లాల్ బహదూర్ శాస్త్రి కాలువ' అంటారు.
1) ఎ, బి, సి, డి లు సరికావు.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి, డి లు సరైనవి.
4) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

జలవిద్యుత్తు ప్రాజెక్టు	నది
ఎ) పోంగ్	1) బ్రహ్మపుత్ర
బి) దుల్‌హస్తీ	2) పెరియార్
సి) ఇటుక్కి	3) బియాస్
డి) పారి	4) చీనాబ్

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-4, బి-3, సి-2, డి-1

13. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ఉత్తర్‌ప్రదేశ్‌లో అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి రిహాండ్ డ్యామ్. ఇది సోన్ నది ఉపనది అయిన రిహాండ్ నదిపై ఉంది.
బి) శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిపేరు నీలం సంజీవరెడ్డి సాగర్ ప్రాజెక్టు.
సి) ఫరక్కా డ్యామ్ గంగానదిపై పశ్చిమ బెంగాల్‌లో నిర్మించారు.
డి) నాగార్జున సాగర్ ప్రాజెక్టును 'నందికొండ ప్రాజెక్టు' అని కూడా అంటారు.
1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి లు సరైనవి.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

డ్యామ్‌లు	నదులు
ఎ) జవహర్ సాగర్	1) కావేరి నది
బి) తీపాయి ముఖ్	2) రావి నది
సి) చమేరా	3) చంబల్ నది
డి) మెట్టూరు	4) బరాక్ నది

1) ఎ-1, బి-4, సి-3, డి-2 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-3, సి-2, డి-1

15. కింది వాటిని సరిచూడండి.
ఎ) చంబల్ లోయ ప్రాజెక్టు మధ్యప్రదేశ్, రాజస్థాన్ మధ్య ఉంది.
బి) నర్మదానది లోయ ప్రాజెక్టు మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల మధ్య ఉంది.
సి) దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌ల మధ్య ఉంది.
డి) భాక్రా నంగల్ ప్రాజెక్టు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌ల మధ్య ఉంది.
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

16. కింది ప్రాజెక్టులు, వాటికి సంబంధించి వివాదాస్పద రాష్ట్రాలను జతపరచండి.

ప్రాజెక్టులు	రాష్ట్రాలు
ఎ) ముళ్లపెరియార్	1) తమిళనాడు-ఆంధ్రప్రదేశ్
బి) ఆల్మట్టి	2) తెలంగాణ-మహారాష్ట్ర
సి) బాబ్లీ	3) ఆంధ్రప్రదేశ్-కర్ణాటక
డి) పాలర్	4) కేరళ-తమిళనాడు

1) ఎ-4, బి-1, సి-2, డి-3
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-1, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-1; 2-3; 3-4; 4-2; 5-1; 6-1; 7-2; 8-3; 9-2; 10-1; 11-3; 12-2; 13-3; 14-4; 15-1; 16-4.

'ఆయుష్మాన్ భారత్' కార్డు ఉన్నా..
వైద్యం నిరాకరిస్తే ఆన్‌లైన్లో ఫిర్యాదు



ఇంటర్నెట్ డెస్క్: 'ఆయుష్మాన్ భారత్ - పీఎం జన్ ఆరోగ్య యోజన' (ఏబీ- పీఎంజేఏవై) కింద పేద, ధనిక తేడా లేకుండా దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్యబీమా సదుపాయం కేంద్రం కల్పిస్తుండగా.. కొన్ని ఆస్పత్రులు ఈ కార్డులను నిరాకరిస్తున్నాయి. 70 ఏళ్ల వయసులో చికిత్స అందించి ఒకవేళ విఫలమైతే ఆస్పత్రులకు చెడ్డ పేరు వస్తుందని కొందరు.. బిల్లుల కోసం వేచిచూడటం ఇష్టం లేక మరికొందరు ఈ పథకం అమలుకు వెనకడుగు వేస్తున్నారు. ఇలా ఆస్పత్రి యాజమాన్యం వైద్యానికి నిరాకరిస్తే.. నేరుగా పోర్టల్ ద్వారానే ఫిర్యాదు చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చు.

ఫిర్యాదు చేయడమిలా..:

తొలుత https://cgrms.pmjay.gov.in/GRMSoginnew.htm వెబ్‌సైటులోకి వెళ్లాలి. 'రిజిస్టర్ యువర్ గ్రీవెన్స్' ఆప్షనుపై క్లిక్ చేయాలి. క్యాప్చా కోడ్‌ను నమోదు చేసి, ఏ వైద్యం అందడం లేదో డ్రాప్ డౌన్ లిస్టు నుంచి దాన్ని ఎంపిక చేయాలి. మిగతా సమాచారం కూడా నింపి ఫిర్యాదును రిజిస్టర్ చేయొచ్చు. ఒకవేళ అలా సాధ్యం కాకపోతే.. నేషనల్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబరు 14555, 1800-11-4477 లేదా ఆయా రాష్ట్రాలకు చెందిన సహాయక కేంద్రాలకు కూడా ఫోను చేసి ఫిర్యాదు చేయొచ్చు. ఉమంగ్ యాప్ ఉంటే అందులో ఆయుష్మాన్ భారత్ లోకి వెళ్లి ఫిర్యాదుల పరిష్కారం ఆప్షను ద్వారా ప్రయత్నించవచ్చు.



ఫిర్యాదు చేసేముందు..:

ఆస్పత్రి వర్గాలు వైద్యం నిరాకరించాయని రుజువు చేసేందుకు వీలుగా ఒక ఫొటో లేదా వీడియో ఉంచుకోవడం మంచిది. ఆయుష్మాన్ కార్డు, అప్పటికే ఆస్పత్రిలో చేరితే దానికి సంబంధించిన రికార్డులు దగ్గర పెట్టుకోవాలి. ఫిర్యాదు చేసిన తర్వాత గ్రీవెన్స్ ఐడీ నంబరును జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఒకవేళ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోతే అనుశీలనకు ఇది ఉపయోగపడుతుంది.

ఆయుష్మాన్ భారత్ కార్డు పొందడమిలా..:

ఏబీ - పీఎంజేఏవై కింద లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎం జేఏవై పోర్టల్‌లో 'యామ్ ఐ ఎలిజిబుల్' ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. దీంతో beneficiary.nha.gov.in అనే వెబ్‌సైటుకు రీడైరెక్ట్ అవుతారు. అక్కడ క్యాప్చా, మొబైల్ నంబరు, ఓటీపీ నమోదు చేయాలి. తర్వాత కేవైసీ కోసం వివరాలు నమోదుచేసి.. ఆమోదం కోసం చూడాలి.

ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఆధార్‌లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

కార్డుతో ఉపయోగాలు:

ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందవచ్చు. దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు ఇస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఇద్దరుంటే చెరి సగం ప్రయోజనం వర్తిస్తుంది. సీజీహెచ్‌ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పథకాల కింద ఉన్న వృద్ధులు ఆయా పథకాలను గానీ, ఏబీ - పీఎంజేఏవైను గానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మికరాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందవచ్చు.



తాజ్‌మహల్‌ను సందర్శించిన సందర్భంగా గురువారం ఆగ్రాలో ఫొటోకు పోజు ఇస్తున్న మిస్ టీన్ ఎర్త్ 2025 ఫైనల్ పోటీదారులు

పాఠాలుగా సైనిక ప్రముఖుల జీవితగాథలు: రక్షణ శాఖ

దిల్లీ: భారత సైన్యానికి చెందిన ప్రముఖులు ఫీల్డ్ మార్షల్ శామ్ మానెక్‌షా, బ్రిగేడియర్ మొహమ్మద్ ఉస్మాన్, మేజర్ సోమనాథ్ శర్మల జీవిత విశేషాలను ఈ విద్యాసంవత్సరం పాఠ్య ప్రణాళికలో చేర్చినట్టు ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు గురువారం వెల్లడించారు. ధైర్యం, విధుల పట్ల నిబద్ధత, త్యాగశీలతలతో నిండిన వారి జీవితాల నుంచి విద్యార్థులకు స్ఫూర్తి అందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అత్యున్నత స్థాయి నాయకత్వ లక్షణాలు, వ్యూహాత్మక కౌశల్యం కలిగిన మానెక్‌షా ఫీల్డ్ మార్షల్ స్థాయిని పొందిన తొలి సైన్యాధికారిగా దేశ చరిత్రలో నిలిచిపోయారు. మరణానంతరం మహావీర్ చక్ర, పరమ్‌వీర్ చక్ర సైనిక అవార్డులు పొందిన బ్రిగేడియర్ ఉస్మాన్, మేజర్ శర్మలు విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలొడ్డారని రక్షణ శాఖ తెలిపింది. ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా జీవిత విశేషాలను ఎనిమిదవ తరగతి (ఉర్దూ) విద్యార్థులకు, బ్రిగేడియర్ ఉస్మాన్ జీవితగాథను ఏడో తరగతి (ఉర్దూ) విద్యార్థులకు, మేజర్ శర్మ జీవిత చరిత్రను ఎనిమిదో తరగతి (ఇంగ్లిష్) విద్యార్థులకు పాఠ్యాంశాలుగా అందిస్తున్నారు.

మయన్మార్ అధ్యక్షుడు మైయింట్ స్వే కన్నుమూత



బ్యాంకాక్: మయన్మార్‌లో ఆంగ్ సాన్ సూకి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని నాలుగేళ్ల క్రితం సైన్యం కూలదోసిన తరవాత తాత్కాలికంగా దేశాధ్యక్ష పదవిని చేపట్టిన మైయింట్ స్వే (74) దీర్ఘకాల అనారోగ్యం వల్ల గురువారం మరణించారు. రాజధాని నేపిడాలోని సైనిక ఆస్పత్రిలో ఆయన కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో సంవత్సర కాలంగా ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలను నిర్వహించడం లేదు. ఆయన బదులు సైనిక ప్రభుత్వ అధిపతి జనరల్ మిన్ ఆంగే అధ్యక్ష విధులను నిర్వహిస్తున్నారు.

అరుంధతీ రాయ్ 'ఆజాదీ' సహా 25 పుస్తకాలపై నిషేధం

శ్రీనగర్: యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించే విధంగా ఉన్నాయన్న కారణంతో 25 పుస్తకాలపై జమ్మూకశ్మీర్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఉగ్రవాదులను హీరోలుగా చూపిస్తూ, వారిని కీర్తించేలా.. హింసను ప్రేరేపించడంలో ఈ పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిలో మౌలానా మౌదూది రాసిన 'అల్ జిహాదుల్ ఫిల్ ఇస్లాం', క్రిస్టోఫర్ స్నెడెన్ రచించిన 'ఇండిపెండెంట్ కశ్మీర్'.. అరుంధతి రాయ్ రాసిన 'ఆజాదీ' పుస్తకాలు ఉన్నాయి.

ప్రస్తుతానికి ముగిసిన ప్రపంచ ఉష్ణోగ్రతల పరంపర

- యూరోపియన్ వాతావరణ సంస్థ వెల్లడి

దిల్లీ: ఇటీవల కాలంలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతల పరంపర ప్రస్తుతానికి ముగిసిందని యూరప్‌కు చెందిన వాతావరణ సంస్థ కోపర్నికస్ పేర్కొంది. జులై, 2025.. ప్రపంచవ్యాప్తంగా మూడో వెచ్చని జులైగా రికార్డులో నిలిచిందని తెలిపింది. గత సంవత్సర (ఆగస్టు 2024- జులై 2025) కాలంలో.. పారిశ్రామికీకరణకు ముందు సగటు కంటే 1.53 డిగ్రీలు అధికంగా నమోదైందని ఏజెన్సీ పేర్కొంది. "జులై నెలలో ప్రపంచ ఉపరితల గాలుల ఉష్ణోగ్రతల సగటు 16.68 డిగ్రీలు. కాగా, ఇది 1991-2020ల మధ్య నమోదైన ఉష్ణోగ్రతల సగటు కంటే 0.45 డిగ్రీలు అధికం. 2025 జులై ఉష్ణోగ్రతలు.. 2023 జులై కంటే 0.27 డిగ్రీలు, 2024 జులై కంటే 0.23 డిగ్రీలు తక్కువ" అని కోపర్నికస్ వాతావరణ మార్పు శాస్త్రవేత్తలు తెలిపారు.

డంకీ మార్గంలో ఇద్దరు భారతీయుల అరెస్ట్

బ్రిడ్జ్‌వాటర్: డంకీ మార్గంలో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు భారతీయులు అరెస్టయ్యారు. అమెరికా-కెనడా సరిహద్దుల్లో ఉన్న మేన్ రాష్ట్రంలోని బ్రిడ్జ్‌వాటర్‌లో వీరిని బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. చట్టపరమైన చర్యల అనంతరం వారిని దేశం నుంచి పంపిస్తామని అధికారులు వెల్లడించారు. వీరు కాలినడకన సరిహద్దుకు చేరుకొని అక్కడి నుంచి అమెరికాలోకి ప్రవేశించేందుకు యత్నించినట్లు వివరించారు. అరెస్టయిన వారి వివరాలు ఇంకా తెలియరాలేదు.

మధ్యప్రదేశ్‌లో నలుగురికి జీబీఎస్

మందసౌర్: మధ్యప్రదేశ్‌లో మందసౌర్ జిల్లాలోని ఓ గ్రామంలో నలుగురు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారిన పడినట్లు గురువారం అధికారులు తెలిపారు. ఇది అరుదైన నాడీ సంబంధిత వ్యాధి. ఇందులో రోగనిరోధక వ్యవస్థ తన నరాలపైనే తానే దాడి చేస్తుంది. దీంతో కండరాల బలహీనత, పక్షవాతం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది అన్ని వయసుల వారికీ సోకుతుంది.

ఐర్లాండ్‌లో భారత సంతతి చిన్నారిపై జాత్యహంకార దాడి

ఇంటర్నెట్‌డెస్క్: ఐర్లాండ్‌లో ఆరేళ్ల భారత సంతతి చిన్నారి జాత్యహంకార దాడికి గురైంది. ఆమె ముఖంతో పాటు గుప్త అవయవాలపై కూడా కొందరు దుండగులు కొట్టారు. బాలిక కుటుంబం గత ఎనిమిదేళ్లుగా ఐర్లాండ్‌లో నివసిస్తోంది. ఇటీవల వీరికి ఐరిష్ పౌరసత్వం లభించింది. నర్సుగా పనిచేస్తున్న బాలిక తల్లి మాట్లాడుతూ... "ఈనెల 4న మా అమ్మాయి ఇంటి బయట ఆడుకుంటుండగా 12-14 మధ్య వయసున్న కొంతమంది అబ్బాయిలు ఆమెపై దాడి చేశారు. 'భారత్‌కు తిరిగి వెళ్లిపో' అంటూ జాత్యహంకార దూషణలు చేశారు" అని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

అమెరికాలో విమానాలకు అంతరాయం

- భారతీయులపైనా ప్రభావం

హ్యూస్టన్: సాంకేతిక లోపంతో అమెరికాలోని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానాలకు బుధవారం తీవ్ర అంతరాయం కలిగింది. పలు విమానాలు రద్దు కాగా మరిన్ని ఆలస్యంగా నడిచాయి. దీంతో వేల మంది ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇందులో పెళ్లిళ్లకు, కుటుంబాలను చూడటానికి వెళ్లే, తిరిగి వస్తున్న భారతీయులూ ఉన్నారు. వేసవి సెలవులను ముగించుకుని తిరిగి విధుల్లో చేరేందుకు వచ్చే వారికీ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఫ్లైట్ డిస్పాచ్ అండ్ లోడ్ ప్లానింగ్‌కు సంబంధించిన యూనిమాటిక్ వ్యవస్థల్లో లోపం తలెత్తింది. ఈ కారణంగా గురువారమూ పలు విమానాలకు అంతరాయం కలిగింది. బుధవారం అన్ని సంస్థలకు చెందిన 35శాతం విమానాలు ఆలస్యంగా నడిచాయని, 7 శాతం రద్దయ్యాయని ఫ్లైట్‌అవేర్ సంస్థ వెల్లడించింది. ఈ వారాంతంలో నెవార్క్, హ్యూస్టన్, షికాగో, వాషింగ్టన్, లాస్ ఏంజెలెస్, శాన్‌ఫ్రాన్సిస్కో, డెన్వర్, ఓర్లాండో, న్యూయార్క్, హొనొలులు, గ్వామ్, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ విమానాశ్రయాల్లో అంతరాయాలు ఏర్పడే అవకాశముందని తెలుస్తోంది.

ఆర్థిక నేరాల బాధితులకు రూ.23వేల కోట్లు అప్పగింత

- ఈడీ స్వాధీనం చేసుకున్న సొమ్ముపై సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ వెల్లడి

దిల్లీ: నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్)కి సంబంధించిన కేసుల దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటివరకు రూ.23వేల కోట్ల సొమ్మును స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక నేరాల బాధితులకు చెల్లించినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. దివాలా తీసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్‌ఎల్) ఆస్తుల విక్రయానికి అనుమతినిస్తూ ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సమీక్షించాలన్న అభ్యర్థనలపై విచారణలో భాగంగా గురువారం ఓ న్యాయవాది బీపీఎస్‌ఎల్‌పై ఈడీ కేసు గురించి ప్రస్తావించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ బదులిస్తూ..'ఇక్కడ కూడా ఈడీ ఉందా?' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. "ఇక్కడో వాస్తవం చెప్పాలి. ఈ విషయాన్ని మేం ఏ కోర్టులోనూ చెప్పలేదు. ఇప్పటివరకు మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా రూ.23వేల కోట్లను ఈడీ స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తం దేశ ఖజానాలో ఉండదు. ఆ సొమ్మును బాధితులకు ఈడీ అందజేసింది" అని వివరించారు.

అయితే, ఈడీ కేసుల్లో శిక్షల రేటు ఎలా ఉందని సీజేఐ అడగ్గా.. శిక్షలు పడిన సందర్భాలు తక్కువేనని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. "దోషులుగా తేలకపోయినా.. విచారణ పేరుతో సంవత్సరాల పాటు మీరు వారిని శిక్షించడంలో సఫలం అవుతున్నారు కదా' ' అని ధర్మాసనం పేర్కొంది. కొందరు రాజకీయ నాయకుల వద్ద భారీగా పట్టుబడిన డబ్బును కౌంటింగ్ యంత్రాలు కూడా లెక్కించలేకపోతున్నాయని, కొత్త వాటిని తెప్పించాల్సి వస్తోందని తుషార్ మెహతా తెలిపారు. ఆ తర్వాత కేసుల విచారణ, శిక్ష విధింపు అంతా సామాజిక మాధ్యమాలు, మీడియాలోనే జరిగిపోతోందని ఆక్షేపించారు. దీనికి సీజేఐ స్పందిస్తూ... మీడియా కథనాల ఆధారంగా కోర్టులు కేసులపై నిర్ణయం తీసుకోవని తెలిపారు.

'సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యల తీర్పు'పై సుప్రీంకోర్టులో నేడు మళ్లీ విచారణ

దిల్లీ: 'ఘోరమైన తీర్పు' వెలువరించారంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన వ్యవహారం మరోసారి సర్వోన్నత న్యాయస్థానం ముందుకు రానుంది. సివిల్ వివాదంలో క్రిమినల్ స్వభావ సమన్ల జారీని హైకోర్టు జడ్జి సమర్థించడాన్ని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. పదవీ విరమణ చేసే వరకు ఆ జడ్జికి క్రిమినల్ వ్యాజ్యాలు అప్పగించరాదనీ అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. అయితే, ధర్మాసనం ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకే చెందిన సీనియర్ న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వారు ఈ విషయమై సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ను సంప్రదించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు జడ్జి తీర్పు కేసు శుక్రవారం జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ముందుకే రానుందని కేసుల విచారణ జాబితా ద్వారా వెల్లడైంది.



రక్షాబంధన్ సందర్భంగా గుజరాత్‌లోని సూరత్‌లో శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ విద్యార్థుల 'రాఖీ' ప్రదర్శన

సమయానికి అధికార నివాసం ఖాళీ చేస్తా: జస్టిస్ గవాయ్

దిల్లీ: పదవీ విరమణ చేశాక తాను నిర్దిష్ట కాల పరిమితిలోగా అధికార నివాసాన్ని ఖాళీ చేస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ అన్నారు. నవంబరులో తన పదవీ కాలం పూర్తయిపోతుందని, సమయాభావం ఉన్నా గడువులోగా అధికార నివాసాన్ని తప్పకుండా ఖాళీ చేస్తానని చెప్పారు. శుక్రవారం పదవీ విరమణ చేయనున్న జస్టిస్ సుధాంశు ధూలియా గౌరవార్థం 'సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్' ఏర్పాటుచేసిన వీడ్కోలు సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ విషయం వెల్లడించారు. పదవీ విరమణ చేసిన మర్నాడే జస్టిస్ ధూలియా తన అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారని జస్టిస్ గవాయ్ ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సకాలంలో అధికార నివాసం ఖాళీ చేయని కారణంగా వివాదం రేగిన నేపథ్యంలో జస్టిస్ గవాయ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ముంబయిలో కబూతర్ఖానాల రగడ

- వాటి చుట్టూ పరదాలు వేయడంపై నిరసనలు
- మూసివేతకు ఆదేశాలివ్వలేదన్న బాంబే హైకోర్టు

ముంబయి: దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో పావురాలకు ఆహారం పెట్టే కబూతర్ఖానాలపై వివాదం తలెత్తింది. పావురాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారంటూ వాటిని మూసివేయాలన్న డిమాండ్లు రావడంతో ముంబయి మహానగరపాలక సంస్థ టార్పాలిన్ పరదాలు వేసింది. ఈ చర్యపై ఆగ్రహించిన కొందరు స్థానికులు ఆ పరదాలను చింపివేయడం ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ.. హైకోర్టు ఆదేశాలతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కబూతర్ఖానాలను మూసివేయాలంటూ తాము ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని బాంబే హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. మహానగర పాలక సంస్థ తీసుకున్న కబూతర్ఖానాల మూసివేత నిర్ణయాన్ని సవాల్ చేసిన పిటిషనర్‌కు తాము మధ్యంతర ఉపశమనం ఇవ్వలేదని, స్టే ఇచ్చేందుకు నిరాకరించామని జస్టిస్ జి.ఎస్.కులకర్ణి, జస్టిస్ ఆరిఫ్ డాక్టర్ ధర్మాసనం తెలిపింది. అయితే, ప్రజల ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై పావురాలు ప్రభావం చూపితే మాత్రం.. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. ఈ సమస్యపై అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సూచనలు చేసేందుకు, నగరంలోని పాత కబూతర్ఖానాలను కొనసాగించాలా.. వద్దా అనే దానిపై నిపుణుల కమిటీని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. పావురాలకు ఆహారం అందివ్వటాన్ని మత సంబంధ విషయంగా చూడరాదని వివిధ సామాజిక వర్గాల నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల మనోభావాలను గౌరవించాలని, అదే సమయంలో స్థానికుల ఆరోగ్య సమస్యలనూ గుర్తెరగాలని కోరుతున్నారు.

ఏడో రోజుకు చేరుకున్న ఆపరేషన్ అఖల్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ (ఆపరేషన్ అఖల్) ఏడో రోజుకు చేరుకుందని అధికారులు తెలిపారు. గురువారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది గాయపడినట్లు పేర్కొన్నారు. దక్షిణ కశ్మీర్‌లోని భద్రతా పరిస్థితులను, ఉగ్రవాద నిరోధక గ్రిడ్‌లను నార్తర్న్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ సమీక్షించారు. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఏడుగురు భద్రతా సిబ్బంది గాయపడినట్లు అధికారులు తెలిపారు.

అమెరికాలో మరో కాల్పుల ఘటన

- ఇద్దరి మృతి

గ్లెన్‌వుడ్ (అమెరికా): పశ్చిమ అయోవాలోని ఒక ఇంట్లో జరిగిన కాల్పులు, తదనంతర పేలుడులో ఇద్దరు మరణించారు, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. అయోవా రాష్ట్రంలోని గ్లెన్‌వుడ్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. కాల్పుల అనంతరం సంభవించిన పేలుడు కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయని గ్లెన్‌వుడ్ పోలీస్ చీఫ్ ఎరిక్ జోహాన్సన్ అన్నారు. కాల్పులకు సంబంధించి ఒక వ్యక్తిని నిర్బంధించినట్టు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అయోవా నేర పరిశోధన విభాగం త్వరలో మరిన్ని వివరాలను అందిస్తుందన్నారు. అయితే ఆయన కాల్పులకు బాధ్యులైన వ్యక్తి లేదా వ్యక్తుల పేర్లు వెల్లడించలేదు. కాల్పుల ఘటన వెనక విస్తృతమైన కుట్ర ఏదీ లేదని, దీంతో సమాజానికి ముప్పు లేదని జోహాన్సన్ తెలిపారు.

మానవీయ శాస్త్ర మండళ్లకు అమెరికా కోర్టు ఊరట

వాషింగ్టన్: అమెరికా అంతటా మానవీయ శాస్త్రాల (హ్యూమానిటీస్) మండళ్లకు జాతీయ మానవీయ శాస్త్రాల నిధి నుంచి గ్రాంట్ల విడుదలను నిలిపివేయడంపై ఓరెగాన్ రాష్ట్రంలోని ఒక ఫెడరల్ న్యాయమూర్తి బుధవారం స్టే జారీచేశారు. నిధుల విడుదల అనేది రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ (పార్లమెంటు) అధికారాల పరిధిలోని అంశమనీ, అది దేశాధ్యక్షుడి పరిధిలోకి రాదనీ హ్యూమానిటీస్ మండళ్లు చేసిన వాదనను అంగీకరించి నిధుల బంద్‌పై తాత్కాలిక స్టే ఇచ్చారు. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడానికని ట్రంప్ చేపట్టిన విధానం కింద ఈ మండళ్లకు గ్రాంట్ల విడుదలను ఏప్రిల్‌లో నిలిపేశారు. దానిపై మండళ్లు మే నెలలో కోర్టుకెక్కాయి. చరిత్ర, సాహిత్యం, తత్వశాస్త్రం, మతవ్యవహారాలు, కళలు తదితరాలను మానవీయ శాస్త్రాలంటారు. మానవీయ శాస్త్ర అధ్యయన మండళ్లకు ఇవ్వాల్సిన నిధులను వేరే విధంగా ఉపయోగించకూడదని జడ్జి ఆదేశించారు.

కెనడాలో కపిల్ శర్మ కేఫ్‌పై మరోసారి కాల్పులు

ఇంటర్నెట్ డెస్క్: కెనడాలో బాలీవుడ్ కమెడియన్, టీవీ హోస్ట్ కపిల్ శర్మకు చెందిన కేఫ్‌లో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. దుండగులు దాదాపు 25 రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. నెల వ్యవధిలోనే కపిల్ శర్మ కేఫ్‌పై రెండు సార్లు దాడులు జరగడం గమనార్హం. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లు తరఫున ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోల్డీ ఢిల్లాన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. "జై శ్రీరాం. ఈ రోజు కపిల్ శర్మ కేఫ్ వద్ద జరిగిన కాల్పులకు గోల్డీ ఢిల్లాన్, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహిస్తుంది. తదుపరి చర్య ముంబయిలో ఉంటుంది" అని పోస్టులో పేర్కొన్నారు.

వజ్రం కోసం శోధిస్తే 'బంగారం' దొరికింది!

వాషింగ్టన్: వజ్రాల పుట్టుక గురించి శోధిస్తున్న అమెరికా శాస్త్రవేత్తలు ఒక అనూహ్య ఆవిష్కారం చేశారు. ఘన బైనరీ గోల్డ్ హైడ్రైడ్ అనే పదార్థాన్ని యాదృచ్ఛికంగా తయారుచేశారు. ఈ మూలకంలో బంగారం, హైడ్రోజన్ పరమాణువులు ఉన్నాయి. తీవ్ర పీడన, ఉష్ణ పరిస్థితుల్లో హైడ్రోకార్బన్లు వజ్రంగా మారుతున్న తీరుపై అధ్యయనం చేస్తున్నప్పుడు ఈ పరిణామం చోటుచేసుకుంది. "సాధారణంగా బంగారం ఏ పదార్థంతోనూ చర్య జరపదు. అందువల్ల తాజా ప్రయోగంలో ఎక్స్‌రేలను శోషించుకోవడానికి దాన్ని ఉపయోగించాం" అని పరిశోధనకు నాయకత్వం వహించిన ముంగో ఫ్రాస్ట్ అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు. పరిశోధనలో భాగంగా డైమండ్ యాన్విల్ సెల్ అనే సాధనాన్ని ఉపయోగించి హైడ్రోకార్బన్ నమూనాలను.. భూమి లోపలి పొర అయిన మ్యాంటిల్‌ను మించిన పీడనానికి గురిచేశారు. ఆ తర్వాత వాటిని ఎక్స్‌రేలతో 3,500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు వేడిచేశారు. ఈ క్రమంలో ఈ నమూనాల నుంచి పరావర్తనం చెందిన ఎక్స్‌రేలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. వాటిలో జరిగిన నిర్మాణ సంబంధ మార్పులను గమనించారు. కర్బన పరమాణువుల నుంచి వజ్రపు ఆకృతులు ఏర్పడటాన్ని గుర్తించారు. ఇదే క్రమంలో హైడ్రోజన్ పరమాణువులు బంగారు రేకుతో చర్య జరిపి.. గోల్డ్ హైడ్రైడ్‌ను ఏర్పర్చడాన్ని గమనించి వారు విస్మయానికి లోనయ్యారు. దట్టమైన పరమాణు హైడ్రోజన్ గురించి శోధించడానికి ఇది దోహదపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. తద్వారా కొన్నిరకాల గ్రహాల అంతర్భాగాల గురించి తెలుసుకోవడానికి, సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరిగే కేంద్రక సంలీన చర్యపై మరిన్ని వివరాలు వెలుగులోకి తీసుకురావడానికి వీలు కలుగుతుందని వివరించారు. భూమిపై ఈ చర్యను అనుకరించి, భారీ పరిమాణంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి ఇది మార్గం సుగమం చేయవచ్చని పేర్కొన్నారు.



శాస్త్ర పరిశోధనలపై ట్రంప్ దాడి

కేంబ్రిడ్జ్: ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిధులను నిలిపేయడంతో మాదకద్రవ్య వ్యసనాన్ని మాన్పించడం మొదలుకొని క్యాన్సర్ వరకు వివిధ అంశాలపై ఏళ్లతరబడి పరిశోధన జరుపుతున్న శాస్త్రజ్ఞులు తమ కృషిని నిలిపేయాల్సి వస్తోంది. తమకు సాయపడుతున్న యువ పరిశోధకులకు లేఆఫ్ ప్రకటించక తప్పడంలేదు. సిబ్బంది జీతాల కోసం ఏ నెలకు ఆ నెల వెతుక్కోవలసి వస్తోంది. హార్వర్డ్ తన సొంత నిధులు 25 కోట్ల డాలర్లను పరిశోధనకు కేటాయిస్తానని ప్రకటించినా, అది పరిశోధనలు కొనసాగించడానికి తోడ్పడేంతగా లేవు. నిర్వహణ ఖర్చులు మాత్రం తీరుతున్నాయి. ప్రస్తుతం ఆగిపోయిన పరిశోధనలు తిరిగి ప్రారంభం కావాలంటే కనీసం అయిదేళ్లు పడుతుంది. ప్రజారోగ్యంపై చేపట్టిన పరిశోధన ప్రాజెక్టులకు 190 గ్రాంట్లను రద్దు చేయడం 130 మంది శాస్త్రజ్ఞులకు పెను విఘాతమైంది. వ్యాధులు స్త్రీలను ఒకరకంగా, పురుషులను ఒక రకంగా ప్రభావితం చేస్తాయా అనే అంశంపైనా, నాడీ సంబంధ వ్యాధులు, రక్తనాళాల పూడిక మీద పరిశోధనలకు గ్రాంట్లు నిలిచిపోయాయి. డాక్టరేట్ విద్యార్థుల శిక్షణ కార్యక్రమాలకు 2.4 కోట్ల డాలర్ల నిధులను నిలిపేశారు. చివరకు ట్రంప్ సర్కారుకూ, హార్వర్డ్‌కూ రాజీ కుదిరినా నిలిచిపోయిన ప్రాజెక్టులను నిధులను ఎప్పటికి పునరుద్ధరించగలరో చెప్పలేం. అమెరికాకు బలమైన మూల స్తంభాల్లో సైన్స్ ఒకటి. ట్రంప్ సర్కారు చర్యలతో అది బలహీనపడిపోతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అమెరికా నాయకత్వం దెబ్బతింటోంది.

సూడాన్‌లో 40 మంది కిరాయి సైనికుల హతం

కైరో: సూడాన్‌లో ప్రభుత్వ బలగాలకు, తిరుగుబాటు వర్గాలకు మధ్య సాగుతున్న అంతర్యుద్ధంలో గురువారం మరో భారీ పరిణామం చోటుచేసుకుంది. తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న న్యాలా విమానాశ్రయంపై ప్రభుత్వ బలగాలు జరిపిన దాడిలో కొలంబియాకు చెందిన 40 మంది కిరాయి సైనికులు మరణించారు. ఈ దాడిలో తిరుగుబాటు దళమైన ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పంపిన ఆయుధ సంపత్తి, ఒక యూఏఈ యుద్ధ విమానం ధ్వంసమైనట్టు సూడాన్ సైనిక అధికారులు వెల్లడించారు. సూడాన్ ప్రభుత్వ బలగాలకూ, ఆర్‌ఎస్‌ఎఫ్‌కూ మధ్య 2023 ఏప్రిల్ నుంచి పోరాటం సాగుతోంది. ఈ పోరాటం దేశంలో అరాచకానికి, అవ్యవస్థకు దారితీసింది. ఈ అంతర్యుద్ధంలో వేల మంది మరణించారు, దాదాపు 1.4 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. తాజా దాడి సూడాన్ సంక్షోభంలో జోక్యం చేసుకుంటున్న విదేశీ శక్తులకు ఒక హెచ్చరిక అని ప్రభుత్వ అనుకూల సూడాన్ టీవీ ప్రకటించింది. అయితే ఈ ఘటనపై యూఏఈ కానీ, తిరుగుబాటు బలగమైన ఆర్‌ఎస్‌ఎఫ్ కానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. గత సంవత్సరం తిరుగుబాటు బలగాలు దక్షిణ దర్ఫూర్ రాష్ట్ర రాజధాని నగరమైన న్యాలాలో ఉన్న విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పౌర విమానయానం కోసం ఏర్పాటు చేసిన ఈ విమానాశ్రయాన్ని ఆర్‌ఎస్‌ఎఫ్ సైనిక కార్యకలాపాలకు వినియోగిస్తోందని సూడాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.



జమ్మూకశ్మీర్‌లోని ఉధమ్‌పుర్ సమీపాన కాలువలో పడిన సీఆర్పీఎఫ్ జవాన్ల వాహనం వద్ద సహాయక చర్యలు

కాలువలో పడిన వాహనం.. ముగ్గురు జవాన్ల మృతి

- 15 మందికి గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపుర్ జిల్లాలో భద్రతా సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి కాలువలో పడటంతో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. గురువారం ఉదయం బసంత్ గఢ్ నుంచి విధులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ఉన్న వాహనం కట్వా ప్రాంతంలో అదుపుతప్పింది. అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఇంకొకరు ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు. 15 మంది చికిత్స పొందుతున్నారు.

జీసీసీ పాలకమండలి సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: గిరిజన సహకార సంస్థ(జీసీసీ) పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా నియమితులైన వారిలో పాలకొండకు చెందిన నిమ్మల నిబ్రం, పాడేరుకు చెందిన బొర్ర నాగరాజు, పోలవరానికి చెందిన కన్నాప్రజు మడ్కమ్, శ్రీశైలానికి చెందిన జీవుల నాయక్, అరకు వ్యాలీకి చెందిన పి.రాజారావును ఉన్నారు.

ఏపీ కేడర్‌కు ఏజీఎంయూటీ ఐపీఎస్ అధికారి విబుకృష్ణ

ఈనాడు, అమరావతి: అరుణాచల్‌ప్రదేశ్-గోవా- మిజోరం కేంద్రపాలిత ప్రాంతాల (ఏజీఎంయూటీ) కేడర్ 2021 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి యు.విబుకృష్ణను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ చేసింది. విబుకృష్ణ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సుస్మితను వివాహం చేసుకోవడంతో రాష్ట్రంలో సేవలకు అవకాశం కల్పించారు.

హెలికాప్టర్ కొనుగోలుకు బిడ్ ఎవల్యూషన్ కమిటీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి సహా ఇతర ప్రముఖులు వినియోగించే హెలికాప్టర్ కొనుగోలుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి తగిన సిఫార్సులు చేసేందుకు బిడ్ ఎవల్యూషన్ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. ఆర్థికశాఖ ఉప కార్యదర్శి నూరుల్ ఖమర్, ఎస్ఎస్‌జీ డైరెక్టర్ సచికేత్ విశ్వనాథ్, డీజీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎల్ నాయక్, ఏపీఏసీఎల్ ఎండీ తాతా మోహనరావు, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. సాంకేతిక, ఆర్థిక అంశాల్ని పరిశీలించి ఈ కమిటీ వారం రోజుల్లోగా నిపుణుల కమిటీకి సిఫార్సులు పంపాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తితిదేతో భూ మార్పిడికి రాష్ట్ర పర్యాటక సంస్థకు అనుమతి

ఈనాడు, అమరావతి: తిరుపతి గ్రామీణ మండలం పేరూరు గ్రామంలోని రాష్ట్ర పర్యాటక సంస్థ (ఏపీటీఏ)కి చెందిన 24.68 ఎకరాల భూమిని తిరుపతి అర్బన్ మండలం సర్వే నంబరు 588/ఏలో గల 25 ఎకరాల తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) భూమితో మార్పిడి చేసుకోడానికి ఏపీటీఏకి అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక సంస్థ సీఈఓను ఆదేశిస్తూ పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీచేశారు.

డిస్కంల రుణానికి ప్రభుత్వ హామీ

ఈనాడు, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద చేపట్టిన పనులను నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేసేందుకు పీఎఫ్‌సీ నుంచి రుణంగా తీసుకునే రూ.4,573.94 కోట్లకు హామీగా ఉండేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీనిపై 2 శాతం గ్యారంటీ కమిషన్ కింద డిస్కంలు ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొంది. ఎస్‌పీడీసీఎల్‌కు రూ.3,544.57 కోట్లు, సీపీడీసీఎల్‌కు రూ.1,029.37 కోట్లు రుణంగా ఇచ్చేందుకు పీఎఫ్‌సీ గతంలోనే అంగీకరించింది.

ట్రైకార్ పాలకమండలికి ఇద్దరు సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్)కు పాడేరుకు చెందిన వి.గంగులయ్య, పుంగనూరుకు చెందిన బి.కృష్ణా నాయక్‌లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

గవర్నర్‌తో ఆదాయ పన్ను ప్రధాన కమిషనర్ భేటీ

ఈనాడు, అమరావతి: ఆదాయ పన్ను శాఖ ఏపీ, తెలంగాణ ప్రాంతీయ ప్రధాన కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ గురువారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. ఆ శాఖ ప్రతినిధులతో ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

ఈ నెల 12 నుంచి 18 వరకు ర్యాగింగ్ వ్యతిరేక వారం

ఈనాడు, హైదరాబాద్: వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ఈ నెల 12 నుంచి 18 వరకు దేశవ్యాప్తంగా ర్యాగింగ్ వ్యతిరేక వారాన్ని నిర్వహించాలని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఆదేశించింది. 12న భారత ర్యాగింగ్ వ్యతిరేక దినం సందర్భంగా కళాశాలల్లో వివిధ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరింది.

రూ.41వేల కోట్ల పనులు ఎక్కడివక్కడే!

- ఇందులో రూ.3,931 కోట్ల విలువైన పని పూర్తి
- రూ.2,495 కోట్లు చెల్లించేశారు
- ఏళ్ల తరబడి ఆ నిధులన్నీ నిరుపయోగమే
- సాగునీటి రంగంపై జగన్ సర్కార్ నిర్లక్ష్య ఫలితం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో గడిచిన ఏడెనిమిది ఏళ్లలో పాలనామోదం ఇచ్చినా.. ముందడుగు పడని పనుల విలువ రూ.41వేల కోట్లుగా లెక్కతేలింది. 2018 నుంచి 2022 వరకు ఆయా ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించి టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకున్నారు. కొన్ని ప్యాకేజీల్లో అంతో, ఇంతో పని జరిగింది. మరికొన్నింటిలో అదీలేదు. దీంతో ఆ ప్రాజెక్టులు నిరుపయోగంగా మిగిలిపోయాయి. ఈ ప్యాకేజీలన్నింటిలో కలిపి ఇప్పటివరకు రూ.3,931 కోట్ల పని జరిగింది. రూ.2,495 కోట్ల బిల్లులు ఇప్పటికే గుత్తేదారులకు చెల్లించేశారు. అంటే గడిచిన ఏడెనిమిది ఏళ్లుగా ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.2,500 కోట్లు వృధాగా మారాయి. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడగానే అన్ని ప్రభుత్వశాఖల పనులపైనా అధ్యయనం చేయాలని సూచించారు. 2024 మార్చి నెలాఖరుకు 25%లోపు పూర్తయినవి, అసలు పని మొదలుపెట్టనివి నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఆయా ప్రాజెక్టుల్లో ఏవేం పనులు ప్రాధాన్యమైనవి, ఏవి వెంటనే చేపట్టాలి? ఏవి నిలిపివేయాలో అధ్యయనం చేసి తేల్చాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ క్రమంలో ఒక్క జలవనరుల శాఖలోనే రూ.41వేల కోట్ల విలువైన 155 పనులు ఏడెనిమిదేళ్లుగా పెండింగులో ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వాలు సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. జగన్ ప్రభుత్వం రాగానే అప్పటికే ప్రారంభించిన పనులు నిలిపివేసింది. ఆ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై అత్యల్ప ఖర్చు చేసింది. అత్యంత ప్రాధాన్యం అని పేర్కొన్న 5 ప్రాజెక్టులనూ పూర్తిచేయలేకపోయింది. నెల్లూరు, సంగం బ్యారేజిల పెండింగు పనులే పూర్తిచేసి మమ అనిపించింది. ఆ ప్రభుత్వహయాంలో పాత ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కొత్త ప్రాజెక్టులు చేపట్టింది.

గతంలో ఆగిపోయిన 155 పనుల్లో 71 పనులు ప్రస్తుతం మళ్లీ కొనసాగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వీటిలో ఇంతవరకు రూ.1,183 కోట్లు ఖర్చుచేసిన పనులకు అంతో ఇంతో విలువ దక్కుతుంది. మిగిలిన పనుల్లో 55 ప్యాకేజీలు దాదాపు ఇప్పట్లో చేపట్టడానికి సాధ్యం కాదని తేల్చారు. ఇప్పటికే రూ.1,232 కోట్లతో పూర్తిచేసిన 31 ప్యాకేజీల్లో పనులు కొనసాగించాలా లేదా అన్న దానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి.

పరిశీలనలో వెల్లడైన విషయాలు గమనిస్తే.. మొత్తం 155 ప్యాకేజీల్లో 85 ప్యాకేజీల్లో అసలు ఇంతవరకు పని ప్రారంభించనే లేదు. టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకోవడం తప్ప ఎలాంటి పని చేపట్టలేదు. మరో 70 ప్యాకేజీల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో 1%లోపు పనిచేసిన వాటి నుంచి 19% వరకు పనులు చేసినవి ఉన్నాయి. వీటిలో 37 పనులు కొనసాగించాలని ఇప్పటికే నిర్ణయించారు. 16 పనులు ప్రస్తుతం అవసరం లేదనే అభిప్రాయంతో ఉన్నారు. తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



గవర్నర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

ఈనాడు, అమరావతి: బ్రహ్మకుమారీల ఇన్‌ఛార్జి బీకే శాంతా, ప్రజాపిత బ్రహ్మకుమారీ-ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యులు గురువారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు రాఖీ కట్టారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

33 ఏళ్ల లీజుకు 22 ఏపీటీడీసీ హోటళ్లు, రిసార్టులు

టెండర్ల ప్రక్రియకు ప్రభుత్వ అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ఆరు క్లస్టర్లలోని 22 హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు అవసరమైన టెండర్ల (ఆర్ఎఫ్‌పీ) ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ బిడ్ సమావేశాల్లో ప్రైవేటు ఏజెన్సీల నుంచి వచ్చే ప్రతిస్పందన ఆధారంగా ఆర్ఎఫ్‌పీ ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసే అధికారం ఎండీకి ప్రభుత్వం కల్పించింది. పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించే ఉద్దేశంతో ఏపీటీడీసీకి చెందిన హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రతిపాదనలను బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదించిన విషయం తెలిసిందే. వీటిని 33 ఏళ్ల లీజుకు కేటాయించనున్నారు. ఇంటర్నల్ బెంచ్ మార్కు(ఐబీఎం)గా నిర్ణయించిన 12% పైన వచ్చే స్థూల ఆదాయంలో వాటా లేదా పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్ణయించిన కనీస వార్షిక అద్దెలో.. ఏది ఎక్కువైతే దాన్ని లీజుగా నిర్ణయించేలా నిబంధనలు రూపొందించనున్నారు. హోటళ్లు, రిసార్టుల నిర్వహణలో అనుభవం కలిగిన ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ (ఓఅండ్ఎం)ను అప్పగించనున్న హోటళ్లు, రిసార్టుల వివరాలు

హోటల్	గదులు
క్లస్టర్-1	
యాత్రీ నివాస్, విశాఖ	41
హరితా బీచ్ రిసార్టు, కళింగపట్నం	4
క్లస్టర్-2	
హరితా హోటల్, ద్వారకాతిరుమల	18
హరితా కోకోనట్ రిసార్టు, దిండి	32
క్లస్టర్-3	
హరితా హోటల్, సూర్యలంక	39
హరితా హోటల్, బెర్మ్‌పార్కు, విజయవాడ	30
హరితా హోటల్, భవానీ ద్వీపం, విజయవాడ	45
హరితా హోటల్, విజయపురి సౌత్, నాగార్జునసాగర్	19
హరితా హోటల్, ఎత్తిపోతల	8
ధ్యానబుద్ధ	0
క్లస్టర్-4	
హరితా హోటల్, నెల్లూరు	54
హరితా హోటల్, శ్రీకాళహస్తి	25
క్లస్టర్-5	
హరితా హోటల్, గండికోట	10
హరితా హోటల్, గండి	10
హరితా హోటల్, కడప	51
హరితా హోటల్, ఒంటిమిట్ట	4
క్లస్టర్-6	
హరితా హోటల్, కర్నూలు	28
హరితా హోటల్, ఓర్వకల్లు	20
హరితా హోటల్, మహానంది	28
హరితా హోటల్, అహోబిలం	38
హరితా హోటల్, లేపాక్షి	8
హరితా హోటల్, శ్రీశైలం	100
మొత్తం	222

ఆ కేసు పురోగతి వివరాలివ్వండి

దర్గామిట్ట పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: తన ఇంటిని కొందరు ధ్వంసం చేసిన వ్యవహారంలో వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసు పురోగతి వివరాలు సమర్పించాలని నెల్లూరు-దర్గామిట్ట పోలీసులను హైకోర్టు ఆదేశించింది. దాడికి పాల్పడిన వారి వివరాలు, ఫొటోలు అందజేసినప్పటికీ నిందితులుగా చేర్చకపోవడంపై వివరణ ఇవ్వాలని పేర్కొంది. అనంతరం విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. తన ఇంటిపై కొందరు దాడి చేసిన వ్యవహారంలో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కేసు నమోదు చేయలేదని, ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఫిర్యాదులో పేర్కొన్న వారిని నిందితులుగా చేర్చలేదని పేర్కొంటూ ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై గురువారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున రూపేశ్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. దాడి చేసిన వారి పేర్లు, సీసీ టీవీ ఫుటేజ్, ఫొటోలు పోలీసులకు అందజేసినప్పటికీ చర్యలు లేవన్నారు. దాడికి ప్రేరేపించిన తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ.. 'ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది. అయితే దర్యాప్తు ఎలా చేయాలి, ఎవర్ని నిందితులుగా చేర్చాలని ఫిర్యాదుదారుడు పోలీసులను నిర్దేశించలేరు' అన్నారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి.. పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించారు.

మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే..

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 10.10 లక్షల బంగారు కుటుంబాలను 1.12 లక్షల మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు. మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి దత్తత తీసుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని.. ఎవరినీ బలవంతం చేయవద్దని సూచించారు. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఈ పార్కులు, ముఖ్య ప్రాజెక్టులకు భూసంబంధ అంశాలపై జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని చెప్పారు. బంగారు కుటుంబ అవసరాలను తెలుసుకునేందుకు నిర్దేశించిన నీడ్ అసెస్‌మెంట్ సర్వే కార్యక్రమాన్ని రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. 2027-28 నాటికి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటులో భాగంగా 175 నియోజకవర్గాల్లో భూముల సేకరణ, లాజిస్టిక్ ప్రణాళికలపై పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటికే 98 ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్లు భూములు గుర్తించారని.. 54 పార్కులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా జరిగాయని తెలిపారు.

అగ్నిమాపక శాఖ డీజీగా వెంకటరమణ



ఈనాడు, అమరావతి: రాష్ట్ర విపత్తు స్పందన- అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా పెనికలపాటి వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఏపీ అగ్నిమాపక సేవల శిక్షణ కేంద్రంలో సంచాలకుడిగా ఉన్న ఆయనకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీసత్యసాయి జిల్లా మోదుగులకుంట గ్రామానికి చెందిన వెంకటరమణ 1996లో జిల్లా అగ్నిమాపక అధికారిగా గ్రూప్-1లో ఎంపికయ్యారు. కృష్ణా, విశాఖపట్నం, హైదరాబాద్ డివిజన్లలో డివిజనల్ అగ్నిమాపక అధికారిగా పనిచేశారు. ప్రాంతీయ అగ్నిమాపక అధికారిగానూ సేవలందించారు. అదనపు సంచాలకుడిగా హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో పనిచేశారు. రాష్ట్ర విభజనతో ఏపీ అగ్నిమాపక సేవల శిక్షణ కేంద్రానికి బదిలీపై వచ్చి 2020 నుంచి సంచాలకుడిగా కొనసాగుతున్నారు. డీజీగా బాధ్యతల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

ఏపీఈఆర్‌సీ లీగల్ సభ్యుడి కోసం ఇద్దరి పేర్ల ప్రతిపాదన


సీఎం ఆమోదానికి పంపిన అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) లీగల్ సభ్యుడి ఎంపిక కోసం ఇద్దరి పేర్లను సీఎం పరిశీలనకు అధికారులు గురువారం పంపించారు. లీగల్ సభ్యుడి నియామకానికి ఇచ్చిన ప్రకటనకు 30 మంది నుంచి దరఖాస్తులు అందాయి. నిర్దేశిత అర్హతలను పరిశీలించి 15 మంది దరఖాస్తులను అధికారులు తుది పరిశీలనకు తీసుకున్నారు. వారిలో ఇద్దరి పేర్లను ముఖ్యమంత్రి పరిశీలనకు తాజాగా పంపించారు. ఏపీఈఆర్‌సీలో ఆర్థిక, న్యాయ, టెక్నికల్ సభ్యులు ఉంటారు. వారిలో ఒకరిని ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమిస్తుంది. న్యాయ, టెక్నికల్ సభ్యులుగా గతంలో నియమించిన వారి పదవీ కాలం పూర్తి కావడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిలో న్యాయ విభాగానికి చెందిన సభ్యుడి ఎంపిక కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటన ఇచ్చింది.

ఏ లైటింగ్ డిజైన్ బాగుంది?



మొదటి డిజైన్



రెండో డిజైన్ ఇలా..

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం తుది మెరుగులు దిద్దుకుంటోంది. భవనం ముందు భాగాన్ని (ఫేసేడ్) విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. దీని కోసం లైటింగ్ సంస్థలు జాగ్వార్, సిగ్నిఫైతో అధికారులు రెండు డిజైన్లు చేయించి, సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో ఓటింగ్‌కు ఉంచారు. ఓటు వేయాలనుకునేవారు సీఆర్‌డీఏ సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబరు నమోదు చేసిన తర్వాత సబ్మిట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. రెండు వీడియోల్లో ఎక్కువ మంది ఓటు వేసిన డిజైన్‌ను ఖరారు చేస్తారు.

ప్రకటనలే తప్ప.. నేతన్నలకు చేసిందేమీ లేదు

ప్రభుత్వంపై జగన్ విమర్శలు

ఈనాడు, అమరావతి: 'మగ్గానికి 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అన్నారు. కానీ, ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయలేదు' అని గురువారం ఎక్స్ వేదికగా వైకాపా అధ్యక్షుడు జగన్ విమర్శలు గుప్పించారు. 'నేతన్నలకు జీఎస్టీ రీయింబర్స్ చేస్తామని చెప్పారు. దాని కోసం దాదాపు రూ.250 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా. కానీ, బడ్జెట్‌లో ప్రభుత్వం అందుకు కేటాయించింది మాత్రం సున్నా. పత్రికల్లో ప్రకటనలు తప్ప.. నేతన్నలకు మీరు చేసిందేమీ లేదు. అన్ని వర్గాల్లాగే వీరినీ చంద్రబాబు మోసం చేశారు. వైకాపా హయాంలో నేతన్నలకు మేం ఏటా రూ.24 వేలు ఇచ్చాం. నేతన్నలకు ఉచితంగా, పవర్‌లూమ్‌లకు రాయితీపై విద్యుత్ అందించాం' అని పేర్కొన్నారు.

ఇనాం భూములకు 'నిషిద్ధ' చెర వీడేదెప్పుడు?

- రిజిస్ట్రేషన్లు జరగక తక్కువ ధరకు భూములు అమ్ముకుంటున్న రైతులు
- బ్యాంకు రుణాలు, 'అన్నదాతా సుఖీభవ' సాయం అందక ఆందోళన

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, భీమవరం: రాష్ట్రంలో ఇనాం భూముల పరిష్కారం విషయంలో జరుగుతున్న జాప్యం రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. ఒకప్పుడు పట్టా భూములుగా ఉన్న వీటిని నిషిద్ధ జాబితాలోకి చేర్చేయడంతో.. క్రయ, విక్రయాలు జరగడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అడపాదడపా సమావేశమవుతున్నా.. ఇనాం భూముల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్య పరిష్కారం కోసం మరోమారు ఆర్డినెన్స్ జారీచేయాలన్న చర్చ వచ్చినప్పటికీ ఈ దిశగానూ కార్యాచరణ లేదు.

రెవెన్యూశాఖ 2023 జులైలో జారీ చేసిన జీఓ 310 మేరకు రాష్ట్రంలో 1,38,848 ఎకరాల భూమి విలేజ్ సర్వీస్ ఇనాం కింద ఉంది. ఈ భూములను నిషిద్ధ జాబితాలో చేర్చడంతో భూ విలువ మదింపు, రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం తదితర ప్రాంతాల్లో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకూ ధర పలుకుతోంది. అయితే ఈనాం భూములకు రిజిస్ట్రేషన్లు జరగనందున ఎకరం రూ.30 నుంచి 35 లక్షలకే అనధికారికంగా అమ్ముకోవాల్సి వస్తోంది. బ్యాంక్ రుణాలూ లభించడం లేదు. రైతులకు 'అన్నదాతా సుఖీభవ' కింద ఆర్థిక సాయం కూడా అందడంలేదు.

సమస్య ఇది..

స్వాతంత్ర్యానికి పూర్వం రాజులు, జమిందార్లు ఆలయాలకు, గ్రామాలకు సేవలందించే వారి జీవనోపాధి కోసం సాగు భూములను విరాళం (ఇనాం)గా ఇచ్చారు. 1956లో అప్పటి ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తెచ్చి, అర్హులైన వారికి రైత్వారీ పట్టాలు మంజూరు చేయగా అవకతవకలు జరుగుతున్నాయన్న ఉద్దేశంతో 2013లో అప్పటి ప్రభుత్వం ఇనాం ల్యాండ్ ఎబాలిషన్ చట్టానికి సవరణ చేసింది. ఈ క్రమంలో ప్రాస్పెక్టివ్‌కు బదులు రెట్రాస్పెక్టివ్ అని చట్టంలో పేర్కొనడంతో 1956 నుంచి 2013 వరకు జారీ చేసిన రైత్వారీ పట్టా భూములు నిషిద్ధ జాబితాలోకి చేరాయి. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్స్ (ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్‌టూ రైత్వారీ) ఎమెండ్‌మెంట్ ఆర్డినెన్స్ తేగా ఆ తరవాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు.

ప్రధాని వద్దకు.. సిరిసిల్ల శాలువా

సిరిసిల్ల, న్యూస్‌టుడే: తెలంగాణలోని సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ 'ఆపరేషన్ సిందూర్' లోగోతో అగ్గిపెట్టెలో ఇమిడే శాలువాను రూపొందించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీకి చేరాలని ఆకాంక్షించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గురువారం శాలువాను మోదీకి కప్పి చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రెండు మీటర్ల పొడవు, 32 అంగుళాల వెడల్పు ఉన్న శాలువాను రూపొందించేందుకు 45 రోజుల సమయం పట్టిందని, రూ.46,000 ఖర్చయిందని విజయ్ పేర్కొన్నారు.

చేనేత సేవా కేంద్రానికి జాతీయ పురస్కారం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణలో చేనేత సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసినందుకు ఆ రాష్ట్ర చేనేత సేవా కేంద్రం డైరెక్టర్ అరుణ్‌కుమార్‌కు జాతీయ పురస్కారం లభించింది. దిల్లీలోని భారత మండపంలో గురువారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన పథకాలను అమలు చేయడంలో చేనేత సేవా కేంద్రాలు చేస్తున్న కృషికి గుర్తింపుగా అందించే ఈ పురస్కారానికి 38 దరఖాస్తులురాగా, తెలంగాణకు అవార్డు దక్కిందని అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

హైకోర్టులో వాదనలకు స్టాండింగ్ కౌన్సెళ్ల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ కార్యదర్శి

ఈనాడు, అమరావతి: హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాల తరఫున వాదనలు వినిపించేందుకు పలువురు న్యాయవాదులు స్టాండింగ్ కౌన్సెళ్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం వేర్వేరుగా ఉత్తర్వులిచ్చారు.

1. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ - వజ్రాల శ్రీనివాసులరెడ్డి
2. కృష్ణా యూనివర్సిటీ, మచిలీపట్నం- బి.సుధాకర్‌కుమార్
3. శ్రీకాకుళం, బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు- జంధ్యం సుబ్బారావు
4. ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్- చేజర్ల వెంకటేశ్వరరావు
5. జేఎన్‌టీయూ, కాకినాడ - సిహెచ్.ఎస్.వి.సూరజ్
6. రాయలసీమ రీజియన్‌తో పాటు నెల్లూరు జిల్లా మున్సిపాలిటీలు(సర్వీసెస్)- బొర్రా శివశంకరరావు
7. జేఎన్‌టీయూ, గురజాడ, విజయనగరం - బి.రామశంకర్ రావు
8 ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం, విజయవాడ - గుడి శ్రీనివాస్

పెండింగ్ ఉపాధి బిల్లుల అప్‌లోడ్‌కు ప్రత్యేక డ్రైవ్

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను గడువులోగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. రూ.166 కోట్ల పెండింగ్ బిల్లుల్లో ఇప్పటివరకు రూ.106 కోట్ల బిల్లులకు సంబంధించి ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు (ఎఫ్‌టీవో) అప్‌లోడ్ చేశారు. మిగతా మొత్తానికి కూడా ఈ నెల 10లోగా ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా జలయాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. తెదేపా ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టింది. బిల్లులు సైతం అప్‌లోడ్ చేసే వీల్లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం విజ్ఞప్తిపై 2014-19 చేసిన 3.51 లక్షల ఉపాధి పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేసే అవకాశం కేంద్రం కల్పించింది. ఈ ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 25% నిధులు సమకూర్చాక కేంద్ర ప్రభుత్వం మిగతా 75% నిధులు అందిస్తుంది. ఈనెల 25లోగా బిల్లులు చెల్లించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

బడులకు స్టార్ రేటింగ్

- ఆరు కొలమానాల ఆధారంగా నిర్ణయం
- జాతీయ స్థాయిలో ఎంపికైన వాటికి రూ.లక్ష ప్రోత్సాహకం



ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు కేంద్ర విద్యాశాఖ స్టార్ రేటింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గతంలో ఉన్న స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు మార్పులు చేసి, ఆ స్థానంలో స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్(ఎస్‌హెచ్‌వీఆర్)ను ప్రారంభించింది. మొత్తం ఆరు ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా ఒకటి నుంచి ఐదు స్టార్లు కేటాయించనుంది.

స్వయంగా పరిశీలించి.. గుర్తింపు

- ఈ విధానాన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు (1 నుంచి 10వ తరగతి వరకు) వర్తింపజేస్తారు.
- ఆయా పాఠశాలల హెచ్ఎంలు సెప్టెంబరు 30 వరకు ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.
- ప్రతి సూచికకు సంబంధించిన ఆధారాలు అప్‌లోడ్ చేయాలి.
- వాటిని పరిశీలకులు స్వయంగా పరిశీలించి ఒకటి నుంచి ఐదు వరకు రేటింగ్ ఇస్తారు.
- దేశవ్యాప్తంగా సుమారు 14.75 లక్షల పాఠశాలలుండగా..వాటిల్లో ఉత్తమ స్కోర్ సాధించిన బడులకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు ఇస్తారు.
- ఒక్కో జిల్లా నుంచి ఎనిమిది పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు.
- రాష్ట్రస్థాయిలో గరిష్ఠంగా 20 పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. వాటిని జాతీయస్థాయికి పంపిస్తారు.
- జాతీయస్థాయికి ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తారు. సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు/ప్రిన్సిపాళ్లు మూడు రోజులపాటు దేశంలోని ప్రముఖ సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తారు.

పచ్చదనం... పరిశుభ్రత పెంచే లక్ష్యం...

పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణ సుస్థిరతకు పాఠశాలలను చిరునామాగా మార్చడం, వాటిపై విద్యార్థులకు అవగాహన పెంచడం ఎస్‌హెచ్‌వీఆర్ 2025-26 లక్ష్యం. అందుకు ఆరు ప్రధాన కొలమానాలు, వాటికి అనుబంధంగా తాగునీటి అందుబాటు, వాననీటి సంరక్షణ, శౌచాలయాల అందుబాటు..వాటి శుభ్రత, చేతులు కడుక్కునేందుకు సబ్బు వినియోగం, వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, విద్యుత్తు సదుపాయం.. ఇలా మొత్తం 60 సూచికలు ఉంటాయి.

అటవీ మంటల నియంత్రణ పనులకూ నరేగా వర్తింపు

- ఈ మేరకు చట్టసవరణ చేస్తూ నోటిఫికేషన్ జారీ
- గత మూడేళ్లలో ఏపీలో 49,199, తెలంగాణలో 42,674 ఘటనలు

ఈనాడు, దిల్లీ: ఇటీవలి కాలంలో అడవుల్లో మంటల ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటి నియంత్రణ పనులను మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ చట్టం-2005లో సవరణ చేస్తూ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పథకం కింద చేపట్టే పనుల జాబితాలో అటవీ మంటల నియంత్రణ పనులను (ఫారెస్ట్ ఫైర్ మేనేజ్‌మెంట్ వర్క్స్) చేర్చింది. గురువారం రాజ్యసభలో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ప్రకారం దేశవ్యాప్తంగా 2022-23లో 2,12,249, 2023-24లో 2,03,544, 2024-25 నవంబర్-జూన్ మధ్య 2,38,309 అటవీ మంటల ఉదంతాలు వెలుగుచూశాయి. ఈ మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 49,199, తెలంగాణలో 42,674 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ మూడేళ్లలో మంటల నియంత్రణ కోసం కేంద్రం రూ.107 కోట్లు కేటాయించి, రూ.100 కోట్లు విడుదల చేసింది.

ఫిబ్రవరి 7 నుంచి గేట్

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎంటెక్, పీహెచ్‌డీలో ప్రవేశానికి గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజినీరింగ్ (గేట్)-2026ను ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈసారి ఐఐటీ గువాహటి నిర్వహణ బాధ్యతను చేపట్టింది. ఈ మేరకు వెబ్‌సైట్‌ను తాజాగా అందుబాటులోకి తెచ్చింది. ఈ నెల చివరి వారంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొత్తం 30 పేపర్లలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. బీటెక్‌తోపాటు బీఎస్సీ, బీఏ, బీకాం విద్యార్థులు కూడా ఈ పరీక్ష రాయవచ్చు. పరీక్షలో సాధించిన స్కోర్‌కు ఫలితం వెలువడిన నాటి నుంచి మూడేళ్లపాటు విలువ ఉంటుంది. ఆ స్కోర్‌తో మూడేళ్లలో ఎంటెక్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందొచ్చు.

నేడు సిట్ ఎదుటకు బండి సంజయ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వనున్న కేంద్ర మంత్రి

ఈనాడు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో తన వాంగ్మూలం ఇచ్చేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం సిట్ ఎదుట హాజరుకానున్నారు. సంజయ్‌తోపాటు ఆయన ఓఎస్డీ, వ్యక్తిగత సహాయకులు పసునూరి మధు, బోయినపల్లి ప్రవీణ్‌కుమార్, పోగుల తిరుపతి కూడా సిట్ విచారణకు రానున్నారు. ఈ మేరకు సంజయ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇచ్చే క్రమంలో గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు కేంద్ర హోంశాఖ అధికారులతో సంజయ్ భేటీ అయ్యారు. ఉమ్మడి ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారు. భారాస సర్కారు హయాంలో సంజయ్ ఫోన్ అనేకమార్లు ట్యాపింగ్ జరిగిందన్న దానిపై నిఘా వర్గాలు పలు ఆధారాలను ఆయనకు అందజేసినట్లు తెలిసింది. విచారణ సందర్భంగా వాటిని ఆయన సిట్‌కు సమర్పించనున్నారు.

రేషన్ కార్డుల పంపిణీ రసాభాస

- కాంగ్రెస్ నేత శ్యాంనాయక్‌పై వాటర్ బాటిళ్లను విసిరిన భారాస ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వాటర్ బాటిల్ విసురుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పక్కన ఆపే ప్రయత్నం చేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్... శ్యాంనాయక్‌పై దూసుకెళ్లిన సీసా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలోని కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లోని జన్కాపూర్ రైతు వేదికలో గురువారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. భారాస ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యాంనాయక్‌ల మధ్య మాటల యుద్ధం జరిగింది. ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయం మాట్లాడవద్దంటూ ఎమ్మెల్యేను ఉద్దేశించి శ్యాంనాయక్ అనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం మొదలైంది. చివరకు ఎమ్మెల్యే వాటర్ బాటిళ్లను ముందున్న ఆయనపై విసిరేశారు. అదనపు కలెక్టర్ డేవిడ్ ఆపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో పోలీసులు లేరు. ఇరువురిని అధికారులు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. కొన్ని కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఎవరికి వారుగా ప్రెస్‌మీట్‌లు పెట్టి పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.




ఒక గంట ముందుగా లేవండి!

మీ జీవితాన్ని మెరుగుపరుచుకునేందుకు అత్యంత వేగవంతమైన మార్గం ఏంటో తెలుసా..? రోజూ ఒక గంట ముందుగా నిద్రలేవడం. మీ పిల్లలు బెడ్ దిగకముందే, ఆఫీసు నుంచి ఈ-మెయిళ్ల వరద మొదలవక ముందే, మీ బాస్ నుంచి వాట్సప్‌లో మెసేజ్‌లు రాకముందే మీరు నిద్రలేవండి. ఆ గంట సమయాన్ని ఏదైనా రాసేందుకో, చదివేందుకో, వ్యాయామం చేసేందుకో, సైడ్ ప్రాజెక్టుపై పనిచేసేందుకో ఉపయోగించుకోండి. ఏడాది గడిచాక వెనక్కి తిరిగి చూసుకోండి.. చాలామంది తమ జీవితాంతం సాధించలేని పురోగతిని మీరు ఆ గంట సమయం వల్ల సాధించి ఉంటారు.

– ఎడ్డీ క్వాన్, కంటెంట్ క్రియేటర్

చిరు సాయమైనా.. పేదలకు పెద్ద ఆలంబనే

- పీ4తో సమాజానికి మంచి చేద్దాం
- పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐల సమావేశంలో సీఎం పిలుపు
- ఉపాధ్యాయులూ ముందుకొస్తున్నారని వెల్లడి



ఈనాడు, అమరావతి: 'ఉన్నత స్థానాల్లోని వారు చేసే సాయం చిన్నదైనా.. పేదలకు అదే పెద్ద ఆలంబన అవుతుంది. అసమానతలు లేని సమాజం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో మార్గదర్శులుగా చేరండి. బంగారు కుటుంబాలను కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి. ఉన్నత స్థితిలో ఉన్నవారు బాధ్యత తీసుకుంటే దత్తత కుటుంబాల్లో నైపుణ్యం పెంపొందించవచ్చు. వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పీ4 కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి విజయవాడలోని హోటల్‌లో పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఎంత సంపాదించినా ఇక్కడే వదిలిపెట్టి వెళ్లాలని, అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే సమాజానికి ఎంతో మేలు చేసినవాళ్లమవుతామని ఆయన సూచించారు.

నేనూ పోటీ పడతా

'రాష్ట్రంలో ఇప్పటి వరకు 10,81,281 మంది కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో నేనూ 250 కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శిగా మారా. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు నా సహచర మార్గదర్శులతో పోటీ పడతా' అని చంద్రబాబు వివరించారు. 'అవనిగడ్డలో పారిశుద్ధ్య కార్మికురాలు మార్గదర్శిగా ఉండేందుకు ముందుకొచ్చారు. పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్ధమయ్యారు. మార్గదర్శులుగా మారాలని ఎవర్నీ బలవంతపెట్టడం లేదు. సాయం చేయడంలో రకరకాలు ఉంటాయి. ఇటీవల కొందరు టీచర్లు ముందుకొచ్చారు. చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామంటున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని పీ4లో కో-స్పాన్సర్స్ విధానాన్ని తెస్తున్నాం. ఆర్థిక సాయం చేసేవారు చేస్తారు.. ఆసక్తి కలిగిన వారు విజ్ఞానాన్ని అందిస్తారు' అని సీఎం వివరించారు.

ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తల నుంచి విశేష స్పందన

మార్గదర్శులుగా ఉండేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు ముందుకొచ్చారు. 729 కుటుంబాలను దత్తత తీసుకుంటామని ప్రకాశం జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త మోహన్‌రెడ్డి చెప్పారు. సౌదీ నుంచి వచ్చిన రాధాకృష్ణ, మహ్మద్ ఆరిఫ్, సుచరిత తదితరులు 10 కుటుంబాల చొప్పున దత్తత తీసుకుంటామని ప్రకటించారు. తనతోపాటు మరికొందరు సంఘంగా ఏర్పడి బొమ్మనహాళ్ మండలాన్ని దత్తత తీసుకున్నామని పారిశ్రామికవేత్త వరప్రసాద్ పేర్కొన్నారు. కూరపాటి అనే ప్రవాసాంధ్రుడు.. తాము 160 స్కూళ్లను దత్తత తీసుకుంటామని తెలిపారు. తాను 10 కుటుంబాలు దత్తత తీసుకుంటాననని.. మిత్రులూ మరో 100 కుటుంబాలు దత్తత తీసుకునేలా చూస్తామని గొర్రెపాటి చందు, 20 కుటుంబాలకు చదువు చెప్పించే బాధ్యత తీసుకుంటానని ఎన్ఆర్ఐ మాగులూరు భాను వెల్లడించారు. విశ్వప్రసాద్ (అమెరికా) 10, రాంబాబు (సింగపూర్) 2 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కన్నీటి రాఖీ కడుతున్నా.. తిరిగి రారా తమ్ముడూ!





'చిన్ననాడే అమ్మ దూరమైనా.. మనమిద్దరమే ఒకరికొకరం తోడుగా పెరిగాం.. అమ్మలేని లోటు తెలియకుండా పెంచిన నాన్నను వృద్ధాప్యంలో వదిలేసి వెళ్లావు కదరా..' అంటూ ఓ సోదరి విగతజీవిగా మారిన తన తమ్ముడికి చితిపై రాఖీ కడుతూ గుండెలవిసేలా విలపించింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కిష్టాపురంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన పందిరి పెద్ద లింగారెడ్డి, శారద దంపతులకు జ్యోతి, అప్పిరెడ్డి(24) సంతానం. అప్పిరెడ్డి పుట్టిన కొద్దిరోజులకే తల్లి శారద మృతిచెందారు. కుమార్తె జ్యోతికి అప్పటికి రెండేళ్లు. తండ్రే అన్నీతానై పిల్లలను పోషించారు. కుమార్తె వివాహం చేశారు. జేసీబీ ఆపరేటర్‌గా పని చేసే అప్పిరెడ్డి రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో రక్షాబంధన్ ఉన్న నేపథ్యంలో అక్క జ్యోతితోపాటు వరసకు సోదరీమణులయ్యే మరో 30 మంది కన్నీటిపర్యంతమవుతూ చితిపైన ఉన్న మృతదేహానికి రాఖీలు కట్టారు.

– న్యూస్‌టుడే, కూసుమంచి

అనుమానంతో.. అమానవీయం

స్తంభానికి కట్టేసి మహిళపై దాడి

రెంజల్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కొందరు ఓ మహిళను స్తంభానికి కట్టేసి మూకుమ్మడిగా దాడిచేసిన అమానవీయ ఘటన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలో గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. సదరు మహిళ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. రెంజల్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు, ఆయన భార్య తరఫు బంధువులు అనుమానించారు. బుధవారం రాత్రి ఆమెను బలవంతంగా గ్రామానికి తీసుకొచ్చారు. విద్యుత్తు స్తంభానికి కట్టేసి దాడి చేశారు. స్థానికులు గమనించి ఆమెను విడిపించారు. అనంతరం బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామని తెలిపారు.

మైనింగ్ జరిమానాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

- 5రెట్ల జరిమానాకు ఒక వంతు చెల్లిస్తే చాలు
- పది రెట్ల జరిమానాకు రెండు రెట్లతో సరి
- 1,900 కేసుల్లో రూ.1,800 కోట్ల జరిమానాలు పరిష్కరించేలా ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏళ్ల తరబడి జరిమానాల కారణంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించలేని లీజుదారులు, మినరల్ డీలర్ లైసెన్సుదారులు, జరిమానాల భారంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఏకకాల పరిష్కారానికి (వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు) అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. మైనింగ్ రంగంలో అనేక మార్పులతో ఏపీ మైనర్ మినరల్ పాలసీ- 2025ని ప్రభుత్వం ఏప్రిల్‌లో తీసుకొచ్చింది. అందులోనే ఏకకాల పరిష్కార పథకం అమలు చేస్తామని పేర్కొంది. తాజాగా దాని విధివిధానాలు పేర్కొంటూ గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. లీజులు, క్వారీలు, మినరల్ డీలర్ లైసెన్సుదారులు గతంలో నిబంధనలు ఉల్లంఘించారని, అవకతవకలకు పాల్పడ్డారని గుర్తించి జరిమానాలు వేసి ఉంటే.. వాళ్లు ఏకకాల పరిష్కారం ద్వారా ఉపశమనం పొందొచ్చు.

పది రెట్లకు.. రెండు రెట్లు చాలు

- ✦ సాధారణ సీనరేజ్ ఫీజుకు పది రెట్లు జరిమానా విధించి ఉంటే.. అందులో రెండు రెట్లు, 5 రెట్లు జరిమానా ఉంటే ఒక వంతు చెల్లిస్తే సరిపోతుంది. అయితే దీనికి ఒక వంతు సీనరేజ్ ఫీజు, కన్సిడరేషన్ ఎమౌంట్, జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్), ఖనిజాన్వేషణ నిధి (మెరిట్) కూడా చెల్లించాలి.
- ✦ ఖనిజ ధర ఆధారంగా జరిమానా విధించి ఉంటే.. అందులో 20 శాతం చెల్లించాలి.
- ✦ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా తగ్గించిన జరిమానా మొత్తంలో 25 శాతాన్ని రెండు నెలల్లో చెల్లించాలి. మిగిలిన 75 శాతాన్ని పది నెలల్లో వాయిదాల కింద చెల్లించవచ్చు.
- ✦ ఇప్పటి వరకు షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు అందుకున్నవారికి, జరిమానాలు తగ్గించాలంటూ ప్రభుత్వం వద్ద రివిజన్‌కు పెట్టుకున్న లీజుదారులకు ఈ పథకం వర్తిస్తుంది.
- ✦ మైనింగ్ ఉల్లంఘనల్లో క్రిమినల్ కేసులున్న లీజుదారులకు వర్తించదు.

రూ.100 కోట్ల రాబడి

రాష్ట్రంలో లీజుదారులు, మినరల్ డీలర్ లైసెన్సుదారులపై 1,900 కేసుల్లో మొత్తం రూ.1,800 కోట్ల వరకు జరిమానాలు ఉన్నాయి. ఇప్పుడు ఏకకాల పరిష్కార పథకంలో ప్రభుత్వానికి రూ.100 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. జరిమానా చెల్లించి, కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఆయా లీజుల్లో మళ్లీ మైనింగ్ కార్యకలాపాలు మొదలైతే గనులశాఖ రాబడి కూడా పెరుగుతుంది.





కంఫర్ట్ జోన్‌కు ఆవల

పాఠశాలకు వెళ్లి చదువుకుంటూ.. స్నేహితులతో కలిసి ఆటలాడుకుంటూ.. హాయిగా ఆ వయసు రోజుల్ని గడిపేయవచ్చు. అలానే అనుకుంటే అతిచిన్న వయసులో ఎవరెస్టును అధిరోహించి.. స్ఫూర్తిదాయకంగా మారే వారు కారు మలావత్ పూర్ణ. అలాంటివాడే ఈ బాలుడు. తొమ్మిదో తరగతి చదువుతూ వాళ్ల నాన్నతో కలిసి యూరప్ ఖండంలో అత్యంత ఎత్తయిన మౌంట్ ఎల్బ్రస్ (5,642 మీటర్ల)ను ఈ నెల 3న అధిరోహించాడు 14 ఏళ్ల వివేకానందరెడ్డి. మైనస్ 20 డిగ్రీల చలిని తట్టుకొని ఈ యాత్రను పూర్తిచేశాడు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన మహిపాల్‌రెడ్డి ఎక్సైజ్ కానిస్టేబుల్. ఆసక్తి మేరకు.. పర్వతారోహణలో శిక్షణ పొంది.. ఎల్బ్రస్ సహా కిలిమంజారో తదితర 12 పర్వతాలను అధిరోహించారు. తండ్రిని చూసి.. తానూ పర్వతారోహకుడిని అవుతానని పెద్ద కుమారుడు వివేకానందరెడ్డి చెప్పడంతో.. బాలుడికీ శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా 2023లో హిమాచల్‌ప్రదేశ్‌లోని పటాల్సు పర్వతాన్ని ఇద్దరూ కలిసి అధిరోహించారు. ఇప్పుడు ఎల్బ్రస్ శిఖరాన్ని పాదాక్రాంతం చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, కమాన్‌పూర్

వాగు నీటిలో బావి నీరు వేరయా..!



నిండుగా ప్రవహిస్తున్న వాగు.. అందులో నీటితో నిండి ఉన్న బావి.. చిత్రంగా ఉంది కదూ. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బీచురాజ్‌పల్లి గ్రామంలో ఉందిది. సుమారు 20 ఏళ్ల కిందట ఊళ్లో తాగునీటికి వేరే ఆధారం ఉండేది కాదు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో ఆకేరు వాగులో 40 అడుగుల లోతున ఈ బావిని తవ్వించారు. ఊళ్లో ప్రజలకు చాలాకాలం ఈ బావి నీటినే పైపుల ద్వారా సరఫరా చేసేవారు. వేసవిలో వాగు ఎండిపోయినా.. బావి మాత్రం నీటితో కళకళలాడేది. మిషన్ భగీరథ పథకం వచ్చాక గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. దీంతో బావి నీటిని సమీప రైతులు వేసవిలో పంటల సాగుకు వినియోగిస్తున్నారు. వాగులో నీరు, బావి నీరు భిన్నమైన రంగుల్లో కనిపిస్తాయి.

– ఈనాడు, హనుమకొండ

19 నుంచి 'సైన్స్ కాంగ్రెస్'

'టాస్' అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు



ఈనాడు, హైదరాబాద్: కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవం సందర్భంగా ఈ నెల 19 నుంచి 21 వరకు వరంగల్‌లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నట్లు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(టాస్) అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు తెలిపారు. ఈ నేపథ్యంలో 'ఈనాడు'తో ఆయన మాట్లాడుతూ... ''రాష్ట్ర విభజన తర్వాత 2015లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఏర్పాటైంది. ఈసారి సదస్సు 'సాధికారత కోసం వినూత్న నైపుణ్యాలు- యువ భారతాన్ని మార్చడంలో శాస్త్ర, సాంకేతికత' అనే ఇతివృత్తంతో జరగనుంది. ఇప్పటికే 700 వరకు పత్రాలు సమర్పించేందుకు పరిశోధకులు ముందుకొచ్చారు. శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పారిశ్రామిక ప్రముఖులు, విధాన నిర్ణేతలు, విద్యార్థులను ఒకచోట చేర్చి సమకాలీన శాస్త్రీయ సవాళ్లు, పురోగతులపై చర్చించనున్నాం. కృత్రిమమేధ, డేటా సైన్స్, బయో టెక్నాలజీ, వాతావరణ శాస్త్రం వంటి రంగాలపై ఇస్రో, డీఆర్‌డీవో, ఐఐసీటీ, సీసీఎంబీ తదితర సంస్థల డైరెక్టర్లు మాట్లాడతారు. చిన్నారులను సైన్స్ వైపు ఆకర్షించేలా శాస్త్రవేత్తలతో ముఖాముఖీలు ఉంటాయి. ఇటీవల సైన్స్ వైపు వచ్చే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటోంది. కంప్యూటర్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అటువైపు వెళ్తున్నారు. ఏ రంగంలో రాణించాలన్నా కోర్ సైన్స్‌పై పట్టు అవసరం. ఈ దిశగా విద్యార్థుల్లో జిజ్ఞాస పెంచేందుకు ప్రయత్నిస్తాం. సమాజం ఎదుర్కొంటున్న వేర్వేరు సవాళ్లపై తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ తన అభిప్రాయాలను ప్రభుత్వాలకు తెలియజేస్తుంది'' అని వివరించారు.

కేసు విచారణ.. రేవంత్‌రెడ్డికి హాజరు నుంచి మినహాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఉస్మానియా వర్సిటీ పోలీసులు 2016లో నమోదు చేసిన క్రిమినల్ కేసు విచారణకు తెలంగాణ సీఎం రేవంత్‌కు హాజరు మినహాయింపునిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులకు, ఫిర్యాదుదారుకు నోటీసులిచ్చింది. జూన్, 2016లో ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసుల అనుమతి లేకుండా నిర్వహించిన సభలో అప్పుడు ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి పాల్గొనడంపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టగా కౌంటరు దాఖలు చేస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు తెలిపారు. విచారణను సెప్టెంబరు 1కి వాయిదా వేశారు. కింది కోర్టులో రేవంత్‌రెడ్డికి హాజరు నుంచి మినహాయింపునిస్తూ, తప్పనిసరని కోర్టు ఆదేశిస్తేనే హాజరుకావాలన్నారు.



ఏపీలో రూ.44వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రూ.44,536 కోట్ల విలువైన 1,980 కిలోమీటర్ల 96 జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. ఆయన గురువారం లోక్‌సభలో అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేష్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఈ ఏడాది జూన్ 30 వరకు రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి, నిర్వహణకు రూ.2,958 కోట్లు కేటాయించగా, అందులో రూ.2,745 కోట్లు ఖర్చయినట్లు చెప్పారు.

అమరావతి-హైదరాబాద్ మధ్య ర్యాపిడ్ రైల్ ప్రాజెక్టు ప్రతిపాదన లేదు

అమరావతి-హైదరాబాద్ మధ్య ర్యాపిడ్ రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనేదీ లేదని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయమంత్రి టోకన్ సాహు తెలిపారు. ఆయన గురువారం లోక్‌సభలో మల్కాజ్‌గిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ''తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజధానులు హైదరాబాద్-అమరావతి ర్యాపిడ్ రైల్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇచ్చిందా? ఒకవేళ ఇచ్చి ఉంటే ఇంతవరకు ఏం పనులు చేశారు? ఏయే ఎన్ఓసీలు తీసుకున్నారు? డీపీఆర్ ఖరారైందా? నిధుల మాటేంటి?' అని ఆయన అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి అనుమతి ఇవ్వలేదని, అందువల్ల తదనంతర ప్రశ్నలు ఉత్పన్నం కావని సమాధానం ఇచ్చారు.

అవినీతి ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యల నిబంధనల్లో సవరణలు

ఈనాడు, అమరావతి: అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి... ఏపీ విజిలెన్స్ కమిషన్, ఏపీపీఎస్సీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న ప్రస్తుత నిబంధనల్లో రాష్ట్రప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. అన్ని అంశాల్లోనూ రెండు కమిషన్ల నుంచీ అనుమతులు అవసరం లేకుండా 1991నాటి ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనల్లో సవరణలు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై అభిశంసన, పదోన్నతి నిలుపుదల, వేతన పెంపు నిలుపుదల (విత్‌ఔట్ క్యుములేటివ్ ఎఫెక్ట్), ఏపీసీఎస్ కింద సస్పెండైన వ్యక్తి సస్పెన్షన్ కాలాన్ని పెంచడం వంటి కొన్ని అంశాల్లో ఏపీ విజిలెన్స్ కమిషన్ అనుమతి సరిపోతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. నూరుశాతం కంటే తక్కువ పింఛను లేదా గ్రాట్యుటీ నిలుపుదల, లేకపోతే రెండింటినీ నిలిపివేయడం, నిర్బంధ పదవీవిరమణ, సర్వీసు నుంచి తొలగింపు లాంటి అంశాల్లో ఏపీపీఎస్సీ అనుమతి సరిపోతుందని తెలిపింది. ఎవరైనా ఉద్యోగిపై సస్పెన్షన్ ఎత్తివేసేందుకు విజిలెన్స్ కమిషన్ అనుమతి లేదని తేల్చింది. అవినీతికి పాల్పడ్డ ఉద్యోగులపై చర్యలకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ గతంలో జారీచేసిన ఉత్తర్వుల్ని అనుసరించి... రాష్ట్రప్రభుత్వం ఈ సవరణలు చేపట్టింది.

సృష్టి కేసు సిట్‌కు..!

గోపాలపురం ఠాణా నుంచి బదిలీ చేసే యోచన

ఈనాడు– హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కు బదిలీ చేయనున్నట్లు సమాచారం. ఈ కేసులో తవ్వేకొద్దీ మోసాలు బయటపడుతుండడం, నాలుగైదు రాష్ట్రాలతో లింకులు ఉండడం, సరోగసీ ముసుగులో శిశువుల విక్రయం, బాధితుల్ని బెదిరించడం.. ఇలా అనేక కోణాలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటివరకూ 8 మంది బాధితులు తాము మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. 26 మంది నిందితులు అరెస్టయ్యారు. ఈ నేపథ్యంలోనే కేసును హైదరాబాద్ సీసీఎస్ ఆధ్వర్యంలోని సిట్‌కు బదిలీ చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈ కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గోపాలపురం పోలీసులు ఇతర కేసుల దర్యాప్తు, బందోబస్తు వంటి విధులతో సతమతమవుతున్నందున ఈ కేసును సిట్‌కు అప్పగిస్తే బాగుంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

రెండేళ్లలో 80 మంది శిశువులు..

సరోగసీ ముసుగులో డా. నమ్రత ముఠా రెండేళ్లలో 80 మంది శిశువులను విక్రయించినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఈ కేంద్రం దాదాపు 15 ఏళ్లుగా నడుస్తున్నందున అప్పటి నుంచి వందల మంది శిశువుల్ని విక్రయించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల నుంచి సేకరించిన వివరాల ద్వారా బాధితుల్ని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన సంతోషి ద్వారా 18 మంది పిల్లల్ని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. మరికొందరి ఏజెంట్ల నుంచి కూపీ లాగుతున్నారు. ఇంకోవైపు డాక్టర్ నమ్రతకు సహకరించిన వైద్యుల గురించి ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు ఐదుగురు వైద్యుల ప్రమేయం వెలుగులోకి వచ్చింది.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వండి

డీజీపీకి జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కవితపై మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలకు సంబంధించి 4 వారాల్లో కార్యాచరణ నివేదిక సమర్పించాలంటూ జాతీయ మానవహక్కుల కమిషన్ డీజీపీ జితేందర్‌ను ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ డీజీపీకి లేఖ రాసింది. జులై 12న జరిగిన బహిరంగ సభలో కవితపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని, మహిళలను కించపరిచేలా ఉన్న వ్యాఖ్యలకు సంబంధించి వెంటనే జోక్యం చేసుకోవాలని మహబూబాబాద్‌కు చెందిన న్యాయవాది రేవంత్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని ఆ లేఖలో పేర్కొంది. దీనిపై విచారణ జరిపి 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

జాతీయ రహదారిపై కుంగిన వంతెన

తప్పిన ప్రమాదం.. వాహనాల దారి మళ్లింపు



మల్లంపల్లి వద్ద వంతెన కుంగడంతో జారిపోతున్న మట్టి

ములుగు, న్యూస్‌టుడే: తెలంగాణలోని ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి సమీపంలోని 163 జాతీయ రహదారిలో ఎస్సారెస్పీ కాలువపై ఉన్న వంతెన గురువారం రాత్రి అకస్మాత్తుగా కుంగిపోయింది. దీంతో అధికారులు అప్రమత్తమై.. వాహనాలను వేరే మార్గాల్లో పంపుతున్నారు. ములుగు నుంచి హనుమకొండ వెళ్లే వాహనాలను ములుగు మండలం జాకారం, అబ్బాపురం, రేగొండ, పరకాల మీదుగా మళ్లించారు. హనుమకొండ నుంచి ములుగు వైపు ప్రయాణించే వాహనాలను మల్లంపల్లి మండలం శ్రీనగర్, పందికుంట మీదుగా జాతీయ రహదారి చేరుకుని.. ములుగు-ఏటూరునాగారం మార్గంలోకి వెళ్లేలా మళ్లించినట్లు ములుగు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఏటూరునాగారం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు, లారీలను ములుగు మండలం జంగాలపల్లి నుంచి పాలంపేట, గణపురం మీదుగా భూపాలపల్లి, హనుమకొండ వైపు పంపుతున్నామని వివరించారు.

గుత్తేదారు నిర్లక్ష్యంతోనే..: నిత్యం వేల వాహనాలు తిరిగే వంతెన కుంగడానికి.. దాని పక్కనే కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు నిర్లక్ష్యమే కారణంగా భావిస్తున్నారు. పాత వంతెనకు మద్దతుగా ఉన్న మట్టిని ఇష్టారాజ్యంగా జేసీబీతో తోడడం వల్ల క్రమక్రమంగా వంతెన కుంగుబాటుకు గురైంది. వంతెన ప్రమాదకరంగా ఉందని గత నెల 15న 'ఈనాడు' జిల్లా సంచికలో కథనం ప్రచురించింది. అయినా ఇంజినీర్లు అప్రమత్తం కాలేదు.